ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 29-1-2019 మంగళవారం సిటీ సంపుటి 45 సంచిక 169

రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net


Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

పేదలందరికీ కనీస ఆదాయం

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ హామీ

- ఛత్తీస్‌గఢ్ రైతు ర్యాలీలో ప్రకటన

రాయ్‌పుర్: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మరో అస్త్రాన్ని బయటకు తీశారు. తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశంలోని పేదలందరికీ కనీస ఆదాయాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. తద్వారా పేదరికం, ఆకలి లేని భారత్‌ను సాకారం చేస్తామన్నారు. ఇది తమ స్వప్నమని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ విజయాన్ని పురస్కరించుకుని సోమవారమిక్కడ ఏర్పాటుచేసిన ...మిగతా 2లో



కనీస ఆదాయ భరోసాపై ఎన్నికల ప్రణాళికలో చెబుతాం

– ట్విట్టర్‌లో చిదంబరం



ఇది మా స్వప్నం... ఇది మా హామీ...

లక్షలాది మంది అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు పేదరికంతో మగ్గుతుంటే మనం కొత్త భారత్‌ను ఎలా సృష్టించగలం! సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఎవరే పరిస్థితుల్లో ఉన్నా అందరికీ కనీస ఆదాయం అనేది ఉండాలి. ఈ సార్వత్రిక కనీస ఆదాయం (యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం) గురించి 2016-17లోనే భారత ఆర్థిక సర్వే చెప్పింది. ఒక్కో వ్యక్తికి రూ. 7,620 కనీస వార్షికాదాయం కల్పించాలంది. 2019లో మేము అధికారంలోకి వస్తే ప్రతి పేదవాడికి కనీస ఆదాయ భరోసా (మినిమం ఇన్‌కం గ్యారెంటీ) కల్పిస్తాం. ఇది మా స్వప్నం. ఇది మా హామీ.

– ట్విట్టర్‌లో రాహుల్ గాంధీ

బిగిసిన పిడికిలి

సత్ఫలితాలు ఇస్తున్న పీడీయాక్ట్ ప్రయోగం



పీడీ చట్టం కింద అరెస్టయిన వారి సంఖ్య

2016	2017	2018
345	162	385

‘ఇప్పుడు జైల్లో పెట్టినా బయటకు రాగానే మళ్లీ నేరాలకు పాల్పడుతూనే ఉంటా’ అని పోలీసుల ముందు.. ఏకంగా విలేకరుల సమావేశంలోనే సవాలు చేశాడు పులిపిల్ల సాకీ హంతకుడు సలావుద్దీన్.

హైదరాబాద్ కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ హుస్సేన్ అలియాస్ లంబా అనే గొలుసు దొంగ ఒక్కడే 150కిపైగా నేరాలు చేశాడు. అడ్డొచ్చిన పోలీసులపై దాడికి పాల్పడేవాడు.

వీళ్లకింత ధైర్యం ఎలా వచ్చింది? వారి ఆటకట్టించలేరా? సాధారణ ప్రజల నుంచి పోలీసులకు ఎదురైన సవాల్ ఇది.


పోలీసులు ఈ సవాల్‌ను గట్టిగానే తీసుకున్నారు. అమ్ముల పొదిలోని అస్త్రాన్ని బయటికి తీశారు. గురిచూసి ప్రయోగిస్తున్నారు. సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఆ అస్త్రమే ప్రివెంటివ్ డిటెన్షన్ (పి.డి)యాక్ట్.

గతంలో అత్యంత అరుదుగా పీడీయాక్ట్‌ను ప్రయోగించేవారు. దాంతో నేరగాళ్లు త్వరత్వరగా బెయిల్ పొందుతూ మళ్లీ మళ్లీ నేరాలకు పాల్పడేవారు. కానీ హైదరాబాద్ కమిషనర్‌గా మహేందర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత దీన్ని విస్తృతంగా వాడటం మొదలుపెట్టారు. ఇది మంచి ఫలితాలను ఇస్తోంది. తాజా గణాంకాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 859 మందిపై పీడీ చట్టం ప్రయోగించారు. ముఖ్యంగా రాజధాని నగరంలో నేరాలు 20 శాతం, రాష్ట్ర వ్యాప్తంగా 5 శాతం తగ్గాయి.

...ప్రత్యేక కథనం 2లో

రాజధానికి స్వచ్ఛభారత్ మిషన్ పురస్కారం

- ఓడీఎఫ్++ గుర్తింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ
- దేశంలో హైదరాబాద్‌కు మూడో స్థానం



ఈనాడు, హైదరాబాద్: భాగ్యనగరాన్ని స్వచ్ఛభారత్ మిషన్ ఉన్నత పురస్కారం వరించింది. హైదరాబాద్‌ను బహిరంగ మల, మూత్ర విసర్జన రహితంగా తీర్చిదిద్దడంతో పాటు, ఆయా వ్యర్థాలను శాస్త్రీయంగా శుద్ధి చేసినందుకు గాను.. ఓడీఎఫ్++ (ఓపెన్ డిఫికేషన్ ఫ్రీ)గుర్తింపును జారీ చేస్తూ స్వచ్ఛభారత్ మిషన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా ...మిగతా 2లో



ఎదురులేని భారత్

- మూడో వన్డేలో న్యూజిలాండ్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపు
- మరో 2 మ్యాచ్‌లు మిగిలి ఉండగానే సిరీస్ కైవసం

...వివరాలు ఛాంపియన్‌లో

ఎస్సై పోస్టుల భర్తీకి తొలగిన అడ్డంకులు



- ‘ఆరు ప్రశ్నల’పై సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలు నిలిపివేత
- అందరి మార్కులను ప్రకటించనవసరం లేదు
- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు 2

భారీగా గురుకుల కొలువులు


119 బీసీ గురుకులాల్లో 4,322 పోస్టుల మంజూరు

ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థికశాఖ 2

అక్కడెట్లయితే ఇక్కడట్ల..



- కేంద్రంలో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే.. మనమూ అలాగే చేద్దాం 2
- బడ్జెట్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష



ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే రాజీనామా చేస్తా

- కాంగ్రెస్ నేతల తీరుపై కర్ణాటక సీఎం కుమారస్వామి అసహనం
- సంబంధిత ఎమ్మెల్యేను వివరణ కోరిన కేపీసీసీ

ఈనాడు డిజిటల్ - బెంగళూరు

"సంకీర్ణ ప్రభుత్వం గురించి కాంగ్రెస్ శాసనసభ్యులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే రాజీనామా చేయక తప్పద"ని కర్ణాటక ముఖ్యమంత్రి కుమారస్వామి మరోసారి అసహనం ప్రకటించారు. ఆదివారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ శాసనసభ్యుడు, బీడీఏ అధ్యక్షుడు ఎస్.టి.సోమశేఖర్ ప్రసంగిస్తూ.."సిద్ధరామయ్య సీఎంగా ఉన్నప్పుడు అన్ని పనులూ జరిగేవి. ఆయనే మరో అయిదేళ్లు కొనసాగి ఉంటే బాగుండేది. ప్రస్తుతం ఏ పనికైనా ఎదురుచూడాల్సి వస్తోంది. ఇప్పటికీ మా ముఖ్యమంత్రి సిద్ధరామయ్యే" అంటూ వ్యాఖ్యానించారు. మంత్రులు నాగరాజు, పుట్టరంగశెట్టి సైతం సిద్ధరామయ్య నాయకత్వాన్ని సమర్థిస్తూ బహిరంగ సమావేశాల్లో వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలు చేసిన ఈ ప్రకటనలకు స్పందించిన ముఖ్యమంత్రి కుమారస్వామి 'కాంగ్రెస్ శాసనసభ్యులను నియంత్రించాల్సిన బాధ్యత ఆ పార్టీదే. ఇలాంటి బహిరంగ ప్రకటనలు చేస్తే అది కాంగ్రెస్‌కే నష్టం తప్ప నాకు కాదు. వారు పొత్తు నిబంధనలను ఉల్లంఘించటం సరికాదు. వాళ్లిలాగే మాట్లాడుతూపోతే నేను రాజీనామా చేసేందుకైనా సిద్ధం" అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఏడు నెలల సంకీర్ణ ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని ఆయన పేర్కొన్నారు.

బాధపడి ఉంటే క్షమించండి

ఈ నేపథ్యంలో కేపీసీసీ అధ్యక్షుడు దినేశ్ గుండూరావు సంకీర్ణ ప్రభుత్వ పనితీరును విమర్శిస్తూ మాట్లాడిన సదరు ఎమ్మెల్యేను వివరణ కోరారు. తన వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి బాధపడి ఉంటే క్షమించాలని ఎమ్మెల్యే ఎస్.టి.సోమశేఖర్ ప్రకటించారు. ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలపై భాజపా స్పందిస్తూ సంకీర్ణ ప్రభుత్వంలో తన పరిస్థితి ఏమిటో ఇప్పటికైనా కుమారస్వామి బహిరంగపరిచారని, ఇలాంటి ప్రభుత్వంలో ఉండేకంటే రాజీనామా చేయటమే మేలంటూ ట్వీట్ చేసింది.

తెలంగాణ వైద్యుల ఫోరం అధ్యక్షుడిగా అన్వేష్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ అనుబంధంగా ఏర్పాటైన రాష్ట్ర వైద్యుల ఫోరం అధ్యక్షుడిగా డాక్టర్ కల్వకుర్తి అన్వేష్ నియమితులయ్యారు. టీఈయూ అధ్యక్షుడు సంపత్‌కుమార్‌స్వామి సోమవారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. జూనియర్ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అన్వేష్ ప్రస్తుతం నిమ్స్‌లో అత్యవసర వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. వైద్యుల సమస్యల పరిష్కారంతోపాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా అన్వేష్ తెలిపారు.



అన్వేష్

ఎస్సై పోస్టుల భర్తీకి తొలగిన అడ్డంకులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఎస్సై నియామకాలకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. రాత పరీక్షలో 6 ప్రశ్నలను తొలగించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే అర్హత సాధించినవారు కాకుండా.. ఆరు ప్రశ్నలను తొలగించాక తాజా అర్హత జాబితా తయారు చేయాలన్న సింగిల్ జడ్జి ఆదేశాలనూ నిలిపివేసింది. హాల్‌టిక్కెట్లవారీగా అభ్యర్థులందరి మార్కులను ప్రకటించాల్సిన అవసరంలేదని.. అభ్యర్థులు దరఖాస్తు చేసి వాటిని పొందొచ్చని స్పష్టంచేసింది.

ఎస్సై నియామకాల కోసం గతేడాది మే 31న జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్షలో 6 ప్రశ్నలను తొలగించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ పోలీసు నియామక మండలి హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీలు దాఖలు చేసింది. దీనిపై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. మండలి తరపున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శ్రీరాంభట్ల శరత్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. ప్రశ్నపత్రం రూపొందించడంలోగానీ, ఐచ్ఛికాలను ఇవ్వడంలోగానీ పొరపాట్లు లేవన్నారు. కోర్టుకు వచ్చిన అభ్యర్థులెవరూ



ఆ ఆరు ప్రశ్నలకు సమాధానం రాయడానికి ప్రయత్నించలేదన్నారు. నిపుణుల కమిటీ రూపొందించిన అంశాలపై న్యాయవ్యవస్థ, పాలనా వ్యవహారాలకు చెందినవారు నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. యూపీఎస్సీ, టీఎస్‌పీఎస్సీ తరహాలో రాత పరీక్షల్లో అర్హత సాధించినవారి హాల్‌టిక్కెట్ నెంబర్లు ప్రకటిస్తామని.. అభ్యర్థులందరి మార్కులు ప్రకటించడం ఆచరణ సాధ్యం కాదని వివరించారు. ఈ దశలో అభ్యర్థుల తరపు న్యాయవాది చిల్లా రమేశ్ వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికే అర్హత సాధించినవారిపై తమకెలాంటి అభ్యంతరాలు లేవని, అర్హత సాధించనివారి విషయంలో ఈఆరు ప్రశ్నలకు మార్కులు కలిపితే వారికి అవకాశం దక్కుతుందని చెప్పారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ 610 జీవోకు సంబంధించిన ప్రశ్నలో ఐచ్ఛికాలుగా గిర్‌గ్లానీ, జయభరత్‌రెడ్డి కమిషన్ తదితరాలను ఇచ్చారని పేర్కొంది. 610 జీవోకు గిర్‌గ్లానీ కమిషన్‌తో సామీప్యత ఉన్నప్పుడు.. అభ్యర్థులు ఐచ్ఛికాల ఎంపికలో సామీప్యతను పరిగణనలోకి తీసుకోవచ్చంది. ఒక సమాధానాన్ని భిన్న పద్ధతుల్లో చెప్పడానికి అవకాశం ఉందని, ఉదాహరణకు తన పేరును ఒక్కోచోట ఒక్కో విధంగా రాస్తుంటారని.. ఒకచోట టీబీ రాధాకృష్ణన్, మరోచోట టీబీఎన్ రాధాకృష్ణన్ అని రాస్తుంటారని, ఎలా రాసినా తప్పుకాదన్నారు. ఇలాంటి సందర్భాల్లో నియామక బోర్డు నిర్ణయం తీసుకోవచ్చుంది. ఫలితాలు ప్రకటించి 90 శాతం నియామక ప్రక్రియ పూర్తయిన దశలో ప్రశ్నలను తొలగించి తాజా జాబితాను రూపొందించాలనడం సరికాదంది. కొంతమంది కోసం మొత్తం ప్రక్రియను నిలిపివేయడం సరికాదంది. పోలీసు నియామక మండలి ఎస్సై నియామకాల కోసం గత ఏడాది ఆగస్టు 28న నిర్వహించిన రాత పరీక్షలో ఆరు ప్రశ్నలకు తప్పు సమాధానాలిచ్చారని, దీంతో తాము అవకాశం కోల్పోయామంటూ డి.ఉపేందర్‌రెడ్డి, మరో 14 మంది హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ ఆరు ప్రశ్నలను తొలగించి, తాజాగా అర్హత జాబితాను రూపొందించాలంటూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన విషయం విదితమే. ఆ ఉత్తర్వుల అమలును ధర్మాసనం నిలిపివేయడంతో ఎస్సై పోస్టుల నియామకాలకు అడ్డంకులు తొలగిపోయినట్లే.

పేదలందరికీ కనీస ఆదాయం

(మొదటి పేజీ తరువాయి)

'కిసాన్ ఆభార్ సమ్మేళనం'లో ఆయన ప్రసంగించారు. "హరిత విప్లవానికి పునాదులు వేసింది కాంగ్రెస్. క్షీర విప్లవాన్నీ, టెలికాం విప్లవాన్నీ తెచ్చింది. ఆహార భద్రత కల్పిస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకొంది. అదే బాటలో ఇప్పుడు పేదలందరికీ కనీస ఆదాయ భరోసా కల్పించాలన్న నిర్ణయం తీసుకుంది. వచ్చే సాధారణ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ సర్కారు నేతృత్వంలో ఇది జరుగుతుంది. మేము ఛత్తీస్‌గఢ్‌లో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతుల రుణాలను మాఫీ చేయాలని భాజపా సర్కారును అడిగితే... డబ్బుల్లేవన్నారు. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లోనూ ఇదే మాట చెప్పారు. దిల్లీలో మోదీ కూడా ఇదే పాట పాడారు. రైతుల రుణాలను మాఫీ చేసేందుకు మన దేశ కాపలాదారు వద్ద రూ.6 వేల కోట్లు లేవుగానీ... 15 మంది పారిశ్రామికవేత్తలకు 3.5 లక్షల కోట్ల మేర రుణాలు మాఫీ చేయడానికి డబ్బులుంటాయి! మేం అలా కాదు. ఛత్తీస్‌గఢ్‌లో అధికారంలోకి వస్తే పది రోజుల్లో అన్నదాతల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చాం. రాష్ట్రంలో 15 సంవత్సరాలుగా భాజపా చేయలేనిది 24 గంటల్లో చేసి చూపించాం. మోదీ, భాజపాల ప్రయత్నమంతా రెండు రకాల భారత్‌లను సృష్టించడంపైనే ఉంది. ఒకటేమో.. లబ్ధిదారుల వర్గానిది. ఇందులో రఫేల్ కుంభకోణం, అనిల్ అంబానీ, మెహుల్ ఛోక్సీ, నీరవ్ మోదీ, నరేంద్ర మోదీలు ఉంటారు. మరో భారత్‌లో పేదలు, బలహీనవర్గాలు, యువకులు, రైతులు ఉంటారు. మాక్కావాల్సింది ఒక్క ఇండియానే. అందులో పేదలందరికీ కనీస ఆదాయం దక్కాలి." అని రాహుల్ అన్నారు.

కనీస ఆదాయ భరోసాపై ఎన్నికల ప్రణాళికలో చెబుతాం

- చిదంబరం

దిల్లీ: సార్వత్రిక కనీస ఆదాయం (యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం)పై గత రెండేళ్లుగా తీవ్ర చర్చ జరుగుతోందనీ, దీన్ని అమలు చేయాల్సిన తరుణం ఆసన్నమైందని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. కాంగ్రెస్ సార్వత్రిక ఎన్నికల ప్రణాళికలో దీన్ని చేర్చుతామని ఆయన తెలిపారు.



రాయ్‌పూర్‌లో సోమవారం 'కిసాన్ ఆభార్ సమ్మేళనం'లో నాగలితో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ



బిగిసిన పిడికిలి

పోలీసుల చర్యలతో తగ్గుతున్న నేరాలు

మన చట్టాలు పదునైనవే. ప్రయోగించే తీరునుబట్టే ఫలితాలు ఉంటాయి. అమలులో చిత్తశుద్ధితో వ్యవహరిస్తే అద్భుత ఫలితాలు వస్తాయనడానికి ఇది మంచి ఉదాహరణ. రాష్ట్రంలో ప్రివెంటివ్ డిటెన్షన్ (పి.డి.)యాక్ట్‌ను ప్రయోగించడంలో పోలీసులు దూకుడు పెంచడంతో నేరగాళ్లు వెనక్కి తగ్గుతున్నారు. గతంలో నేరంచేసినా కొద్ది రోజుల్లోనే బయటికి వస్తామన్న ధీమాతో చెలరేగిన నేరగాళ్లు...ఇప్పుడు భయంతో వణికిపోతున్నారు. అరెస్టయిన వారు జైళ్లలో మగ్గిపోతుండగా బయట ఉన్న వారు నేరాలు చేసేందుకు జంకుతున్నారు.

గొలుసు దొంగల ఆటకట్టుకు మొదలై...

ముఖ్యంగా రాజధాని నగరంలో గొలుసు దొంగతనాలు విపరీతంగా ఉండేవి. కేవలం మహిళల మెడల్లో గొలుసులు దొంగిలించేందుకు ముంబయి, దిల్లీ వంటి దూరప్రాంతాల నుంచి కూడా నేరగాళ్లు విమానాల్లో హైదరాబాద్ వచ్చేవారు. స్థానిక దొంగలు సరేసరి. ఒక్కొక్కరు వందలాది గొలుసులు దొంగిలించారంటే అతిశయోక్తికాదు. చట్టప్రకారం వీరిపై చోరీ కిందనే కేసులు నమోదు చేసేవారు. ఇలాంటి చిన్నా చితకా నేరాలకు కొన్ని రోజుల్లోనే బెయిల్ దొరుకుతుంది. బెయిల్‌పై బయటకు వచ్చాక మళ్లీ పట్టుబడేవరకు దొంగతనాలు చేస్తూనే ఉండేవారు. ఈ గొలుసు దొంగల గొలుసుకట్టు చోరీలను నివారించే ఉద్దేశంతోనే మొదట వీరిపై పీడీ చట్టం ప్రయోగించారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో మొత్తం 90 మందిపై ఈ చట్టం ప్రయోగించారు. దాంతో 2014లో హైదరాబాద్ పరిధిలో 425 గొలుసు దొంగతనాలు జరగ్గా 2017 నాటికి ఇవి 40కి తగ్గాయి. అంటే ఈ నేరాలు 90.6 శాతం తగ్గాయన్నమాట. అలానే సైబరాబాద్‌లో 14, రాచకొండలో ఏడుగురు గొలుసు దొంగలపై ఈ చట్టాన్ని ప్రయోగించారు.

ప్రజల్లో భరోసా కలిగింది

– మహేందర్‌రెడ్డి, డీజీపీ



కరడుగట్టిన నేరగాళ్లను నియంత్రించడానికి పీడీ యాక్టు బాగా ఉపయోగపడుతుంది. దీనివల్ల రాష్ట్రంలో నేరాలు బాగా తగ్గాయి. అందుకే ప్రజల్లో భరోసా కలుగుతోంది. కేవలం సమాజ శ్రేయస్సు కోసం, అరుదుగా మాత్రమే దీన్ని ప్రయోగిస్తున్నాం. ఈ చట్టం కింద అరెస్టయిన నేరగాళ్ళు జైల్లో ఉన్నప్పుడు వారు చేసిన పాత కేసులకు సంబంధించిన న్యాయ విచారణ కూడా వేగంగా పూర్తి చేయవచ్చు. దాంతో అటువంటివారికి శిక్షలు కూడా ఎక్కువగా పడుతున్నాయి. ఈ చట్టం ప్రయోగించడం మొదలుపెట్టిన తర్వాత అంతర్రాష్ట్ర నేరగాళ్లు రాష్ట్రానికి రావడం తగ్గింది.

2017తో పోల్చుకుంటే నేరాల్లో తగ్గుదల (శాతాల్లో)

హత్యలు	దొంగతనాలు	గొలుసు దొంగతనాలు	మహిళలపై నేరాలు	సైబర్ నేరాలు	వైట్‌కాలర్ నేరాలు
4	8	43	7	3	2

పీడీయాక్ట్ ఏం చెబుతోంది?

నేరాలకు అలవాటుపడిన వారు బయట తిరుగుతున్నంతకాలం దొంగతనాలు, నేరాలను అదుపు చేయడం కష్టం. అందుకే వ్యవస్థీకృత నేరగాళ్ళను అదుపు చేసే ఉద్దేశంతో ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ)యాక్ట్-1950ను రూపొందించారు. శాంతిభద్రతలకు భంగం కలుగుతుందని భావించినప్పుడు ప్రభుత్వం ఈచట్టాన్ని ప్రయోగించవచ్చు. ఈ చట్టం కింద అరెస్టు చేస్తే 12 నెలల వరకూ బెయిల్ లభించదు.

- కిరాయి హత్యలు, గుడుంబా అమ్మకాలు, దోపిడీలు, అత్యాచారాల వంటి నిర్దిష్టమైన నేరాలకు పాల్పడే వారిపై మాత్రమే దీన్ని ప్రయోగించే అవకాశం ఉండేది. తెలంగాణ ప్రభుత్వం వీటికి అదనంగా నకిలీ విత్తనాల అమ్మకాలు, సైబర్ నేరాలు, నిత్యావసరాలు దారి మళ్లించే నేరాలకు పాల్పడేవారిపైనా, రేషన్ బియ్యం అక్రమ రవాణాచేసే వారిపై దీన్ని ప్రయోగించేలా చట్ట సవరణ చేసింది. హైదరాబాద్‌లో 88 మంది రౌడీషీటర్లపై పీడీ చట్టం ప్రయోగించారు.
- దీన్ని ప్రయోగించాలంటే ఆరు నెలల వ్యవధిలో రెండు కంటే ఎక్కువ నేరాలు చేసి ఉండాలి. కమిషనరేట్ల పరిధిలో కమిషనర్లు, జిల్లాల్లో అయితే కలెక్టర్లకు పీడీ చట్టం ప్రయోగించే అధికారం ఉంటుంది.
- ఉత్తర్వులు రాగానే పోలీసులు సదరు నేరగాళ్లను అరెస్టు చేసి జైలుకు పంపుతారు. మిగతా కేసులలో మాదిరిగా వీరిని న్యాయస్థానానికి తీసుకు వెళ్లాల్సిన పనిలేదు. ఇది దుర్వినియోగం కాకుండా చూడటానికి ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తులు, ఒక జిల్లా మాజీ న్యాయమూర్తితో సలహా మండలి ఉంటుంది.

- ఈనాడు, హైదరాబాద్

భారీగా గురుకుల కొలువులు

ఈనాడు - హైదరాబాద్

వెనుకబడిన తరగతుల గురుకులాల్లో ప్రభుత్వం 4,322 పోస్టులను మంజూరు చేసింది. రాష్ట్రంలో 2019-20 విద్యాసంవత్సరం నుంచి కొత్తగా ప్రారంభించనున్న 119 బీసీ గురుకుల పాఠశాలల్లో వీటిని విడతలవారీగా భర్తీ చేస్తారు. మహాత్మా జ్యోతిబా పులే బీసీ గురుకుల సొసైటీ పరిధిలోని పాఠశాలలు, కార్యాలయంలో 3,717 రెగ్యులర్, 605 పొరుగు సేవల కొలువులను మంజూరు చేస్తూ, సోమవారం ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో కొత్తగా 119 బీసీ గురుకులాల ఏర్పాటుకు ప్రభుత్వం 2018 ఆగస్టులో అనుమతించింది. బీసీ సంక్షేమశాఖ అవసరమైన పోస్టులను మంజూరు చేయాలంటూ ప్రభుత్వానికి దస్త్రం పంపింది. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే సమయానికి శాసనసభ ఎన్నికల నియమావళి అడ్డొచ్చింది. తాజా ఉత్తర్వులతో ఈ పోస్టులకు మంజూరు లభించింది.

ఏ సంవత్సరానికి ఎన్ని పోస్టులు?

- తాజా ఉత్తర్వుల్లో 2019-20 ఏడాదికి పీజీటీ, పీడీ, జేఎల్ పోస్టులు మినహా మిగతా 2,537 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటికి సర్వీసు నిబంధనలు పూర్తి చేసిన తరువాత ఉద్యోగ ప్రకటనలు వెలువడే అవకాశముంది.
- 2020-21 ఏడాదికి గురుకులాల్లో 833 పీజీటీ పోస్టులు మంజూరయ్యాయి.
- 2021-22 సంవత్సరానికి 119 ఫిజికల్ డైరెక్టర్ పోస్టులను కేటాయించింది.
- 2022-23 నాటికి పాఠశాలలు జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ అవుతాయి. అప్పుడు 833 జూనియర్ లెక్చరర్ పోస్టులు ఉంటాయి. ప్రభుత్వం ఉత్తర్వుల్లో వీటినీ చేర్చింది.
- మంజూరు చేసిన పోస్టులతో పాటు జీవో నం.2246 ప్రకారం శానిటేషన్, వంట, భద్రత విభాగాల్లో పనిచేసేందుకు పొరుగు సేవల కింద సిబ్బందిని తీసుకునేందుకు ప్రత్యేకంగా అనుమతించింది.

మంజూరైన రెగ్యులర్ పోస్టులు ఇవీ.. గురుకుల పాఠశాలల్లో

పోస్టు	సంఖ్య
ప్రిన్సిపల్	119
జూనియర్ లెక్చరర్	833
పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్	833
ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్	1,071
ఫిజికల్ డైరెక్టర్	119
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్	119
లైబ్రేరియన్	119
క్రాఫ్ట్, ఆర్ట్, మ్యూజిక్ టీచర్	119
స్టాఫ్ నర్సు	119
సీనియర్ అసిస్టెంట్	119
జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు	119
మొత్తం	3,689

గురుకుల సొసైటీ కార్యాలయంలో

పోస్టు	సంఖ్య
ఉప కార్యదర్శి	1
సహాయ కార్యదర్శి	2
ప్రాంతీయ సంచాలకులు	10
సూపరింటెండెంట్	02
సీనియర్ అసిస్టెంట్	08
జూనియర్ అసిస్టెంట్	05
మొత్తం	28

పొరుగు సేవల కింద కొలువులు గురుకుల పాఠశాలల్లో

పోస్టు	సంఖ్య
కంప్యూటర్ బోధకులు	238
ల్యాబ్ అటెండర్	238
ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు	119
మొత్తం	595

గురుకుల సొసైటీలో

పోస్టు	సంఖ్య
డేటా ప్రాసెసింగ్ అధికారి	2
డేటా ఎంట్రీ ఆపరేటర్	4
ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు	4
మొత్తం	10

రాజధానికి స్వచ్ఛభారత్ మిషన్ పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఈ గౌరవాన్ని దక్కించుకున్న మెట్రో నగరాల్లో హైదరాబాద్ మూడో స్థానంలో ఉంది. తాజాగా చండీగఢ్, ఇండోర్‌లను ఓడీఎఫ్++ నగరాలుగా ప్రకటించారు. మొత్తం 4,041 నగరాలు గుర్తింపునకు దరఖాస్తు చేసుకున్నాయి. ఇందులో తెలంగాణ నుంచి హైదరాబాద్, వరంగల్, వికారాబాద్ నగరాలున్నాయని బల్దియా అధికారులు తెలిపారు.

మూడు నెలలుగా యంత్రాంగం కృషి

హైదరాబాద్ నగరం ఓడీఎఫ్++ గుర్తింపు పొందేందుకు అధికార యంత్రాంగం గత మూడు నెలలుగా విశేష కృషి చేసిందని కమిషనర్ ఎం.దానకిశోర్ పేర్కొన్నారు. జలమండలి ఎండీగా, బల్దియా కమిషనర్‌గా రెండు శాఖల యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ వ్యర్థాలను శుద్ధి చేసే వ్యవస్థను గాడిలో పెట్టామన్నారు. నెలల వ్యవధిలోనే నగరంలోని మరుగుదొడ్లన్నింటి నుంచి వ్యర్థాలను 18 ఎస్టీపీలకు(మురుగు శుద్ధి కేంద్రాలు) అనుసంధానం చేశామన్నారు.

వ్యక్తిగత గృహాల్లో ఉత్పత్తయ్యే వ్యర్థాలను సెప్టిక్ ట్యాంకర్లు సేకరించి ఖాళీ స్థలాల్లో, చెరువుల్లో వదిలేవని, ఇప్పుడు ఆయా ట్యాంకర్లకు లైసెన్సులు ఇచ్చి ఎస్టీపీల్లో వదిలే ఏర్పాటు చేశామని చెప్పారు. అవన్నీ ఓడీఎఫ్++ గుర్తింపునకు దోహదపడ్డాయని దానకిశోర్ గుర్తు చేశారు. ఆ వ్యవస్థను మరింత ఆధునికీకరించి పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగరాన్ని సుస్థిరం చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

పర్యాటక ప్రాంతాల్లో వయోధికులకు 25శాతం రాయితీ

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: పర్యాటక శాఖ పరిధిలోని ప్రదేశాలు, హోటళ్లలో వయోధికులకు 25 శాతం రాయితీలు ఇస్తామని, మంగళవారం నుంచే ఉత్తర్వులు అమలయ్యేలా చర్యలు తీసుకోనున్నట్లు సాంస్కృతిక, పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం ప్రకటించారు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టస్కా) ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో వయోధికుల సంఘం దైనందిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ తర్వాత సంగీతం, నృత్యం, ఇతర కళల్లో ఆసక్తి ఉండి, నేర్చుకోవాలనుకునే వారికి సంగీత, నృత్య కళాశాలల్లో శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

అక్కడెట్లయితె ఇక్కడట్ల!

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే.. ఇక్కడా అదే విధానాన్ని అనుసరించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర బడ్జెట్ సమావేశాల నిర్వహణపై ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం తన నివాసంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలా? లేదంటే ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పెట్టాలా? అనే అంశంపై ఉన్నతాధికారులతో చర్చించారు. కేంద్రం ఫిబ్రవరి ఒకటో తేదీన పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే.. రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాలనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెడతామని కేంద్రం గతంలో ప్రకటించినా.. పూర్తిస్థాయి బడ్జెట్ అంశంపైనా ఆలోచిస్తున్నట్లు తాజాగా చెప్పిన నేపథ్యంలో సీఎం ఉన్నతాధికారులతో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషి, ఆర్థిక శాఖ సలహాదారు జి.ఆర్.రెడ్డి, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి కె.రామకృష్ణారావు, సీఎం కార్యాలయ అధికారులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర బడ్జెట్ సమావేశాలపై స్పష్టత రాగానే అందుకు అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌పై దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ బడ్జెట్ అంచనాలు, వ్యయం రాబడుల గురించి ఆర్థిక శాఖ అధికారులు సీఎంకు వివరించారు. ప్రభుత్వ శాఖల నుంచి వచ్చిన బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించారు. ప్రధానంగా నీటిపారుదల, వ్యవసాయం, సంక్షేమ రంగాల బడ్జెట్ ప్రతిపాదనలు ప్రస్తావనకు వచ్చాయి.

రాబడి బాగుంది.. పెద్ద పద్దే!

ఆర్థిక వృద్ధి రేటు గత ఏడాది కంటే మెరుగ్గా ఉండటంతో భారీ బడ్జెట్ ప్రవేశపెట్టడానికి సమస్యలు ఉండవని అధికారులు సీఎంకు వివరించినట్లు తెలిసింది. ప్రభుత్వ శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనల మేరకు ఈ సారి బడ్జెట్ రూ.2 లక్షల కోట్లు దాటుతుందని అధికారులు సీఎంకు తెలియజేశారు. ఒకవేళ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అయితే విధానపరమైన అంశాలతో నిమిత్తం లేకుండా ముందుకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిసింది. తెరాస ఇటీవల ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. ఆసరా పింఛన్ల నిబంధనలు సడలించిన నేపథ్యంలో కొత్త ఆర్థిక సంవత్సరంలో గత ఏడాది కేటాయింపుల కంటే చాలా ఎక్కువగా అవసరమని అధికారులు తెలిపారు. వ్యవసాయ రుణమాఫీని ఎలా అమలు చేయడం ద్వారా రైతులకు ప్రయోజనం ఉంటుందనే అంశంపై అధ్యయనం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. కేంద్ర బడ్జెట్‌పై స్పష్టత వచ్చిన తర్వాత మరోమారు సమావేశమై రాష్ట్ర బడ్జెట్‌పై పూర్తిస్థాయిలో చర్చించాలని నిర్ణయించారు.

జేఈల భర్తీకి మార్గం సుగమం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రహదారులు-భవనాల శాఖలో ఖాళీగా ఉన్న ఇంజినీర్ల పోస్టుల భర్తీకి మార్గం సుగమమైంది. 135 జూనియర్ ఇంజినీర్ల పోస్టులపై ముఖ్యమంత్రి కేసీఆర్ సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్లు సమాచారం. ఏఏ విభాగాల్లో ఎన్ని పోస్టులు అవసరమన్న అంశంపై అధికారులు కసరత్తు చేశారు. ఖాళీలపై తుది నివేదికను ప్రభుత్వానికి పంపారు. అధికారిక ఆమోదం లభించిన తర్వాత, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నియామకాలు చేపడతారు. దీనికి వీలుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయనున్నట్లు ఉన్నతాధికారి ఒకరు 'ఈనాడు'కు చెప్పారు.

పుట్టుక కాదు..

మానవజాతి ఔన్నత్యం మనుషులుగా జన్మించటంలో లేదు... మానవత్వంతో జీవించటంలో ఉంది!

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

29–1–2019 మంగళవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
హేమంత రుతువు; పుష్య మాసం; బహుళ పక్షం
నవమి: రా. 7.24 తదుపరి దశమి
విశాఖ నక్షత్రం: రా. 7.53 తదుపరి అనూరాధ
అమృత ఘడియలు: ఉ.11.05 నుంచి 12.40 వరకు
వర్జ్యం: రా. 11.57 నుంచి 1.35 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8.52 నుంచి 9.37 తిరిగి రా. 10.57 నుంచి 11.48 వరకు
రాహుకాలం: మ. 3.00 నుంచి 4.30 వరకు
సూర్యోదయం: ఉ.6-38; సూర్యాస్తమయం: సా.5-50

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	13.2	22.8
హన్మకొండ	14.0	24.0
కరీంనగర్	15.5	26.0
మెదక్	15.8	29.5
నిజామాబాద్	15.9	23.4
నల్గొండ	17.0	27.0
మహబూబ్‌నగర్	17.1	22.6
హైదరాబాద్	17.1	22.7
రామగుండం	17.6	25.4
సూర్యాపేట	20.0	22.0
ఖమ్మం	20.0	28.0
తిరుపతి	22.4	32.0

ఇదీ సంగతి!



ఏంటీ, ఇంకా కుంభమేళాలో స్నానం చేసి రాలేదా, నువ్వేం రాజకీయ నాయకుడివయ్యా. ఎన్నికల్లో పోటీ చేయట్లేదా...

జంగిల్‌కి రావాలంటే నేరగాళ్లు జంకాలి

- అటవీ నేరాలపై కఠినంగా వ్యవహరించండి
- అడవుల సంరక్షణకు త్వరలో పదునైన చట్టం
- పటిష్ఠ ఇన్‌ఫార్మర్ల వ్యవస్థ కూడా
- దూరదృశ్య సమీక్షలో సీఎస్ ఎస్‌కే జోషి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : అటవీ నేరాలను అరికట్టేందుకు కఠినంగా వ్యవహరించాలని, ఇకపై నేరగాళ్లు అడవుల్లోకి అడుగుపెట్టాలంటేనే భయపడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి అధికారులను ఆదేశించారు. అడవుల సంరక్షణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు, అటవీశాఖ అధికారులతో సీఎస్ జోషి సోమవారం దూరదృశ్య సమీక్ష నిర్వహించారు. డీజీపీ మహేందర్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి, అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ప్రశాంత్‌కుమార్ ఝా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. అడవులు విస్తరించి ఉన్న జిల్లాల్లో 54 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని పోలీసు, అటవీ శాఖలకు ఆదేశాలు జారీచేశామన్నారు. వీటి వద్ద సాయుధ బలగాలు నిరంతర పహారా నిర్వహిస్తాయని పేర్కొన్నారు. ప్రతి జిల్లాకు సంబంధించిన అటవీ రక్షణ కార్యాచరణను ఫిబ్రవరి 6లోగా సిద్ధం చేయాలని సూచించారు. అడవులను కాపాడుకునేందుకు పోలీసు నిఘా విభాగం సహకారం తీసుకుంటామని వెల్లడించారు. పటిష్ఠమైన ఇన్‌ఫార్మర్ల వ్యవస్థకు రూపకల్పన చేస్తామని, అటవీ నేరస్థులపై సరైన సమాచారమిచ్చే వారికి ప్రోత్సాహకాలు ఇస్తామని ప్రకటించారు. పర్యావరణపరంగా అత్యంత నివాసయోగ్యమైన రాష్ట్రంగా తెలంగాణ ఉండాలని సీఎం కేసీఆర్ భావిస్తున్నారని, ఆయన ఆదేశానుసారం హరితహారం ద్వారా అడవులకు వెలుపల, లోపల పచ్చదనాన్ని రక్షించుకోవాలని కోరారు. అటవీ నేరాల విచారణ, శిక్షల ఖరారులో వేగం పెంచేందుకు కఠిన చట్టాన్ని తీసుకొస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్‌వోలు ఒక బృందంగా ఏర్పడి అటవీ నేరాలను అరికట్టాలని డీజీపీ మహేందర్‌రెడ్డి కోరారు. తరచూ అటవీ నేరాలకు పాల్పడే వారిని జియో ట్యాగింగ్ చేస్తామని, అడవుల రక్షణకు పోలీసుశాఖ నుంచి పూర్తి సహకారమందిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని కలపకోత యంత్రాల యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. వన్యప్రాణులను వేటాడేందుకు కొందరు విద్యుత్తు తీగలు అమరుస్తున్నారని, ఆ శాఖ సహకారంతో వీటిని నిరోధిస్తామని పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్ ఝా స్పష్టం చేశారు. అటవీ ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు రెవెన్యూ, పోలీసుశాఖల సహకారంతో పనిచేస్తామన్నారు. సమీక్షలో అటవీ, పర్యావరణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్ర, అదనపు డీజీ జితేందర్, ఐజీలు నాగిరెడ్డి, స్టీఫెన్ రవీంద్ర, పీసీసీఎఫ్ (విజిలెన్స్) రఘువీర్, అదనపు పీసీసీఎఫ్‌లు మునీంద్ర, లోకేశ్ జైస్వాల్, డోబ్రియల్, తిరుపతయ్య, స్వర్గం శ్రీనివాస్, సీఎం కార్యాలయ ఓఎస్డీ ప్రియాంక వర్గీస్ తదితరులు పాల్గొన్నారు

పోలీసు, అటవీశాఖల ఉమ్మడి చెక్‌పోస్టులు

- ఆచరణలోకి సీఎం కేసీఆర్ ఆదేశాలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : అడవుల సంరక్షణకు తెలంగాణ సర్కారు చర్యలు చేపట్టింది. 'కలప అక్రమ రవాణా చేసే స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలని, వారెంతటి వారైనా ఉపేక్షించొద్దని.. అడవుల్లోకి వెళ్లే దారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సాయుధ పోలీసుల పహారా పెట్టాలని శనివారం అటవీ, పోలీసు శాఖ ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం కేసీఆర్ ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో అడవులు విస్తరించి ఉన్న పలు జిల్లాల్లో పోలీసు, అటవీశాఖలు ఉమ్మడి చెక్‌పోస్టులను సోమవారం ప్రారంభించాయి. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం ఆరేపల్లి, నిర్మల్ జిల్లా సోన్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఆయా మార్గాల్లో వెళ్లే ప్రతి వాహనాన్ని పోలీసుల పహారా మధ్య తనిఖీ చేస్తున్నారు.



నిర్మల్ జిల్లా సోన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

టేకు కలప స్వాధీనం...

కామారెడ్డి జిల్లా మాచారెడ్డి రేంజ్ పరిధిలోని నాలుగు గిరిజన తండాల్లో అటవీ, పోలీసుశాఖల ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఓ తండా నుంచి అక్రమంగా తరలిస్తోన్న రూ.1.5లక్షల విలువైన టేకు కలపను స్వాధీనం చేసుకొని నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అడవుల నరికివేత వల్ల కలిగే దుష్పరిణామాలు, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం తీసుకునే చర్యలపై తండా వాసులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ఎంబీబీఎస్ పరీక్షలో గందరగోళం

- రెండు సెట్లతో ద్వితీయ సంవత్సరం ఫార్మకాలజీ పరీక్ష నిర్వహణ
- తప్పిదాన్ని గుర్తించి రద్దుచేసిన వర్సిటీ అధికారులు

ఎంజీఎం ఆసుపత్రి (వరంగల్), న్యూస్‌టుడే: ఒకే పరీక్ష.. ప్రశ్నపత్రాలు మాత్రం రెండు.. ఒక్కో వైద్య కళాశాలలో ఒక్కో ప్రశ్నపత్రంతో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ విషయం తెలుసుకున్న కాళోజీ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం అధికారులు తక్షణమే స్పందించి పరీక్షను రద్దుచేస్తున్నట్లు ప్రకటించడంతో కలకలం రేగింది. కాళోజీ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో రాష్ట్రవ్యాప్తంగా ఎంబీబీఎస్ విద్యార్థులకు ప్రస్తుతం వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. సోమవారం ద్వితీయ సంవత్సరం ఫార్మకాలజీ పేపర్-1 నిర్వహించారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సెట్ ప్రశ్నపత్రాలు ఇవ్వాల్సి ఉండగా ఒక్కో కళాశాలలో ఒక్కో సెట్ ప్రశ్నపత్రాలతో వైద్య విద్యార్థులు పరీక్ష రాశారు. వర్సిటీ పరీక్షల నియంత్రణ విభాగం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఒకేసారి ఫార్మకాలజీ పేపర్-1కు సంబంధించి రెండు సెట్ల ప్రశ్నపత్రాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అయ్యాయి. వీటిని వైద్య కళాశాలల యాజమాన్యాలు డౌన్‌లోడ్ చేసుకుని తమకు నచ్చిన సెట్‌తో పరీక్ష నిర్వహించారు. కొందరు ఈ విషయాన్ని వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఒక్కో కళాశాలలో ఒక్కో సెట్‌తో పరీక్ష రాస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. తప్పును తెలుసుకున్న వెంటనే కాళోజీ వర్సిటీ అధికారులు పరీక్షను వాయిదా వేస్తున్నామని ప్రకటించారు. ఈ పరీక్షను మళ్లీ ఫిబ్రవరి 12న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని అధికారికంగా వెల్లడించారు. ఈ విషయమై విచారణకు ఓ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

హెచ్‌ఎండీఏ కమిషనర్ జనార్దన్‌రెడ్డి బదిలీ

- సాధారణ పరిపాలన శాఖ వద్ద రిపోర్టు చేయాలని ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) కమిషనర్ జనార్దన్‌రెడ్డిని ప్రభుత్వం సోమవారం బదిలీ చేసింది. ప్రస్తుతం ఆయన విదేశీ పర్యటనలో ఉన్నారు. బదిలీ ఉత్తర్వులు ఇచ్చిన ప్రభుత్వం ఆయనను మళ్లీ ఎక్కడా నియమించలేదు. విదేశీ పర్యటన నుంచి రాగానే సాధారణ పరిపాలన శాఖ వద్ద రిపోర్టు చేయాలని ఆదేశించింది. హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్‌కు అదనపు బాధ్యతలను అప్పగించింది.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నగదు లావాదేవీలు బంద్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లావాదేవీలను ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ చిరంజీవులు ఆదేశించారు. ఆదిలాబాద్, మూసాపేట, వెస్ట్‌మారెడ్‌పల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల విక్రయాల్లో భారీ అక్రమాలు వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో రూ.వెయ్యి దాటిన నగదు లావాదేవీలను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశామని చిరంజీవులు తెలిపారు.

ముగిసిన తెలంగాణ చరిత్ర అధ్యాపకుల సదస్సు

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయంలో రెండు రోజులపాటు జరిగిన తెలంగాణ రాష్ట్ర చరిత్ర అధ్యాపకుల సదస్సు సోమవారం ముగిసింది. కేయూ ఉపకులపతి ఆచార్య ఆర్.సాయన్న సహా పలువురు తెలంగాణ చరిత్ర, సంస్కృతులపై ఉపన్యాసాలు ఇచ్చారు. మొత్తం 105 పరిశోధనాపత్రాలను సమర్పించారని చరిత్ర, పర్యాటక శాఖ అధ్యక్షుడు, తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ స్థానిక బ్రాంచి కార్యదర్శి ఆచార్య కె.విజయబాబు చెప్పారు.

సీఎం హెలిప్యాడ్‌కు భూసేకరణపై నోటీసులు

కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: కరీంనగర్ జిల్లా తీగలగుట్ట గ్రామం సర్వే నం.232లో ముఖ్యమంత్రి కేసీఆర్ కోసం హెలిప్యాడ్ నిర్మాణానికి చేపట్టిన భూసేకరణపై హైకోర్టు ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. భూసేకరణకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలంటూ సోమవారం రెవెన్యూ, ఆర్అండ్‌బి, హోంశాఖల ముఖ్యకార్యదర్శులు, కరీంనగర్ జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్, ఆర్డీవోలను ఆదేశించింది. హెలిప్యాడ్ నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణను సవాల్ చేస్తూ సిరిసిల్లకు చెందిన పి.ప్రతిమ, మరో నలుగురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరాం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వి.రఘునాథ్ వాదనలు వినిపిస్తూ.. సమీపంలో కేసీఆర్, ఆయన బంధువుల భూములున్నప్పటికీ వాటిని వదిలి తమ భూములను సేకరించడం సరికాదన్నారు. ఈ ప్రక్రియలో భూసేకరణ చట్టం-2013 నిబంధనలను పట్టించుకోలేదని పేర్కొన్నారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో ఇప్పటికే రెండు హెలిప్యాడ్‌లున్నాయని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేశారు.

నలుగురు విద్యార్థినులకు స్వైన్‌ఫ్లూ

- గాంధీలో చికిత్స.. నిలకడగా ఆరోగ్య పరిస్థితి
- మొత్తం తొమ్మిదికి చేరిన బాధితుల సంఖ్య

ఈనాడు, హైదరాబాద్: చలి తీవ్రతతో హైదరాబాద్‌లో స్వైన్‌ఫ్లూ జడలు విప్పుతోంది. ఇప్పటికే ఈ వ్యాధి బారినపడి అయిదుగురు గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. నల్సార్ యూనివర్సిటీకి చెందిన నలుగురు విద్యార్థినులు స్వైన్‌ఫ్లూ లక్షణాలతో సోమవారం ఆసుపత్రిలో చేరారు. వీరికి స్వైన్‌ఫ్లూ సోకినట్లు నిర్ధారణ కావడంతో ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఇందులో ఇద్దరి వయసు 21 ఏళ్లు కాగా.. మరో ఇద్దరు విద్యార్థినులకు 19, 20 సంవత్సరాలు. ప్రస్తుతం వీరి ఆరోగ్యం నిలకడగా ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. దీంతో గాంధీలో చికిత్స పొందుతున్న స్వైన్‌ఫ్లూ బాధితుల సంఖ్య తొమ్మిదికి చేరింది. వీరు గత మూడు నాలుగు రోజులుగా జలుబు, దగ్గు, గొంతు నొప్పి, ఒంటి నొప్పులతో బాధపడుతున్నారు. ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ తగ్గక పోవడంతో వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. మిగతా విద్యార్థుల్లో ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. గడిచిన డిసెంబరులో స్వైన్‌ఫ్లూతో ఒక్క గాంధీ ఆసుపత్రిలోనే అయిదుగురు చనిపోయారు.

అప్రమత్తత అవసరం

సాధారణంగా అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు స్వైన్‌ఫ్లూ వైరస్ విజృంభిస్తుందని వైద్యులు తెలిపారు. చలి వాతావరణం ఈ వైరస్ విస్తరించడానికి ఎక్కువ దోహదపడుతుంది. గత మూడు రోజులుగా వర్షంతో పాటు తీవ్రమైన చలి వాతావరణం వైరస్ వ్యాప్తికి కారణమైంది. ఈ వ్యాధి పట్ల ముఖ్యంగా గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధుల బాధితులు, అవయవ మార్పిడి చేయించుకున్న వారు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు పేర్కొన్నారు. ఏదైనా పనిపై బయటకు వచ్చినప్పుడు మాస్క్ ధరించాలి. ప్రతి ఒక్కరూ చేతుల శుభ్రత పాటించాలి. దగ్గు, జలుబుతో బాధపడేవారు తుమ్మినా.. దగ్గినా చేతి రుమాలు అడ్డంగా పెట్టుకోవాలి. తీవ్రమైన జ్వరం, ముక్కు కారడం, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, నీరసం లాంటివి 3-4 రోజులకు మించి వేధిస్తుంటే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవడం మంచిది. ఇంట్లో ఒకరికి స్వైన్‌ఫ్లూ సోకితే కుటుంబసభ్యులు అప్రమత్తంగా ఉండాలి. అవసరమైతే వారు కూడా పరీక్షలు చేయించుకోవడం మంచిది.

శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదానానికి రూ.1.11కోట్ల విరాళం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి అదే పట్టణంలోని పాతవరదయ్యపాళెం రోడ్డులో నివాసముంటున్న యు.సుబ్రహ్మణ్యం, రాధిక దంపతులు సోమవారం రూ.1,11,11,112ల విరాళం అందజేశారు. సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులైన వెంకటసుబ్బయ్య, రామలక్ష్మమ్మ జ్ఞాపకార్థం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు చెక్కును ఆలయ ఈవో శ్రీరామ రామస్వామికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉసురు తీసిన విద్యుత్ తీగ

సైనిక ఎంపికకు వచ్చి.. కన్నుమూసిన యువకుడు



మెడకు తగిలి ప్రాణం తీసింది ఈ తీగలే (అంతరచిత్రంలో) మృతుడు అరవింద్

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: దేశ సేవ చేసేందుకు సైనికుడిగా మారాలనుకున్న 19 ఏళ్ల యువకుడు.. మెడకు విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మల్కాజిగిరి పోలీసుస్టేషన్ పరిధిలోని తూర్పు ఆనంద్‌బాగ్‌లో ఉన్న రైల్వే రక్షక దళం(ఆర్పీఎఫ్) శిక్షణ మైదానంలో చోటుచేసుకున్న హృదయ విదారక సంఘటన ఇది. సీఐ మన్మోహన్, ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. సోమవారం నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగే సైనిక ఎంపిక కోసం తెలుగు రాష్ట్రాల నుంచి అనేకమంది యువకులు వచ్చారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామానికి చెందిన అరవింద్ కూడా ఆదివారం రాత్రికే మల్కాజిగిరికి చేరుకున్నాడు. రాత్రంతా వర్షం, చలిలోనే తన మిత్రులతో కలిసి ఆర్పీఎఫ్ మైదానం వద్ద కాలిబాటపై ఉన్నాడు. తెల్లవారుజామున కాలకృత్యాల కోసం ఒక మిత్రుడితో పాటు సమీప ప్రాంతానికి వెళ్లాడు. అక్కడి చెత్తకుప్ప పైకి ఎక్కిన కాసేపటికే.. తగిలేంత కిందకు వేలాడుతున్న కరెంటు తీగ అతని మెడను తాకి విద్యుదాఘాతంతో విగతజీవుడయ్యాడు. స్నేహితుడి నుంచి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడ విద్యుత్ సరఫరా నిలిపివేయించి, మృతదేహాన్ని గాంధీ వైద్యశాలకు తరలించారు. జెన్‌కోలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న అంజలయ్య దంపతుల చిన్నకుమారుడు అరవింద్. వనపర్తి బీసీ హాస్టల్లో ఉంటూ బీకాం రెండో సంవత్సరం చదువుతున్నాడు.

మినీ థియేటర్ల ఏర్పాటుపై మరో అధ్యయనం

త్వరలో లఖ్‌నవూను సందర్శించనున్న ఆర్టీసీ అధికారులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 23 బస్‌స్టేషన్లలో మినీ థియేటర్లను నిర్మించాలని నిర్ణయించిన టీఎస్‌ఆర్టీసీ అధికారులు, దీనిపై అధ్యయనం చేయడానికి విజయవాడ బస్‌స్టేషన్‌ను సందర్శించారు. థియేటర్‌ను ప్రయాణికులు ఎలా ఆదరిస్తున్నారు.. ఎంత ఆదాయం వస్తుందనే అంశాలతో పాటు, టీఎస్‌ఆర్టీసీ బస్‌స్టేషన్లలోని ఖాళీ స్థలాల్లో థియేటర్ల నిర్మాణంపై సమగ్ర నివేదిక రూపొందించి ఆర్టీసీ ఎండీ, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మకు అందజేశారు. దాన్ని పరిశీలించిన ఆయన ఈ విషయంపై మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు అధికారుల బృందాన్ని లఖ్‌నవూకు పంపాలని నిర్ణయించారు. పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో అక్కడి బస్‌స్టేషన్లలో నిర్వహిస్తున్న థియేటర్లపై అధ్యయనం చేశాక, సంస్థకు ఆర్థిక ప్రయోజనం చేకూరేలా నిర్ణయం తీసుకుంటామని ఓ ప్రకటనలో తెలిపారు.

సోలార్ ప్లాంట్లపై సమీక్ష..

టీఎస్‌ఆర్టీసీ పరిధిలోని డిపోలు, ప్రధాన బస్‌స్టేషన్లు, యూనిట్లలో దశలవారీగా అందుబాటులోకి తీసుకువస్తోన్న సోలార్ ప్లాంట్ల పురోగతిపై రెవెన్యూ, ఐటీ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆర్టీసీ కార్యదర్శి పురుషోత్తం సమీక్షించారు. బస్‌భవన్‌లో సోమవారం సోలార్ సంస్థ ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. గడువులోగా సోలార్ ప్లాంట్ల పనులు పూర్తిచేసి అప్పగించాలని ఒప్పంద కంపెనీలను ఆదేశించారు.

ఆర్టీసీ అభివృద్ధికి నిధులివ్వండి

ఆర్టీసీ అభివృద్ధికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒక్కొక్కరు రూ.50 లక్షల చొప్పున నిధులు ఇవ్వాలని టీఎస్‌ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ డిమాండ్ చేసింది. ఆర్టీసీ డిపోలు, బస్‌స్టేషన్ల నిర్మాణం, విస్తరణ తదితర పనుల కోసం తమ నిధుల నుంచి ఈ మొత్తం కేటాయించాలని పేర్కొంది.

ఈనాడు

ఉరుముతున్న నిరుద్యోగం

'దేశార్థిక వ్యవస్థలో తయారీ రంగం వాటాను పెంచుకోని పక్షంలో, కృత్రిమ మేధ సాంకేతికత కారణంగా సేవల రంగంలో కొలువులు కునారిల్లి ఇండియాలో పెద్దయెత్తున నిరుద్యోగ సమస్య తలెత్తే ప్రమాదం ఉంది'- నోబెల్ పురస్కార గ్రహీత పాల్ క్రుగ్‌మన్ నిరుడు చేసిన భవిష్యత్ దర్శనం అది. అమెరికా, జపాన్, చైనాలు వయోభారంతో కుంగుతుంటే యువ జనసంద్ర ఘోషతో పోటెత్తుతున్న ఇండియా- మున్నెన్నడూ లేనిస్థాయిలో పనిమంతుల దేశంగా ఎదుగుతోందన్న అమాత్యుల ప్రసంగాలు ఇటీవలి ప్రవాస భారతీయ దివస్‌లో మోతెక్కిపోయాయి. సమర్థ మానవ వనరులుగా యువ శక్తియుక్తులకు సానపట్టి వారి పరిశ్రమనే దేశ ప్రగతికి చోదకశక్తిగా తీర్చిదిద్దాల్సిన విద్యుక్త ధర్మనిర్వహణలో కేంద్రం వైఫల్యాలు- ఏటికేడు జడలు విరబోసుకుంటున్న నిరుద్యోగితలో కళ్లకు కడుతున్నాయి. 2017 సెప్టెంబరు నుంచి 15 నెలల కాలంలో సంఘటిత రంగంలోనే కోటీ 80 లక్షల ఉద్యోగాల సృష్టి జరిగినట్లు కేంద్రీయ గణాంకాల కార్యాలయం తాజాగా ప్రకటించింది. ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ, ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ, నయా పింఛను పథకాల్లోని సమాచారాన్ని క్రోడీకరించి తేల్చిన ఉద్యోగిత లెక్కలో తేడాపాడాలు ఉండవచ్చునని అది స్పష్టీకరించింది. దేశంలో ఉపాధి రంగ వాతావరణంపై సమగ్ర సమాచారం ఏదీ లేకపోవడం సరైన విధానాల రూపకల్పనకు ప్రధాన అవరోధంగా మారిందని పార్లమెంటరీ అంచనాల కమిటీ పది రోజుల నాడు వాపోయింది. ఉపాధి కల్పన కార్యాలయాన్ని పునర్ వ్యవస్థీకరించి కేంద్ర ప్రభుత్వం కొలువుతీర్చిన 'నేషనల్ కెరీర్ పోర్టల్'లో మూడు కోట్ల 91 లక్షల మంది పేర్లు నమోదు చేసుకోగా, 2016-17లో ఏడు లక్షల ఏడు వేల (1.8శాతం) మందికే ఉపాధి దక్కిందని కమిటీ నిర్ధారించింది. కార్మిక ఉపాధి మంత్రిత్వశాఖ పరిధిలోని లేబర్ బ్యూరో 2016 నుంచి ఉపాధి రంగంపై క్రమానుగత సర్వేలను నిలిపివేయడంతో- కేంద్ర సర్కారు పరంగా కాకిలెక్కలు హోరెత్తుతున్నాయి. మరోవంక, నిరుద్యోగుల నిరసనలూ పెరుగుతున్నాయి!

ప్రపంచ దేశాల్లోనే అత్యధిక వృద్ధిరేటు నమోదు చేస్తున్నది ఇండియాయేనని, త్వరలో బ్రిటన్‌ను తోసిరాజని అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందన్న అంచనాలు మిన్నంటుతున్న తరుణమిది. యూపీఏ జమానాలో ఉపాధిరహిత వృద్ధి నిరుద్యోగుల ఆశల్ని నిలువునా నీరుగార్చిందని, అందుకు భిన్నంగా ఉపాధికి ఊతమిచ్చి దేశ ప్రగతిలో యువతను భాగస్వాముల్ని చేస్తామని ఎన్‌డీఏ ఘనంగా వాగ్దానం చేసింది. నాలుగున్నరేళ్ల కాలంలో 'మేకిన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియా' వంటి పథకాలెన్ని పట్టాలకెక్కినా, ఉపాధి అవకాశాల మెరుగుదల మరీచికగానే మిగిలింది. కాబట్టే, చదువుకొన్న నిరుద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 60 సంస్థలు- నిరుద్యోగితను జాతీయ వైపరీత్యంగా ప్రకటించాలని కోరుతూ తాజాగా తీర్మానించాయి. ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ యుద్ధప్రాతిపదికన కేంద్రం చట్టం చేసిన నేపథ్యంలో- 29 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల్ని సత్వరం భర్తీ చెయ్యాలన్న డిమాండ్లు జోరెత్తుతున్నాయి. ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులు, పోలీసు విభాగం, సర్వశిక్ష అభియాన్, కేంద్రప్రభుత్వ మంత్రిత్వశాఖల్లోనే దాదాపు 22 లక్షల ఖాళీలు ప్రస్ఫుటమవుతున్నాయి. దానికితోడు పెద్దనోట్ల రద్దు, వసేప (జీఎస్‌టీ) కుదుపులతో లక్షల మంది ఉపాధి కోల్పోయారన్న అంచనాలు, ఈ ఏడాది సైతం నిరుద్యోగిత మూడున్నర శాతంగా ఉండబోతోందన్న అంతర్జాతీయ కార్మిక సంస్థ అధ్యయనాలు, వ్యాపార సానుకూల సూచీల్లో ఇండియా దూసుకెళ్లినా, అందుకు తగ్గట్లుగా విస్తరించని ఉపాధి మార్కెట్లు- నిరుద్యోగ భారతాన్ని నిరాశా నిస్పృహల్లో ముంచుతున్నాయి. ఏటా ఉపాధి వేటకు సిద్ధమవుతున్న యువజనం రేటుకు సరితూగాలంటే సంవత్సరానికి 81 లక్షల ఉద్యోగాల సృష్టికి సిద్ధం కావాలని ప్రపంచ బ్యాంకు నిర్దేశించింది. భారత్‌లో తయారీ లక్ష్యాలు గురికి బారెడు దూరం కావడం యువజనాన్ని మరింతగా కుంగదీస్తోంది!

స్థూల దేశీయోత్పత్తిలో ప్రస్తుతం 16 శాతంలోపు ఉన్న పారిశ్రామిక రంగం వాటాను పాతిక శాతానికి పెంచాలన్న బృహత్ లక్ష్యంతో కేంద్రప్రభుత్వం 'మేకిన్ ఇండియా' మంత్రాన్ని జపించింది. మరో అయిదారేళ్లలో భారత జీడీపీని అయిదు లక్షల కోట్ల డాలర్లకు చేర్చడం, అందులో పారిశ్రామిక రంగం వాటా కనీసం అయిదోవంతు అయినా ఉండేలా చూడటం ప్రధాన ధ్యేయమంటూ కేంద్రం పాతిక రంగాల్ని గుర్తించింది. జీడీపీలో 40 శాతాన్ని ఎగుమతుల ద్వారానే ఆర్జించాలని నిర్దేశించుకొని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి నిబంధనల్లో నూట పది సవరణలు తెచ్చి, పరిశ్రమల స్థాపనకు అవరోధంగా ఉన్న 1,300 నిబంధనల్ని తొలగించామన్నా- పెద్దగా ఒనగూడిందేముంది? దేశీయంగా సెల్‌ఫోన్ల తయారీలో పెను విప్లవమే సృష్టించామని ప్రధానమంత్రి చెప్పినా, చైనా నుంచి విడిభాగాల దిగుమతుల బిల్లు తడిసి మోపెడై, ఇక్కడ కేవలం సెల్‌ఫోన్లకు తుదిరూపు ఇచ్చే క్రతువే జరుగుతోంది. భారత్‌లో తయారీ అంటూ పట్టుబట్టి ఉక్కు మంత్రిత్వ శాఖ- ఉన్నతస్థాయి స్టీలు ఉత్పాదనల్ని కార్ల తయారీ సంస్థలు దేశీయంగానే సేకరించాలనడంతో ఆటొమొబైల్ రంగమే స్తంభించిపోయే పరిస్థితి తలెత్తింది. అతి చేస్తే గతి చెడుతుందని భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ చేస్తున్న హెచ్చరికల్ని ఉక్కు శాఖ లక్ష్యపెట్టే అవకాశం లేదన్న సమాచారం- అభివృద్ధి లక్ష్యాలు ఎందుకు గురి తప్పుతున్నాయో వెల్లడిస్తోంది. దేశ విశాల హితమనే విధాన చట్రంలో భిన్న విభాగాల మధ్య సమన్వయంతో పాదర్శకత, జవాబుదారీతనాలతో సాగాల్సిన ప్రస్థానం ఇలా ఒడుదొడుకుల పాలవుతుండబట్టే, నిరుద్యోగిత ఇంతగా తాండవిస్తోంది!

ఎన్నికల వేళ... ఆశల ఊయల



తుమ్మల కిశోర్

సాధారణంగా మధ్యంతర బడ్జెట్‌పై అటు పారిశ్రామిక రంగానికి, కార్పొరేట్ వర్గాలకు ఇటు కర్షకులకు, ఉద్యోగస్తులకు, సామాన్య ప్రజానీకానికి పెద్దగా ఆసక్తి ఉండదు. మధ్యంతర బడ్జెట్ కేవలం సార్వత్రిక ఎన్నికల తరవాత కొత్త సర్కారు ఏర్పడేవరకు ప్రభుత్వ యంత్రాంగాన్ని నడపడానికి అవసరమయ్యే ఖర్చులు రాసే పద్దు లాంటిది. ఈ తాత్కాలిక బడ్జెట్‌లో కొత్తగా ఎటువంటి సంక్షేమ పథకాలు, పన్నురాయితీలు, రుణ వితరణ లక్ష్యాలు, ఆర్థిక సంస్కరణల ఊసు ఉండదు. ఇది ఆనవాయితీ. ఈసారి అందుకు భిన్నంగా ఫిబ్రవరి ఒకటిన ప్రవేశపెట్టనున్న మధ్యంతర బడ్జెట్లో మోదీ ప్రభుత్వం ఒకడుగు ముందుకువేసి కొన్ని జనరంజక పథకాలతో, కొన్ని తాయిలాలతో ఎన్నికలకు సిద్ధమవుతుందన్న సంకేతాలు అందుతున్నాయి. 'దేశ ప్రయోజనాల దృష్ట్యా, రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యల దృష్ట్యా సంప్రదాయాన్ని పక్కనపెట్టి అన్నదాతను ఆదుకొనేందుకు బడ్జెట్లో ప్యాకేజీని ప్రకటిస్తా'మని కొన్ని రోజుల క్రితం కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించడంతో అన్ని వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. మరో 3, 4 నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మోదీ ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌ను సాధ్యమైనంత జనరంజకంగా రూపొందించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి.

అంచనాలు ఆశాజనకం

పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలుతో తీవ్ర కుదుపుల పాలైన దేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే కోలుకొంటోంది. 2017 తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) కనిష్ఠంగా 5.7 శాతానికి పడిపోగా ఆ తరవాత త్రైమాసికాల్లో పుంజుకొని గడిచిన రెండో త్రైమాసికం (జులై-సెప్టెంబరు)లో 7.1 శాతానికి పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ 7.2 శాతం ఉంటుందని అంతర్జాతీయ రేటింగ్ సంస్థలు కొన్ని అంచనా వేశాయి. ప్రపంచబ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదిక (గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్)లో రానున్న రెండేళ్లలో భారత్ వృద్ధిరేటు 7.5 శాతానికి చేరుతుందని అంచనా వేసింది. తాజాగా అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎమ్ఎఫ్) 2019లో భారత్ వృద్ధిరేటు 7.5 శాతం ఉంటుందని 'వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్' నివేదికలో పేర్కొంది. 2019లో ప్రపంచ వృద్ధిరేటు నెమ్మదించి 3.5 శాతానికి పరిమితమవుతుందని అయినా ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతుందని ఐఎమ్ఎఫ్ ఆశాభావం వ్యక్తం చేసింది. అంతర్జాతీయంగా, దేశీయంగా పలు ప్రతికూలతలు ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరవృద్ధి రేటులో దూసుకుపోతుందన్న ప్రపంచ బ్యాంకు, ఐఎమ్ఎఫ్‌ల అంచనాలు ఒకింత ఊరట కలిగిస్తున్నాయి. క్రమంగా తగ్గుతున్న ద్రవ్యోల్బణం (2.19 శాతం), ప్రత్యక్ష పన్నుల వసూళ్లలో వృద్ధి (14 శాతం- 8.74 లక్షల కోట్లు), పెరుగుతున్న పెట్టుబడులు దేశ వృద్ధిరేటుపై కొత్త ఆశలు రేపుతున్నాయి. మరికొన్ని రోజుల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మధ్యంతర బడ్జెట్ ఏ విధంగా ఉండబోతోందన్న ఉత్కంఠ పెరుగుతోంది. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ఓటమి పాలైనందువల్ల మోదీ ప్రభుత్వం ఇప్పటికే దిద్దుబాటు చర్యలు చేపట్టింది. పెద్దనోట్ల రద్దు వల్ల తీవ్రంగా నష్టపోయిన చిరువ్యాపారస్తులకు కొంత ఉపశమనం కల్పించే దిశలో చర్యలు చేపట్టింది. జీఎస్‌టీ అమలు వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్నవ్యాపారులకు ఇటీవల కొంత ఊరట కల్పించింది. రూ.40 లక్షల వార్షిక టర్నోవర్ ఉన్న వ్యాపారులు ఎలాంటి జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేకుండా వారికి మినహాయింపు నిచ్చింది. శ్లాబులను కుదించడంతో పాటు సామాన్యుడిపై జీఎస్‌టీ భారాన్ని పరిమితం చేసే దిశలో పలు వస్తువులపై పన్ను శాతం తగ్గించింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలను ఆదుకొనే క్రమంలో ఇటీవల రిజర్వు బ్యాంకు రూ.25 కోట్ల వరకు ఉన్న రుణ ఖాతాలను పునర్‌వ్యవస్థీకరించే వెసులుబాటు కల్పించింది.

వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించడంతోపాటు ఈ మధ్యంతర బడ్జెట్లో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.12 లక్షల కోట్ల మేర బ్యాంకు రుణాలు అందించేందుకు ప్రతిపాదనలు చేయాలి. చిన్న, సన్నకారు రైతులు గతంలో తీసుకున్న పంట రుణాలను (లక్ష రూపాయల లోపు) పునర్ వ్యవస్థీకరించడంతోపాటు ఆ రుణాలపై వడ్డీ రద్దు చేసే దిశలో చర్యలు చేపట్టాలి. కష్టనష్టాల పాలవుతున్న అన్నదాతను ఆదుకొనే క్రమంలో



మధ్యంతర బడ్జెట్లో వరాలు?


మధ్యంతర బడ్జెట్లో పలు కీలక ప్రతిపాదనలు చేసే అవకాశం ఉంది. దేశంలో రైతు ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపుచేయాలన్న సంకల్పంతో మోదీ ప్రభుత్వం పలుచర్యలు చేపట్టింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, అగ్రిఉడాన్ వంటి పథకాల అమలుతో అన్నదాతకు చేయూతనిచ్చే ప్రయత్నం చేసింది. అన్నదాత తమ వ్యవసాయోత్పత్తులను ఆన్‌లైన్‌లో అమ్ముకొనే వెసులుబాటు కల్పించేందుకు ఈ-నామ్ వంటి పోర్టళ్ళను ప్రవేశపెట్టడంతో పాటు నగదు బదిలీ పథకం ద్వారా రైతులకు సబ్సిడీ మొత్తాలను నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమచేస్తోంది. గడచిన నాలుగేళ్లలో 11 రాష్ట్రాల్లో (ఆంధ్రప్రదేశ్, అసోం, చండీగఢ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, తెలంగాణ, తమిళనాడు, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్) దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయల మేర వ్యవసాయ రుణాలను రద్దు చేశారు. గతంలోనూ పలురాష్ట్రాల్లో రుణమాఫీ అమలు చేశారు. అయినా రైతాంగం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొని దిక్కుతోచని స్థితిలో ఉంది. రైతు సమస్యలను పరిష్కరించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంలో అన్ని ప్రభుత్వాలు విఫలమయ్యాయి. ఏటా (2013 నుంచి 12 వేల దాకా) రైతుల ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతుంది. అందువల్ల కేంద్ర ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ మధ్యంతర బడ్జెట్లో అన్నదాతకు ఉపశమనం కోసం ఆర్థిక ప్యాకేజీని ప్రకటించాల్సిన అవసరం ఉంది. అంతేకాక రైతాంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారాలను చూపేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి.

రాజకీయ లబ్ధే లక్ష్యమా?

గత బడ్జెట్లో కార్పొరేట్ పన్నును 30 శాతంనుంచి 25 శాతానికి (రూ. 250 కోట్ల వరకు టర్నోవర్ ఉన్న సంస్థలకు) తగ్గించారు. ఈసారి మధ్యంతర బడ్జెట్లో ఆర్థిక మంత్రి ఈ పన్నుల జోలికి వెళ్ళకపోవచ్చు. వ్యక్తిగత ఆదాయపు పన్ను మినహాయింపులపై ఆశగా ఎదురుచూస్తున్న మధ్యతరగతికి కొంత ఊరటను ఇచ్చే దిశలో కొన్ని ప్రతిపాదనలు చేయవచ్చు. ప్రస్తుతం కొనసాగుతున్న ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.2.50 లక్షలనుంచి రూ.3.50 లక్షలకు పెంచే అవకాశం ఉంది. అదేవిధంగా ఆదాయపు పన్నుచట్టం సెక్షన్ 80సీ కింద ప్రస్తుతం ఉన్న పన్ను మినహాయింపు పరిమితిని రూ.1.50 లక్షల నుంచి రూ 2.50 లక్షల దాకా పెంచాలి. వయోవృద్ధులకు ప్రస్తుతం ఇస్తున్న పన్ను రాయితీలు, మినహాయింపుల్లో పెంపుదల ఎంతో అవసరం. ఆదాయ పన్ను శ్లాబులను క్రమబద్ధీకరించి ప్రత్యక్ష పన్నుల సంస్కరణలను వేగవంతం చేసే దిశలో నిరుడు ప్రభుత్వం నియమించిన అఖిలేశ్ రంజన్ కమిటీ తమ నివేదికను 28 ఫిబ్రవరి నాటికి సమర్పించనుంది. అందువల్ల ఆదాయ పన్ను శ్లాబులను యథాతథంగానే కొనసాగించి మధ్యతరగతికి కొంత ఊరట కలిగించే దిశలో కొన్ని రాయితీలు ప్రకటించవచ్చు. బడ్జెట్ మధ్యంతరమే అయినా ఎన్నికల దృష్ట్యా ఆర్థిక మంత్రి కీలక ప్రతిపాదనలు కొన్ని చేసే అవకాశం లేకపోలేదు. ఆర్థిక క్రమశిక్షణ కంటే రాజకీయ లబ్ధికే అధిక ప్రాధాన్యం ఇచ్చే దిశగా మధ్యంతర బడ్జెట్లో కొన్ని జనాకర్షక పథకాలను ప్రవేశపెట్టే అవకాశాలున్న దృష్ట్యా ద్రవ్యలోటు అదుపుతప్పే సూచనలు కనబడుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు జీడీపీలో 3.3 శాతానికి పరిమితం కావాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోవచ్చు. ప్రభుత్వ అంచనాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు రూ.6.24 లక్షల కోట్లకు పరిమితం కావాల్సి ఉండగా గడచిన అక్టోబర్ నాటికి ద్రవ్యలోటు రూ.6.49 లక్షల కోట్లు దాటింది. మార్చి నాటికి ఇది మరింత పెరిగే ప్రమాదముంది. ప్రత్యక్ష పన్నుల వసూళ్లు గణనీయంగా వృద్ధి చెందడం ప్రభుత్వానికి కొంత ఊరటనిచ్చే అంశమే. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.11.50 లక్షల కోట్ల దాకా ఉంటాయని ప్రభుత్వం అంచనా వేయగా గడచిన డిసెంబర్ నాటికి అవి రూ.8.74 లక్షల కోట్లకు చేరాయి. మార్చి నాటికి పన్ను వసూళ్లు ప్రభుత్వ అంచనాలకు మించి వృద్ధి చెందే అవకాశం లేకపోలేదు. ఇక రిజర్వు బ్యాంకు ఈ మార్చిలోపు రూ.30.35 వేలకోట్ల దాకా మధ్యంతర డివిడెండును ప్రభుత్వానికి అందజేసే వీలుంది. వీటికితోడు ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడులను ఉపసంహరించే ప్రక్రియ మరింత వేగవంతం చేసినట్లయితే మరికొన్ని నిధులు ప్రభుత్వ ఖజానాలో చేరతాయి. ఫలితంగా ప్రభుత్వానికి కొంత ఆర్థిక వెసులుబాటు కలిగే అవకాశం ఉంది. అందువల్ల మధ్యంతర బడ్జెట్ జనాకర్షకంగా ఉంటుందనడంలో సందేహం లేదు!

(రచయిత- బ్యాంకింగ్ రంగ నిపుణులు)

రైతన్న ఎదురుచూపులు



దేశ రైతాంగానికి తాత్కాలిక ఉపశమనాన్నిచ్చే రుణమాఫీ పథకాలకు స్వస్తిపలికి వారికి కనీస ఆదాయం నేరుగా అందించే దిశలో పథకాలు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణలో అమలవుతున్న 'రైతుబంధు' పథకం మాదిరి ఓ కొత్త పథకాన్ని ఈ బడ్జెట్లో ప్రవేశపెట్టాలి. చిన్న, సన్నకారు రైతులు, కౌలుదారులకు పూర్తి స్థాయి ప్రయోజనాలు అందేవిధంగా కనీస ఆదాయపథకాన్ని రూపొందించడంతోపాటు వ్యవసాయరంగంలో పెద్దయెత్తున సంస్కరణలు చేపట్టాలి. వడ్డీలేని రుణాలకంటే కనీస ఆదాయ పథకమే మేలు. ఎందుకంటే వడ్డీలేని రుణాలందించడంలో బ్యాంకులు కొంత తాత్సారం చేస్తాయి. కొత్త రుణాలు పొందాలంటే ప్రస్తుతం ఉన్న రుణబకాయిలను పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటిదాకా 'రుణమాఫీ' కోసం ఎదురుచూస్తూ బకాయిలు చెల్లించని రైతాంగానికి నిరాశ కలిగిస్తుంది. అధికశాతం రైతాంగం వడ్డీలేని రుణాలకు అర్హత పొందలేకపోవచ్చు. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో అన్నదాతకు సత్వర ఆర్థికసాయం నేరుగా అందాలంటే కనీస ఆదాయ పథకంవైపే అడుగులు పడాలి. సత్వర ఉపశమనాన్నిచ్చే పథకాలతో పాటు వ్యవసాయరంగంలో మెరుపువేగంతో సంస్కరణలు అమలు చేయాల్సి ఉంది. అన్నదాతకు ఇతరత్రా ఆదాయ మార్గాలను పెంచడంతోపాటు వ్యవసాయరంగంలో పెద్దయెత్తున పెట్టుబడులు ఆకర్షించేందుకు చర్యలు చేపట్టాలి.

అమలుకాని చట్టంతో అభద్రత

'దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగాల్లో కోట్ల మంది మహిళలు పనిచేస్తున్నారు. వారు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నారు. దాన్ని నివారించడం ద్వారా మహిళలకు పని చేసే హక్కును, సురక్షిత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత దేశంపై ఉంది'- 2015 నవంబరు 18న లైంగిక వేధింపుల నిరోధం, పరిష్కార చట్టంపై అవగాహన కల్పిస్తూ రూపొందించిన చేతి పుస్తకం ఆవిష్కరణ సందర్భంగా కేంద్ర మహిళా శిశు, సంక్షేమ మంత్రి మేనకాగాంధీ చేసిన వ్యాఖ్యలివి. జాతీయ నేర గణాంక సంస్థ(ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ప్రకారం 2013-17 మధ్యకాలంలో పని ప్రదేశాల్లో వేధింపులు ఏటా 25-30 శాతం చొప్పున పెరిగాయి. వీటిలో ఉత్తర్ ప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. దిల్లీ దానితో పోటీపడుతోంది.

మహిళలపై వేధింపుల నివారణకు నిర్దేశించిన చట్టాలు కాగితాలకే పరిమితం అవుతుండటంతో సగటు భారతీయ మహిళ అభద్రత మధ్య కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. దేశవ్యాప్తంగా ఏటికేడు ఈ తరహా నేరాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వీటికి అడ్డుకట్ట వేసే చట్టాలు, వ్యవస్థలు ఉన్నాయి. అయినప్పటికీ ఆచరణలో అవి మహిళలకు భద్రత కల్పించలేకపోతున్నాయి. ఏడాది క్రితం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వైద్యకళాశాల ఆస్పత్రిలోని వైద్యురాలు పైఅధికారి వేధింపులకు తాళలేక ఆత్మహత్యకు ఒడిగట్టింది. కరీంనగర్ జిల్లాలోని ఓ పురపాలికలో మహిళా ఉద్యోగిపై ఉన్నతాధికారి సాగించిన వేధింపుల పర్వం పెను దుమారమే రేపింది. మహిళల పని ప్రదేశంలో వేధింపుల చట్టం పురుడు పోసుకోవడానికి రాజస్థాన్‌లో చోటుచేసుకున్న ఓ ఘటన కారణం. అక్కడ 1992లో మహిళా సాధికారత ప్రాజెక్టులో పనిచేసే బన్వారీదేవి అనే మహిళ ఏడాది వయసు గల బాలిక వివాహాన్ని అడ్డుకుంది. దాంతో ఆగ్రహించిన పల్లెవాసులు అయిదుగురు భర్త ఎదుటే ఆమెపై తెగబడ్డారు. విశాఖ అనే వేదిక ద్వారా ప్రజా సంఘాలు సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేయడంతో ఆ ఘోరం వెలుగుచూసింది. దరిమిలా 2007లో అప్పటి కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక బిల్లును రూపొందించింది. 2013 నుంచి చట్టం అమలులోకి వచ్చింది. దీని ప్రకారం అన్ని ప్రభుత్వ/ప్రైవేటు, సేవా రంగాల్లో అంతర్గత విచారణ కమిటీల ఏర్పాటు తప్పనిసరి. దేశంలోని 36 శాతం కంపెనీలు, 25 శాతం ప్రభుత్వరంగ సంస్థలు అసలు కమిటీలనే ఏర్పాటు చేయలేదని, నామమాత్రంగా ఏర్పాటు చేసిన సంస్థలు సైతం సభ్యులకు శిక్షణ ఇవ్వలేదని 2015లో జాతీయ మహిళా సంక్షేమ శాఖ నిర్వహించిన అధ్యయనంలో తేలింది. 2017లో ఇండియన్ బార్ అసోసియేషన్ నిర్వహించిన సర్వేలో- ఉద్యోగం, పరువుపోతుందన్న భయంతో 70 శాతం మహిళలు వేధింపులపై ఫిర్యాదులు చేయడం లేదని వెల్లడైంది. చట్టంపై అవగాహన కల్పించే లక్ష్యంతో మంత్రిత్వ



పని ప్రదేశాల్లో మహిళలకు వేధింపులు

శాఖ రెండేళ్ల క్రితం మరో జీఓ విడుదల చేసింది. అంతర్గత కమిటీ సభ్యులకు చట్టంపై అవగాహన కల్పించే బాధ్యతలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శిక్షణ సంస్థలకు అప్పగించింది. ఏడాది లోపు శిక్షణ పూర్తి చేయాలని ఆదేశించింది. మూడు నెలలకు ఒకసారి వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని నిర్దేశించి చేతులు దులుపుకొంది. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ప్రభుత్వ/ప్రైవేటు రంగ సంస్థలు తప్పనిసరిగా మహిళలతో అంతర్గత విచారణ కమిటీలు ఏర్పాటు చేయాలి. సేవా రంగంలో అయిదేళ్ల అనుభవం ఉన్న సామాజిక కార్యకర్త, కార్మిక రంగం, యాజమాన్యం తరపున చట్టాలపై అవగాహన ఉన్న పదిమంది వీటిలో సభ్యులుగా ఉండాలి. ఆ కమిటీలకు సమీకృత శిశు సంరక్షణ పథకం నేతృత్వంలో ఏర్పాటయ్యే జిల్లా స్థాయి శిశు సంరక్షణ సంఘం లేదా జిల్లా స్థాయి మహిళా వివాదాల పరిష్కార కమిటీ సహాయ సహకారాలు అందించాలి. కమిటీలు ఏర్పాటయ్యేలా జిల్లా మేజిస్ట్రేట్లు లేదా కలెక్టర్లు బాధ్యత వహించాలి. వాటి పనితీరునూ వారు పర్యవేక్షించాలి. లైంగిక వేధింపులపై విచారణను అత్యంత రహస్యంగా జరపాలి. బాధితురాలికి ఇష్టంలేని పక్షంలో ఆమె తరపున బంధువు, లేదా చట్టబద్ధమైన వారసులు ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. విచారణ నివేదికను 90 రోజుల్లో కోర్టులకు అందించాలి.

వేధింపులకు పాల్పడే వ్యక్తిని విధుల నుంచి తొలగించడం, పదోన్నతులు ఆపేయడంతోపాటు భారీగా జరిమానా విధించే అధికారాన్ని ఈ చట్టం కల్పించింది. లైంగిక ప్రయోజనాలు ఆశించి స్త్రీలకు పని లేదా ఉద్యోగం ఇవ్వడం, శారీరకంగా తాకడం, తాకడానికి ప్రయత్నించడం వంటివి పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులుగా పేర్కొన్నారు. కోర్కె తీర్చాలంటూ బలవంతం చేయడం, బతిమాలడం, లైంగిక సుఖాన్ని ఆశించి పనిలో లోపాలను ఎత్తిచూపడం, అశ్లీల దృశ్యాలు చూపడం, ఇబ్బందికరంగా సంభాషించడం, సంభాషణల ద్వారా లైంగిక వాంఛను ప్రదర్శించడాన్ని నేరాలుగా పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు, రోజువారీ కూలీలు, శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు, సందర్శనీయ ప్రాంతాలకు వెళ్లిన మహిళలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో, పొరుగు సేవల్లో, వేతనం తీసుకుని, వేతనం తీసుకోకుండా స్వచ్ఛందంగా సేవలు అందించేవారు, ఏ సంస్థలోనైనా నేరుగా, ఏజెన్సీ ద్వారా నియమితులైనవారిని పనిచేసే మహిళలుగా చట్టం చెబుతోంది.

అభివృద్ధి చెందిన దేశాలు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులను నేరంగా పరిగణిస్తున్నాయి. అమెరికా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ వంటి దేశాలు వీటిని మానవ హక్కుల ఉల్లంఘన స్థాయి తీవ్ర నేరాలుగా చూస్తున్నాయి. కొన్ని దేశాల్లో వీటిని జీవించే హక్కు, స్వాతంత్ర్యం, భద్రతను హరించే నేరంగా పరిగణిస్తున్నాయి. పని ప్రదేశాల్లో ఎలాంటి వేధింపులు ఉండకూడదని, అది జీవించే హక్కును హరించడంగానే చూసి, ఆ మేరకు కఠినంగా శిక్షించాలని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) నిర్దేశించింది. చట్టాలు ఎన్ని చేసినా వాటిని పకడ్బందీగా అమలు చేసినప్పుడే అతివలకు భద్రత, భరోసా లభిస్తుంది!

– బాలచంద్ర నందం

ఈనాడు లేఖలు

దక్కని రుణమాఫీ

ఎన్నికల హామీలో భాగంగా 2014లోనే తెలంగాణ ప్రభుత్వం లక్ష రూపాయల లోపు రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ఇదే సమయంలో మెదక్, రంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో పంట నష్టం వాటిల్లినందువల్ల, అక్కడి రైతులకు రుణాల రెన్యువల్‌కు బదులుగా రీషెడ్యూలు చేసుకోవడానికి బ్యాంకులకు అవకాశం కల్పించింది. అలాంటి రుణాలను రైతులు మూడేళ్లలో చెల్లించడానికి అవకాశం కల్పించింది. దీన్ని ప్రభుత్వం అవకాశంగా తీసుకుని ఆయా రైతుల రుణాలను మూడేళ్ల తరవాత చెల్లిస్తామని బ్యాంకులకు తెలియజేశారు. వారికి చెల్లించిన తొలివిడత మాఫీ నిధులనూ వెనక్కు తీసుకున్నారు. అయిదేళ్లవుతున్నా ఇప్పటికీ ఆ నిధులను విడుదల చెయ్యలేదు. ఇచ్చిన మాట ప్రకారం, రీషెడ్యూలు రుణాల నిధులను ప్రభుత్వం వెంటనే రైతుల ఖాతాలో జమ చేసి, వారికి రుణ విముక్తి కల్పించాలి.

- బర్ల చంద్రయ్య, ఖానాపూర్, సంగారెడ్డి జిల్లా

వన్యప్రాణులకు మరింత రక్షణ

అభయారణ్యాల్లో పులుల కదలికలు వెలుగులోకి రావడం, వాటి సంఖ్య పెరుగుతోందంటూ వస్తున్న వార్తలు తృప్తి కలిగిస్తున్నా అదెంతో కాలం నిలవడం లేదు. కొన్ని ప్రాంతాల్లో పులుల వధ కొనసాగుతుండటమే అందుకు కారణం. పరిస్థితులు ఇలాగే కొనసాగితే పులుల జాతి పూర్తిగా అంతరించిపోయే ప్రమాదం ఉంది. పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక సాయుధ దళాల ఏర్పాటు సంతోషకరమే అయినా, ఈ వ్యవస్థలను మరింత పరిపుష్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వేటగాళ్లకు కఠిన శిక్షలు పడేలా నిబంధనలు ఉండాలి. వన్యప్రాణులకు అటవీ ప్రాంతాల్లో నీటివసతి ఏర్పాటు చేయాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా అడవుల్లో వన్యప్రాణుల కదలికలను దృశ్యరూపంలో అందుబాటులోకి తీసుకురాగలిగితే అది విద్యార్థులకు విజ్ఞానయుతంగా, వినోదాత్మకంగా ఉంటుంది.

- విశ్వం, హైదరాబాద్

అంతర్యామి

దివ్యచరణాలు

భక్తుల సమస్త పాప సంహారకాలు శ్రీవారి దివ్య చరణాలు. అవి ఆశ్రితులకు మోక్ష ప్రదాయకాలు. సర్వాంతర్యామి మంగళ చరణాల ప్రాశస్త్యం అనేక సందర్భాల్లో వెల్లడైంది.

ప్రహ్లాదుడు జన్మతః విష్ణు భక్తుడు. అతడి మనసు ఎల్లప్పుడూ శ్రీహరి పాదపద్మాలపైనే లగ్నమై ఉండేది. పోతన అనేక సందర్భాల్లో ప్రహ్లాదుణ్ని హరిపాద పయోరుహ చింతనాక్రియలోలుడు, శ్రీనారాయణ పాదపద్మయుగళ చింతనామృతాస్వాద సంధానుడు వంటి విశేషణాలతో వర్ణించాడు. ప్రహ్లాదుడి చేత హరిపూజ మానిపించాలని హిరణ్యకశిపుడు అనేక విధాలుగా ప్రయత్నించాడు. చండుడు, అమర్కుడు అనే గురువులు ప్రహ్లాదుడికి ధర్మార్థ కామాలను (రాక్షసులు మోక్షాన్ని కోరుకోరు) బోధించారు. వారి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ప్రహ్లాదుడు గురువులనుద్దేశించి... తుమ్మెద మందార పుష్పంలోని మకరంద ఆస్వాదనంలో తేలియాడుతుంది. అది ఉమ్మెత్త పూలవైపు కన్నెత్తి అయినా చూడదు. అలాగే నా మనసూ విష్ణు పాదపద్మాలను ధ్యానించడంలో నిమగ్నమైందంటాడు.

వామనుడికి మూడడుగుల నేలను దానమివ్వడానికి బలి సిద్ధమవుతాడు. ముందుగా అతడి పాద ప్రక్షాళన చేస్తాడు. ఆ సందర్భంలో శ్రీహరి పాదాలకు వేదాలు అందెలుగా మారాయంటూ పోతన ప్రస్తుతిస్తాడు. వామనుడు త్రివిక్రముడై పరాక్రమిస్తాడు. ఒక పాదంతో భూమండలాన్ని ఆక్రమిస్తాడు. మరో పాదాన్ని ఆకాశమంతా వ్యాపింపజేస్తాడు. అది బ్రహ్మలోకాన్ని చేరుతుంది. అక్కడ పుణ్యాత్ములు, యోగులు, సిద్ధులు ఉంటారు. వారందరూ ఆ పాదాన్ని దర్శిస్తారు. తామందరం కోరుకునే పెన్నిధి తమకు లభించిందంటూ మనసులో సంతోషపడతారు. బ్రహ్మ తన కమండలంలోని జలధారలతో ఆ పాదాన్ని కడుగుతాడు. పునీతుడవుతాడు.



వాల్మీకి అనేక ఘట్టాల్లో శ్రీరామ పాదపద్మాల ప్రాముఖ్యాన్ని వర్ణిస్తాడు. విశ్వామిత్రుడి కోరిక మేరకు రామలక్ష్మణులు యాగ సంరక్షణకు వెళతారు. శ్రీరామ పాద ధూళి స్పర్శతో శిల అహల్యగా రూపాన్ని పొందుతుంది. ఎంతటివారి పాపాన్నైనా క్షయం చెయ్యగల శక్తి ఆ చరణ రేణువులది. భరతుడు శ్రీరామ పాదుకలకు పట్టాభిషేకం జరిపిస్తాడు. వాది, ప్రతివాదుల వాదన విని తీర్పు చెప్పగల సమర్థత ఆ పాదుకలది. ఆంజనేయుడు ఆ పాదాలకు దాసుడయ్యాడు. సీతారామ లక్ష్మణులతో కలిసి పూజలందుకొంటున్నాడు. భక్తులనూ దైవసమానులుగా మార్చగలవి ఆ దివ్య చరణాలు.

ఒకనాడు మందాకినీ తీరంలో సీతాదేవి నిద్రిస్తుంటుంది. కాకాసురుడనే రాక్షసుడు అక్కడకు వెళ్తాడు. పదునైన గోళ్లతో సీతమ్మను గాయపరుస్తాడు. శ్రీరాముడు కోపగించి బాణప్రయోగం చేస్తాడు. కాకాసురుడు ప్రాణరక్షణ కోసం రాముడి పాదాలపై పడి శరణు కోరతాడు. అతడి ప్రాణాలను హరించకుండా విడిచిపెడతాడు. పాదాలను ఆశ్రయిస్తే ఎంతటి శత్రువునైనా క్షమించగల ఔదార్యం శ్రీరాముడిది.

శ్రీహరి దివ్యచరణాలు ఎప్పుడు, ఎవరిని అనుగ్రహిస్తాయో ఊహించడం దుర్లభం. కాళియుడు దుష్టుడైన సర్పరాజు. అతడి పడగలపై శ్రీకృష్ణుడు నాట్యం చేస్తాడు. గర్వాన్ని అణచివేస్తాడు. బాలకృష్ణుడి నాట్యానికి గుర్తుగా కాళియుడి పడగలపై పాదముద్రలు పడతాయి. అవే గరుత్మంతుడి బారినుంచి కాపాడతాయని శ్రీకృష్ణుడు వరం అనుగ్రహిస్తాడు.

శ్రీహరి పాదపద్మాలను నిత్యం స్మరించాలంటాడు ముకుందమాల కర్త కులశేఖర మహారాజు. భద్రాచల రామభక్తుడైన గోపన్న కూడా 'చరణములే నమ్మితీ... నీ దివ్య చరణములే నమ్మితీ' అంటూ భగవంతుడి చరణ పద్మాలను స్తుతిస్తాడు. భక్తులకు ఆ దివ్య చరణాలే శరణు!

– జి.రామచంద్రరావు

ఎటువైపు సాగుతుంది?

- ఈ బడ్జెట్ రైతు నేస్తమా?
- నేరుగా నగదు బదిలీ చేస్తారా..



రైతు ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేయడమే లక్ష్యమని చెబుతున్న మోదీ సర్కారు- ఫిబ్రవరి ఒకటో తేదీన వ్యవసాయ అనుకూల బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందా? రైతులకు వివిధ రూపాల్లో అందిస్తున్న రాయితీలకు బదులుగా నేరుగా నగదు బదిలీ ప్రతిపాదన తెస్తుందా? అన్నదాతకు ఆదాయాన్ని చేకూర్చడం, వడ్డీలేని రుణాలు ఇవ్వడం లాంటి హామీలు ఇస్తుందా? మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురు దెబ్బలుతిన్న భాజపా సర్కారు తాము రైతు అనుకూలమనే భ్రమ కల్పించడానికి ఈ బడ్జెట్‌లో ప్రయత్నించొచ్చని విపక్షాలు విమర్శిస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా రుణమాఫీని అమలుచేస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఇప్పటికే హామీఇచ్చారు. తెలంగాణలో అమలవుతున్న రైతుబంధు తరహాలో దేశవ్యాప్తంగా కొత్త పథకాన్ని అమలుచేయాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ సర్కారు రైతు అనుకూల వ్యూహాలకు పదునుపెట్టింది.



తెలంగాణ రైతుబంధు ఆదర్శం

రైతన్నను ఆదుకోవడానికి కొన్ని రాష్ట్రాలు వినూత్న పద్ధతుల్ని అవలంబిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం 'రైతు బంధు' పథకాన్ని అమలుచేస్తోంది. ఎకరానికి రూ.4 వేల చొప్పున ఏడాదికి రెండుసార్లు రైతు ఖాతాకే నేరుగా నగదు జమచేస్తోంది. విత్తనాలు, ఎరువులు కొనడానికి రైతుకు ఇది ఉపకరిస్తోంది. ఇది విజయవంతమైన పథకంగా మన్ననలందుకుంది. దాదాపు 90 శాతం మంది భూ యజమానులకు ఇది చేరింది. అయితే ఈ పథకం కౌలు రైతుల్ని విస్మరించిందన్న విమర్శ ఉంది. ఒడిశా ప్రభుత్వం రైతు సహాయ, జీవనభృతి, ఆదాయ పెంపు(కేఏఎల్ఐఏ) పథకాన్ని అమలుచేస్తోంది. ఈ పథకం కింద కౌలు రైతులు, వ్యవసాయ కూలీలకు ఒకసారి చెల్లింపులు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఎలాంటి రికార్డుల్లేవు కాబట్టి ఈ రెండు కేటగిరీలను గుర్తించడమే పెద్ద సమస్య. తెలంగాణ, ఒడిశా తరహా పథకాలు.. అవినీతిని తగ్గిస్తాయని, మార్కెట్ మాయాజాలానికి అడ్డుకట్టవేస్తాయని, రైతులు, వ్యవసాయ కూలీలు ప్రత్యక్షంగా లబ్ధిపొందుతారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేరుగా నగదు బదిలీ రైతుకు లాభమా?

ప్రభుత్వం నేరుగా నగదు బదిలీ చేసినా.. అది రైతులందరికీ చేరదనే అభిప్రాయమూ ఉంది. కౌలు రైతులకు ప్రయోజనం చేకూర్చడం ఎలా? అనేది పెద్ద ప్రశ్న. దేశంలో దాదాపు 14.6 కోట్ల రైతు కుటుంబాలున్నాయి. ప్రభుత్వం నేరుగా నగదు బదిలీచేస్తే వీరిలో 10 కోట్ల మంది రైతులు లాభపడొచ్చు. దీనికి రూ.లక్ష కోట్లకు పైగా బడ్జెట్ కేటాయింపులు అవసరమవుతాయి. అయితే ప్రస్తుతం రాయితీలు, ఇతరత్రా రూపాల్లో ప్రయోజనాలు పొందుతున్న రైతుల్లో కనీసం మూడోవంతు మందికి నగదు బదిలీ అందదు. దేశంలో 56% మంది గ్రామీణులకు వ్యవసాయ భూమి లేదు. ఝార్ఖండ్, బిహార్, గుజరాత్, కేరళ, తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో భూ రికార్డుల డిజిటలైజేషన్ పూర్తికాలేదు. కాబట్టి నిజమైన లబ్ధిదారులకు నగదు బదిలీ చేరవేత కష్టంతో కూడుకున్న పని.

మద్దతు ధర పెంచితే..

వ్యవసాయ సంక్షోభ పరిష్కారానికి మద్దతు ధరల(ఎంఎస్‌పీ)ను పెంచటమన్నది తరచూ వినిపించే డిమాండేకానీ.. దీనివల్ల మార్కెట్లు ఇబ్బందుల్ని ఎదుర్కొంటాయని, ప్రభుత్వాల వద్ద ధాన్యం నిల్వలు పేరుకుపోయి, విపరీత నష్టాలు చేకూరుతాయని ఆర్థికవేత్తలు అంటున్నారు. మార్కెట్ చేయగలిగిన మిగులు పంటలు ఉన్న రైతులకే ఎంఎస్‌పీ వల్ల ఉపయోగం తప్ప మెజారిటీ రైతులకు దీనివల్ల ప్రయోజనం లేదంటున్నారు.

ఏం చేస్తారు?

వ్యవసాయ సంక్షోభానికి కేంద్రం ఈ బడ్జెట్లో ఎలాంటి పరిష్కారాలతో ముందుకు వస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు పెద్దపీట వెయ్యటం, పెట్టుబడులు పెంచటం, సుస్థిర ధరల విధానాన్ని అమలుచేయటం.. లాంటి దీర్ఘకాలిక చర్యలతో సాగు రంగంలో సమూల మార్పులు తెచ్చి, రైతుకు భరోసా కల్పించే సంస్థాగత చర్యలు చేపట్టాలనేది ఆర్థిక, వ్యవసాయ రంగ నిపుణుల సూచన. మరి ఎన్నికల ముంగిట మోదీ సర్కారు దీర్ఘకాలిక పరిష్కారాలతో ముందుకు వస్తుందా? తాత్కాలిక ఉపశమనాలతో సరిపెడుతుందా? అన్నది వేచిచూడాల్సిందే.

- ఈనాడు ప్రత్యేక విభాగం

రుణమాఫీ పరిష్కారమా?

రైతన్నను ఆదుకోవడానికి రుణమాఫీని ఒక దివ్యౌషధంగా వివిధ రాష్ట్రాలు ప్రకటించేస్తున్నాయి. అప్పుల ఊబిలో కూరుకుపోయిన అన్నదాతను ఆదుకోవడానికి రుణమాఫీ ఉపకరించేదే అయినా.. కేవలం దీంతోనే వారి సమస్యలు తీరిపోవని, కేవలం కొద్దిమంది రైతులే రుణమాఫీ వల్ల లబ్ధిపొందుతారని పలువురు ఆర్థికవేత్తలు, మేధావులు అభిప్రాయపడుతున్నారు. కారణాలు...



1 జులై 2015- జూన్ 2016 మధ్య కేవలం 43.5 శాతం మంది రైతులే రుణాలు తీసుకున్నట్లు నాబార్డ్ గణాంకాలు తేటతెల్లంచేస్తున్నాయి. వీరిలోనూ సంస్థాగత రుణాలు తీసుకున్న వారు 69.7 శాతం మంది. ఈ లెక్కన దేశంలోని మొత్తం రైతుల్లో సంస్థాగత రుణాలు తీసుకున్న వారు 30% మంది. కేంద్రం రుణమాఫీ అమలుచేస్తే కేవలం 30% మందికే లబ్ధిచేకూరుతుంది. మిగతా 70% మంది ఈ ప్రయోజనానికి దూరం అవుతారు.

2 రుణమాఫీ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందనే అభిప్రాయం ఉంది. రుణమాఫీ లాంటి డిమాండ్ల కోసం నిధులు మళ్లిస్తూ పోతే.. అభివృద్ధి పనులు కుంటుపడతాయి.

3 రుణమాఫీ దేశ రుణ సంస్కృతికి గొడ్డలి పెట్టులాంటిదని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. రుణ గ్రహీతలు తాము అప్పుతీసుకునే సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన అవసరం ఉండదు కాబట్టి.. వారు ఎలాంటి నైతిక బాధ్యత వహించరంటున్నారు.

2017 ఏప్రిల్ నుంచి దేశంలోని 8 రాష్ట్రాలు రుణమాఫీని ప్రకటించాయి. ఈ మొత్తం రూ.1.9 లక్షల కోట్లు

ప్రస్తుతం రాయితీలు, రైతు మద్దతు పథకాలకు కేంద్రం రూ.98,100 కోట్లు కేటాయిస్తోంది. పంటల బీమా, ఎరువుల రాయితీలు, తక్కువ వడ్డీకి రుణాలు ఇందులో ఉన్నాయి.

మొత్తం 14.6 కోట్ల మంది రైతుల్లో పంటల బీమాను వినియోగించుకున్నది 35% మందే.

(2015-16 వ్యవసాయ గణాంకాలు)

రాష్ట్రపతి ఉత్తర్వులు గురుకులాలకు వర్తిస్తాయా?

- ప్రభుత్వం నుంచి స్పష్టత కోరనున్న బోర్డు
- కొత్త పోస్టుల మంజూరుపై నేడు ప్రత్యేక సమావేశం

ఈనాడు, హైదరాబాద్: 'కొత్త జోనల్ విధానంపై రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వులు.. రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల సొసైటీలకు వర్తిస్తాయా? కార్పొరేషన్లు, సొసైటీలకు ప్రత్యేక మినహాయింపు ఉంటుందా?' అనే అంశంపై గురుకుల నియామక బోర్డు సందిగ్ధంలో పడింది. అనుమతులున్నా ప్రకటనలివ్వలేకపోయిన పోస్టులపై ఎలా ముందుకు వెళ్లాలనే విషయమై మంగళవారం ప్రత్యేకంగా సమావేశం కానుంది. నూతన జోన్ల ప్రకారం పోస్టుల విభజన, ప్రభుత్వ అనుమతులపై చర్చించనుంది. కొత్త జోన్ల నిబంధనలు వచ్చిన తరువాత.. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను నూతన జోన్లు, మల్టీజోన్ల ప్రకారం పునర్విభజన చేయాల్సి ఉంది. అందువల్ల టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 ప్రకటన నిలిపివేసింది. మరికొన్ని పోస్టులను ప్రభుత్వ విభాగాలకు వెనక్కు పంపించింది. వాటిని నూతన జోన్ల ప్రకారం విభజించాలని కోరింది. అయితే గురుకుల బోర్డు పరిధిలోని పోస్టులు జోనల్ పరిధిలోనివి. బోర్డు కింద నియామకాలు చేపట్టేందుకు అనుమతులున్నా.. పీఈటీ, పీడీ, ఆర్ట్స్ టీచర్, లైబ్రేరియన్ తదితర పోస్టులకు ప్రకటనలు ఇవ్వలేదు. తాజాగా కొత్త జోనల్ నిబంధనల ప్రకారం జోన్ల సంఖ్య పెరిగింది. మల్టీజోన్లు వచ్చాయి. ప్రకటనలు ఇవ్వకుండాపోయిన పోస్టులను కొత్త నిబంధనల మేరకు విభజించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ఉత్తర్వుల నుంచి కార్పొరేషన్లు, సొసైటీలకు మినహాయింపు ఉందంటూ బోర్డు వర్గాలు భావిస్తున్నాయి. ఒకవేళ మినహాయింపు పొందేందుకు అవకాశం ఉంటే.. ఆ మేరకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక ఉత్తర్వులు పొందాల్సి ఉంటుంది. అప్పుడు మిగిలిపోయిన పోస్టులకు ప్రకటనలు ఇచ్చేందుకు ఎలాంటి ఇబ్బందులూ ఉండవని పేర్కొంటున్నాయి. ఒకవేళ రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తిస్తే.. ఆ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన తరువాత తదుపరి ఉద్యోగ ప్రకటనల ప్రక్రియ ఉంటుందని, అప్పటి వరకు కొత్త పోస్టుల ప్రకటన ఉండకపోవచ్చని అభిప్రాయపడుతున్నాయి. గురుకులాల్లో పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుకులబోర్డు తొలి ఫలితాన్ని సిద్ధం చేసింది. పీజీటీ ఉర్దూ సబ్జెక్టుకు ఎంపికైన 78 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను మైనార్టీ గురుకుల సొసైటీకి అందజేసింది. అధికారికంగా ఈ ఫలితాన్ని ప్రకటించనుంది. మరో ముగ్గురి ఫలితాలను నిలిపివేసినట్లు పేర్కొంది. ఈ అభ్యర్థులు ధ్రువపత్రాలన్నీ సమర్పిస్తే వెంటనే పోస్టింగులు ఇవ్వాలని బోర్డు నిర్ణయించింది.

విస్తృత ధర్మాసనానికి హైకోర్టు కేసుల బదిలీ వ్యవహారం

ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ లేఖను సుమోటోగా తీసుకున్న తెలంగాణ హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ చేసే వ్యవహారంపై విచారణను విస్తృతధర్మాసనానికి బదలాయిస్తూ తెలంగాణ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. ఏపీ స్థానికతకు చెందిన కేసులతోపాటు, ఏపీ ప్రభుత్వం ప్రతివాదిగా ఉన్న కేసులను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలంటూ ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం రాసిన లేఖను విచారణ నిమిత్తం సుమోటో ప్రజాప్రయోజన వ్యాజ్యంగా తీసుకుంది. దీనిపై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. అప్పీళ్లు, కోర్టు ధిక్కరణ పిటిషన్‌లు తదితరాలను బదిలీ చేసే విషయంలో చట్టపరంగా కీలకమైన అంశాలున్నాయని, దీనిపై విస్తృతధర్మాసనం విచారణ చేపట్టాల్సి ఉందని పేర్కొంది. దీంతో ఈ పిటిషన్‌ను ఫుల్ బెంచ్‌కు నివేదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి హైకోర్టు ఏర్పడేనాటికి దాఖలైన అప్పీళ్లు, కోర్టు ధిక్కరణ పిటిషన్‌లు, పునఃసమీక్ష (రివ్యూ) పిటిషన్‌లపై విచారణ జరిపే పరిధి ఉమ్మడి హైకోర్టుకు ఉంటుందని ఏపీ రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 40(3) చెబుతోందని, దీనివల్ల ఏపీ న్యాయవాదులు ఇబ్బందులు పడుతున్నారని ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం లేఖలో పేర్కొంది. విస్తృత ధర్మాసనం..అందులో న్యాయమూర్తులకు సంబంధించి పాలనాపరమైన నిర్ణయాన్ని ప్రధాన న్యాయమూర్తి తీసుకోవాల్సి ఉంది.

వినియోగదారుల కమిషన్‌లో 18 కేసుల విచారణ

ఈనాడు, హైదరాబాద్: వినియోగదారుల సౌకర్యార్థం హైదరాబాద్‌లో ఏర్పాటైన జాతీయ వినియోగదారుల కమిషన్ సర్క్యూట్ బెంచ్ సోమవారం 18 కేసుల విచారణ చేపట్టింది. ఫిబ్రవరి 8 వరకు కొనసాగే ప్రక్రియలో భాగంగా, కమిషన్ అధ్యక్షుడు జస్టిస్ ఆర్.కె.అగర్వాల్, సభ్యురాలు ఎం.శ్రీషలతో కూడిన ధర్మాసనం వీటిని విచారిస్తోంది. తొలి రోజు (సోమవారం) చేపట్టిన వాటిలో ఆరు కేసులను పరిష్కరించారు. మరో ఐదు కేసులను కక్షిదారుల అభ్యర్థన మేరకు వాయిదా వేశారు. ప్రస్తుత విధానంలో కమిషన్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఇక్బాల్ అహ్మద్, తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ జనార్దన్‌రెడ్డి సహాయ సహకారాలు అందిస్తున్నారు.

ఏసీబీ కేసులో కఠిన కారాగార శిక్ష

ఈనాడు, హైదరాబాద్: ఎస్ఎస్‌సీ, ప్రభుత్వ పరీక్షల నిర్వహణ అదనపు సంయుక్త కార్యదర్శిగా పనిచేసిన అట్లూరి ధన కోటి రవీంద్రరావుకు జైలుశిక్ష పడింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్న ఆయనకు రెండేళ్ల కఠిన కారాగారం విధిస్తూ సోమవారం అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక కోర్టు జడ్జి కె.శైలజ తీర్పు వెలువరించారు. సెక్షన్ 13(1)(ఇ) రెడ్‌విత్ 13(2) కింద కారాగారంతో పాటు రూ.10,000 జరిమానా విధించారు. అది చెల్లించకుంటే, మరో 3నెలల సాధారణ జైలు శిక్ష ఉంటుందన్నారు. రవీంద్రరావుకు ఆదాయానికి మించి రూ.34.18 లక్షలు ఉన్నాయంటూ, ఏసీబీ 2007లో కేసు నమోదుచేసింది. 2010లో అభియోగ పత్రం దాఖలుచేసింది.

అతిథి అధ్యాపకుల వేతనం పెంపు!

ఈనాడు, హైదరాబాద్: విశ్వవిద్యాలయాల్లో అతిథి అధ్యాపకులు (గెస్ట్ లెక్చరర్స్)గా పనిచేసే వారి వేతనాలు ఇకముందు పెరగనున్నాయి. వారికి గంటకు రూ.1,500 చొప్పున చెల్లించాలని విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) ఆదేశాలిచ్చింది. అయితే, నెలకు రూ.50 వేలకు మించరాదని పేర్కొంది. రాష్ట్రంలో 11 విశ్వవిద్యాలయాల్లో 576మంది అతిథి అధ్యాపకులు పనిచేస్తున్నారు.

బ్యాంకులో రూ.5 కోట్ల నగలు, నగదు చోరీ

తమిళనాడులో ఘటన

ప్యారిస్, న్యూస్‌టుడే: తమిళనాడులోని తిరుచ్చి సమయపురం టోల్‌గేట్ వద్ద ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకులో ఆదివారం రాత్రి అయిదు లాకర్లు పగలగొట్టిన దుండగులు రూ.5 కోట్ల మేర నగలు, నగదు దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. .. రెండు రోజుల సెలవుల అనంతరం సోమవారం ఉదయం విధులకు వచ్చిన సిబ్బంది బ్యాంకు వెనక ఉన్న గోడ పగలగొట్టి ఉండటం గమనించారు. వెంటనే మేనేజరుకు సమాచారం ఇచ్చారు. బ్యాంకు గోడకు రంధ్రం వేసి లోపలికి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు అయిదు లాకర్లు పగలగొట్టి వాటిలోని నగదు, నగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దుండగులు వదిలేసి వెళ్లిన సుత్తి, వెల్డింగ్ మిషన్‌లను స్వాధీనం చేసుకుని వేలిముద్రల నిపుణుల సాయంతో దర్యాప్తు చేపట్టారు. బ్యాంకులో చోరీకి గురైన నగలు, నగదు విలువ రూ.5 కోట్లు ఉంటుందని మేనేజరు ఫిర్యాదు చేశారు.

మంత్రివర్గ విస్తరణపై కొనసాగుతున్న కసరత్తు

- ఇతర పదవుల భర్తీపైనా చర్చ
- జాబితా తయారీపై సీఎం దృష్టి

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, పార్లమెంటరీ రాజకీయ కార్యదర్శుల నియామకం, ఇతర పదవుల భర్తీపై ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారమూ కసరత్తు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సీఎం దీనిపైనే దృష్టి సారించినట్లు తెలిసింది. తొలి విడత మంత్రివర్గ విస్తరణలో 8 మంది వరకు తీసుకోవాలని భావిస్తున్న సీఎం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల జాబితాను పరిశీలించారు. సామాజికవర్గం, విజయాలు, ఇతర అంశాల ప్రాతిపదికన కొంత మందిని ఆయన ప్రాథమికంగా ఎంపిక చేశారని తెలిసింది. పార్లమెంటరీ కార్యదర్శుల పదవులకూ కొంతమందిని పరిగణనలోకి తీసుకున్నారని తెలిసింది. కార్పొరేషన్ ఛైర్మన్ నియామకాల జాబితాను విడిగా తయారు చేయిస్తున్నారు. సీఎం సోమవారం రాత్రి ఎర్రవల్లి వెళ్లారు. అక్కడ ఆయన ఏకాంతంగా మంత్రివర్గ విస్తరణ, ఇతర పదవుల జాబితాను ఖరారు చేసుకొని వస్తారనే అంచనాలు మొదలయ్యాయి.

విస్తరణ తేదీలపై ఉత్కంఠ

మంత్రివర్గ విస్తరణ తేదీలపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ నెల 30 లేదా ఫిబ్రవరి 7న విస్తరణ గురించి సీఎం ఈ నెల 26న గవర్నర్ వద్ద చర్చించినట్లు తెలిసింది. ఈ నెల 30న ఉదయం గవర్నర్ అమరావతికి వెళ్తున్నందున ఆ రోజున విస్తరణపై అనుమానాలు నెలకొన్నాయి. 31న విస్తరణపై కొందరు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఇప్పటి వరకు ఏర్పాట్లు చేపట్టకపోవడంతో విస్తరణ ఆలోగా జరగడమూ సందేహంగానే మారింది. ఫిబ్రవరి మొదటి వారంలోపు విస్తరణ జరుగుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

రెండో వారంలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక

తెలంగాణ శాసనమండలిలో ఖాళీ అయిన, ఖాళీ కాబోతున్న స్థానాలకు అభ్యర్థులను ఫిబ్రవరి రెండో వారంలో ఎంపిక చేస్తారని తెలిసింది. ఇప్పటికే ఏడు స్థానాలు ఖాళీగా ఉండగా, మరో 9 మంది మార్చిలో పదవీ విరమణ పొందనున్నారు. మొత్తం 16 స్థానాలు మార్చిలోనే భర్తీ కావాలి. వీటిలో ఒకటి గవర్నర్ నామినేటెడ్ కోటా కింద ఉంది. దీనిపైనా సీఎం ఇప్పటికే గవర్నర్‌తో చర్చించారు.

సచివాలయానికి 'విస్తరణ కళ'

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ సచివాలయంలో కొత్త మంత్రులకు కార్యాలయాలు సిద్ధమవుతున్నాయి. త్వరలోనే జరగనున్న మంత్రివర్గ విస్తరణను దృష్టిలో పెట్టుకొని సాధారణ పరిపాలన శాఖ ఈ మేరకు కార్యాలయాల ముస్తాబు చేపట్టింది. పేషీల్లో రంగులు వేయడం, క్యాబిన్లు, ఫర్నీచర్ మరమ్మతు, ఇతర పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉపముఖ్యమంత్రులు, మంత్రులకు సచివాలయంలో 17 కార్యాలయాలను కేటాయించారు. ఇవన్నీ డి-బ్లాక్‌లోనే ఉన్నాయి. మంత్రులు నియమితులైన తర్వాత పేషీలను ఎంపిక చేసుకొని, తమ అభిరుచులు, వాస్తుకు అనుగుణంగా వాటిని తయారు చేయించుకున్నారు. శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత మంత్రులు తమ పేషీలను ఖాళీ చేశారు. అధికారులు వెంటనే వాటికి సీళ్లు వేశారు. ఎన్నికల అనంతరం మళ్లీ తెరాస ప్రభుత్వం అధికారంలోకి రాగా గత నెలలో సీఎం కేసీఆర్, మంత్రి మహమూద్ అలీలు ప్రమాణ స్వీకారం చేశారు. ఆ వెంటనే మహమూద్ అలీ తన పేషీలో చేరారు. వచ్చే నెల ఏడో తేదీలోగా మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశాలున్నాయి. దీనికి అనుగుణంగా మళ్లీ మంత్రుల పేషీలను సిద్ధం చేయాలని ప్రభుత్వం జీఏడీ అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో మంత్రుల కార్యాలయాలన్నింటికీ సీళ్లు తీసి పనులు చేపట్టారు. వాటికి మరమ్మతులు చేసి సరికొత్తగా అలంకరిస్తున్నారు.



సచివాలయంలోని డి బ్లాక్‌లో ఉన్న మంత్రుల కార్యాలయాల్లో కొనసాగుతున్న మరమ్మతులు

జాతీయ విపణికి తెలంగాణ పంట

- ఇతర రాష్ట్రాల వ్యాపారులకూ ఈ-నామ్‌లో చోటు
- తొలుత ఏపీ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్లకు అనుసంధానం
- మలిదశలో దక్షిణాది రాష్ట్రాలకూ అవకాశం
- నేడు తెలుగు రాష్ట్రాల అధికారులు, వ్యాపారులకు శిక్షణ

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ రైతులు పండిస్తున్న పంటలను జాతీయ విపణిలోకి ఆన్‌లైన్ ద్వారా తీసుకెళ్లి గిట్టుబాటు ధరలు కల్పించేందుకు మార్కెటింగ్ శాఖ తాజాగా చర్యలు ప్రారంభించింది. "ఎలక్ట్రానిక్ జాతీయ వ్యవసాయ మార్కెట్"(ఈ-నామ్) పథకం కింద ఇతర రాష్ట్రాల మార్కెట్లను తెలంగాణ వ్యవసాయ మార్కెట్లతో అనుసంధానం చేయడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా గద్వాల మార్కెట్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు మార్కెట్‌తో కలిపింది. ఈ రెండు మార్కెట్లలో లైసెన్సులున్న వ్యాపారులు ఎక్కడైనా పంటలు కొనే అవకాశం కల్పించింది. దీన్ని మరింత విస్తరించేందుకు మంగళవారం రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులు, వ్యాపారులతో జాతీయ స్థాయి సమావేశం బోయిన్‌పల్లి మార్కెట్‌లో ఏర్పాటు చేస్తోంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నందున అప్పుడున్న అనుభవాలతో ఈ-నామ్‌లో తొలుత ఏపీతో అనుసంధానం ప్రారంభించింది. మలిదశలో తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాల మార్కెట్లన్నింటినీ కలుపుతారు. ఈ పథకం ప్రారంభమైనా ఇంతవరకూ అంతర్రాష్ట్ర మార్కెట్ల కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. ఆన్‌లైన్, సాఫ్ట్‌వేర్ సమస్యలూ ఇందుకొక కారణం. దీన్ని అధిగమించేందుకు కేంద్రంతో తెలంగాణ మార్కెటింగ్ శాఖ సంప్రదింపులు జరుగుతోంది.

◆ తెలంగాణలో పంటను మరో రాష్ట్రంలోని వ్యాపారి కొన్నప్పుడు వెంటనే రైతు ఖాతాలో సొమ్ము జమ చేసేలా చూసే బాధ్యత ఎవరు తీసుకోవాలనే అంశంపై చర్చ జరుగుతోంది. ఉదాహరణకు కర్నూలు వ్యాపారి గద్వాల మార్కెట్‌లో వేరుసెనగలు కొంటే.. వెంటనే సదరు వ్యాపారి కర్నూలు మార్కెట్ సిబ్బందికి సమాచారమిచ్చి ఆన్‌లైన్‌లో సొమ్ము వేయాలి. గద్వాల నుంచి సదరు వ్యాపారికి పంటను రవాణా చేసేందుకు ఇక్కడి మార్కెట్ సిబ్బందీ సహకరించాలి.

◆ తరువాత ముఖ్యమైన అంశం.. మార్కెట్ రుసుం వసూలు. అంతర్రాష్ట్ర మార్కెట్లలో కొనుగోళ్లు జరిగేటప్పుడు ఈ రుసుంను ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తే అదే విధానంలో ఆన్‌లైన్ పర్మిట్‌నూ జారీ చేసేందుకు తెలంగాణ మార్కెటింగ్ శాఖ 'ఈ-సర్వీసు' వ్యవస్థను ఏర్పాటు చేసింది.



అంతర్రాష్ట్ర కొనుగోళ్లను ప్రయోగాత్మకంగా ప్రారంభించిన గద్వాల మార్కెట్

ఆన్‌లైన్ చెల్లింపులకు అవకాశం ఇవ్వాలి

ఈ-నామ్‌లో దేశంలో ఎక్కడి నుంచైనా పంటలను తెలంగాణ మార్కెట్ల నుంచి కొనేందుకు ఏపీతో శ్రీకారం చుడుతున్నాం. ఇది సమీప భవిష్యత్తులోనే దేశమంతా విస్తరించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. తెలంగాణ రైతుల పంటలకు మంచి ధరలు ఇప్పించాలన్నదే ఈ పథకం ప్రధాన లక్ష్యం. కానీ అమలులో అనేక సమస్యలున్నందున తొలుత ఏపీ అధికారులు, వ్యాపారులతో చర్చించి సంయుక్తంగా శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశాం. అంతర్రాష్ట్ర కొనుగోలుకు ఆన్‌లైన్ చెల్లింపులు జరిపేలా సాఫ్ట్‌వేర్‌ను మార్చే అవకాశం ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం.

– లక్ష్మీబాయి, సంచాలకురాలు, మార్కెటింగ్ శాఖ, తెలంగాణ

పరిశ్రమల్లో భద్రతే కీలకం

ఈనాడు, హైదరాబాద్: ప్రమాదాలు జరగకుండా పూర్తిస్థాయిలో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ.. పరిశ్రమలు మరింత ఉత్పాదకత సాధించాలని కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ కోరారు. కర్మాగారాల విభాగం, జాతీయ భద్రతా మండలి తెలంగాణ చాప్టర్ సోమవారం సంయుక్తంగా 'రసాయన పరిశ్రమల్లో వృత్తిపరమైన ఆరోగ్యం, భద్రత' అంశంపై సదస్సు నిర్వహించాయి. కర్మాగారాల విభాగం సంచాలకుడు పీఎం చంద్రమోహన్, సంయుక్త ప్రధాన ఇన్‌స్పెక్టర్ బి.రాజగోపాల్‌రావుతో కలిసి ఆయన మాట్లాడుతూ- అనుకోకుండా జరిగే ప్రమాదాల్ని ఎదుర్కొనేందుకు పరిశ్రమల్లో సదా అప్రమత్తంగా ఉండాలన్నారు. చుట్టూ ఉన్న ఇతర పరిశ్రమలతో సమన్వయం చేసుకుని, ఉమ్మడి అవగాహనతో ప్రమాదాల్ని నివారించాలన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసే కార్మికులకు, సంబంధిత యాజమాన్యాల కు భద్రతా చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చంద్రమోహన్ తెలిపారు.

'విలువల' పరీక్షకు 96% హాజరు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం నిర్వహించిన 'నైతికత, మానవీయ విలువల' పరీక్షకు 96.46 శాతం హాజరయ్యారు. ఈసారి ప్రశ్నపత్రాలను ఇంటర్‌బోర్డే రూపొందించి, ఆన్‌లైన్ ద్వారా పరీక్ష ప్రారంభానికి ముందు కళాశాలలకు పంపింది. 4,77,029 మంది పరీక్ష రాశారని ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్ తెలిపారు.

పల్లె తుది పోరుకు సర్వం సిద్ధం

3,529 పంచాయతీల్లో రేపు పోలింగ్

పూర్తయిన ఏర్పాట్లు

ఈనాడు, హైదరాబాద్: గ్రామపంచాయతీ తుది విడత ఎన్నికలకు రంగం సిద్ధమైంది. 3,529 పంచాయతీలకు బుధవారం పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఇప్పటికే రెండు విడతల్లో 7043 పంచాయతీలకు పోలింగ్ పూర్తిచేశారు. మూడో విడతలో 29 జిల్లాల పరిధిలో 166 మండలాల్లో పోలింగ్ జరగనుంది. దీనికి అనుగుణంగా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ చేసేందుకు సీసీ కెమెరాలు, ప్రత్యక్ష ప్రసారాలకు అనుగుణంగా సాంకేతిక ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపట్టింది. మరోవైపు 'మూడో విడత' బహిరంగ ప్రచారానికి సోమవారం సాయంత్రంతో గడువు ముగియడంతో అభ్యర్థులు రహస్యంగా ఓటర్లను కలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఏకగ్రీవాలకు ఆఖరి దాకా ప్రయత్నాలు

తుది విడత ఇలా..	
పోలింగ్ జరిగే పంచాయతీలు:	3,529
బరిలో సర్పంచి అభ్యర్థులు:	11,667
ఎన్నికలు జరిగే వార్డులు:	27,583
వార్డుల బరిలో అభ్యర్థులు:	67,316

పంచాయతీలను ఏకగ్రీవం చేసుకుని చేజిక్కించుకునేందుకు నాయకులు కడదాకా ప్రయత్నించారు. చాలా ప్రాంతాల్లో అభ్యర్థులు ససేమిరా అనడంతో పోటీతప్పని పరిస్థితి ఏర్పడింది. కొన్ని జిల్లాల్లో రూ.లక్షలు ధారపోసి ప్రత్యర్థులు లేకుండా కొన్ని పంచాయతీలను నాయకులు దక్కించుకున్నారు. తుది విడతలో 573 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 61, ఆసిఫాబాద్‌లో 55 పంచాయతీలు ఈ జాబితాలో ఉన్నాయి.

సర్పంచి పదవుల్లో తండ్రి, కూతురు


వెంకటేశ్వర్‌రెడ్డి


దీపిక

రాజకీయ కుటుంబ నేపథ్యం, రిజర్వేషన్లు అనుకూలించడంతో.. తండ్రి, కూతురు సర్పంచులయ్యారు. తొలివిడత పంచాయతీ ఎన్నికల్లో కుమార్తె ఒక గ్రామానికి, రెండో విడత ఎన్నికలకు సంబంధించి తండ్రి మరో గ్రామానికి ప్రజాప్రతినిధులుగా విజయాలు అందుకున్నారు. వీరు- మెదక్ జిల్లా కౌడిపల్లి సర్పంచి చిలుముల వెంకటేశ్వర్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కొన్యాల సర్పంచి భగవాన్‌రెడ్డిగారి దీపిక. తండ్రి తెరాస మద్దతుదారు కాగా, తనయ కాంగ్రెస్ మద్దతుతో గెలుపు సాధించారు.

– న్యూస్‌టుడే, నర్సాపూర్



ఇదే ఆ వివాహ కానుక కరపత్రం

'మన ఊరి మహాలక్ష్మి'కి అయిదేళ్లూ పెళ్లి కానుక!

అలంపూర్, న్యూస్‌టుడే: గ్రామపంచాయతీ ఎన్నికల బరిలో నిలిచిన జోగులాంబ గద్వాల జిల్లాలోని ఓసర్పంచి అభ్యర్థిని వినూత్నహామీ ఇచ్చారు. తనను ఎన్నుకుంటే, పదవిలో ఉన్నంత కాలమూ ఊరి ఆడపిల్లలకు రూ.5,016 వంతున 'పెళ్లి కానుక'ను సొంత డబ్బుతో అందజేస్తానని ప్రచారం సాగిస్తున్నారు. ఉండవల్లి సర్పంచి అభ్యర్థిగా బరిలో నిలిచిన రేఖ సరికొత్త పంథా ఇది. మండలంలో అధికజనాభా (9500పైగా) ఉన్నది, ఓటర్లు 3,700మంది గలదీ ఈ గ్రామమే. వధువులకు కానుకలంటూ, కరపత్రాలు ముద్రించి ఇంటింటా ఆమె పంచుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పథకాలు స్ఫూర్తిదాయకాలని చెబుతున్నారు.

ప్రైవేటులోనూ శిక్షణ వైద్యులకు ఉపకార వేతనం

నిబంధనలు తప్పనిసరి చేస్తూ ఎంసీఐ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన శిక్షణ వైద్యులకు కూడా ఉపకార వేతనాన్ని కచ్చితంగా చెల్లించేలా నిబంధనలను కఠినతరం చేయాలని భారతీయ వైద్య మండలి (ఎంసీఐ) నిర్ణయించింది. ఎంబీబీఎస్ విద్యాభ్యాసం అనంతరం ప్రతి వైద్యవిద్యార్థి ఏడాది పాటు శిక్షణ (ఇంటర్న్‌షిప్) పొందాల్సి ఉంటుంది. ఎక్కువ మంది వైద్య విద్యార్థులు తమ కళాశాలలకు అనుబంధంగా ఉన్న బోధనాసుపత్రిలోనే శిక్షణ పొందుతారు. కొందరు ఇతర బోధనాసుపత్రుల్లోనూ శిక్షణ పొందుతారు. ఈ శిక్షణ కాలంలో తెలంగాణలోని ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో నెలకు రూ.19,559 చొప్పున శిక్షణ వైద్యుడికి చెల్లిస్తున్నారు. ప్రైవేటు వైద్య కళాశాలలు శిక్షణ వైద్యుడికి ఉపకారవేతనాన్ని చెల్లిస్తున్నట్లుగా దస్త్రాల్లో పొందుపరుస్తున్నా వాస్తవానికి చెల్లించడం లేదని ఎంసీఐకి ఫిర్యాదులు అందాయి. జూడాలు కూడా ఫిర్యాదులు పంపించారు. దేశవ్యాప్తంగా అత్యధిక ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఇదే పరిస్థితి ఉందని ఎంసీఐ గుర్తించింది. ప్రభుత్వ వైద్యకళాశాలల్లో అభ్యసించిన ఎంబీబీఎస్ వైద్యులతో సమానంగా ప్రైవేటులోనూ చెల్లించాలని స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన నిబంధనలను మరింత కఠినతరం చేయనున్నామని.. దీనిపై అభిప్రాయాలు, సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరుతూ ఎంసీఐ తాజాగా లేఖను విడుదల చేసింది.

పంచాయతీల ఆదాయం పెరిగేదెలా?

- ప్రస్తుతానికి సొంత రాబడి వాటా 29 శాతమే
- కొత్త చట్టం ప్రకారం పెంచుకొనే అవకాశం
- ప్రత్యేకంగా నిధులు ఇస్తామని చెప్పిన రాష్ట్ర సర్కారు
- 2019-20 బడ్జెట్‌లో రూ. 1,000 కోట్లు కేటాయింపు!



ఈనాడు – హైదరాబాద్

రాష్ట్రంలో పంచాయతీల స్వరూపం మారిపోయింది. కొత్తవాటి ఆవిర్భావంతో ఉన్నవన్నీ చిన్నవిగా మారిపోయాయి. దీంతో వాటి రాబడులూ అంతంత మాత్రంగానే ఉండబోతున్నాయి. సొంత రాబడులను పెంచుకోవటం కొత్త పాలక వర్గాలకు ఒక సవాల్‌గా మారనుంది. చిన్న పంచాయతీలకు మనుగడ కష్టమని, అలాంటి యోచన ఏ రాష్ట్రానికైనా ఉన్నట్లైతే దాన్ని ఉపసంహరించుకోవటమే ఉత్తమమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఏర్పాటు చేసిన సుమిత్ బోస్ కమిటీ స్పష్టం చేసిన సమయంలోనే.. తెలంగాణలో ఒకేసారి కొత్తగా 4,383 కొత్త పంచాయతీలు ఏర్పాటయ్యాయి. దీంతో మొత్తం సంఖ్య 12,751కి చేరింది. వీటి ఆవిర్భావంతో ఇప్పుడు రాష్ట్రంలో 95 శాతం మేర పంచాయతీలు చిన్నవిగా మారిపోయాయి. వీటి సొంత ఆర్జనలో ఆస్తి పన్ను ప్రధానమైనది. ఇళ్లు తక్కువగా ఉన్నపుడు పన్ను కూడా అంతే స్థాయిలో వస్తుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఆస్తి పన్ను వార్షిక వసూళ్లు రూ.700 కోట్ల మేర ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందుతున్న నిధులను కలిపి చూస్తే.. 2017-18లో గ్రామాలకు అందిన రూ. 2,284 కోట్లలోను వాటి సొంత ఆదాయం వాటా 29 శాతం మాత్రమే. కానీ రాష్ట్రం ప్రత్యేకంగా నిధులిస్తేమని చెప్పినందున కొంత భరోసా లభించే అవకాశం ఉంది.

కొత్త చట్టంలో ఆదాయ వనరులు ఇవీ

పంచాయతీలో ఇంటి పన్ను విధింపుతో పాటు తూకాలు, కొలతలు ద్వారా గ్రామ ఫల సాయాలపై పన్ను వేయవచ్చు. ప్రభుత్వం అనుమతించే మరికొన్ని రకాల పన్నులను పాలక వర్గాలు వసూలు చేయవచ్చని కొత్త చట్టం చెబుతోంది. పంచాయతీ అధీనంలో ఉండే పోరంబోకు, సామాజిక భూములను ఉపయోగించుకొనే వారిపై ప్రత్యేక రుసుములు విధించవచ్చు. చావడిలు, సరాయిలతో సహా భవనాలపైనా రుసుములు రాబట్టవచ్చు. ప్రత్యేక పన్నులు, యూజర్ ఛార్జీలను వసూలు చేయవచ్చు. అధికారుల ముందస్తు అనుమతితో భూములపై సర్‌ఛార్జీని రాబట్టవచ్చు. గ్రామంలోని తాగునీటి వనరులు, మురుగు కాలువలు, వీధి దీపాలు తదితరాల నిర్వహణ, మరమ్మతులకు నిధుల ఆవశ్యకత ఏర్పడినపుడు సర్కారు అనుమతితో ఇళ్లపై ప్రత్యేక పన్నును పంచాయతీ రాబట్టవచ్చు. మార్కెట్లు, కబేళాలు, ప్రజల మజిలీ స్థలాలు, పార్కింగ్ స్థలాలకు లైసెన్సుల జారీ, మార్కెట్లలోని విక్రయాలపై పన్ను.. ఇలా పన్నులు, రుసుములను పంచాయతీ రాబట్టి సొంత రాబడులను పెంచుకోవచ్చు. వీటన్నింటినీ చట్టంలో పొందుపరిచినప్పటికీ అందుకు అనుగుణమైన పరిస్థితులు కూడా అక్కడ ఉండి తీరాలి. పలు తండాలు, చిన్న గ్రామాలు సైతం పంచాయతీలుగా అవతరించినందున వాటిలో వివిధ రకాల రుసుములను విధించేందుకు ఆస్కారం ఉండదు. కనుక వాటికి ప్రభుత్వ సాయం తప్పనిసరి.

అమలు కాని 14వ ఆర్థిక సంఘం సిఫార్సులు

పంచాయతీల రాబడులను పెంచటం లక్ష్యంగా కేంద్ర 14వ ఆర్థిక సంఘం కొన్ని సిఫార్సులను చేయగా రాష్ట్రంలో అవి ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. పట్టణాలకు సమీపంలోని పంచాయతీల్లోని ఖాళీ స్థలాలపై పన్నును వసూలు చేయాలని, ప్రకటనలపై పన్ను విధింపునకు ప్రభుత్వం ఒక విధానాన్ని తేవాలని, స్థానిక ఆస్తులను పంచాయతీలకు అప్పగించి వాటిని లీజుకు ఇచ్చుకొనే సౌలభ్యాన్ని కల్పించడంవంటివి అందులో ఉన్నాయి.

15వ ఆర్థిక సంఘంపై మరిన్ని ఆశలు

స్థానిక సంస్థలకు నిధులను ఏ రీతిలో ఇవ్వాలో 15వ ఆర్థిక సంఘం త్వరలో తేల్చనుంది. దీని సిఫార్సులు 2020 ఏప్రిల్ మొదలుకొని అయిదేళ్ల పాటు అమలులో ఉంటాయి. ఇప్పటికంటే మెరుగైన పద్ధతుల్లో నిధులు రావచ్చని రాష్ట్ర అధికారులు భావిస్తున్నారు. 14వ ఆర్థిక సంఘం ద్వారా 2015-20 మధ్య రాష్ట్రానికి రూ.4,833 కోట్లు వస్తుండగా పంచాయతీలకు అవే ప్రధాన ఆదాయ వనరుగా మారాయి.

కొత్త బడ్జెట్‌లో నిధులు

పంచాయతీల చేయూతకు రానున్న 2019-20 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.1,000 కోట్లకు పైగా కేటాయించే యోచనలో ఉంది. అప్పటికి రాష్ట్ర ఆర్థిక సంఘం నివేదిక వస్తుంది కనుక దానిలోని సిఫార్సుల ప్రకారం నిధులు పంపిణీ అవుతాయి. ప్రస్తుత 2018-19 బడ్జెట్‌లోనూ ప్రభుత్వం స్థానిక సంస్థల పద్దులో రూ.వెయ్యి కోట్లను చూపించినప్పటికీ ఇంతవరకు నిధులు విడుదల కాలేదు. ఒక్కో పంచాయతీకి రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల మేర ఇవ్వనున్నట్లు పంచాయతీల ఆవిర్భావ సమయంలో సీఎం ప్రకటించటంతో నిధుల కొరత ఉండబోదనే భరోసా అప్పట్లో నేతల్లో నెలకొంది.

భగీరథతో కొంత వెసులుబాటు

తాగునీటి కోసం పంచాయతీలు ఇంతవరకు చేస్తున్న ఖర్చంతా మిషన్ భగీరథ కారణంగా ఇక ఆదా కానునుంది. నదులు, రిజర్వాయర్ల నుంచి తాగునీరు నేరుగా గ్రామంలోని ఉపరితల జలబాండాగారాలకు చేరుతుంది కనుక మునుపటి మాదిరిగా విద్యుత్ బిల్లులు, మరమ్మతు ఖర్చులు అంటూ పంచాయతీలకు ఉండబోవని అధికారులు పేర్కొంటున్నారు.

నేడే 'కియా' తొలికారు విడుదల

- ఆవిష్కరించనున్న ఏపీ సీఎం చంద్రబాబు, కొరియా రాయబారి
- అనంతపురం కర్మాగారంలో ప్రయోగాత్మక ఉత్పత్తికి శ్రీకారం



ఈనాడు, అనంతపురం: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి గర్వకారణమైన ఘట్టం ఆవిష్కరణకు రంగం సిద్ధమైంది. కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తరువాత ఏర్పాటైన దక్షిణ కొరియాకు చెందిన కియా మోటార్స్ పరిశ్రమ నుంచి తొలికారు మంగళవారం బయటకు రానుంది. దేశంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదయ్యే రెండో జిల్లాగా, రాష్ట్రంలో కరవుకు ప్రతిరూపంగా పేరుగాంచిన అనంతపురం జిల్లా.. ఇకపై కార్ల పరిశ్రమ జిల్లాగా ఖ్యాతి గాంచనుంది. వాస్తవానికి దేశంలో తొలి ప్లాంట్ ఏర్పాటు చేయాలని భావించినప్పుడు కియా ప్రతినిధులు వివిధ రాష్ట్రాలను పరిశీలించారు. ఇందులో భాగంగా 2016లో పలు దఫాలు అనంతపురం జిల్లాకూ వచ్చారు. భూముల కోసం అన్వేషణ చేశారు. కర్ణాటక, తమిళనాడుతోపాటు, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్, గుజరాత్ వంటి రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా కియాను తమ రాష్ట్రానికి తీసుకెళ్లేందుకు విశ్వప్రయత్నాలు చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, ప్రత్యేక చొరవ చూపి 'కియా మోటార్స్'ను అనంతపురానికి తీసుకురావడంలో కృతకృత్యులయ్యారు. మంగళవారం కియా తొలికారును సీఎం చంద్రబాబు, భారత్‌లో కొరియా రాయబారి షిన్ బాంకిల్ ఆవిష్కరించనున్నారు.

ప్రశ్నిస్తే కేసులు బనాయింపు

- ఆచార్య హరగోపాల్ విమర్శ


తెలంగాణ ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న హరగోపాల్. పక్కన నలమాస కృష్ణ, విమలక్క, రాములు, గోవర్ధన్

కవాడిగూడ, న్యూస్‌టుడే: సమాజం మారాలని కోరుకుంటే నేరం అవుతుందా అని ఆచార్య హరగోపాల్ ప్రశ్నించారు. ప్రజా ఉద్యమాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫాసిస్టు నిర్బంధాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ సోమవారం హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో తెలంగాణ ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దీనికి హాజరైన హరగోపాల్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు అన్యాయం చేయొద్దని, అసమానతలు తొలగాలని ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించడం అన్యాయమన్నారు. అనారోగ్యంతో కదలలేని స్థితికి చేరిన ప్రొ. సాయిబాబాను జైలునుంచి విడుదల చేయాలని కోరారు. ప్రధాని మోదీని హత్య చేయడానికి కుట్ర పన్నారని కట్టుకథలల్లి వరవరరావుతోపాటు పలువురిని అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. ఎవరినైనాఅరెస్టుచేసి విచారణ లేకుండా 6నెలలపాటు జైలుకు పంపించేందుకు వీలున్న ఊపా (యూఏపీఏ) చట్టం ప్రమాదకరమైందన్నారు. ఈ చట్టం రద్దు కోసం ప్రజలు పోరాడాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాములు మాట్లాడుతూ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాజపా అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలన్నారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం మనువాద పాలనసాగిస్తోందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గోవర్ధన్ ఆరోపించారు. టీడీఎఫ్ కన్వీనర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షురాలు విమలక్క, టీడీఎఫ్ కన్వీనర్ చిక్కుడు ప్రభాకర్, పీవోడబ్ల్యూ రాష్ట్రఅధ్యక్షురాలు సంధ్య, ప్రజాఫ్రంట్ అధ్యక్షుడు నలమాస కృష్ణ తదితరులు మాట్లాడారు.

1 నుంచి రాష్ట్ర స్థాయి పద్య, సాంఘిక నాటిక పోటీలు

ఆరు రోజుల పాటు మిర్యాలగూడలో నిర్వహణ

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర సినిమా, టీవీ నాటక అభివృద్ధి సంస్థ, మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం సంయుక్తంగా ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి మిర్యాలగూడలో 'తెలంగాణ రాష్ట్రస్థాయి పద్య, సాంఘిక నాటిక పోటీల' నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నాయి. అంతరించిపోతున్న కళలకు జీవం కల్పించే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల నుంచి కళాకారులను ఆహ్వానించి ఆరు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని నలుమూలల నుంచి వందలాదిగా నాటికల పోటీకి ఎంట్రీలు రాగా ప్రాథమికంగా పరిశీలించిన తరువాత తుది ప్రదర్శనకు గాను కొన్నింటిని ఎంపిక చేశారు. మిర్యాలగూడలోని హౌసింగ్‌బోర్డు వెంకటేశ్వరస్వామి ఆలయంలోని కళా వేదికపై ప్రదర్శించనున్నారు. కళా వేదికకు రంగస్థల నటుడు రాపోలు ప్రసాద్ కళా వేదికగా నామకరణం చేశారు. ఆయా ప్రాంతాల నుంచి పోటీలకు హాజరయ్యే కళాకారులకు వసతి సౌకర్యాల కల్పనకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షులు తడకమళ్ల రాంచందర్‌రావు, భుజంగరావు, ప్రధాన కార్యదర్శి పులి కృష్ణమూర్తి తెలిపారు.

చంద్రబాబుతో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి భేటీ

ఈనాడు, అమరావతి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి సోమవారం రాత్రి పొద్దుపోయాక ఏపీ సీఎం చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. భార్య సుజాతమ్మ, కుమారుడు రాఘవేంద్రరెడ్డితో కలసి ఆయన ముఖ్యమంత్రి నివాసానికి వచ్చారు. సూర్యప్రకాశ్‌రెడ్డి త్వరలో తెదేపాలో చేరనున్నట్టు సమాచారం. ఆ విషయంపై చర్చించేందుకే ఆయన కుటుంబసభ్యులతో కలిసి చంద్రబాబుతో సమావేశమయ్యారు. సూర్యప్రకాశ్‌రెడ్డి కర్నూలు ఒక లోక్‌సభ, ఒక అసెంబ్లీ టిక్కెట్‌ను ఆశిస్తున్నట్టు తెలిసింది. ఫిబ్రవరి 6న తెదేపాలో చేరే అవకాశమున్నట్టు సమాచారం.

పశుసంవర్ధక శాఖ సంచాలకుడి హఠాన్మరణం

- సోమవారం తిరుపతిలో జాతీయ సదస్సుకు హాజరు
- వెంకన్న దర్శనానికి వెళ్లి గుండెపోటుతో మృతి


డి.వెంకటేశ్వర్లు

తిరుపతి వ్యవసాయం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ డి. వెంకటేశ్వర్లు హఠాన్మరణం పాలయ్యారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆయన గుండెపోటుతో కన్నుమూశారు. తిరుపతిలో సోమవారం పరాన్న జీవశాస్త్ర శాస్త్రవేత్తల జాతీయ సదస్సు ప్రారంభోత్సవ సదస్సుకు వెంకటేశ్వర్లు హాజరయ్యారు. మధ్యాహ్నం శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వెళ్లారు. క్యూలైన్‌లో ఉండగా గుండెపోటు వచ్చింది. అక్కడి సిబ్బంది వెంటనే తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో చేర్చి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ రాత్రి 8 గంటల సమయంలో కన్నుమూశారు. వెంకటేశ్వర్లును తిరుపతి తరలించిన వెంటనే పశువైద్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ వై.హరిబాబు స్విమ్స్‌కు చేరుకొని పర్యవేక్షించారు. వెంకటేశ్వర్లు 1979-84లో రాజేంద్రనగర్ పశువైద్య కళాశాలలో బీవీఎస్సీ పూర్తి చేశారు. 1984-86లో తిరుపతిలోని పశువైద్య కళాశాలలో ఎంవీఎస్సీ (గర్భకోశశాస్త్రం)లో పీజీ పూర్తి చేసి పశుసంవర్ధక శాఖలో సహాయ సంచాలకులుగా నియమితులయ్యారు. చిత్తూరు జిల్లా జేడీగానూ దీర్ఘకాలం పనిచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సంచాలకులుగా పనిచేసిన ఆయన రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పశు సంవర్ధక శాఖ సంచాలకుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబరులో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా ఇంతలోనే హఠాన్మరణానికి గురయ్యారు.

ఖాళీ అవుతున్న సింగూరు, మంజీరా

హైదరాబాద్‌కు తగ్గుతున్న సరఫరా

ఈనాడు, హైదరాబాద్: రాజధాని హైదరాబాద్‌కు సింగూరు, మంజీరా ప్రాజెక్టుల నుంచి నీటి సరఫరా క్రమంగా తగ్గిపోతూ వస్తోంది. ప్రాజెక్టులు ఖాళీ అవుతుండటంతోపాటు మిషన్ భగీరథ కింద ఇతర ప్రాంతాలకు నీటిని తరలిస్తుండటంతో జలాశయాల్లో నీటిమట్టం తగ్గిపోయింది. 30 టీఎంసీల సామర్థ్యం ఉన్న సింగూరు ప్రాజెక్టుకు ఈ సారి 1.5 టీఎంసీల జలాలు మాత్రమే వచ్చాయి. 2017లో ఎస్సారెస్పీ అవసరాలకు దాదాపు 16 టీఎంసీలను విడుదల చేశారు. ప్రస్తుతం సింగూరు ప్రాజెక్టు నుంచి మిషన్ భగీరథ పథకం కింద తొమ్మిది నియోజకవర్గాలకు నిత్యం 100 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఈ ప్రాజెక్టు నుంచి మూడు, నాలుగు దశల ద్వారా హైదరాబాద్ నగరానికి నీటి విడుదల నిలిచిపోయింది. మరోవైపు ఈ ప్రాజెక్టుపై ఆధారపడిన 2 టీఎంసీల సామర్థ్యం ఉన్న మంజీర ప్రాజెక్టులో ప్రస్తుతం 0.3 టీఎంసీల నీటిమట్టమే ఉంది. దీని నుంచి మిషన్ భగీరథ ద్వారా నర్సాపూర్, సంగారెడ్డి నియోజకవర్గాలకు తాగునీరు ఇస్తున్నారు. ఈ ప్రాజెక్టు నుంచే హైదరాబాద్ నగరానికి ఒకటి, రెండు దశల ద్వారా నిత్యం 180 ఎంఎల్‌డీల నీటిని పటాన్‌చెరు నుంచి కూకట్‌పల్లి వరకు ఇవ్వాల్సి ఉంది. జలాశయంలో నీరు అడుగంటడంతో ప్రస్తుతం 150 ఎంఎల్‌డీలు సరఫరా చేస్తున్నారు. జలాశయంలో నీటిమట్టం పడిపోతున్న దృష్ట్యా హైదరాబాద్ నగరానికి నీటి సరఫరా నిలిపివేయాలని ఇటీవలే సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. లేదంటే నీళ్లు అడుగంటడంతోపాటు అటు సంగారెడ్డి ప్రాంతానికీ కటకట తప్పేలా లేదు. మరోవైపు నగరానికి కృష్ణా, గోదావరి జలాలు వస్తుండటంతో కొరత తెలియడం లేదు. ఈ నేపథ్యంలో ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా మిషన్ భగీరథ అవసరాలకు మాత్రమే నీటిని సరఫరా చేయాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నట్లు సమాచారం.

తెలంగాణ శాసనసభ ప్రొరోగ్

- ఒకటి, రెండు రోజుల్లో ఎస్‌జీఎస్టీ చట్టసవరణపై ఆర్డినెన్స్
- ప్రభుత్వ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాలను ప్రొరోగ్ (ఈ విడత ముగిసినట్లుగా ప్రకటన) చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వస్తు, సేవల పన్ను (ఎస్‌జీఎస్టీ) చట్ట సవరణ కోసం ఆర్డినెన్స్ జారీకి వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ నెల 31లోగా ఈ ప్రక్రియలు పూర్తికానున్నాయి. కేంద్ర జీఎస్టీ మండలి సూచనలకు అనుగుణంగా ఫిబ్రవరి 1 నుంచి కీలక సవరణలతో కూడిన రాష్ట్ర జీఎస్టీ చట్టం అమల్లోకి రావాలి. ఇందుకు మూడు రోజులు మాత్రమే గడువు ఉన్నందున చట్టసవరణ కోసం శాసనసభలో తక్షణమే బిల్లు ప్రవేశపెట్టడానికి అవకాశం లేదు. శాసనసభ ఇటీవలే వాయిదా పడింది. అయితే నిబంధనల మేరకు ఈ విడత (సెషన్) కొనసాగుతున్నట్లుగా పరిగణనలో ఉంటుంది. సభ కొనసాగుతుండగా ఆర్డినెన్స్ జారీ చేయడానికి వీలుండదు. దీంతో ప్రభుత్వం శాసనసభ సమావేశాలు ముగిసినట్లుగా ప్రకటిస్తూ ప్రొరోగ్ చేయాలని కోరుతూ గవర్నర్ నరసింహన్‌కు సిఫార్సు చేస్తుంది. బుధ లేదా గురువారాల్లో ఎస్‌జీఎస్టీపై ఆర్డినెన్స్ సిద్ధం చేసి, గవర్నర్ ఆమోదం తీసుకుని, గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తారు. తద్వారా ఫిబ్రవరి 1వ తేదీ నుంచి సవరణలతో కొత్త చట్టం అమల్లోకి వస్తుంది. శాసనసభ ప్రొరోగ్‌కి గవర్నర్‌ను కోరుతూ, ఎస్‌జీఎస్టీ ఆర్డినెన్స్ జారీకి సంబంధించిన దస్త్రాలపైనా ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం సంతకం చేసినట్లు తెలిసింది.

కొత్తగూడేనికి సైబీరియన్ అతిథులు

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలానికి సైబీరియన్ అతిథులు వచ్చాయి. సంతానోత్పత్తి కోసం ఏటా సైబీరియన్ కొంగలు తుంగతుర్తి మండలంలోని కొత్తగూడెం, పస్తాల గ్రామానికి వలస వస్తుంటాయి. జనవరి మొదటి వారం నుంచి విడతల వారీగా వచ్చి గ్రామంలోని చెట్లపై నివాసాలు ఏర్పాటు చేసుకుంటాయి. సమీపంలోని చెరువుల్లో ఉండే చేపలను వేటాడి గుడ్లు పెట్టి, వాటిని పిల్లల్ని చేయడంతోపాటు వాటికి రెక్కలు వచ్చే వరకు ఇక్కడే ఉండి వేసవికి ముందు తమ ప్రాంతానికి వెళ్లిపోతాయి. అందులో భాగంగా కొత్తగూడెంలోని చింత చెట్లపై ఉన్న కొంగలు 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కాయి.

– న్యూస్‌టుడే, తుంగతుర్తి



ముదిమి పళ్లు పదిలం!

నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందంటారు. ఇది ఆరోగ్యానికీ వర్తిస్తుంది. నోరు ఆరోగ్యంగా ఉంటేనే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది మరి. పళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటేనే మనం తిన్న తిండి సరిగా జీర్ణమై దానిలోని పోషకాలు ఒంట బడతాయి. కానీ వయసు మీద పడుతున్నకొద్దీ వచ్చే మార్పులు కావొచ్చు, మొదట్నుంచీ సరిగా శుభ్రం చేసుకోకపోవటం కావొచ్చు, పొగతాగటం లాంటి అలవాట్లు కావొచ్చు, మధుమేహం వంటి ఇతరత్రా సమస్యలు కావొచ్చు, వేసుకునే మందులు కావొచ్చు.. ఇలాంటివన్నీ ముదిమి వయసు పళ్లను దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా పళ్లు ఊడటం, పుచ్చిపోవటం, చిగుళ్లవాపు వంటి సమస్యలెన్నో ముంచుకొస్తున్నాయి. వీటిని ముందే గుర్తించి జాగ్రత్త పడకపోతే పంటి నొప్పులు, తీపులతో జీవితం నిత్య నరకంగా మారిపోయే ప్రమాదం లేకపోలేదు.




ఒకప్పుడు 60 ఏళ్లు వచ్చాయంటే 'కృష్ణా రామా' అనుకుంటూ ఇంట్లో ఓ మూలకు కూచోవటం తప్ప చేసేదేముందని అనుకునేవారు. ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. ప్రస్తుతం ఎంతోమంది వృద్ధాప్యంలోనూ చురుకుగా పనులు చేసుకుంటున్నారు. పదవీ విరమణ తర్వాత కూడా తిరిగి ఉద్యోగాలు ఆరంభిస్తున్నారు. అందుకే వృద్ధాప్యంలో ఆరోగ్య పరిరక్షణపై.. ముఖ్యంగా నోటి ఆరోగ్యంపై మరింత ఎక్కువగా దృష్టి పెట్టాల్సిన అవసరమూ పెరుగుతోంది. ఎందుకంటే చిగుళ్ల సమస్యలు, పంటి సమస్యలు కేవలం నోటితోనే ఆగిపోయేవి కావు. చిగుళ్లవాపుతో గుండెజబ్బు, పక్షవాతం, న్యుమోనియా వంటి తీవ్ర సమస్యల ముప్పు పెరుగుతుండటం గమనార్హం. ఇక పళ్లు కదలటం, నొప్పి మూలంగా తిండి సరిగా తినలేకపోవటం, నిద్ర పట్టకపోవటం వంటి ఇబ్బందులూ మొదలవుతాయి. తిండి సరిగా తినకపోతే పోషణ లోపానికి దారితీస్తుంది. నిద్ర పట్టకపోవటం వల్ల హుషారు, ఉత్సాహం తగ్గిపోతాయి. మాటిమాటికీ మూడ్ మారిపోవచ్చు. కుంగుబాటు వంటి మానసిక సమస్యలూ దాడిచేయొచ్చు. ఇవన్నీ రోగనిరోధకశక్తి సన్నగిల్లటానికీ దారితీస్తాయి. ఫలితంగా జలుబు, ఫ్లూ వంటి ఇన్‌ఫెక్షన్లు తేలికగా దాడిచేస్తాయి. వృద్ధాప్యంలో సహజంగానే రోగ నిరోధకశక్తి తగ్గుముఖం పడుతుంటుంది. దీనికి నిద్రలేమి, పోషణలోపం కూడా తోడైతే అగ్నికి ఆజ్యం పోసినట్టేనని అనుకోవచ్చు. పళ్లు ఊడిపోవటం వల్ల మాట్లాడే తీరూ మారుతుంది. మాట స్పష్టంగా రాదు. దీంతో చాలామంది నలుగురిలోకి రావటానికీ జంకుతుంటారు. కాబట్టి వృద్ధాప్యంలో పంటి సమస్యలను తేలికగా తీసుకోవటానికి లేదు. ఇవి ఎందుకు వస్తాయి? రాకుండా చూసుకోవటమెలా? అనేది తెలుసుకొని ఉండటం అవసరం. అప్పుడే ఏదైనా ఇబ్బంది మొదలైతే వెంటనే డాక్టర్‌ను సంప్రతించి, ముందుగానే జాగ్రత్త పడటానికి వీలుంటుంది.



డా॥ కడియాల రాజేంద్ర
చైర్మన్, ఏపీ సూపర్ స్పెషాలిటీ
డెంటల్ హాస్పిటల్
జూబిలీహిల్స్, రోడ్ నం. 10
హైదరాబాద్

ఊడిపోవటం

ఇది తరచుగా చూసే సమస్య. మనదేశంలో 65-74 ఏళ్ల వృద్ధుల్లో సుమారు 19% మంది పళ్లు ఊడిపోవటంతో బాధపడుతున్నారని అంచనా. వృద్ధాప్యంలో పళ్లు ఊడిపోవటం సహజమని చాలా మంది భావిస్తుంటారు. కానీ ఇది నిజం కాదు. మొదట్నుంచీ సరిగా శుభ్రంగా ఉంచుకుంటే వృద్ధాప్యంలోనూ దంతాలు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. పళ్లు ఊడిపోవటానికి ప్రధాన కారణం పుచ్చిపోవటం, చిగుళ్ల వాపు, మధుమేహం వంటి సమస్యలు. దీర్ఘకాలంగా పొగాకు నమలటం వంటి అలవాట్లూ పళ్లకు ముప్పును తెచ్చిపెడతాయి. 'ఒకట్రెండు పళ్లు ఊడిపోతే ఏమవుతుందిలే?' అని చాలా మంది అనుకుంటుంటారు. పట్టించుకోకుండా వదిలేస్తుంటారు. ఇది మంచిది కాదు. ఒకట్రెండు పళ్లు ఊడినా ఆహారాన్ని నమిలే ప్రక్రియ దెబ్బతింటుంది. కింది పళ్లు అలాగే ఉన్నా వాటికి పైనుండే పళ్లు ఊడిపోతే సరిగా నమలటం సాధ్యం కాదు. దీంతో అటువైపు దవడకు ముద్దను తీసుకొచ్చి నములుతుంటారు. ఫలితంగా రెండోవైపు పళ్లు ఎక్కువగా అరిగిపోవచ్చు. అలాగే దవడ ఎముక కదలటానికి తోడ్పడే కీలు (టెంపోరల్ మాండిబులార్ జాయింట్) మీద ఒత్తిడి పెరిగి, నొప్పి తలెత్తొచ్చు. అందువల్ల పళ్లు ఊడిపోతే నిర్లక్ష్యం పనికిరాదు.



- **పళ్లు ఊడినవారికి ఒకప్పుడు కట్టుడు పళ్లు తప్ప మరో మార్గం ఉండేది కాదు. ఇప్పుడు ఇంప్లాంట్, బ్రిడ్జెస్ వంటి పద్ధతులూ అందుబాటులో ఉన్నాయి. ఇవి మామూలు పళ్ల మాదిరిగానే పనిచేస్తాయి. దవడ ఎముక గట్టిగా ఉండి.. మధుమేహం వంటి ఇతరత్రా సమస్యలేవీ లేకపోతే వృద్ధాప్యంలోనూ ఇంప్లాంట్స్‌తో పెద్దగా దుష్ప్రభావాలేవీ ఉండవు.**

పుచ్చిపోవటం

పిప్పిపళ్లు అనగానే పిల్లలే గుర్తుకొస్తారు. కానీ వృద్ధులకూ దీని ముప్పు ఎక్కువే. ఈ వయసులో పళ్లు పుచ్చిపోవటానికి ప్రధాన కారణం నోరు పొడిబారటం. సాధారణంగా వయసు మీద పడుతున్నకొద్దీ లాలాజల గ్రంథుల పనితీరు మందగిస్తుంటుంది. దీంతో లాలాజలం సరిగా ఉత్పత్తి కాక నోరు ఎండిపోతుంటుంది. మద్యం, పొగ తాగటం, గుట్కా నమలటం వంటివీ లాలాజల ఉత్పత్తిని దెబ్బతీయొచ్చు. అధిక రక్తపోటు, అలర్జీ, ఆస్థమా, కుంగుబాటు వంటి సమస్యలకు వాడుకునే మందులతోనూ నోరు పొడిబారొచ్చు. నోరు, పళ్లు శుభ్రంగా ఉండటానికే కాదు.. లాలాజలం సహజ రక్షణ వ్యవస్థగానూ పనిచేస్తుంది. ఇది బ్యాక్టీరియా చనిపోవటానికి తోడ్పడుతుంది. నోరు పొడిబారినప్పుడు ఇలాంటి సహజ రక్షణ వ్యవస్థ దెబ్బతింటుంది. అలాగే తిన్న పదార్థాలు పళ్ల మీద, చిగుళ్ల మీద అతుక్కుపోయి.. సందుల మధ్యలో ఇరుక్కుపోయి ఎక్కువసేపు అలాగే ఉండిపోతుంటాయి. ఫలితంగా బ్యాక్టీరియా వృద్ధి చెంది పళ్లు దెబ్బతిని రంధ్రాలు పడుతుంటాయి. కొందరికి ఛాతీలోమంట (అసిడిటీ) కూడా సమస్యాత్మకంగా పరిణమిస్తుంది. వీరిలో జీర్ణాశయంలోని ఆమ్లం పైకి ఎగదన్నుకొని వచ్చి.. పళ్ల మీదుండే ఎనామిల్‌ను దెబ్బతీస్తుంది. అలాగే కొందరికి పళ్ల వెనక భాగమూ అరిగిపోవచ్చు. అక్కడ ఆహార పదార్థాలు చిక్కుకొని.. బ్యాక్టీరియా పెరిగి పళ్లు పుచ్చిపోవచ్చు.



- **పళ్లు పుచ్చిపోతే ఫిల్లింగ్ ద్వారా రంధ్రాలను పూడ్చేయొచ్చు. సమస్య మరీ తీవ్రమై.. నాడి కూడా ప్రభావితమై నొప్పి పుడుతుంటే రూట్‌కెనాల్ చికిత్స చేయాల్సి ఉంటుంది. తర్వాత పళ్ల మీద క్యాప్ వేసుకోవచ్చు. నోరు పొడిబారుతుంటే లాలాజల ఉత్పత్తిని పెంచే మందులు వాడుకోవాల్సి ఉంటుంది.**

రంగు మారటం


ఒక వయసు వచ్చేసరికి పళ్ల రంగు మారిపోవటం చూస్తుంటాం. దీనికి మూలం పళ్ల మీదుండె తెల్లటి ఎనామిల్ పొర క్షీణించి లోపలి పొర (డెంటిన్) బయటపడటం. జీర్ణాశయంలోని ఆమ్లం గొంతులోకి ఎగదన్నుకొని రావటం మూలంగా ఎనామిల్ దెబ్బతినొచ్చు. మనం తినే ఆహార పదార్థాలు, అలవాట్ల మూలంగా పళ్లలో విషతుల్యాలు పేరుకుపోవటం కూడా రంగు మారటానికి దోహదం చేయొచ్చు. ముఖ్యంగా సిగరెట్లు, బీడీలు, చుట్టలు కాల్చటం.. పొగాకు, గుట్కా నమలటం వంటివి పళ్లు త్వరగా రంగు మారిపోయేలా చేస్తాయి. దీంతో నవ్వినపుడు, మాట్లాడినపుడు పళ్లు అసహ్యంగా కనిపిస్తుంటాయి. ఇది కొందరిలో ఆత్మ న్యూనతకూ దారితీయొచ్చు. కాబట్టి దీన్ని తేలికగా తీసుకోవటానికి లేదు.



- **పళ్లను డెంటిస్టుతో తరచుగా శుభ్రం చేయించుకోవటం ద్వారా రంగు మారకుండా చూసుకోవచ్చు. ఒకవేళ బాగా రంగు మారిపోయి అసహ్యంగా కనిపిస్తుంటే పాలిషింగ్, బ్లీచింగ్ వంటి పద్ధతులతో తిరిగి మెరిసేలా చేయొచ్చు. అవసరమైతే క్యాప్స్ కూడా వేసుకోవచ్చు. కొందరికి ప్రమాదాల మూలంగానూ పళ్లకు రక్తసరఫరా తగ్గిపోయి రంగు మారిపోవచ్చు. పూర్తిగా రక్తసరఫరా ఆగిపోతే నల్లగానూ అవ్వొచ్చు. ఇలాంటివారికి ఎక్స్‌రే తీసి.. అవసరమైతే రూట్‌కెనాల్ చికిత్స చేస్తారు. తర్వాత క్యాప్స్ వేసుకుంటే పళ్లు తిరిగి మెరిసేలా చూసుకోవచ్చు.**

చిగుళ్ల వాపు

చిగుళ్ల జబ్బు తీవ్రంగా వేధిస్తుంది. దీని మూలంగా రక్తం కారటం, వాపు, నొప్పితో చాలామంది ఇబ్బంది పడుతుంటారు. చిగుళ్ల వాపునకు ప్రధాన కారణం పళ్ల మీద గార పేరుకుపోవటం. గారలోని బ్యాక్టీరియా క్రమంగా చిగుళ్ల ఇన్‌ఫెక్షన్‌కు దారితీస్తుంది. దీంతో వాపు, ఎరుపు, నొప్పి వంటివి వేధిస్తాయి. గమనించాల్సిన విషయం ఏంటంటే- వృద్ధుల్లో ఇన్‌ఫెక్షన్ తీవ్రమయ్యేంతవరకూ నొప్పి కలగకపోవటం. దీంతో చాలామంది 'ఏం కాదులే' అని నిర్లక్ష్యం చేస్తుంటారు. కానీ ఇన్‌ఫెక్షన్ తీవ్రమైతే చిగుళ్లు పూర్తిగా దెబ్బతినొచ్చు. దవడ ఎముకతో పాటు దంతాలను పట్టి ఉంచే కండర బంధనాలూ క్షీణించొచ్చు. దీంతో పళ్లు కదిలి ఊడిపోయే ప్రమాదముంది. మధుమేహంతోనూ చిగుళ్లజబ్బు తలెత్తొచ్చు. చాలామందిలో చిగుళ్లజబ్బులతోనే మధుమేహం తొలిసారిగా బయటపడుతుండటం గమనార్హం. క్యాన్సర్, రక్తహీనత వంటి సమస్యలు, అధిక రక్తపోటు మందులతోనూ చిగుళ్ల జబ్బులు తలెత్తొచ్చు.



- **చిగుళ్ల వాపు తీవ్రతను బట్టి చికిత్స చేస్తారు. పళ్ల మీద గారను తొలగించటం, ఇన్‌ఫెక్షన్ లోపలికి చేరుకుంటే దంతమూలాన్ని శుభ్రం చేయటం ఉపయోగపడతాయి. పళ్లు కదులుతున్నా, పళ్ల మధ్య సందులు పెరిగిపోతున్నా ఎక్స్‌రే తీసి చూడాల్సి ఉంటుంది. ఏదైనా తేడా ఉండే ఫ్లాప్ సర్జరీ చేయొచ్చు. దవడ ఎముక అరిగిపోతే గ్రాఫ్టింగ్‌తో సరిదిద్దొచ్చు.**

నివారణ ఉత్తమం

పంటి సమస్యలు, చిగురు సమస్యలు ఉన్నట్టుండి పుట్టుకొచ్చేవి కావు. వీటికి చాలాకాలం ముందు నుంచే బీజం పడుతుంది. అందువల్ల తగు జాగ్రత్తలు తీసుకుంటే వీటి బారినపడకుండా చూసుకోవచ్చు.

- **ఏదైనా తిన్న తర్వాత తప్పకుండా నోటిని పుక్కిలించాలి.**
- **తరచుగా నీరు తాగాలి. దీంతో నోరు పొడిబారకుండా ఉంటుంది.**
- **తీపి పదార్థాలు, పానీయాల విషయంలో పరిమితి పాటించాలి.**
- **రోజూ ఉదయం, రాత్రిపూట పళ్లను శుభ్రంగా తోముకోవాలి.**
- **పళ్లు తోముకున్నాక పూర్తిగా శుభ్రమయ్యాయో లేదో తెలుసుకోవటానికి ఒకసారి అద్దంలో చూసుకోవటం మంచిది.**
- **బ్రష్ పోచలు మెత్తగా ఉండేలా చూసుకోవాలి. మూడు నెలలకు ఓసారి బ్రష్ మార్చాలి. పోచలు వంగిపోతే వెంటనే కొత్త బ్రష్ తీసుకోవాలి. ఏదైనా ఇన్‌ఫెక్షన్ వస్తే తగ్గిన తర్వాత కొత్త బ్రష్ వాడుకోవాలి.**
- **పళ్లను తోముకున్నాక చిగుళ్లను వేళ్లతో రుద్దుతూ మర్దన చేయాలి.**
- **క్రమం తప్పకుండా ఆరు నెలలకు ఓసారి డాక్టర్ సంప్రతించాలి. పళ్ల నుంచి రక్తం వస్తున్నా, నోరు దుర్వాసన కొడుతున్నా ఏమాత్రం తాత్సారం చేయరాదు.**
- **గుండుసూదులు, పిన్నీసులు, అగ్గిపుల్లల వంటివాటితో పళ్ల సందుల్లో ఇరుక్కుపోయిన ఆహార పదార్థాలను బయటకు తీయటం తగదు.**
- **పీచు పదార్థాలు పళ్లకు ఎంతో మేలు చేస్తాయి. ఇవి పళ్లు శుభ్రపడటానికి తోడ్పడతాయి. యాపిల్ల వంటివి తిన్నప్పుడు దంతాలు సహజంగానే శుభ్రపడటం తెలిసిందే. అందువల్ల పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి. మాంసాహారం తీసుకున్నప్పుడు పళ్ల మధ్యలో ఇరుక్కోకుండా చూసుకోవాలి.**

జివ్వుమనటం

దీనికి ప్రధాన కారణాలు పంటి పైపొర (ఎనామిల్) క్షీణించటం, చిగురు తగ్గిపోవటం. మరీ అతిగా పళ్లను తోముకోవటం, పుల్లటి పదార్థాలు తీసుకోవటం, జీర్ణాశయంలోని ఆమ్లం పైకి ఎగదన్నుకొని రావటం వంటివి ఎనామిల్ క్షీణించటానికి దారితీస్తాయి. మధుమేహం, సరిగా పళ్లు శుభ్రం చేసుకోకపోవటం, పొగాకు నమలటం వంటివి చిగురు తగ్గిపోయేలా చేస్తాయి. ఎనామిల్ క్షీణిస్తే దాని కిందుండే డెంటిన్, చిగురు తగ్గిపోతే దంత మూలం బయటపడతాయి. దీంతో ఏదైనా తినటం, తాగటం మొదలెట్టినపుడు ఉన్నట్టుండి పళ్లు జివ్వున లాగినట్టుగా నొప్పి పుడుతుంది. ఇది కొద్దిసేపే ఉండొచ్చు గానీ తరచుగా వస్తుంటే చాలా ఇబ్బంది కలిగిస్తుంది.



- **సమస్య తీవ్రంగా ఉంటే ఎనామిల్ ఫిల్లింగ్ చేయించుకోవచ్చు. జివ్వుమనటం తగ్గించే పేస్టులు, ఫ్లోరైడ్ పూతల వంటివీ బాగా ఉపయోగపడతాయి. లేజర్ చికిత్సతోనూ సరిచేయొచ్చు. అవసరమైతే పళ్ల మీద క్రౌన్స్ వేసుకోవచ్చు.**

చిగురు తగ్గటం

వయసు మీద పడుతున్నకొద్దీ చిగుళ్ల సైజు తగ్గిపోతుంటుంది. పళ్లు సరిగా శుభ్రం చేసుకోకపోవటం, పొగతాగటం, హార్మోన్ల సమతుల్యత దెబ్బతినటం, మధుమేహం, కొన్నిరకాల మందుల వంటివీ దీనికి దారితీయొచ్చు. కొందరికి పైపళ్లు, కిందిపళ్లు రుద్దుకోవటం మూలంగానూ చిగుళ్లు తగ్గిపోవచ్చు. ఇవి మరీ తగ్గిపోతే దంతమూలం కూడా బయటపడొచ్చు. దీంతో బ్యాక్టీరియా వృద్ధి చెంది పళ్లు క్రమంగా దెబ్బతింటాయి. దంతమూలం బాగా దెబ్బతింటే పళ్లు ఊడిపోవచ్చు కూడా.

- **క్రమం తప్పకుండా దంత వైద్యులను సంప్రతిస్తే చిగుళ్లు తగ్గటాన్ని ముందే గుర్తించొచ్చు. వెంటనే జాగ్రత్త పడితే సమస్య ముదరకుండా చూసుకోవచ్చు. ఒకవేళ దవడ ఎముక సమస్యలతో చిగుళ్లు తగ్గిపోతే ఫ్లాప్ సర్జరీ, లేజర్ చికిత్స, బోన్ గ్రాఫ్టింగ్ వంటివి ఉపయోగపడతాయి.**

కట్టుడుపళ్ల సమస్యలు

కట్టుడుపళ్లను వాడేవారు వాటిని సరిగా అమర్చుకోవటం చాలా ముఖ్యం. లేకపోతే మాట తత్తరపడటం, ఆహారాన్ని సరిగా నమలలేకపోవటం వంటి ఇబ్బందులు తలెత్తొచ్చు. కట్టుడుపళ్లను తీయకుండా రాత్రిపూట అలాగే పడుకున్నా, సరిగా శుభ్రం చేయకపోయినా ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు రావొచ్చు. కాబట్టి కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మంచిది.




- కట్టుడుపళ్లను రోజూ శుభ్రం చేసుకోవాలి. వీటిని శుభ్రం చేసేటప్పుడు జాగ్రత్తగా పట్టుకోవాలి. నీళ్ల గిన్నెలో పెట్టి శుభ్రం చేసుకుంటే విరిగిపోకుండా చూసుకోవచ్చు. రాత్రిపూట కట్టుడుపళ్లను తీసి చల్లటి నీటిలో భద్రపరచాలి.
- దవడకు గట్టిగా పట్టుకోకపోతున్నా, వరుసగా లేకపోయినా సరిచేసుకోవాలి. ఫంగల్ ఇన్‌ఫెక్షన్ వచ్చినపుడు తప్పకుండా స్టెరిలైజ్ చేయాల్సి ఉంటుంది.

ముఖం మీద మచ్చలు.. పోయేదెలా?


సమస్య: నా వయసు 32 సంవత్సరాలు. తరచుగా ముఖం మీద నల్లటి మచ్చలు వస్తున్నాయి. ముక్కు దగ్గర్నుంచి కనుబొమ్మల కిందివరకు ఎక్కువగా కనబడుతున్నాయి. ఏంటీ సమస్య? ఎలాంటి చికిత్స తీసుకోవాలి?

– కీర్తన (ఈమెయిల్ ద్వారా)

సమస్య - సలహా



సలహా: ముఖం మీద మచ్చలు రావటానికి రకరకాల అంశాలు దోహదం చేయొచ్చు. సూర్యరశ్మిలోని అతి నీలలోహిత కాంతి ప్రభావానికి గురైనప్పుడు, ఇతరత్రా ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో చర్మ కణాలు మరింత ఎక్కువగా వర్ణద్రవ్యాన్ని ఉత్పత్తి చేస్తుంటాయి. దీంతో అక్కడ చర్మం రంగుమారి మచ్చలుగా కనబడొచ్చు. కాబట్టి మీరు వీలైనంతవరకు ముఖానికి ఎండ తగలకుండా చూసుకోవటం మంచిది. వీలైతే అంచు వెడల్పుగా ఉండే టోపీలు ధరించొచ్చు. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే అరగంట ముందుగానే సన్ స్క్రీన్ లోషన్ రాసుకుంటే మంచి ఉపశమనం కలుగుతుంది. దీన్ని ప్రతి మూడు గంటలకు ఓసారి తిరిగి రాసుకోవాలి. తాత్కాలికంగా అజిలిక్ యాసిడ్ 10%, కోజిక్ యాసిడ్ 2% పూత మందులను వాడుకోవచ్చు. వీటిని రాత్రిపూట ముఖానికి పెట్టుకొని పడుకోవాలి. అయినా కూడా ఫలితం కనబడకపోతే ఒకసారి చర్మ నిపుణులను సంప్రతించటం మంచిది. విటమిన్ సి కూడా చర్మం కాంతి మెరుగుపడటానికి తోడ్పడుతుంది. కాబట్టి విటమిన్ సి లభించే బత్తాయి, నారింజ వంటి పండ్లు తరచుగా తీసుకోవటం మంచిది. నిమ్మకాయ, ఉసిరికాయలోనూ విటమిన్ సి దండిగా ఉంటుంది. మహిళల్లో నెలసరి సమస్యలు, గర్భనిరోధక మాత్రల మూలంగా కొందరికి ఈస్ట్రోజెన్ హార్మోన్ స్థాయులు మారిపోతుంటాయి. ఇది కూడా ముఖం మీద మచ్చలకు దారితీస్తుండొచ్చు. కాబట్టి అలాంటిదేదైనా గమనిస్తే ఒకసారి గైనకాలజిస్టును సంప్రతించి సలహా తీసుకోవటం మేలు.



– డా॥ పుట్టా శ్రీనివాస్
సీనియర్ డెర్మటాలజిస్ట్


మీ ఆరోగ్య సమస్యలను సందేహాలను పంపాల్సిన చిరునామా
సమస్య – సలహా **సుఖీభవ** ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
email: sukhi@eenadu.in



తొలి స్నానం ఆలస్యం అమృతం!

పిల్లలకు ఆరు నెలలు నిండేంత వరకూ కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలి. ఇది బిడ్డ ఎదుగుదలకు, రోగనిరోధకశక్తి పెంపొందటానికి ఎంతగానో తోడ్పడుతుంది. అయితే బిడ్డ రొమ్ము పట్టటం లేదని కొందరు వాపోతుంటారు. పుట్టిన తర్వాత బిడ్డకు ఆలస్యంగా స్నానం చేయిస్తే ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా చూసుకోవచ్చని క్లీవ్‌లాండ్ క్లినిక్ అధ్యయనం పేర్కొంటోంది. కనీసం 12 గంటల తర్వాత తొలి స్నానం చేయించిన పిల్లలు తల్లిపాలు బాగా తాగుతున్నట్టు, తల్లులు కూడా ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లాక చనుబాలు ఇవ్వటానికే మొగ్గుచూపుతున్నట్టు బయటపడటం గమనార్హం. ఇలాంటి పిల్లల్లో శరీర ఉష్ణోగ్రత కూడా స్థిరంగా ఉండటం విశేషం. సిజేరియన్ కాన్పు అయినవారితో పోలిస్తే సహజకాన్పు అయిన వారిలో దీని ప్రభావం మరింత ఎక్కువగా ఉంటున్నట్టూ తేలింది. దీనికి గల కారణాలేంటన్నది స్పష్టంగా బయటపడలేదు గానీ బిడ్డ తల్లిని, తల్లి బిడ్డను తాకటం.. తల్లి వాసన ఇందుకు దోహదం చేస్తుండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. ఎందుకంటే ఉమ్మనీరు, రొమ్ములు ఒకే వాసన కలిగుంటాయి మరి. ఆలస్యంగా స్నానం చేయించటం ద్వారా బిడ్డ త్వరగా తల్లిని హత్తుకోవటానికి అవకాశం లభిస్తుందని, అలాగే ఉమ్మనీటి వాసనతో కూడిన రొమ్మును పిల్లలు తేలికగా గుర్తించి, పెదాలతో పట్టుకోవటానికి వీలవుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. అంతేకాదు.. వెంటనే స్నానం చేయిస్తే ఒంట్లో ఉష్ణోగ్రత తగ్గిపోయి బిడ్డకు చలివేస్తుంది. దీంతో శిశువులు త్వరగా అలసిపోతారు. ఫలితంగా రొమ్ము పట్టటానికి అంతగా ఇష్టపడరు. అందువల్ల శిశువులకు వీలైనంత ఆలస్యంగా స్నానం చేయించటమే మంచిదని పరిశోధకులు సూచిస్తున్నారు.

ఆకుపచ్చ హుషారు!



రోజూ ఉత్సాహంగా, హుషారుగా ఉండాలని అనుకుంటున్నారా? అయితే ఇంటి పరిసరాల్లో చెట్లు, మొక్కలు, గడ్డి వంటివి పెంచుకొని చూడండి. ఇలాంటి పచ్చదనం కనులకు విందు చేయటమే కాదు.. మనసునూ ఆహ్లాదంతో నింపుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇటీవల ఫిలడెల్ఫియా పరిశోధకులు కొన్ని ఖాళీ ప్రాంతాల్లో చెట్లు, మొక్కలు, గడ్డి పెంచి ఫలితాలను బేరీజు వేశారు. ఆ ఖాళీ ప్రాంతాల చుట్టుపక్కల నివసించేవారిలో మొక్కలు నాటటానికి ముందూ తర్వాతా కుంగుబాటు తీరుతెన్నులను పరిశీలించారు. మొక్కలు పెంచిన తర్వాత కుంగుబాటు లక్షణాలు 41.5% తగ్గటం గమనార్హం. మానసిక ఆరోగ్యం బాగా లేదని చెప్పేవారి సంఖ్య కూడా 62.8% వరకు తగ్గుముఖం పట్టటం విశేషం.

ఈనాడు సినిమా

ఆటాడుకుందాం రా!

గెలుపు.. ఓటమి... - ఆటంటే ఇంతే కదా అనుకొనే వాళ్లు చాలామందే! ఆటంటే అలా ఫలితాలకి పరిమితం చేసేది కాదు. అదొక భావోద్వేగాల సమ్మేళనం. ఆట కోసం చేసే ప్రయాణంలో ఎన్నో మలుపులు, మరెంతో నాటకీయత. సినిమా కథలకి అంతకుమించి కావల్సిందేముంది? అందుకే వీలు కుదిరినప్పుడంతా ఆట నేపథ్యాన్ని ఎంచుకొంటూ ప్రేక్షకులకి వినోదాన్ని పంచుతుంటారు దర్శకనిర్మాతలు. మైదానంలో ఎంత ఉత్కంఠకి, ఉద్వేగానికీ గురవుతూ ఆటని ఆస్వాదిస్తుంటారో.. థియేటర్లలోనూ అదే అనుభవాన్ని పొందుతుంటారు ప్రేక్షకులు. తెలుగులో ఆట నేపథ్యంలో చిత్రాలు అరుదుగానే వస్తుంటాయి కానీ... అవి చాలా వరకు మంచి ఫలితాల్నే సొంతం చేసుకొన్నాయి. తెలుగులో ఈ ఏడాది ఆట నేపథ్యంలో సినిమాలు విరివిగా రాబోతున్నాయి.


వరుణ్ తేజ్


కార్తి


సందీప్ కిషన్

తెలుగులో పూర్తిస్థాయిలో తెరకెక్కిన స్పోర్ట్స్ డ్రామా చిత్రాలు తక్కువే. కానీ అగ్ర కథానాయకుల చిత్రాలకి ఆ నేపథ్యాన్ని బాగానే వాడుకొన్నారు. కమర్షియల్ కథలే అయినా కథానాయకుల్ని ఆటగాళ్లుగా చూపిస్తూ సినిమాలకి స్పోర్ట్స్ డ్రామా టచ్ ఇచ్చారు. 'తమ్ముడు', 'అమ్మ నాన్న ఓ తమిళమ్మాయి' చిత్రాల్లో పవన్‌కల్యాణ్, రవితేజ బాక్సర్లుగా కనిపిస్తారు. 'ఒక్కడు', 'భీమిలి కబడ్డీ జట్టు'లో మహేష్, నాని కబడ్డీ ఆడేశారు. వెంకటేష్ 'వసంతం'లో బ్యాటు పట్టారు. 'సై' సినిమాలో నితిన్ రగ్బీ ఆటగాడిగా మెరిశాడు. ఈ చిత్రాలన్నీ పూర్తిస్థాయి స్పోర్ట్స్ కథలేమీ కావు. కానీ కథానాయకులు ఆటగాళ్లుగా కనిపించడం ప్రేక్షకులకు నచ్చింది. 'గోల్కొండ హైస్కూల్', 'గురు' వంటి చిత్రాలు పూర్తిస్థాయి స్పోర్ట్స్ డ్రామాలుగా ప్రేక్షకుల్ని మెప్పించాయి. అదే బాటలోనే వినోదాన్ని పంచేందుకు పలు చిత్రాలు ముస్తాబవుతున్నాయి. నాని, వరుణ్‌తేజ్, నాగచైతన్య, సందీప్‌కిషన్ తదితర కథానాయకులతో ఆటగాళ్లుగా తెరపై సందడి చేయబోతున్నారు. ఈ జాబితాలో కథానాయిక రష్మిక కూడా ఉంది.

బాక్సర్‌గా...: కొత్త దర్శకుడు కిరణ్ కొర్రపాటితో వరుణ్‌తేజ్ స్పోర్ట్స్ డ్రామా చిత్రం చేయబోతున్నారు. ఇందులో వరుణ్ బాక్సర్‌గా కనిపించబోతున్నారు. ఈ చిత్రం కోసం ఆయన బాక్సింగ్‌లో తర్ఫీదు పొందుతున్నారు. సంతోష్ జాగర్లమూడి దర్శకత్వంలో సందీప్‌కిషన్ ఓ చిత్రం చేయబోతున్నారు. అదీ ఓ ఆట నేపథ్యంలోనే సాగుతుంది. గురుశిష్యుల కథ ఇందులో ఆసక్తికరంగా ఉంటుందని చిత్రబృందం చెబుతోంది. కథానాయకుడు కార్తి 'దేవ్'లో బైక్ రేసర్‌గా కనిపించబోతున్నారు. బైక్ రేసింగ్‌తో ముడిపడిన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. క్రీడలతో ముడిపడిన కథతోనే ఉదయ్ శంకర్, ఐశ్వర్యరాజేష్ జంటగా ఎస్.వి.నిర్మల్ కుమార్ ఓ చిత్రం తెరకెక్కిస్తున్నారు. బ్యాడ్మింటన్ దిగ్గజం పుల్లెల గోపీచంద్ జీవితం ఆధారంగా ఓ చిత్రం తెరకెక్కబోతోంది. బయోపిక్‌గా రూపొందుతున్నా, అందులో స్పోర్ట్స్ డ్రామానే హైలెట్‌గా నిలుస్తుందని తెలుస్తోంది. నవతరం క్రీడా నేపథ్యంతో కూడిన కథలపై మక్కువ ప్రదర్శిస్తోంది. రామ్‌చరణ్, అఖిల్ తదితర కథానాయకులు మంచి కథ వస్తే చేయడానికి రెడీ అంటున్నారు. రామ్‌చరణ్ ఇదివరకు ఓ కథకి పచ్చజెండా ఊపారు. కానీ అది పట్టాలెక్కలేదు.

"చిత్రసీమలో ఒకొక్కసారి ఒక్కో ట్రెండ్ నడుస్తుంటుంది. ప్రస్తుతం స్పోర్ట్స్ డ్రామాల ట్రెండ్ మొదలైనట్లు కనిపిస్తోంది. క్రీడలతో ముడిపడిన కథల్ని తెరకెక్కించడం కష్టంతో కూడుకొన్న వ్యవహారం అంటుంటారు దర్శకనిర్మాతలు. ఆటలోని సాంకేతిక విషయాలపై పక్కాగా అవగాహన ఉండటంతో పాటు... ఆ నేపథ్యాన్ని సహజంగా తెరపైకి తీసుకురావాల్సి ఉంటుంది. సాధారణ సినిమాలతో పోలిస్తే వీటిని తెరకెక్కించడంలో రెండింతల కష్టం ఉంటుందన్నది నిజం. అయినా సరే, ప్రేక్షకులకు కొత్తదనం పంచేందుకు దర్శకులు, కథానాయకులు మైదానంలో చెమటోడ్చడానికి సిద్ధమవుతున్నారు".


నాని


రష్మిక


నాగ చైతన్య

క్రికెటర్లుగా...


నాని ఈ వేసవిలో 'జెర్సీ'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. 36 ఏళ్లొచ్చినా జాతీయ జట్టులో స్థానం కోసం కలలు కనే ఆటగాడిగా నాని కనిపించనున్నాడు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రమది. 'ఆపేసి ఓడిపోయినవాడు ఉన్నాడు కానీ... ప్రయత్నిస్తూ ఓడిపోయినవాడు లేడ'ని ఈ చిత్రంతో చెప్పబోతున్నాడు నాని. నాగచైతన్య 'మజిలీ'లో క్రికెటర్‌గా సందడి చేయబోతున్నాడు. ఇదొక ప్రేమకథతో తెరకెక్కుతున్నా, ఇందులో నాగచైతన్యని క్రికెటర్‌గా చూపిస్తున్నారు దర్శకుడు శివ నిర్వాణ. కథానాయిక రష్మిక మందన్న కూడా సిక్సర్లు, ఫోర్లతో మైదానాన్ని హోరెత్తించబోతోంది. ఆమె 'డియర్ కామ్రేడ్' చిత్రంలో మహిళా క్రికెటర్‌గా దర్శనమివ్వబోతోంది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. ఈ చిత్రం కోసం రష్మిక ప్రత్యేకంగా క్రికెట్‌లో శిక్షణ తీసుకుంది.

కొత్త కబుర్లు


శర్వానంద్

కథ చెప్పేశారట!

'పడి పడి లేచె మనసు' అంటూ ప్రేక్షకుల్ని పలకరించాడు శర్వానంద్. ప్రస్తుతం సుధీర్ వర్మ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో నటిస్తున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతోంది. మరోవైపు కొత్త కథలూ వింటున్నాడు. చందూ మొండేటి ఇటీవలే శర్వాకి ఓ కథ వినిపించినట్లు టాలీవుడ్ టాక్. ఆ కథ శర్వాకి బాగా నచ్చిందని సమాచారం. ప్రస్తుతం చందూ స్క్రిప్టుని పకడ్బందీగా తయారు చేసే పనిలో ఉన్నాడని తెలుస్తోంది. 'కార్తికేయ', 'ప్రేమమ్' చిత్రాలతో విజయాల్ని అందుకున్నారు చందు. 'సవ్యసాచి' నిరాశ పరిచింది. అయితే ఈసారి మరో విభిన్నమైన కథతో శర్వాని మెప్పించార్ట. అతి త్వరలో ఈ కాంబినేషన్ సెట్స్‌పైకి వెళ్లే అవకాశాలున్నాయని ఫిల్మ్‌నగర్ సమాచారం.


నిధి

శంకర్‌కి 'నిధి' దొరికింది

'సవ్యసాచి'తో తెలుగు చిత్రసీమలో అడుగుపెట్టింది నిధి అగర్వాల్. ఇటీవలే 'మిస్టర్ మజ్ను'లో అఖిల్ సరసన నటించింది. ఇప్పుడు మరో అవకాశం దక్కింది. త్వరలోనే రామ్‌తో కలసి జోడీ కట్టబోతోంది. రామ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. పూరి జగన్నాథ్ దర్శకుడు. ఆయనే నిర్మాత. ఈ చిత్రంలో కథానాయికగా నిధి అగర్వాల్‌ని ఎంచుకున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో మరో నాయికకీ చోటుందట. ఆ స్థానం నభా నటేష్‌కి దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. 'నన్ను దోచుకుందువటే', 'అదుగో' చిత్రాల్లో కథానాయికగా నటించింది నభా. త్వరలోనే రెండో కథానాయిక ఎవరన్నది చిత్రబృందం ప్రకటించనుంది. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది.

ఉమంగ్‌లో తారల జోష్


స్టెప్పులేస్తున్న షారుఖ్ ఖాన్, ఆలియా భట్, రణ్‌బీర్ కపూర్


అజయ్ దేవగణ్, అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్


పోలీస్ అధికారులతో రణ్‌వీర్ సందడి

ముంబయి పోలీసుల ధైర్యానికి, శ్రమకు గౌరవ సూచికంగా, వారి సంక్షేమ నిధి కోసం ఏటా 'ఉమంగ్' వేడుక జరుగుతుంది. ఈ ఏడాదీ ఆ వేడుక కన్నుల పండువగా సాగింది. బాలీవుడ్ తారలు దిగొచ్చి ఆటపాటలతో మురిపించారు. అక్షయ్‌కుమార్ పోలీస్ గెటప్‌లో కనిపిస్తే, రణ్‌వీర్ సింగ్ పులి చర్మాన్ని పోలిన దుస్తులతో ఆకట్టుకున్నారు. పోలీసులతో రణ్‌వీర్ చేసిన సందడైతే మామూలుగా లేదు. పోలీసుల్లో కొత్త జోష్ నింపేలా రణ్‌వీర్ వాళ్లతో సరదాగా గడిపారు. షారుఖ్‌ఖాన్, రణ్‌బీర్‌కపూర్, ఆలియాభట్ హుషారైన స్టెప్పులేసి అలరించారు. ఈ వేడుకలో బాలీవుడ్ తారలు అజయ్ దేవగణ్, కత్రినాకైఫ్, మాధురీ దీక్షిత్ తదితరులు సందడి చేశారు.

నా బయోపిక్‌కు మా అబ్బాయే సరిపోతాడు


ఆమీర్ ఖాన్, కిరణ్ రావ్, జునైద్ ఖాన్

"మీ బయోపిక్‌లో ఎవరు నటిస్తే బాగుంటుంది" అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆమీర్‌ఖాన్ స్పందిస్తూ "మా అబ్బాయి జునైద్ ఖాన్ అయితే చక్కగా సరిపోతాడు" అని చెప్పారు. "మీ అబ్బాయిని తెరకు ఎప్పుడు పరిచయం చేస్తారు?" అంటే "నేను, నా భార్య కిరణ్ రావ్ మంచి కథ కోసం చూస్తున్నాం. జునైద్ నటనలో శిక్షణ తీసుకుంటున్నాడు. అలాగని ఒకేసారి సినిమాల్లోకి తీసుకురాను. ముందు స్క్రీన్ టెస్ట్ చేయిస్తాను. అందులో ఓకే అయితేనే సినిమాల్లోకి వస్తాడు. "హీరోగానే నటించాలనుకోవద్దు. కథలో ఓ మంచి పాత్రలో నటిస్తేనే నటనను ఆస్వాదించగలవు" అని జునైద్‌కు చెప్పానన్నారు ఆమీర్.

మద్యం మత్తులో


శివ కంఠంనేని, రావుల వెంకటేశ్వరరావు

శివ కంఠంనేని ప్రధాన పాత్రలో నటిస్తూ రావుల వెంకటేశ్వరరావుతో కలసి నిర్మించిన చిత్రం 'అక్కడొకడుంటాడు'. రామ్ కార్తీక్, శివహరీష్, రసజ్ఞదీపిక, అలేఖ్య, వినోద్‌కుమార్, ఇంద్రజ, అల్లరి రవిబాబు కీలక పాత్రలు పోషించారు. శ్రీపాద విశ్వక్ దర్శకత్వం వహించారు. ఫిబ్రవరి 1న విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శివ మాట్లాడుతూ "ప్రేమజంట కథ ఇది. మిత్రులతో విహారయాత్రకి కారులో బయలుదేరతారు. ఆ కారు ప్రమాదానికి గురవుతుంది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు, విచిత్ర మలుపుల నేపథ్యంలో ఈ చిత్రం సాగుతుంది. నేను ప్రతినాయకుడుగా రెండు ఛాయలున్న పాత్రలో నటించాను. త్వరలో మరో చిత్రం పట్టాలెక్కనుంద"న్నారు. రావుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ "మద్యం మత్తులో వాహనాలు నడిపి ఎందరో యువతీయువకులు చనిపోతున్నారు. ఈ అంశం ప్రధానంగా తీసుకుని సందేశాత్మకంగా ఈ చిత్రాన్ని మలిచామ"న్నారు.

జవాబు దొరకని ప్రశ్నల గురించీ చర్చించుకుంటాం


అనుష్క శర్మ

అనుష్కశర్మ, షారుఖ్‌ఖాన్ మధ్య చక్కటి అనుబంధం ఉంది. షారుఖ్ 'రబ్ నే బనా దీ జోడీ'తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది అనుష్క. ఆ తర్వాత ఈ ఇద్దరూ కలసి 'జబ్ తక్ హై జాన్', 'జబ్ హ్యారీ మెట్ సెజల్', 'జీరో' చిత్రాల్లో నటించారు. వీటిల్లో రెండు చిత్రాలు బాక్సాఫీసు వద్ద బోల్తా కొట్టాయి. అవేవీ ఈ ఇద్దరి మధ్య అనుబంధానికి ఎలాంటి ఇబ్బంది కలిగించలేదు. మేమిద్దరం మాట్లాడుకునే తీరు చూస్తే మా మధ్య ఏళ్ల తరబడి అనుబంధం ఉందేమో అనుకుంటారు అంటోంది అనుష్క. "షారుఖ్..నేను మాట్లాడుకుంటే ఏదో సినిమా గాసిప్పులు మాట్లాడుకుంటాం అనుకుంటారేమో చాలామంది. మా మధ్య చాలా పెద్ద విషయాలే చర్చకు వస్తాయి. మనిషి, మానసిక స్థితి, ప్రవర్తన ఇలాంటి విషయాలెన్నో మాట్లాడుకుంటాం. సైన్స్‌కు సంబంధించిన ఎన్నో విషయాల్ని షారుఖ్ వివరిస్తుంటారు. సృష్టిలో సమాధానం దొరకని ప్రశ్నలు ఎన్నో ఉన్నాయి. వాటి గురించీ చర్చించుకుంటాం. మొత్తానికి చెప్పాలంటే మేము మాట్లాడుకోని విషయం అంటూ ఉండదు"అని చెప్పింది అనుష్క శర్మ.

వసుంధర

అమ్మాయిల అల్మారాల్లో ఎక్కువ భాగం జీన్స్ ప్యాంట్లదే స్థానం. వాటిల్లో స్కిన్నీ, బాయ్‌ఫ్రెండ్, క్రాప్డ్, సిగరెట్... ఇలా పేర్లెన్ని చెప్పినా సరే! దానికో చిరుగు కనిపించాల్సిందే అంటోంది ఈతరం. అదే నండీ! ట్రెండీ లుక్‌ని తెచ్చే రిప్డ్ జీన్స్ గురించే ఈ ప్రస్తావన. ఇప్పుడు స్టార్ సెలబ్రిటీల నుంచి కాలేజీ క్యాంపస్‌ల వరకూ దీని హవానే నడుస్తోంది. ఇంకెందుకాలస్యం. ఈ చిరుగుల జీన్స్ స్టైల్ ఏంటో మీరూ చూసేయండి!

జీన్స్‌ని చించేద్దాం









రిప్డ్ జీన్స్... అదే ట్రెండ్ ఇప్పుడు. స్కిన్‌టైట్, స్ట్రెయిట్ కట్, బ్యాగీ స్టైల్ జీన్స్ ఏదైనా కావొచ్చు. అది రిప్డ్ రకమై ఉండాలి. పది పదిహేనేళ్ల క్రితం ఉన్న ఫ్యాషన్ ఇప్పుడు మళ్లీ కొత్తగా సందడి చేస్తోంది. అందుకే ప్రముఖ బ్రాండ్‌లూ రిప్డ్ బాట పట్టాయి. చిరిగిన ప్యాంట్ అనడం కన్నా... ఓ పద్ధతిలో చించిన ప్యాంట్ అనొచ్చేమో! గమనిస్తే...రెండింటికీ మధ్య స్పష్టమైన తేడా కనిపిస్తుంది.

ఈ రిప్డ్ జీన్స్ ప్రధానంగా స్క్రాప్, ష్రెడ్, హోల్... వంటి మూడురకాల్లో లభిస్తుంది. జీన్స్‌పై అక్కడక్కడా చిన్న చిన్న రంధ్రాల్లా ఉండటమే స్క్రాప్. చిరుగుల జీన్స్ వేసుకోవాలని ఉన్నా... వెనకడుగు వేసేవారికి చక్కని ఎంపిక ఈ రకం. మీ శరీరానికి నప్పే జీన్స్ రకంలో ఈ స్క్రాప్ స్టైల్‌ని ఎంచుకుంటే ఆకట్టుకోవచ్చు. ఇక రెండో రకం ష్రెడ్స్. దీన్ని చూస్తే చిరిగినట్లే కనిపిస్తుంది. కానీ ఆ చిరుగుల్లో తెల్లటి దారం పోగులు ఉంటాయి. అవి చర్మాన్ని కనపడకుండా కప్పేస్తాయి. ఇక మూడో రకం హోల్. స్పష్టంగా శరీరం కనిపించేలా చిరుగు ఉండటమే దీని ప్రత్యేకత. దీనికి మోకాళ్ల దగ్గర ఎక్కువగా చిరుగులు కనిపిస్తాయి. జతగా క్రాప్‌టాప్, టీషర్టుల్లాంటివి వేసుకుంటే ఆ అందమే వేరు అంటారు ఫ్యాషన్ నిపుణులు.



- కాస్త సన్నగా ఉండేవారు, శరీరాకృతి చక్కగా కనిపించాలని కోరుకునేవారు స్కిన్నీ రిప్డ్ జీన్స్‌ని ఎంచుకోవచ్చు. అదే కాస్త లావుగా ఉండి, ప్రయత్నించాలనుకునేవారు చిరుగులు ఉండే హైవెయిస్టెడ్, బాయ్‌ఫ్రెండ్ జీన్స్ వంటివాటిని ప్రయత్నించొచ్చు. వీటిమీదకు ట్యూనిక్ టాప్‌లు బాగుంటాయి. ఈ జీన్స్ రకాల మీదకు జతగా స్నీకర్స్, కాన్వాస్ షూస్ వంటివి సరైన ఎంపికవుతాయి.

కంపెనీ సెక్రటరీ కోర్సు పాతదే అయినా... పురుషాధిక్యత ఎక్కువగా ఉన్న రంగం ఇది. అలాంటి రంగంలోకి అడుగుపెట్టారు కవితా రాణి శాఖమూరి. వందల సంస్థలకు దిశానిర్దేశం చేస్తూ... వాటి అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు.



వ్యాపార మంత్ర

ఇష్టం + కష్టం ఒకటైతే...!

కంపెనీ సెక్రటరీ అంటే చాలామందికి తెలియదు. అదొక ఉద్యోగం అనుకుంటారు. కానీ వివిధ సంస్థల నిర్వహణలో కీలకపాత్ర పోషించాల్సి ఉంటుంది. అంటే సంస్థ ఏర్పాటు నుంచి ఫర్మ్ రిజిస్ట్రేషన్, జీఎస్టీ సర్టిఫికెట్ నమోదు, పాలసీల వివరణ, న్యాయ సలహాలు, సంస్థ నియమ నిబంధనలు తెలియజేయడం, నిర్ణయాలు తీసుకున్నప్పుడు మంచీ చెడు విశ్లేషించి... రికార్డు చేయడం.. ఇలా ఎన్నో ఉంటాయి. ఈ కోర్సును ఎవరైనా చేయొచ్చు. ఈ ఉద్యోగం కూడా మన సమయాలకు అనుకూలంగా మలచుకోవచ్చు.

అందుకే ఈ చదువు: నేను ఈ రంగంలోకి అనుకోకుండానే వచ్చా. మాది గుంటూరు జిల్లా నిడుబ్రోలులోని వ్యవసాయ కుటుంబం. స్కూల్లో ఉన్నప్పుడు టీచర్లందరికీ గ్రీటింగ్ కార్డులు ఇచ్చేదాన్ని. ఒక ఉపాధ్యాయుడు మాత్రం నేనిచ్చిన గ్రీటింగ్ కార్డు తీసుకోలేదు. 'ఇది మీ అమ్మానాన్నల కష్టంతో కొన్నది. నాకు నువ్వు సంపాదించిన డబ్బులతో కొనిస్తే సంతోషం. అలా తెచ్చిన రోజే తీసుకుంటా' అని అన్నారు. దాంతో నాకు చదువయ్యాక ఎలాగైనా మంచి ఉద్యోగం చేయాలని మనసులో పడింది. అలా పదో తరగతి అయ్యాక సీఏ చేయాలని సీఈసీ తీసుకున్నా. బీకాం పూర్తి చేశా. నాకు తెలిసిన వాళ్లు కంపెనీ సెక్రటరీ కోర్సు ఆడపిల్లలు చేయొచ్చని సూచించారు. అలా నేను చెన్నైలో ఆ కోర్సు కోసం నమోదు చేసుకున్నా. అది చదువుకుంటూనే ఎల్ఎల్‌బీ లోనూ చేరా. చివరి ఏడాదిలో ఉన్నప్పుడు నా పెళ్లైంది. మావారిది గుంటూరు. అప్పటికే కంపెనీ సెక్రటరీ కోర్సు పూర్తైంది కానీ.. అప్పటికి ఇంకా కోర్సు పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఆ తరువాత పాప పుట్టింది. దాంతో కొంత కాలం ఇంట్లోనే ఉన్నా. మా వారు మాత్రం 'నువ్వు ఆపిన చదువు పూర్తి చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది' అని నన్ను హైదరాబాద్ తీసుకొచ్చి కోచింగ్‌లో చేర్పించారు. మా పాపని అత్తగారు చూసుకునేవారు. అలా మిగిలిపోయిన రెండు సబ్జెక్టులను రెండు నెలల్లో పూర్తి చేశా. మంచి మార్కులతో పాసయ్యా. దాంతో నాకు క్యాంపస్ సెలక్షన్స్‌లో రెండు ఉద్యోగాలు వచ్చాయి. ఏడాదిపాటు ఓ అసోసియేట్ దగ్గర ఉద్యోగం చేశా. అయితే కొందరు 'నువ్వే సొంతంగా సంస్థను స్థాపించి... కంపెనీ సెక్రటరీగా సేవలు అందించొచ్చు కదా అని' అన్నారు. అలా నేను పద్నాలుగేళ్ల క్రితం 'కవితారాణి అసోసియేట్స్' పేరుతో సంస్థను స్థాపించా.

వందలాది సంస్థలు: ఇప్పటి వరకూ ఆరొందల యాభై సంస్థలకు పని చేశా. ప్రస్తుతం వంద సంస్థలు శాశ్వత క్లయింట్లుగా ఉన్నాయి. వాటిలో జెన్‌సెక్యూరిటీస్, రామ్‌డిజీమీడియా ప్రయివేట్ లిమిటెడ్, లిఖితా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్.. వంటివీ ఉన్నాయి. మన దేశంలో ప్రతిష్ఠాత్మకమైన 'ద ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా'లో సభ్యురాలిని కూడా. దీనికి సంబంధించి దేశవ్యాప్తంగా చాలా చాప్టర్లు ఉన్నా హైదరాబాద్ చాప్టర్‌కు ఏ ప్లస్ గ్రేడ్ ఉంది. అలాంటి చాప్టర్‌కు నేను గతేడాది ఛైర్‌పర్సన్‌గా పని చేశా. అందులో భాగంగా పలు కార్యక్రమాలు చేశా. కొత్త ప్రతిపాదనలూ తీసుకొచ్చా.

మేం డైరెక్టర్లకీ రకరకాల అంశాలకు సంబంధించి శిక్షణ ఇస్తాం. మామూలు ఉద్యోగులుగా మొదలై కొందరు, కుటుంబ వారసత్వంగా మరికొందరు డైరెక్టర్ల స్థానంలోకి వస్తారు. అలాంటి వారికి సంస్థ నిబంధనలు, మేనేజ్‌మెంట్ మీద అవగాహన చాలా వరకు ఉండదు. మేం ఆ అవగాహన కల్పిస్తాం. వారు తీసుకున్న నిర్ణయాలు సరైనవో కావో చూసి, పక్కాగా రికార్డు చేయడం కూడా మా పనే. బోర్డు మీటింగులకు హాజరవ్వాలి. ఎంత సేపు జరిగింది... ఏం మాట్లాడుకున్నారు వంటివి రికార్డు చేసి వారికి ఆడిట్ ఫైల్ ఇవ్వాల్సి ఉంటుంది. కొన్నిసార్లు డైరెక్టర్లు తీసుకున్న నిర్ణయాలు సరైనవి కాకపోతే వారికి చెప్పడం కూడా చాలా కష్టమవుతుంది. ఆ విషయాన్ని నొప్పించకుండా వారికి చెప్పి... మెప్పించాలి. అలానే సంస్థల రికార్డులను తయారు చేసి మేం ఫైలింగ్ చేస్తాం. వాటిని ఆర్ఓసీ ఫైల్స్(రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్) అంటారు. వీటిని మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్... వాళ్లకి ఆయా సంస్థలు ఇవ్వాల్సి ఉంటుంది. సంస్థల తరఫున ఆ బాధ్యతల్నీ మేం తీసుకుని పని పూర్తి చేసి ఇస్తాం.

డబ్బు మామగారిది... హక్కు ఉండదా?

? మా అత్తమామలకి ముగ్గురు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. మా అత్త చనిపోవడానికి ముందే ఆమె పేరు మీద ఉన్న ఇంటిని మా రెండో బావకి, మా వారికి రాసిచ్చారు. మా మామగారు ప్రభుత్వోద్యోగిగా పదవీవిరమణ చేశారు. ఆయనకు పింఛను వస్తుంది. ప్రస్తుతం ఆయన బాధ్యత మేం చూసుకుంటున్నాం. అందుకోసం ప్రతినెలా కొంత మొత్తాన్ని ఆయన మాకు ఇస్తున్నారు. మరికొంత డబ్బుని తన వైద్య ఖర్చుల కోసం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకున్నారు. మిగిలిన మొత్తాన్ని తనకు నచ్చినట్లుగా ఖర్చుపెట్టుకుంటున్నారు. మామయ్య తదనంతరం ఆ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అందరికీ హక్కు ఉంటుందా? లేక నామినీకి మాత్రమేనా? ఆడపిల్లలు, పెద్దబావ వాటాకి వస్తే వారికీ ఆ ఆస్తిలో భాగం పంచుకునే అవకాశం ఉంటుందా?

- ఓ సోదరి

✔ మీ మామగారి సంపాదన పూర్తిగా ఆయనకే సొంతం. ఆయన తన జీవిత కాలం కష్టపడి సంపాదించిన మొత్తాన్ని తన చరమాంకం కోసం దాచుకున్నారు. ఆ డబ్బును మీరు ఆశించడం తప్పు. ఆయనకు తన పింఛనును నచ్చినట్లు ఖర్చుపెట్టుకునే హక్కు ఉంది. అలానే తాను సొంతంగా సంపాదించుకున్న ఆస్తిపై సర్వహక్కులూ ఉంటాయి. ఒకవేళ ఆయన ఎటువంటి విల్లు రాయకుండా చనిపోతే అప్పుడు ఆ ఆస్తి పిల్లలందరికీ సమానంగా వస్తుంది. కోడళ్లకి రాదు. భర్త చనిపోయిన కోడలికి మాత్రం ఆమె భర్తకి సంబంధించిన భాగం లభిస్తుంది. ఇక, ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో నామినీ పేరు ఉన్నా సంపూర్ణ హక్కు రాదు. నామినీలను కూడా కోర్టు నుంచి లీగల్ హెయిర్ డిక్లరేషన్ లేదా వారసులమని నిరూపించుకునేందుకు సర్టిఫికెట్ తీసుకురమ్మని బ్యాంక్‌లు అడుగుతాయి. ఒకవేళ ఆ ఆస్తి నామినీకి చెందాలంటే... మీ మామగారు "నేను చనిపోయాక నా ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు అన్నీ నా నామినీకి చెందాలి' అని ఏదైనా పత్రం బ్యాంక్‌కి రాసిచ్చి ఉండాలి. దాన్ని చూపించి కోర్టుద్వారా ఆర్డర్ పొందితే ఆ ఆస్తి నామినీకి లభిస్తుంది. మీ మామగారు జీవించి ఉన్నప్పుడు ఇచ్చిన మొత్తానికి చనిపోయిన తరువాత ఎవరికీ లెక్క చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే అది ఆయన ఇష్టపూర్వకంగా ఇచ్చారు కాబట్టి. మీ అత్త మీ వారి పేరుమీద రాసిచ్చిన ఇంటి కాగితాలు చూపించి ఆయన పేరుతో ఆర్వోఆర్‌లో మ్యుటేషన్ చేయించుకోండి. లేదంటే మళ్లీ భవిష్యత్తులో సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. మీ అత్తమామల పేరుమీద జాయింట్ ఆస్తులు ఏమైనా ఉంటే ఆయన బతికి ఉండగా మీకు ఎటువంటి హక్కు ఉండదు. మీ అత్తకి ఆ ఆస్తి ఎక్కడి నుంచి వచ్చిందనే దాని మీద మీ హక్కులు ఆధారపడి ఉంటాయి. ఆస్తులు కన్నా అనుబంధాలు ముఖ్యం. కాబట్టి మీ మామగారిని ప్రేమగా, గౌరవంగా, సంతోషంగా ఉండేలా చూసుకోండి.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

– మీ సందేహాలను, సమస్యల్ని vasulegal@eenadu.net కు పంపించగలరు.

బీరు వద్దు... నీరిప్పించండి!

గ్రామీణ ప్రాంతాల నుంచి మహిళాలోకం కదిలింది. ఓ వైపు ప్రజల్లో చైతన్యాన్ని నింపుతూ, మరో వైపు 'బీరు వద్దు... నీరు కావాలి' అనే నినాదంతో ప్రభుత్వానికి తమ డిమాండ్లను సమర్పించడానికి మహిళలందరూ నడుము బిగించారు. ఇదంతా జరిగింది కర్ణాటకలో. ఈనెల 19న చిత్రదుర్గ ప్రాంతం నుంచి ఈ మార్చ్ ప్రారంభమైంది. దాదాపు 2,500 మంది మహిళలు ఈ యాత్రలో పాల్గొన్నారు. రోజుకి 20 కిలోమీటర్ల చొప్పున నడుస్తూ, మార్గంమధ్యలో 23 జిల్లాల్లోని గ్రామీణ మహిళలకు మంచినీటి అవసరంపై



అవగాహన కలిగిస్తూ ముందుకు సాగుతున్నారు. అలాగే కర్ణాటక రాష్ట్రంలో మద్య నిషేధాన్ని తీసుకురావడానికి ఈ యాత్ర ద్వారా తమ వంతుగా సాటి వారిలోనూ చైతన్యం తెస్తున్నారు. మైసూరు, రామనాగర, చామరాజనగర, తుమకూరు, సిద్ధగంగ మఠం తదితర ప్రాంతాలకు చెందిన ఈ మహిళలంతా ఈనెల 30న బెంగళూరులోని విధాన సభకు చేరుకుంటారు. అక్కడే ప్రభుత్వానికి తమ సమస్యల్ని నివేదించనున్నారు. వెళ్లిన ప్రతిచోటా మహిళలకు మద్యం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ దాన్ని ఆపాలంటూ... నినాదాలు చేస్తున్నారు.



బంగారం వెండి



28న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	33,830	------	33,400	33,300
ఆర్నమెంట్	31,580	------	30,900	30,800
వెండి (కిలో)	40,900	------	40,300	40,300

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	33,480	------	33,790	33,670
ఆర్నమెంట్	30,930	------	31,280	31,190
వెండి (కిలో)	40,900	------	40,800	40,700

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	33,640	33,500	-------	-------
ఆర్నమెంట్	31,290	31,210	3,127	3,121 గ్రా
వెండి (కిలో)	40,000	40,000	43.20	43.20 గ్రా

వెజిటబుల్ టిక్కీ

కావల్సినవి: ఉడికించిన బంగాళాదుంపలు - నాలుగు, బ్రెడ్ పొడి - రెండు టేబుల్ స్పూన్లు, మైదా - అరకప్పు, పనీర్ - కప్పు, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ తరుగు - కప్పు చొప్పున, పచ్చిమిర్చి - రెండు, అల్లం తరుగు - చెంచా, వెన్న - రెండు చెంచాలు, కొత్తిమీర - కట్ట, కారం - అరచెంచా, పసుపు - పావు చెంచా, ఉప్పు - తగినంత, నూనె - వేయించేందుకు సరిపడా.

తయారీ: బంగాళాదుంపల్ని ఓ గిన్నెలో తీసుకుని మెత్తగా చేయాలి. అందులో నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసుకుని బాగా కలిపి మూత పెట్టేయాలి. ఐదు నిమిషాలయ్యాక ఈ మిశ్రమాన్ని టిక్కీల ఆకృతిలో వచ్చేలా చేసుకోవాలి. పొయ్యిమీద బాణలి పెట్టి నూనె వేడి చేయాలి. అందులో రెండు చొప్పున టిక్కీలు వేసుకుని ఎర్రగా కాల్చుకుని తీసుకుంటే చాలు. పుదీనా లేదా కొత్తిమీర చట్నీతో కలిపి వడ్డించండి.

అమ్మచేత కమ్మగా



మృతకణాలు పోగొట్టేలా

ఎంత శ్రద్ధ తీసుకున్నా... కొన్నిసార్లు చర్మం నిర్జీవంగా కనిపిస్తుంది. ఇలాంటప్పుడు చర్మాన్ని మెరిపించే స్క్రబ్‌ని ఇంట్లో తయారు చేసి చూడండి.



గులాబీ-తేనె-పంచదార

గుప్పెడు గులాబీ రేకల్ని ముద్దగా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. దాన్ని కప్పు కొబ్బరినూనెలో వేసి మరిగించాలి. అలాగే పావుకప్పు తేనెను గోరువెచ్చగా చేయాలి. ఆపై అరకప్పు పంచదార, ఏదైనా ఎసెన్షియల్ నూనెను కొన్ని చుక్కలు తీసుకోవాలి. ఇప్పుడు అన్నింటినీ కలిపి ఓ గాజు సీసాలో భద్రపరుచుకోవాలి. దాన్ని స్నానం చేసే ముందు ఒంటికి పట్టించాలి. దీనివల్ల మృతకణాలు పోతాయి. చర్మం కాంతిమంతంగా కనిపిస్తుంది.



చూద్దాం-చేద్దాం

చాక్లెట్-చక్కెర-నూనె



ఈ స్క్రబ్‌కి కప్పు పంచదార, పావుకప్పు కోకో పౌడర్, ముప్పావు కప్పు కొబ్బరి నూనె, రెండు చుక్కల లావెండర్ నూనె అవసరం. ముందుగా కొబ్బరి నూనెను వేడి చేసుకోవాలి. దానిలో లావెండర్ నూనె కలుపుకోవాలి. ఆపై పంచదార, కోకోపౌడర్ కూడా వేసుకుని ముద్దలా చేసుకోవాలి. దీన్ని ముఖం, మెడ, చేతులు, కాళ్లకు రాసుకుని ఆరనివ్వాలి. తడి చేతులతో సవ్య, అపసవ్య దిశలో రుద్దితే మృతకణాలు తొలగి చర్మం కాంతులీనుతుంది.

చదువు




పదోతరగతి 10/10

భౌతికశాస్త్రాన్ని బట్టీపట్టి రాయడం కుదరదు. ఆంగ్లాన్ని అర్థం చేసుకోకపోతే పెన్ను కదలదు. అందుకే శాస్త్రమైనా.. భాషైనా .. పూర్తిగా అవగాహన చేసుకోవాలి. ఫిజిక్స్‌లో ముఖ్యమైన భావనలను, ఫార్ములాలను నిత్యజీవితానికి అనువర్తన చేసుకోవాలి. ఆంగ్లంలో నేర్చుకున్న పదాలను, వ్యాకరణాన్ని ఉపయోగిస్తూ భాషానైపుణ్యాన్ని పెంచుకోవాలి. దీని వల్ల లక్షిత విద్యా ప్రమాణాలను అలవోకగా అందుకుంటారు. పదికి పది గ్రేడ్ ఖాయంగా కొట్టేస్తారు.

బట్టీయం వదిలేసి.. అర్థాలను పట్టేసి..!

భౌతిక శాస్త్రం



పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో.. భౌతిక శాస్త్ర ప్రశ్నలు గుర్తుకు పెట్టుకుని, బట్టీ పట్టి రాయడానికి వీలుగా ఉండవు. ఆలోచించి రాసేలా ఉంటాయి. విశ్లేషణాత్మకంగా అన్వయించి రాయాలి. ఆ ప్రశ్నలు నిర్ధారించిన విద్యాప్రమాణాలు, సాధించవలసిన సామర్థ్యాలకు సంబంధించినవై ఉంటాయి. పాఠ్యపుస్తకంలోని అన్ని ప్రశ్నలూ యథాతథంగా ప్రశ్నపత్రంలో రావు. అందువల్ల బట్టీ విధానానికి స్వస్తిచెప్పి విషయాన్ని అవగాహన చేసుకోవాలి. సిలబస్ మొత్తానికి సమాన ప్రాధాన్యం ఉంటుంది. పాఠాన్ని పూర్తిగా చదివి అందులో ముఖ్యమైన భావనలు, పటాలు, ఫార్ములాలు, ప్రయోగాలు, నిత్యజీవిత అనువర్తనాలను అవగాహన చేసుకోవాలి. పాఠ్యపుస్తకంలోని ప్రశ్నలకు సమాధానాలు రాయటం అభ్యసించి, పునశ్చరణ చేయాలి. కృత్యాలు, ప్రయోగాలను వ్యక్తిగతంగా చేసి పరిశీలనలు, ఫలితాలను నమోదు చేయాలి. ప్రతి ప్రయోగ కృత్యానికీ నివేదికలు రూపొందించుకోవాలి. ప్రతి భావననూ విశ్లేషణాత్మకంగా చదవాలి. ప్రత్యేకంగా బొమ్మల ద్వారా వివరించగలగడం, అసంపూర్తి బొమ్మలను పూర్తిచేయడం, సందర్భోచిత పటాలు గీయటం సాధన చేయాలి.

ప్రశ్నల స్వభావం

విషయావగాహన: భౌతికశాస్త్రంలో నేర్చుకున్న భావనలను వివరించడం, ఉదాహరణలివ్వడం, కారణాలు చెప్పడం, పోలికలు, భేదాలు చెప్పటంపై ప్రశ్నలు. **ప్రశ్నించడం– పరికల్పనలు చేయడం:** వివిధ భావనలపై విద్యార్థులు సొంతంగా ప్రశ్నలు అడిగేలా ఫలితాలు గురించి ఊహించే ప్రశ్నలు. **ప్రయోగాలు – క్షేత్ర పరిశీలనలు:** ప్రయోగ విధానం, ఉపయోగించిన పరికరాలు, వచ్చిన ఫలితాలు, ప్రత్యామ్నాయ పరికరాలు ఉపయోగించిన విధానం, చరాలు మార్చినప్పుడు వచ్చే ఫలితాల, అమరికకు పటాలు గీయటం వంటి ప్రశ్నలు. **సమాచార నైపుణ్యాలు:** సమాచారాన్ని విశ్లేషించడం, సేకరించడం, ఉపయోగించిన సాధనాలు, నమూనా పట్టికలు తయారు చేయటం వంటి ప్రశ్నలు. **బొమ్మలు గీయడం:** పరికరాల అమరిక, పనిచేసే విధానం, బొమ్మలు గీయడం, ఫ్లో చార్టులు, గ్రాఫులు గీయడం వంటి ప్రశ్నలు. **ప్రశంస, విలువలు, జీవవైవిధ్యం:** అభినందించే, ప్రశంసించే పద్ధతులు, నిర్వహించే లేదా పాల్గొనే పనులు, నినాదాలు, కరపత్రాలు, వ్యాసాలు రాయడం వంటి ప్రశ్నలు.

ప్రశ్నపత్రంలో పార్ట్-ఎ, బి విభాగాలుంటాయి. ★ పార్ట్-ఎ మూడు విభాగాలు. పార్ట్-ఎకి సమాధాన పత్రంలో, పార్ట్-బికి ప్రశ్నపత్రంలోనే సమాధానాలు రాయాలి. ★ పార్ట్-ఎలోని విభాగం-1లో 7 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. 1 లేదా 2 వాక్యాల్లో సమాధానం రాయాలి.

అనుసరించవలసిన అంశాలు

- సరైన ప్రణాళిక, సంసిద్ధత, పునశ్చరణ మంచి గ్రేడ్ పాయింట్లు సాధించడానికి దోహదం చేస్తాయి..
- ఇంట్లో, పాఠశాలలో పునశ్చరణకు తగిన సమయం కేటాయించాలి.
- ప్రతి పాఠ్యాంశాన్నీ పూర్తిగా అవగాహన చేసుకుని చదవాలి.
- కీ పాయింట్లను తయారుచేసుకోవాలి.
- స్వయంగా ప్రశ్నలు తయారు చేసుకొని వాటికి జవాబులు రాయడం సాధన చేయాలి.

- కంచర్ల గగన్ కుమార్

ఇంగ్లిష్



పదో తరగతి విద్యార్థులు ఇంగ్లిష్‌లో ఎక్కువ మార్కులు పొందాలంటే academic standards , weightage మీద జ్ఞానం పెంచుకోవాలి. బాగా సాధన చేయాలి. మొదటి పేపర్, రెండో పేపర్‌లకు academic standards ఒకటైనప్పటికీ మొదటి పేపర్‌లో పాఠ్యపుస్తకం నుంచీ, రెండో పేపర్‌లో పాఠ్యేతరం నుంచీ ప్రశ్నలుంటాయి. ప్రతి పేపర్‌లో 3 సెక్షన్లుంటాయి. విద్యార్థి చేతిరాత అర్థమయ్యేలా, నీట్‌గా ఉండాలి.

A: Reading comprehension: దీనిలో ఎక్కువ మార్కులు స్కోర్ చేయవచ్చు. జవాబులను తార్కికంగా వివరిస్తూ సరళంగా, నేరుగా రాయాలి. ఈ సెక్షన్లో passageలకు సంబంధించి ప్రశ్నలుంటాయి. passageను copy చేయకుండా అవగాహన చేసుకొని రాయాలి.

Ist Paperలో ఎక్కువ మార్కులు పొందాలంటే పాఠాలను రెండు, మూడుసార్లు అర్థమయ్యేవరకు చదవాలి. passage లో ఒక ప్రశ్న... పైన ఇచ్చిన passage ఏ టెక్స్ట్ సంబంధించినది అని అడుగుతున్నారు. కాబట్టి ప్రతి పాఠం ఏ టెక్స్ట్ అనేది తెలిసివుండాలి. ఒక ప్రశ్న application typeలో అడుగుతున్నారు కాబట్టి ప్రతి unit concept, themeపై అవగాహన ఉండాలి. ప్రతి poemకు సంబంధించి simile, Metaphor, personification and Hyperbole etc పై పరిజ్ఞానం అవసరం. చదివిన పాఠాల passageలు కాబట్టి స్కోర్ చేసుకోవచ్చు.

IIవ పేపర్‌లో పాఠ్యేతర 3 passageలు ఒక్కొక్కటి 5 మార్కులు సంబంధించి ఉంటాయి. (Q.No.1-15). వీటిని బాగా అర్థమయ్యేవరకు 2 లేదా 3 సార్లు చదవాలి. పాఠ్యేతర passage లు ఎక్కువగా సాధన చేయాలి Ist paper లో చెప్పిన సూచనలు పాటించాలి.

B: Vocabulary and Grammar: Ist Paperలో 13-27 ప్రశ్నలు ఈ విభాగంలో ఉంటాయి. పాఠ్యపుస్తకం నుంచి వస్తాయి. ప్రతి పాఠంలో ఏ ఆర్టికల్స్, tense, prepositions, conjunction , degrees of comparison, మిగతా ఏ parts of speech ఉన్నాయో పూర్తి అవగాహన పెంచుకోవాలి. ప్రతి పాఠానికి సంబంధించి Synonyms, వాటి Antonyms తెలుసుకోవాలి. కాబట్టి ప్రతి పాఠ్యాంశం మీద పట్టు ఉండేలా చదవాలి.

IIవ పేపర్‌లో పైన Ist Paperలో చెప్పినవాటి మీద అవగాహనతోపాటు 16, 17, 18 ప్రశ్నలకు సంబంధించి ఎక్కువ శ్రమ చేయాలి. ఈ సెక్షన్లో 16-32 వరకు 10 మార్కుల ప్రశ్నలుంటాయి. 16, 17, 18 ప్రశ్నలు direct and indirect, active voice and passive voice, Question tags మీద ఉంటాయి: వీటి ప్రాథమిక నిబంధనలు తెలుసుకొని ప్రశ్నలు సాధన చేయాలి.

C: Creative writing: Discourses అభ్యాసం చేస్తే కమ్యూనికేషన్ నైపుణ్యాలు వృద్ధి చెందుతాయి. 10 పాయింట్లు సాధించాలంటే వీటిని బాగా సాధన చేయాలి.

Ist paper లో చదివిన పాఠాలకు సంబంధించి discourses ఉంటాయి. Q.no 28, 29 15 మార్కులకు ఈ విభాగంలో ఉన్నాయి. ప్రతి పాఠానికి సంబంధించి ఏ తరహా ప్రశ్నలు discourses మీద ఉంటాయో ఊహించి సాధన చేయాలి. అంటే ప్రతి పాఠంలో maximum discourses practice చేయాలి. అంతేకాకుండా discourses indicators (specific/ language) మీద అవగాహన ఉండాలి. Format ను అనుసరించాలి.

IIవ పేపర్‌లో 33, 34 ప్రశ్నలు పాఠ్యేతర విభాగానికి చెందినవి. Matter ఇస్తారు. కాబట్టి అర్థమయ్యేవరకూ చదివి మొదటి పేపర్‌లో చెప్పిన సూచనలు పాటిస్తూ ఎక్కువ ప్రశ్నలు అభ్యాసం చేయాలి. ముఖ్యంగా format, indicatorsను దృష్టిలో పెట్టుకోవాలి.

- వి. సత్యనారాయణరావు

పదో తరగతి భౌతికశాస్త్రం, ఇంగ్లిష్ పరీక్షల్లో ముఖ్యమైన ప్రశ్నల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

కాళ్లకు రక్షణ కల్పిస్తూనే, హుందాతనాన్ని పెంపొందించేలా తోడ్పడుతున్నాయి పాదరక్షలు. ఆకర్షణీయ డిజైన్లలో పాపాయి నుంచి పెద్దాయన వరకూ అందరినీ ఇవి ఆకట్టుకుంటున్నాయి. పర్వాలేదు అనుకున్నవారికి పై స్థాయిలో, లేనివాళ్లకు అందుబాటు ధరల్లో ఇప్పుడివి అన్నిచోట్లా దొరుకుతున్నాయి. వీటిని సౌకర్యవంతంగా అవసరాలకు తగ్గట్టుగా తయారుచేయడానికి ఎంతోమంది నిపుణులు అవసరం. ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) ఈ రంగంలో జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన సంస్థ. తాజాగా డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఎఫ్‌డీడీఐ ప్రకటన వెలువడింది. ఆ వివరాలు చూద్దాం...

ఉపాధి దారిలో పాదరక్షలు

ఎఫ్‌డీడీఐ కోర్సుల ప్రకటన విడుదల

పాదరక్షల తయారీలో నాణ్యమైన మానవ వనరులను సృష్టించి ఎక్కువమందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ) 1986లో ఏర్పాటయింది. ఈ సంస్థకు హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా 12 కేంద్రాలు ఉన్నాయి. వీటిలో పాదరక్షలకు సంబంధించి బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీలను అందిస్తున్నారు.

కోర్సులో భాగంగా వివిధ పదార్థాలు, ఉత్పత్తులు ఉపయోగించి పాదరక్షలు ఎలా తయారుచేయాలో నేర్పిస్తారు. యంత్రాల సాయంతో వాటిని డిజైన్ చేయిస్తారు. వినియోగదారుల అవసరాలపై అవగాహన కల్పిస్తారు. వీటితోపాటు టైల్ మేనేజ్‌మెంట్, కన్స్యూమర్ బిహేవియర్, రిటైల్ కమ్యూనికేషన్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, రిటైల్ ఆపరేషన్, మార్కెటింగ్, బ్రాండ్ మేనేజ్‌మెంట్, సేల్స్ మేనేజ్‌మెంట్, బేసిక్ కంప్యూటర్ నాలెడ్జ్...మొదలైనవన్నీ నేర్పుతారు.

ఈ సంస్థలో డిజైన్ కోర్సులు చేసినవారికి ఎక్కువగా పాదరక్షల తయారీ కంపెనీల్లో అవకాశాలు లభిస్తాయి. ఇక్కడ ఎంబీఏ కోర్సు చదివినవారికి పాదరక్షలు విక్రయించే సంస్థల్లో ఏరియా మేనేజర్, ఫ్లోర్ మేనేజర్, స్టోర్ మేనేజర్ మొదలైన ఉద్యోగాలుంటాయి. చెప్పుల తయారీ ఉద్యోగాలు, విక్రయించే కొలువులు ఈ రెండూ ఇక్కడి విద్యార్థులకు దక్కుతాయి. అడిడాస్, యాక్షన్, బాటా, ఫ్యూచర్ గ్రూప్, గ్లోబస్, ఖాదిమ్స్, లైఫ్ స్టైల్, ల్యాండ్ మార్క్, మ్యాక్స్, రీబక్, లిబర్టీ, రిలయన్స్ రీటైల్, వెస్ట్‌సైడ్, ఉడ్‌ల్యాండ్. .మొదలైన సంస్థలు క్యాంపస్ నియామకాల ద్వారా ఇక్కడి విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నాయి.

కోర్సులు, అర్హతలు

బ్యాచిలర్ ఆఫ్ డిజైన్: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్‌లో-780, లెదర్ గూడ్స్ అండ్ యాక్సెసరీస్ డిజైన్‌లో-330, రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చెండైజ్‌లో-525, ఫ్యాషన్ డిజైన్‌లో 870 సీట్లు ఉన్నాయి. కోర్సుల వ్యవధి నాలుగేళ్లు. ఇంటర్ విద్యార్హతతో చేరవచ్చు.

మాస్టర్ ఆఫ్ డిజైన్: ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్‌లో 75 సీట్లు ఉన్నాయి. ఫుట్‌వేర్ / లెదర్ గూడ్స్ అండ్ యాక్సెసరీస్ డిజైన్ / ఫ్యాషన్ / ఇంజినీరింగ్ / ఫైన్ ఆర్ట్స్/ ఆర్కిటెక్చర్‌ల్లో బ్యాచిలర్ డిగ్రీ కోర్సులు చదివినవారు అర్హులు.

ఎంబీఏ (రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చెండైజ్): దీనిలో 435 సీట్లు ఉన్నాయి. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత ఉంటే చేరవచ్చు.

మాస్టర్ ఆఫ్ డిజైన్ (క్యాడ్/ క్యామ్): దీనిలో 60 సీట్లున్నాయి .ఫుట్‌వేర్ / లెదర్ గూడ్స్ అండ్ యాక్సెసరీస్ డిజైన్ / ఫ్యాషన్ / ఇంజినీరింగ్ / ఫైన్ ఆర్ట్స్/ ఆర్కిటెక్చర్‌ల్లో బ్యాచిలర్ డిగ్రీ కోర్సులు చదివినవారు అర్హులు.

యూజీ, పీజీల్లో కలుపుకుని అన్ని సంస్థల్లోనూ 3075 సీట్లు ఉన్నాయి. మరో 304 ఎన్‌ఆర్ఐ, స్పాన్సర్డ్ సీట్లు లభిస్తున్నాయి.

క్యాంపస్‌లు: నోయిడా, రోహ్‌తక్, కోల్‌కతా, ఫుర్సత్ గంజ్, చెన్నై, జోధ్‌పూర్, ఛింద్వారా, పట్నా, చండీగఢ్, గుణ, హైదరాబాద్, అంకలేశ్వర్ (గుజరాత్)





హైదరాబాద్ క్యాంపస్

కంప్యూటర్ ఆధారిత పరీక్ష

జాతీయ స్థాయిలో నిర్వహించే కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా ప్రవేశాలుంటాయి. 200 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే వస్తాయి. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, వెర్బల్ ఎబిలిటీ, జనరల్ అవేర్‌నెస్, బిజినెస్ ఆప్టిట్యూడ్ టెస్టు అంశాల్లో ఒక్కో విభాగం నుంచి 50 చొప్పున ప్రశ్నలు వస్తాయి. పీజీ కోర్సులకు క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అండ్ ఎనలిటికల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్, మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్టు ఒక్కో విభాగం నుంచి 50 చొప్పున ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. రుణాత్మక మార్కులు లేవు.

ముఖ్యమైన తేదీలు

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 20

పరీక్ష తేదీ: మే 19

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం. వెబ్‌సైట్: www.fddiindia.com

లైబ్రరీ



జవహర్ నవోదయ

జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షాదర్శిని - టాప్ 10 మోడల్ పేపర్స్, పేజీలు: 134, ధర: రూ. 54 ప్రచురణ: వీజీఎస్ బుక్ లింక్స్


నేటి ప్రతిభ పేజీల్లో

ఏపీపీఎస్సీ, ఎస్ఐ & కానిస్టేబుల్స్ పరీక్షలకు
▮ కరెంట్ అఫైర్స్ ▮ జనరల్ అవేర్‌నెస్
టెన్త్, ఇంటర్ విద్యార్థుల కోసం
▮ జీవశాస్త్రం ▮ గణితశాస్త్రం

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

దిల్లీ సబార్డినేట్ సర్వీసులు



దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు.. వివిధ ప్రభుత్వ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: అసిస్టెంట్ ఇంజినీర్, జూనియర్ ఇంజినీర్ **ఖాళీలు:** 264 **అర్హత:** సంబంధిత బ్రాంచుల్లో ఇంజినీరింగ్ డిగ్రీ/ డిప్లొమా ఉత్తీర్ణత. **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: రూ.100. **ఆన్‌లైన్ దరఖాస్తు:** జనవరి 30 నుంచి మార్చి 1 వరకు.

వెబ్‌సైట్: https://dsssbonline.nic.in/

స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్

భోపాల్‌లోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కింది నాన్-టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



పోస్టులు–ఖాళీలు: డిప్యూటీ లైబ్రేరియన్-01, అసిస్టెంట్ లైబ్రేరియన్-01, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్-01.

అర్హత: సంబంధిత సబ్జెక్టులు/ బ్రాంచీల్లో బీఈ/ బీటెక్, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం. **ఎంపిక:** రాతపరీక్ష/ స్కిల్ టెస్ట్/ ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** ఫిబ్రవరి 15

హార్డు కాపీలను పంపడానికి చివరితేది: ఫిబ్రవరి 28

వెబ్‌సైట్: http://spabhopal.ac.in/

ప్రవేశాలు

ఐఐఎస్‌సీ, బెంగళూరు

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) 2019 సంవత్సరానికిగానూ కింది ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

కోర్సులు: ఎంటెక్, ఎం.డిజైన్, మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్, పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ.

అర్హత: సంబంధిత సబ్జెక్టులు/ బ్రాంచీల్లో బీఈ/ బీటెక్, బీఎస్సీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత. జామ్/ జెస్ట్ 2019, నెట్/ గేట్/ క్యాట్/ జీమ్యాట్/ సీడ్ అర్హత ఉండాలి.

ఎంపిక: జాతీయ స్థాయి పరీక్షల స్కోరు, రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు: ఫిబ్రవరి 1 నుంచి మార్చి 25 వరకు.

వెబ్‌సైట్: https://www.iisc.ac.in/

వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

ఆర్ఐఈ, మైసూరు

మైసూరులోని రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఆర్ఐఈ) కింది కాంట్రాక్టు పోస్టుల భర్తీకి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది. **పోస్టులు–ఖాళీలు:** జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-02, కంప్యూటర్ టైపిస్ట్-01, ల్యాబొరేటరీ అసిస్టెంట్ (ఫిజిక్స్)-01.

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, డిప్లొమా, ఎంఎస్సీ/ ఎంఎడ్ ఉత్తీర్ణత, అనుభవం.. **వాక్‌ఇన్ ఇంటర్వ్యూ తేది:** ఫిబ్రవరి 4 **వేదిక:** రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, మైసూరు.

వెబ్‌సైట్: http://www.riemysore.ac.in/

మరిన్ని నోటిఫికేషన్లు www.eenadupratibha.net లో.

సీట్లు పెంచితే మౌలిక సవాలు

- జాతీయ విద్యాసంస్థల్లో 40% బోధనా సిబ్బంది కొరత
- తగ్గనున్న అధ్యాపకుల, విద్యార్థుల నిష్పత్తి
- 25% సీట్ల పెంపు నేపథ్యంలో అంచనాలు



ఈనాడు – హైదరాబాద్

ఆర్థిక బలహీన వర్గాలకు 10% రిజర్వేషన్ అమలు చేయనున్న నేపథ్యంలో.. 25% సీట్లు పెంచుతున్నందున జాతీయ విద్యాసంస్థలకు మౌలిక వసతుల సమస్య ఎదురు కానుంది. ఇప్పటికే దాదాపు 40% బోధనా సిబ్బంది ఉద్యోగాలు ఖాళీగా ఉన్న నేపథ్యంలో వాటిని భర్తీ చేయకుండా.. సమస్యల పరిష్కారానికి నిధులివ్వకుండా, సీట్లను పెంచితే.. విద్యాప్రమాణాలు పడిపోతాయని ఆచార్యులు ఆందోళన చెందుతున్నారు. అధ్యాపకులు, విద్యార్థుల నిష్పత్తి మరింత తగ్గుతుందని అంటున్నారు. ఇది ప్రపంచస్థాయి ర్యాంకింగ్‌లోనూ తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని చెబుతున్నారు. విద్యార్థులకు వసతి గృహాలు, ప్రయోగశాలల సమస్యా తలెత్తనుంది. సౌకర్యాలు ఎలా ఉన్నా.. అధిక విద్యాసంస్థలు వచ్చే విద్యాసంవత్సరానికి కనీసం 10% సీట్లను పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. వచ్చే రెండేళ్లలో ఇప్పుడున్న సీట్లను 25% పెంచాలని కేంద్రం ఆదేశించింది. ఈక్రమంలో ఐఐటీలు, ఎన్ఐటీలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు సీట్లను పెంచుకునేందుకు ప్రతిపాదనలు తయారు చేసుకుంటున్నాయి. ఎన్ఐటీ వరంగల్ ఇప్పటికే కేంద్ర మానవ వనరుల శాఖకు ప్రతిపాదనలు పంపింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం(హెచ్‌సీయూ) 2019-20 విద్యాసంవత్సరానికి 10% సీట్లను పెంచాలని ఇటీవల జరిగిన అకడమిక్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించింది. దేశవ్యాప్తంగా పలు విద్యాసంస్థలు ఇందుకోసం కసరత్తు చేస్తున్నాయి.

అమలు కాని 'విద్యార్థి–అధ్యాపక' నిష్పత్తి

నిబంధనల ప్రకారం ప్రతి 10 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు (1:10 నిష్పత్తిలో) ఉండాలి. ఇప్పటి వరకు ఏ జాతీయ విద్యాసంస్థలోనూ ఈ నిబంధన అమలు కావడం లేదు. ప్రపంచవ్యాప్తంగా క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్, ది టైమ్స్ వరల్డ్ ర్యాంకింగ్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఆ ర్యాంకింగ్‌లలో దేశంలోని రెండు లేదా మూడు విద్యాసంస్థలు మాత్రమే 200లోపు స్థానాలను దక్కించుకుంటున్నాయి. వీటిలో ఆచార్యులు, విద్యార్థుల నిష్పత్తి, పరిశోధనకు ఎక్కువ వెయిటేజీ ఉంటుంది. ప్రస్తుతం ఈ అంశంలోనే భారతీయ విద్యాసంస్థలు వెనకబడి ఉన్నాయి. దేశంలో 2018 ఏప్రిల్ నాటికి సగటున 40% ఆచార్యుల ఉద్యోగాలు భర్తీ కాకుండా ఉన్నాయని కేంద్ర మానవ వనరుల శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఐఐటీల్లో 36% బోధనా సిబ్బంది కొలువులు ఖాళీగా ఉన్నాయి.

వసతి గృహాలకూ కొరత..

సీట్లు పెంచితే తక్షణం తలెత్తే సమస్య వసతి గృహాల కొరత. ఎన్ఐటీ వరంగల్‌లో ప్రస్తుతం తగినన్ని హాస్టళ్లు ఉన్నాయి. సీట్లు పెంచితే రెండు వసతి గృహాలు అవసరమవుతాయని ఆ సంస్థ సంచాలకుడు ఆచార్య ఎన్‌వీ రమణారావు తెలిపారు. మొత్తం మీద నిధులు రూ.200 కోట్ల వరకు అవసరం అవుతాయని చెప్పారు. 'ఒకేసారి మొత్తం సీట్లను పెంచితే సమస్యలు ఉన్నాయని వచ్చే ఏడాది 10% పెంచాలని నిర్ణయించాం. రసాయనశాస్త్రం, భౌతికశాస్త్రం, బయోకెమిస్ట్రీ లాంటి కొన్ని విభాగాల్లో ప్రయోగశాలల కొరత ఏర్పడుతుంది' అని హెచ్‌సీయూ ఉపకులపతి ఆచార్య పొదిలె అప్పారావు చెప్పారు.

వివిధ విద్యా సంస్థల్లో ఖాళీ కొలువులు	కేంద్రీయ విశ్వవిద్యాలయాలు	ఐఐటీలు	ఎన్ఐటీలు	ట్రిపుల్ ఐటీలు	ఐఐఎంలు	స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా)
	5,606	2,813	1,870	324	258	96

కొన్ని ఐఐటీల్లో ఖాళీల శాతం — ఐఐటీ, ఆచార్యుల ఖాళీల శాతం

భిలాయ్	58	ఢిల్లీ	26
ఖరగ్‌పూర్	46	మద్రాస్	28
కాన్పూర్	36	బొంబాయి	27



ట్రక్కుపైకి ఎక్కి ఆవులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్

ఆవుల రవాణాను అడ్డుకున్న ఎమ్మెల్యే రాజాసింగ్

శామీర్‌పేట, న్యూస్‌టుడే: రాజీవ్ రహదారి మీదుగా వధశాలలకు ఆవులను తరలిస్తున్న వాహనాన్ని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అడ్డుకున్నారు. బీజేవైఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవీందర్‌గౌడ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తుర్కపల్లి నుంచి తూంకుంటకి రాజీవ్ రహదారి మీదుగా ప్రయాణిస్తున్నారు. ఓ ట్రక్కు నుంచి ఆవుల అరుపులు విన్న రవీందర్‌గౌడ్ అనుమానం వచ్చి ఆ వాహనాన్ని నిలిపి పరిశీలించగా అందులో 63 ఆవులు, దూడలు ఉన్నాయి. ట్రక్కు డ్రైవర్ రఫీఖాన్‌ను ప్రశ్నించగా ఒడిశా రాష్ట్రం నుంచి సంగారెడ్డిలోని ఆల్ కబీరా పశువుల వధశాలకు తరలిస్తున్నట్లు అంగీకరించారు. ఈ సమాచారంతో భాజపా, స్థానిక నాయకులు, యువకులు వచ్చి నిరసన వ్యక్తం చేశారు. రవీందర్‌గౌడ్ ఫిర్యాదుతో శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విశ్వవిద్యాలయాల ఆచార్యులకు భత్యాలు పెంపు

ఈనాడు, దిల్లీ: కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లోని ఆచార్యులకు భత్యాలు, ప్రత్యేక భత్యాలను సవరిస్తూ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ సోమవారం ఆదేశాలిచ్చింది. ఇవి వెంటనే అమల్లోకి వస్తాయి. ఆచార్యుల నుంచి ఉప కులపతుల వరకు అందరూ ఎన్నో ఏళ్ల నుంచి వీటికోసం ఎదురు చూస్తున్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం, కళాశాలల్లోని బోధన సిబ్బంది, తత్సమాన హోదాలో ఉన్నవారు, రిజిస్ట్రార్లు, ఫైనాన్స్ అధికారులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌లకు ఊరటనిచ్చే అంశమిది.

కృష్ణారావుకు కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద అవార్డు



ఈనాడు, దిల్లీ: సీనియర్ పాత్రికేయుడు, ఆంధ్రజ్యోతి అసోసియేట్ ఎడిటర్, కవి అప్పరసు కృష్ణారావు ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద అవార్డుకు ఎంపికయ్యారు. జమ్ము కశ్మీర్‌కు చెందిన ప్రముఖ డోగ్రీ కవయిత్రి పద్మశ్రీ పద్మా సచ్‌దేవ్ రాసిన కవితలను "గుప్పెడు సూర్యుడు.. మరికొన్ని కవితలు" పేరిట తెలుగులోకి అనువదించినందుకు గానూ ఆయన ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. దేశ విభజన సమయంలో తండ్రిని పోగొట్టుకున్న కవయిత్రితాను ఎదుర్కొన్న మానసిక వేదన, భారతీయ స్త్రీ ఎదుర్కొనే సామాజిక ఇబ్బందులు, సుఖదుఃఖాలను తన కవితల్లో చిత్రీకరించగా.. కృష్ణారావు వాటిని తెలుగులోకి అద్భుతంగా అనువదించారని ప్రశంసాపత్రంలో కొనియాడారు. డోగ్రీ భాషలోని ఈ కవితలను కేంద్ర మాజీ మంత్రి కరణ్‌సింగ్ ఇంగ్లిషులోకి తర్జుమా చేయగా..కృష్ణారావు తెలుగులోకి అనువదించారు. ఈయనకు పురస్కారం కింద రూ.50 వేల నగదు, ప్రశంసపత్రం అందజేయనున్నారు. కృష్ణారావు 1962వ సంవత్సరంలో మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం వింజమూరు గ్రామంలో జన్మించారు. ఈయనకు పురస్కారం దక్కడంపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబునాయుడులు హర్షం వ్యక్తం చేశారు.

లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం

- తెలంగాణలో అన్ని వసతులూ కల్పిస్తాం
- కేంద్ర ఎన్నికల సంఘం దూరదృశ్య సమీక్షలో సీఎస్



కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించిన దూరదృశ్య సమీక్షలో పాల్గొన్న డీజీపీ మహేందర్‌రెడ్డి, సీఎస్ ఎస్‌కే జోషి, సీఈవో రజత్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా జరుపుతామని.. పోలింగ్‌స్టేషన్లలో అన్ని వసతులూ కల్పిస్తామన్నారు. పార్లమెంటు ఎన్నికల ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సునీల్ అరోడా సోమవారం దిల్లీ నుంచి నిర్వహించిన దూరదృశ్య సమీక్షలో సీఎస్ సచివాలయం నుంచి పాల్గొన్నారు. డీజీపీ మహేందర్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ఎన్నికలపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తరపున ముందస్తు ఏర్పాట్లు చేశామన్నారు. దివ్యాంగులకు పోలింగ్ స్టేషన్ల వద్ద సౌకర్యాల కల్పనలో తెలంగాణ ప్రభుత్వం 'ప్రథమ' పురస్కారం పొందిందని అరోడాకు వివరించారు. రాష్ట్రానికి సంబంధించి వచ్చే నెల 22న ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని చెప్పారు. డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. "శాసనసభ ఎన్నికల్లో చక్కగా బందోబస్తు నిర్వహించాం. పార్లమెంటు ఎన్నికలనూ అలాగే జరిపేందుకు సిద్ధంగా ఉన్నాం. శాసనసభ ఎన్నికలకు పొరుగు రాష్ట్రాల నుంచి 19 వేల మంది, కేంద్రం నుండి 276 కంపెనీల పోలీసు సిబ్బందిని కేటాయించారు. అదే స్థాయిలో పార్లమెంటు ఎన్నికలకూ పంపించాలి. ధన, మద్యం ప్రభావాన్ని నిరోధిస్తాం" అని పేర్కొన్నారు.

ఎన్నికల వ్యయం రూ.350 కోట్లు: రజత్‌కుమార్

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్ మాట్లాడుతూ.. "ఎన్నికల ఖర్చు రూ.350 కోట్లు. దీన్ని కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. 2.5 లక్షల మంది సిబ్బంది విధుల్లో ఉంటారు. వారికి టీఏ, డీఏలు ఇవ్వాల్సి ఉంటుంది. టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్ 1950ను అన్ని జిల్లాల్లో ప్రారంభించాం. సిబ్బందికి శిక్షణ పూర్తయింది. ఓటర్ల నమోదుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టగా.. 16 లక్షల అర్జీలు వచ్చాయి" అని చెప్పారు.

మాకు పోస్టింగులు ఇవ్వరూ!

సీఎస్‌కు న్యాయశాఖ ఉద్యోగుల వినతి

ఈనాడు, హైదరాబాద్: తమకు పోస్టింగులు ఇవ్వాలని 75 మంది న్యాయశాఖ ఉద్యోగులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషిని కోరారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిపాలన ట్రైబ్యునల్లో వీరు ఉద్యోగాలు చేశారు. ఉమ్మడి ట్రైబ్యునల్ విభజనతో తెలంగాణ ట్రైబ్యునల్‌కు వచ్చారు. అది ఏర్పాటుకాకపోవడంతో తెలంగాణ ప్రభుత్వం వారిని ఉమ్మడి హైకోర్టుకు పంపింది. అక్కడ కొన్ని నెలలు పనిచేశారు. తాజాగా ఉమ్మడి హైకోర్టు విభజన జరగడంతో వీరి పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

'అంబేడ్కర్' దరఖాస్తు గడువు మార్చి 28

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో నేరుగా డిగ్రీ చదవాలనుకొనే వారి కోసం 'అర్హత పరీక్ష-2019' నోటిఫికేషన్ విడుదలైంది. అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 28 చివరి తేదీగా నిర్ణయించినట్లు సోమవారం వర్సిటీ వర్గాలు తెలిపాయి. ఇంటర్మీడియట్ లేదా సమాన అర్హత గల అభ్యర్థులు 2019-20 సంవత్సరానికి బీఏ/బీకాం/బీఎస్సీ మూడేళ్ల డిగ్రీ ప్రోగ్రాంలో మొదటి సంవత్సరం ప్రవేశాలు పొందడానికి ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. ఇతర వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్ పోర్టల్ www.braouonline.in ద్వారా విద్యార్థులు స్టడీ/పరీక్షా కేంద్రాన్ని ఎంచుకోవాలి.

700 ఎకరాల్లో పంట నష్టం

- తడిసిన కల్లాల్లో ఆరబోసిన మిరప
- అకాల వర్షాలతో నష్టపోయిన రైతులు



నల్గొండ జిల్లా పీఏపల్లి మండలం దుగ్యాలలో తడిసిన మిరపను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు, రైతులు

ఈనాడు, హైదరాబాద్ : అకాల వర్షాలు రైతులను నష్టపరిచాయి. రాష్ట్రవ్యాప్తంగా 700 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా. ఎక్కువగా మొక్కజొన్న 500, వరి 120, మిగతా పంటలు 80 ఎకరాల్లో వర్షాలకు పాడైనట్లు జిల్లా వ్యవసాయాధికారు(డీఏఓ)లు ప్రభుత్వానికి నివేదించారని వ్యవసాయ, ఉద్యానశాఖల ముఖ్య కార్యదర్శి పార్థసారథి పేర్కొన్నారు. పెద్దపల్లి, కరీంనగర్, సిద్దిపేట తదితర జిల్లాల్లో పంటలకు నష్టం ఎక్కువగా ఉంది. కల్లాల్లో రైతులు ఆరబోసిన మిరపకాయలు, మొక్కజొన్నలు కొన్నిచోట్ల వర్షాలకు తడిసిపోయాయి. పండు మిరపకాయలు నీటిలో మునగడంతో నాణ్యత తగ్గి నష్టపోయామని రైతులు వాపోయారు. కల్లాల్లో ఆరబోసిన పంటలు నీటిలో నాని పాడైనా వాటిని నష్టాల కింద వ్యవసాయశాఖ పరిశీలనలోకి తీసుకోదు. వ్యవసాయ మార్కెట్లలో పంటలు నీటిలో తడిసిపోయి ఎక్కడా రైతులు నష్టపోలేదని మార్కెటింగ్ సంచాలకురాలు లక్ష్మీభాయి 'ఈనాడు'కు చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మార్కెట్‌లో కందులు తడిచాయని, కానీ వాటిని రైతుల నుంచి వ్యాపారులు కొనేసి తరలించడానికి పక్కన పెట్టినందున అన్నదాతలకు నష్టం ఏమీ లేదని ఆమె వివరించారు. మార్కెట్లలో పంటలు ఆరబోయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని జిల్లాల అధికారులను ఆదేశించారు.

తడిసిన పంటలకు మద్దతు ధర ఇవ్వాలి : రావుల

అకాల వర్షాలకు తడిసిన పంటలకు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వం కొనాలని తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కల్లాల్లో ఆరబోసిన మిరపకాయలు తడిసిపోయాయని, వాటిని అధికార యంత్రాంగం పరిశీలించి పరిహారం ఇవ్వాలన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి: తమ్మినేని

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో తెలిపారు. తడిసిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర చెల్లించాలని పేర్కొన్నారు.

మేం జోక్యం చేసుకోం

శశిధర్‌రెడ్డి పిటిషన్‌పై సుప్రీంకోర్టు

ఈనాడు, దిల్లీ: ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలుచేస్తూ తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత మర్రి శశిధర్‌రెడ్డి దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. నియోజకవర్గాల పునర్విభజన జరగకుండా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం తగదని, రాజ్యాంగ సవరణ కాకుండా ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు బదలాయించడం సరికాదని ఆయన గత ఆగస్టులో కోర్టును ఆశ్రయించారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల అనంతరం తీర్పు వచ్చింది. శశిధర్‌రెడ్డి పిటిషన్‌ను ఉమ్మడి హైకోర్టు తిరస్కరించింది. సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, జస్టిస్ సంజీవ్‌ఖన్నాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది జంధ్యాల రవిశంకర్ వాదన విని పిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 170, నియోజకవర్గాల పునర్విభజన చట్టంలోని సెక్షన్ 11, ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 9లను సవరించాల్సి ఉన్నా- అవేమీ లేకుండానే తెలంగాణలో ఎన్నికల నోటిఫికేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిందన్నారు. "పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు విన్నాం. పిటిషన్ విచారించదగినదా కాదా అని పరిశీలించాం. ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై జోక్యం చేసుకోం. పిటిషన్ కొట్టివేస్తున్నాం" అని ధర్మాసనం పేర్కొంది. అనంతరం శశిధర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో సుప్రీంకోర్టు తమ పిటిషన్‌పై విచారణకు అంగీకరించలేదన్నారు. సాంకేతిక ఆధారాలు తమ వద్ద ఉన్నాయంటూ, భవిష్యత్తులో న్యాయం జరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

హీరాగోల్డ్ 'కొత్త ఆస్తులు' రూ.500 కోట్లపైనే

- సీసీఎస్ జప్తు ప్రయత్నాలు
- హైదరాబాద్‌కు నౌహీరా షేక్

ఈనాడు, హైదరాబాద్: హీరాగోల్డ్ కంపెనీల పేరుతో ఆ కంపెనీ అధినేత్రి నౌహీరాషేక్ కొనుగోలు చేసిన మరిన్ని స్థిరాస్తులను హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ పోలీసులు కొత్తగా గుర్తించారు. హైదరాబాద్, పుణె, ముంబయి, చేవెళ్ల ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలు, ఫ్లాట్లు, వంద ఎకరాల భూమి ఇందులో ఉన్నాయని తెలుసుకున్నారు. ఆయా జిల్లాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా ఆస్తుల వివరాల నకలు పత్రాలను పొందారు. ఈ ఆస్తులను 2013-2017 మధ్య నౌహీరా షేక్ కొనుగోలు చేసిందని పోలీస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వీటి మార్కెట్ విలువ రూ.500 కోట్లకు పైగా ఉంటుందన్నారు. తెలంగాణ మదుపుదారుల పరిరక్షణ చట్టం ప్రకారం వీటిని జప్తు చేయాలంటూ న్యాయస్థానాన్ని అభ్యర్థించామని వివరించారు. దీంతోపాటు నౌహీరా స్థిరాస్తుల కోసం కోల్‌కతా, దిల్లీ, చెన్నై, రిజిస్ట్రార్ కార్యాలయాలకూ లేఖలు రాశామని తెలిపారు. చిత్తూరు కేంద్ర కారాగారంలో ఉన్న నౌహీరాషేక్‌ను కూకట్‌పల్లి పోలీసులు కోర్టు అనుమతితో తమ అధీనంలోకి తీసుకున్నారు. ప్రత్యేక భద్రత మధ్య ఆమెను హైదరాబాద్‌కు తరలించారు. మంగళవారం నుంచి విచారించనున్నారు.

లెక్క తేలుతోంది..

సులభ వాయిదాల్లో బంగారం, వజ్రాభరణాలు సొంతం చేసుకోవచ్చంటూ వచ్చిన హీరాగోల్డ్ ప్రకటనలకు ఆకర్షితులై గొలుసుకట్టు పథకంలో చేరి, పెట్టుబడులు పెట్టిన మదుపరుల వివరాలను సెంట్రల్ క్రైమ్ పోలీస్ అధికారులు సేకరిస్తున్నారు. 1.74 లక్షల మంది మదుపరులున్నట్లు గుర్తించారు. ఇందులో కొందరు మదుపరుల వివరాలు అనుమానస్పదంగా ఉన్నాయి. మదుపరుల్లో 90% మంది కనిష్ఠంగా రూ.3 లక్షలు గరిష్ఠంగా రూ.75 లక్షల వరకూ మదుపు చేశారని పోలీస్ అధికారులు అంచనా వేశారు. ఇలా హీరాగోల్డ్ సంస్థల పేరుతో నౌహీరా షేక్ రూ.6 వేల కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించిందని గుర్తించారు.

బోగస్ అధ్యాపకుల గుర్తింపు ఇక పక్కా

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర వృత్తి విద్యా కళాశాలల్లో బోగస్ అధ్యాపకులు ఉంటే ఇక సులభంగా.. త్వరగా గుర్తించేలా కొత్త విధానాన్ని తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్‌ఆర్‌సీ) అమలు చేయనుంది. వచ్చే మూడేళ్ల కోసం కొత్తగా రుసుములను సమీక్షించేందుకు ఆయా కళాశాలలను ఆదాయ, వివరాలను సమర్పించాలని కమిటీ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసింది. ఈసారి జాతీయ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్‌తో ఒప్పందం కుదుర్చుకున్న కమిటీ ఆయా వివరాల సమర్పణకు ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చింది. కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల పాన్, ఆధార్ కార్డులను తనిఖీ చేస్తారు. వారి వేతనాలు బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నారా? అధ్యాపకుడి పేరిటే ఆ కార్డు ఉందా? తదితర వివరాలను గతంలో సిబ్బందిని నియమించి తనిఖీ చేయించేవారు. ఆ హడావిడిలో బోగస్ అధ్యాపకులున్నా గుర్తించడం కష్టమయ్యేది. ఈసారి సాఫ్ట్‌వేర్ ద్వారా వేగంగా.. సులభంగా తనిఖీ చేయవచ్చని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వర్గాలు తెలిపాయి. జేఎన్‌టీయూహెచ్ మార్చి నుంచి తనిఖీలు చేస్తుంది. ఒక్కరే రెండుచోట్ల పనిచేస్తున్న సందర్భాలేవైనా ఉంటే గుర్తిస్తారు. ఆ వర్సిటీ నుంచి కూడా వివరాలు తీసుకొని బోగస్ అధ్యాపకుల వేతనాలను ఖర్చుల నుంచి తొలగించి, రుసుములను నిర్ధరించనున్నారు.

పెరగనున్న చలి

ఈనాడు, హైదరాబాద్ : తూర్పు, ఈశాన్య భారతం నుంచి చలిగాలులు వీస్తున్నందున రాష్ట్రంలో మళ్లీ చలి పెరుగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. అకాల వర్షాలు మంగళవారం నుంచి తగ్గనున్నాయని చెప్పారు. మంగళ, బుధవారాల్లో తెలంగాణలో పొడివాతావరణం ఉంటుందన్నారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా కొణిజర్లలో 8, చంద్రుగొండలో 6, ఆలంపూర్, డోర్నకల్, దేవరకొండ, సూర్యాపేట, తల్లాడ, నల్గొండల్లో 5, కూసుమంచి, మధిర, మహబూబాబాద్, హుజూర్‌నగర్, గార్ల, బయ్యారం, నిడమనూరు, చండూరు, ఖమ్మంలో 4 సెంటీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు పలు ప్రాంతాల్లో ఓ మాదిరి వర్షాలు కురిశాయి. పగటి ఉష్ణోగ్రతలు తగ్గాయి. హైదరాబాద్‌లో ఆదివారం పగటిపూట 21, రాత్రి 17 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పగటి సమయంలోనూ చలిగాలులతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బంగాళాఖాతం ఆగ్నేయ ప్రాంతంలో అల్పపీడన ద్రోణి ఉంది. దీని ప్రభావం తెలంగాణపై ఏమీ ఉండదని రాజారావు చెప్పారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు శాస్త్రీయత లేదు

సుప్రీంకోర్టులో ఆర్.కృష్ణయ్య వ్యాజ్యం

ఈనాడు, దిల్లీ: ఆర్థికంగా వెనకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్)కు 10% రిజర్వేషన్లు కల్పించడంలో శాస్త్రీయత లేదంటూ బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయన సోమవారం పిటిషన్ దాఖలుచేశారు. ఈ రిజర్వేషన్లపై కోర్టు జోక్యంచేసుకొని స్టే ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం.. సామాజికంగా వెనకబడినవారు, అంటరానితనం, సాంఘిక వివక్షకు గురవుతున్నవారికే రిజర్వేషన్లు కల్పించాలని ఓ ప్రకటన విడుదల చేశారు.

సెన్సెక్స్ ▼369 **35657** | నిఫ్టీ ▼119 **10662** | డోజోన్స్ 24396 ▼340 | నాస్‌డాక్ 7057 ▼108 | రూపాయి 71.10 ▲ 07 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | ముడి చమురు 59.68 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).




ఘనం (+)			గ్రహణం (-)		
నిఫ్టీ	28న	మార్పు%	నిఫ్టీ	28న	మార్పు%
ZEE ENTERTAINMENT	373.30	17.24	ADANI PORT	326.10	-12.77
BHARTI INFRATEL	287.30	2.70	INDIABULLS HSG	699.30	-6.07
COAL INDIA	225.20	1.92	YES BANK	207.50	-5.51
TCS	1955.00	1.78	BAJAJ FINANCE	2458.50	-5.43
L & T	1300.45	1.17	BAJAJ FINSERV	6050.90	-4.28
POWER GRID CORP.	187.80	1.05	ULTRATECH CEM	3374.45	-3.88
UPL	760.05	0.92	ICICI BANK	343.55	-3.82

విదేశీ మారకపు రేట్లు (థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	64.61	74.92	బహ్రెయిన్ దీనార్	174.87	200.08
పౌండ్ స్టెర్లింగ్	85.25	98.86	కువైట్ దీనార్	193.50	240.88
యూరో	73.74	85.53	ఒమన్ రియాల్	171.12	196.02
జపనీస్ యెన్/100	59.07	68.51	సౌదీ రియాల్	17.18	20.36
ఆస్ట్రేలియా డాలరు	46.50	53.80	యూఏఈ దిర్హమ్	17.58	20.55
సింగపూర్ డాలరు	47.77	56.60	మలేషియా రింగిట్	15.39	18.92
థాయ్ బాత్/100	204.98	245.16	చైనీస్ యువాన్	7.45	12.11

సోమవారం నిఫ్టీ కదలికలు



బ్యాంకర్లలో భయం భయం

- ఐసీఐసీఐ బ్యాంకు ఉదంతం నేపథ్యం
- రుణ మంజూరీ అంటేనే గుబులు
- ఎటు వెళ్లి ఏమవుతుందోనన్న ఆందోళనలు

ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ ఎండీ, సీఈఓ చందాకొచ్చర్‌పై సీబీఐ ఛార్జిషీటు నమోదు చేయడం బ్యాంకర్లలో గుబులు పెట్టిస్తోంది. న్యాయపరిధిలో ఉన్న కేసుపై ఏం మాట్లాడలేకపోయినా.. ఈ పరిణామం వల్ల రుణ మంజూరీలపై నిర్ణయాలు తీసుకునేటపుడు ఆచితూచి వ్యవహరించాల్సి వస్తోంది.

ఓ బ్యాంకరైతే 'వై దిస్ కొలవరి డి' అంటూ వాపోయారు కూడా. కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ గ్రూప్ అధిపతి వేణుగోపాల్ దూత్‌ల పేర్లు ఛార్జిషీటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. వీరితోనే వదిలిపెట్టలేదు. బ్యాంక్ బోర్డు లేదా కమిటీ ఆఫ్ క్రెడిటార్స్‌లో ఉన్న కేవీ కామత్, సందీప్ భక్షి(ప్రస్తుత ఎండీ, సీఈఓ), గోల్డ్ మాన్ శాక్స్ ఇండియా ఛైర్మన్ సంజయ్ ఛటర్జీ, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ ఇండియా సీఈఓ జరీన్ దారువాలా, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ ఎన్.ఎస్. కన్నన్, టాటా క్యాపిటల్ ఎండీ రాజీవ్ సబర్వాల్, బ్యాంక్ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. రామ్‌కుమార్, మాజీ బోర్డు సభ్యుడు హెచ్. ఖుస్రోఖాన్ తదితరులు కూడా ఛార్జిషీటులో చోటు చేసుకున్నారు. అసలు కమిటీ ఆఫ్ క్రెడిటార్స్‌లను కేసులోకి ఎందుకు లాగారన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. దూత్ కంపెనీలో చందా కొచ్చర్ భర్త వ్యాపార లావాదేవీలకు ప్రతిగా కొచ్చర్ దూత్‌కు రుణాలిచ్చారన్న ఆరోపణల నేపథ్యంలో తొలుత వీరిచుట్టూనే కేసు తిరిగిన విషయం తెలిసిందే.



ఐసీఐసీఐ బ్యాంక్ ఉదంతమే కాదు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర విషయంలోనూ జరిగిన పరిణామాల నేపథ్యంలోనూ బ్యాంకర్లు ఆచితూచి వ్యవహరించాల్సి వస్తోంది. డీఎస్‌కే రుణ కేసు విషయంలో ఆ బ్యాంక్ ఉన్నతాధికారులైన ఆర్.పి. మరాఠే, సుశీల్ మునాత్, ఆర్.కె. గుప్తాలు అరెస్టు అయిన సమయంలో ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ వారికి మద్దతుగా నిలిచింది. కేసు కూడా వేసింది. అయితే కేసు సాగే కొద్దీ.. బ్యాంకు చర్యలు నిబంధనలు ఉల్లంఘించినట్లుగా ఉన్నాయంటూ కేసును ఉపసంహరించుకున్నాయి.

చందాకొచ్చర్ విషయంలోనూ తొలుత బ్యాంకు, బోర్డు ఆమెకు మద్దతుగా నిలిచింది. ఆ తర్వాత క్రమంగా వెనక్కి తగ్గాయి. తొలుత సెలవులోకి వెళ్లినా ఏమీ పట్టించుకోని బోర్డు.. ఆ తర్వాత కొచ్చర్‌ను తొలగించాల్సి వచ్చింది కూడా. బ్యాంకులు తీసుకునే నిర్ణయాల్లో అవకతవకలు చోటు చేసుకుంటే.. పలు దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగడం తమ ప్రతిష్ఠకు కూడా భంగమేనని ఆర్‌బీఐ కూడా ఆందోళన చెందుతోంది.

మొండి బకాయిలతో సతమతమైన బ్యాంకింగ్ వ్యవస్థ ఇపుడిపుడే గాడిలో పెడుతున్న తరుణంలో.. ఇలాంటి కేసులు వ్యవస్థను తిరిగి అగాధంలోకి నెడతాయేమోనన్న భయం ప్రభుత్వంలోనూ ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఎవరు తప్పు చేసినా శిక్ష అనుభవించక తప్పదు. కానీ ఆ కొంత మంది చేసే తప్పుల వల్ల మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థపైనే ప్రభావం పడుతుండడమే మింగుడుపడని విషయంగా ఉంది.

రాణించిన కెనరా బ్యాంక్

ముంబయి: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ రూ.317.52 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ ఆర్జించిన రూ.125.75 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 152.50 శాతం అధికం. ఇక మొత్తం ఆదాయం రూ.12,341.09 కోట్ల నుంచి 9.5 శాతం వృద్ధితో రూ.13,513.35 కోట్లకు చేరింది. షేరుపై ఆర్జన (ఈపీఎస్) రూ.2.11 నుంచి రూ.4.33కు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం సైతం 3.66% వృద్ధితో రూ.3814 కోట్లకు చేరింది. మొత్తం రుణాలు 12 శాతం పెరిగి రూ.4.17 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. స్థూల నిరర్థక ఆస్తులు 10.38 శాతం నుంచి 10.25 శాతానికి, నికర ఎన్‌పీఏలు 6.78 శాతం నుంచి 6.37 శాతానికి మెరుగుపడ్డాయి. ఫలితంగా కేటాయింపులు రూ.2,673.64 నుంచి రూ.1,977.34 కోట్లకు పరిమితమయ్యాయి.

బీఎస్ఈలో షేరు 5.23% నష్టంతో రూ.240.30 వద్ద ముగిసింది.

టాటా పవర్ ఆదాయం రూ.7722 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో టాటా పవర్ ఏకీకృత ప్రాతిపదికన రూ.204.61 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.628.16 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 67 శాతం తక్కువ. అధిక ఇంధన, రుణ ఖర్చులు లాభంపై ప్రభావం చూపాయని కంపెనీ వెల్లడించింది. ఇక మొత్తం ఆదాయం రూ.6,451.31 కోట్ల నుంచి రూ.7,721.52 కోట్లకు పెరిగింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో కంపెనీ ఇంధన వ్యయాలు రూ.2,491.24 కోట్ల నుంచి రూ.3,189.87 కోట్లకు చేరాయి. ఆర్థిక ఖర్చులు రూ.855.28 కోట్ల నుంచి రూ.1,013.96 కోట్లకు పెరిగాయి.

బీఎస్ఈలో షేరు 4.26% నష్టంతో రూ.70.80 వద్ద ముగిసింది.

ఎస్కార్ట్స్ లాభం రూ.140 కోట్లు

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో వ్యవసాయ పరికరాల తయారీ సంస్థ ఎస్కార్ట్స్ రూ.140.11 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.91.97 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 52.34 శాతం అధికం. మొత్తం ఆదాయం రూ.1213.23 కోట్ల నుంచి 38.43 శాతం వృద్ధితో రూ.1679.47 కోట్లకు చేరింది.

బీఎస్ఈలో షేరు 4.02% నష్టంతో రూ.674.15 వద్ద ముగిసింది.

సియట్ లాభంలో 36% క్షీణత

దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో టైర్ల తయారీ సంస్థ సియట్ రూ.52.24 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో సంస్థ ఆర్జించిన రూ.82.10 కోట్లతో పోలిస్తే ఇది 36 శాతం తక్కువ. మొత్తం ఏకీకృత ఆదాయం రూ.1,580.78 కోట్ల నుంచి రూ.1,717.95 కోట్లకు చేరింది.

బీఎస్ఈలో షేరు 3.10% నష్టంతో రూ.1151.95 వద్ద ముగిసింది.

49% పెరిగిన సెంచురీ లాభం

ముంబయి: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో సెంచురీ టెక్స్‌టైల్స్ అండ్ ఇండస్ట్రీస్ రూ.134.27 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆర్జించిన రూ.89.94 కోట్ల నికర లాభంతో పోలిస్తే ఇది 49.29 శాతం ఎక్కువ. మొత్తం ఆదాయం రూ.1033.26 కోట్ల నుంచి 7.38 శాతం తగ్గి రూ.957.22 కోట్లకు తగ్గింది. షేరుపై ఆర్జన రూ.8.05 నుంచి రూ.12.02కు పెరిగింది.

బీఎస్ఈలో షేరు 2.60% నష్టంతో రూ.813.55 వద్ద ముగిసింది.

గోద్రేజ్ రికార్డు విక్రయాలు

దిల్లీ: మూడో త్రైమాసికంలో గోద్రేజ్ ప్రాపర్టీస్ ఏకీకృత ప్రాతిపదికన రూ.41.63 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ రూ.54.75 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. కంపెనీ మొత్తం ఆదాయం రూ.308.29 కోట్ల నుంచి రూ.430.70 కోట్లకు పెరిగింది. కంపెనీ మొత్తం విక్రయాలు 89% పెరిగి రూ.1528 కోట్లుగా నమోదయ్యాయి. కంపెనీ ఒక త్రైమాసికంలో నమోదు చేసిన అత్యధిక విక్రయాలు ఇవే.

బీఎస్ఈలో షేరు 0.60% నష్టంతో రూ.741.15 వద్ద ముగిసింది.

పెరిగిన వోకార్డ్ నష్టం

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఔషధ సంస్థ వోకార్డ్ ఏకీకృత ప్రాతిపదికన రూ.71.11 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో కంపెనీ నికర నష్టం రూ.40.76 కోట్లుగా ఉంది. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.1005.30 కోట్ల నుంచి రూ.1045.86 కోట్లకు పెరిగింది.

బీఎస్ఈలో షేరు 7.04% నష్టంతో రూ.444.95 వద్ద ముగిసింది.

మార్కెట్ కబుర్లు

- ✦ రుణాన్ని వాటాలుగా మార్చే ప్రతిపాదనకు ఆమోదం పొందేందుకు ఫిబ్రవరి 21న వాటాదార్ల సమావేశం నిర్వహించనున్నట్లు **జెట్ ఎయిర్‌వేస్** తెలిపింది. బోర్డులో రుణదాతల తరఫున ఒక డైరెక్టరు నియామకానికీ అనుమతి కోరనుంది.
- ✦ గర్భ నిరోధక అబ్రివియేటెడ్ న్యూడ్రగ్ అప్లికేషన్, ఫైజర్ ఉత్పత్తి డోపో ప్రోవెరాకు జనరిక్ విభాగమైన మెడ్రోక్సిప్రోజెసెరోన్ ఇన్‌జెక్టబుల్‌కు యూఎస్ఎఫ్‌డీఏ తుది ఆమోదం లభించినట్లు **సిప్లా** ప్రకటించింది.
- ✦ రాజస్థాన్‌లోని బామర్ జిల్లాలో నెలకొల్పనున్న రిఫైనరీ ప్రాజెక్టుకు ఎస్‌బీఐ నేతృత్వంలోని 9 బ్యాంకుల బృందం రూ.28,753 కోట్ల రుణం ఇచ్చేందుకు అంగీకరించినట్లు, **హెచ్‌పీసీఎల్** ప్రకటించింది. ఈ ప్రాజెక్టుకు మొత్తం రూ.43,129 కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు.
- ✦ అప్రధాన విపణుల నుంచి వైదొలగాలి, శరవేగంగా వృద్ధిచెందుతున్న దేశీయ విపణిపై దృష్టి కేంద్రీకరించాలన్న వ్యూహంలో భాగంగా సింగపూర్, థాయ్ అనుబంధ సంస్థల్లో 70 శాతం చొప్పున వాటాలను హెచ్‌బీఐఎస్ గ్రూప్ ఆఫ్ చైనాకు 480 మిలియన్ డాలర్ల (సుమారు రూ.3,400 కోట్ల)కు విక్రయించినట్లు **టాటా స్టీల్** వెల్లడించింది.
- ✦ ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్‌కు వెళ్లేందుకు, టెలికాం ప్రభుత్వరంగ సంస్థ **ఐటీఐ లిమిటెడ్**కు సెబీ ఆమోదం లభించింది. ఈ ఇష్యూలో భాగంగా కొత్తగా 18 కోట్ల షేర్లు జారీ చేయనున్నారు.
- ✦ **డాక్టర్ రెడ్డీస్**కు చెందిన నల్గొండ జిల్లా మిర్యాలగూడ ప్లాంట్‌ను యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీ చేసి, ఒక అభ్యంతరాన్ని లేవనెత్తినట్లు, ఆ మేరకు 'ఫారం 483' జారీ చేసినట్లు పేర్కొంది.
- ✦ **డాక్టర్ రెడ్డీస్**కు చెందిన తోసిమ్రా (సుమట్రిప్టాన్ నాసల్ స్ప్రే) ఔషధానికి అమెరికాలో అనుమతి వచ్చింది. యూఎస్‌లోని తన అనుబంధ సంస్థ అయిన ప్రామియస్ ఫార్మా ఎల్ఎల్‌సీ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేయగా యూఎస్ఎఫ్‌డీఏ నుంచి అనుమతి లభించినట్లు డాక్టర్ రెడ్డీస్ ఇక్కడ వెల్లడించింది.

అత్యంత విలువైన బ్రాండ్ టాటా

- రూ.1.38 లక్షల కోట్లకు చేరిక
- అంతర్జాతీయ దిగ్గజ సంస్థల్లో 86వ స్థానం
- కన్సల్టెన్సీ సంస్థ బ్రాండ్ ఫైనాన్స్ జాబితా

అంతర్జాతీయంగా అత్యంత విలువైన 100 బ్రాండ్లలో మన దేశం నుంచి టాటా గ్రూప్ ఒక్కటే చోటు దక్కించుకుంది. గత ఏడాది కంటే టాటా బ్రాండ్ విలువ ఈ ఏడాది 37 శాతం పెరిగి 19.5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.38 లక్షల కోట్ల)కు చేరిందని లండన్ కేంద్రంగా పనిచేసే కన్సల్టెన్సీ సంస్థ బ్రాండ్ ఫైనాన్స్ వెల్లడించింది. ఫలితంగా గతేడాది 104వ స్థానంలో ఉన్న టాటా, ఈ ఏడాది 86వ స్థానానికి చేరిందని బ్రాండ్ ఫైనాన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డేవిడ్ హై తెలిపారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ పనితీరు వల్లే టాటా గ్రూప్ విలువ ఇంతలా పెరిగిందన్నారు. గ్రూప్‌నకు చెందిన వాహన, ఉక్కు కంపెనీలు కూడా రాణించాయని, గ్రూప్‌లోని మరిన్ని సంస్థల విలువను కూడా జతచేయడం కలిసి వచ్చిందని పేర్కొన్నారు.



మరింత బాధ్యతతో పనిచేస్తాం: 'మరింత సామాజిక బాధ్యతతో పనిచేసేలా, ఈ గుర్తింపు మాకు ప్రోత్సాహాన్నిస్తుంది. వినూత్నత, వ్యవస్థాపరంగా అత్యున్నత ప్రమాణాలతో టాటా గ్రూప్ ముందుకు సాగేందుకు ఉపకరిస్తుంది'ని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ అన్నారు.

ఆర్కిటెక్చర్ డిజైన్లకు స్టోనిక్స్ అవార్డులు

ఈనాడు, హైదరాబాద్: దేశంలో అత్యుత్తమ ఆర్కిటెక్చర్ డిజైన్లను గుర్తించి అవార్డులు ఇచ్చేందుకు స్టోనిక్స్ ఇండియా సిద్ధమవుతోంది. ఫోర్బ్స్ ఇండియా డిజైన్ అవార్డ్స్-2019 పేరుతో ఈ అవార్డులు ఇవ్వనున్నారు. సాంకేతిక నైపుణ్యం అందుబాటులోకి రావటంతో ఆర్కిటెక్చరల్ డిజైన్లు కొత్త పుంతలు తొక్కుతున్నట్లు, ఈ విభాగంలో దేశీయంగా అత్యంత ఆసక్తికరమైన మార్పులు చోటుచేసుకుంటున్నట్లు స్టోనిక్స్ ఇండియా సీఎండీ గౌరవ్ అగర్వాల్ పేర్కొన్నారు. దీన్ని గుర్తించి ఔత్సాహికులను ప్రోత్సహించే లక్ష్యంగా ఫోర్బ్స్ ఇండియాతో జట్టుకట్టి అవార్డులు ఇవ్వదలచినట్లు వివరించారు.

అరబిందో రక్తపోటు ఔషధాలు వెనక్కి

ఈనాడు, హైదరాబాద్: అరబిందో ఫార్మా లిమిటెడ్ యూఎస్ మార్కెట్ నుంచి 4.95 లక్షల సీసాల రక్తపోటు ఔషధాలను వెనక్కి తీసుకుంది. రక్తపోటును అదుపులో ఉంచుకునేందుకు అమ్లోడిపిన్, వల్సార్టాన్ ట్యాబ్లెట్లను వినియోగిస్తారు. ఈ ఔషధాలను అరబిందో ఫార్మా యూఎస్ మార్కెట్లో విక్రయిస్తోంది. వీటిలో నైట్రోసోడిమిథైలమైన్ (ఎన్‌డీఈఏ) అనే హానికారక రసాయనాన్ని యూఎస్ఎఫ్‌డీఏ గుర్తించింది. దీంతో ఇప్పటికే మార్కెట్లో తన పంపిణీదార్ల వద్ద ఉన్న ఈ ఔషధాలను అరబిందో ఫార్మా వెనక్కి తీసుకుంది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2018-19	2017-18	2018-19	2017-18
పిరమాల్ ఎంటర్‌ప్రైజెస్	603.27	490.47	3489.08	2858.36
టీటీకే ప్రెస్టీజ్	84.85	63.48	558.63	461.62
సిటీ యూనియన్ బ్యాంక్	178.10	154.79	1086.45	987.04
శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్	635.45	541.54	3993.40	3378.00
మహీంద్రా లైఫ్‌స్పేస్	20.58	25.97	137.37	185.64
బ్యాంక్ ఆఫ్ ఇండియా	(4738.00)	(2341.00)	----	----
ఓరియంట్ ఎలక్ట్రిక్	11.76	12.17	422.71	347.97
పర్సిస్టెంట్ సిస్టమ్స్	91.71	91.67	864.20	791.90

బడ్జెట్ ముందు అప్రమత్తత

- ఆర్థిక రంగ షేర్లు కుదేలు
- 369 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
- 10,700 దిగువకు చేరిన నిఫ్టీ

సమీక్ష

రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో ప్రజాకర్షక పథకాలకు కేంద్ర ప్రభుత్వం పెద్ద పీట వేసే అవకాశం ఉండటంతో, ద్రవ్యలోటు పెరిగే అవకాశం ఉందన్న అంచనాల నడుమ దేశీయ సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. ఆర్థిక రంగ షేర్లను మదుపర్లు భారీగా విక్రయించడంతో సెన్సెక్స్ 368 పాయింట్లు, నిఫ్టీ 119 పాయింట్లు మేర నష్టపోయాయి. వాహన, మన్నికైన వినిమయ వస్తువుల రంగ షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. అంతర్జాతీయ సూచీలకొస్తే అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఐరోపా మార్కెట్లూ ఇదే ధోరణిలో ట్రేడయ్యాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు లాభపడి 71.10 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ ఉదయం 36,099.62 పాయింట్ల వద్ద సానుకూలంగా ప్రారంభమైంది. కొద్దిసేపటికే 36,124.26 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత వచ్చిన విక్రయాల ఒత్తిడితో ఎక్కడా కోలుకోలేకపోయింది. 35,565.15 పాయింట్ల కనిష్ఠాన్ని కూడా నమోదు చేసింది. చివరకు 368.84 పాయింట్ల నష్టంతో 35,656.70 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 119 పాయింట్లు కోల్పోయి 10,661.55 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,804.45-10,630.95 పాయింట్ల మధ్య కదలాడింది.

17% పెరిగిన జీ ఎంటర్‌టైన్‌మెంట్: గత శుక్రవారం ప్రతికూల వార్తల నేపథ్యంలో కుదేలైన జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేరు సోమవారం ట్రేడింగ్‌లో రికవరీ బాట పట్టింది. బీఎస్ఈలో 16.64 శాతం లాభపడి రూ.372.50 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో టీసీఎస్ అత్యధికంగా 1.71 శాతం లాభపడింది. కోల్ ఇండియా 1.51%, ఎల్‌అండ్‌టీ 1.17%, పవర్‌గ్రిడ్ 0.86%, ఏషియన్ పెయింట్స్ 0.51%, హెచ్‌సీఎల్ టెక్ 0.48% మేర లాభపడ్డాయి. యెస్ బ్యాంక్ అత్యధికంగా 5.46 శాతం నష్టపోయింది. బజాజ్ ఫైనాన్స్ 5.40%, ఐసీఐసీఐ బ్యాంక్ 3.82%, ఇండస్ఇండ్ బ్యాంక్ 2.80%, హీరో మోటోకార్ప్ 2.55%, సన్ ఫార్మా 2.52%, బజాజ్ ఆటో 2.29%, వేదాంతా 1.80%, యాక్సిస్ బ్యాంక్ 1.77%, ఐటీసీ 1.65%, టాటా స్టీల్ 1.55%, హెచ్‌డీఎఫ్‌సీ 1.47%, ఎంఅండ్‌ఎం 1.41%, ఆర్ఐఎల్ 1.34%, ఎస్‌బీఐ 1.28% చొప్పున నష్టపోయాయి. రంగాలవారీ సూచీలకొస్తే ఫైనాన్స్, ఆరోగ్య సంరక్షణ డీలా పడ్డాయి.

నేటి బోర్డు సమావేశాలు

★ హెచ్‌డీఎఫ్‌సీ ★ హెచ్‌సీఎల్ టెక్ ★ ఓబీసీ ★ యాక్సిస్ బ్యాంక్ ★ బజాజ్ ఫిన్‌సర్వ్ ★ బజాజ్ ఫైనాన్స్ ★ బ్యాంక్ ఆఫ్ బరోడా ★ టాటా కాఫీ ★ భారత్ ఫైనాన్షియల్ ★ సెరా ★ గ్రాన్యూల్స్ ★ రామ్‌కో సిమెంట్

28న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



(100కు రూపాయలలో)

కోడిగుడ్లు

హైదరాబాద్	395	వరంగల్	397
చిల్లరగా(ఒక గుడ్డు)	4.55	విశాఖపట్నం	410
బెంగళూరు	425	చెన్నై	430
29వ తేదీకి...		చిత్తూరు	423
విజయవాడ/గోదావరి	408	నమక్కల్	420

ఎన్ఎస్ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 326.10 (373.85) 15177384
ASIAN PAINTS 1379.50 (1372.15) 1590764
AXIS BANK LT 656.30 (669.75) 7792690
BAJAJ AUTO L 2565.55 (2626.35) 332409
BAJAJ FINANC 2458.50 (2599.55) 2364047
BAJAJ FINSER 6050.90 (6321.55) 299286
BHARTI AIRTE 305.15 (307.50) 4097172
BHARTI INFRA 287.30 (279.75) 8309902
BPCL 348.70 (357.45) 1451374
CIPLA 492.15 (507.65) 3215535
COAL INDIA L 225.20 (220.95) 3917992
DR. REDDYS 2624.75 (2672.40) 684994
EICHER MOTOR 19987.40 (20049.95) 101907
GAIL 333.20 (334.90) 3799381
GRASIM IND 732.80 (759.60) 1265661
HCL TECH 977.80 (969.40) 1514965
HDFC 1946.90 (1977.80) 2698966
HDFC BANK 2084.15 (2096.00) 3840109
HERO MOTOCOR 2598.60 (2670.15) 576248
HINDALCO IND 200.00 (204.45) 5741120
HINDUSTAN UN 1743.00 (1756.80) 1289774
HPCL 239.20 (241.80) 2334958
ICICI BANK 343.55 (357.20) 34362360
INDIABULLS H 699.30 (744.50) 5637650
INDIAN OIL 138.05 (137.75) 5570306
INDUSINDBANK 1443.70 (1484.90) 2246761
INFOSYS LTD 727.95 (730.35) 7944693
ITC 274.75 (279.20) 8992136
JSW STEEL LT 267.75 (274.65) 4518237
KOTAK MAHIND 1260.45 (1266.15) 2054592
LARSEN & TOU 1300.45 (1285.45) 8004136
M&M 673.05 (683.50) 5762442
MARUTI SUZIK 6511.05 (6513.40) 2398091
NTPC LTD 138.60 (138.30) 6086122
ONGC 141.65 (142.00) 2910523
POWER GRID C 187.80 (185.85) 4185481
RELIANCE IND 1229.55 (1246.00) 8569265
SBI 281.60 (285.40) 18905470
SUN PHARMA 411.75 (422.40) 5809082
TATA CONSULT 1955.00 (1920.80) 2769033
TATA MOTORS 172.30 (173.25) 8167430
TATA STEEL L 445.70 (452.90) 4335147
TECH MAHINDR 735.15 (729.05) 1804582
TITAN IND 958.65 (978.00) 1499181
ULTRATECH 3374.45 (3510.80) 1260559
UPL LIMITED 760.05 (753.10) 1226284
VEDANTA LIMI 191.50 (194.70) 6045200
WIPRO 355.15 (353.45) 6899957
YES BANK LTD 207.50 (219.60) 58015753
ZEE ENTERTAI 373.30 (318.40) 121305516

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1235.15 (1254.60) 61118
ACC 1357.25 (1375.00) 469918
ADITYA BIRLA 83.85 (87.20) 2108475
AMBUJA CEMEN 199.75 (202.35) 3278879
ASHOK LEYLAN 83.00 (82.60) 20419146
AUROBIND PHA 755.60 (786.15) 2576685
AVENUE SUPER 1372.75 (1365.70) 357354
BANDHAN BANK 417.70 (424.45) 675570
BANK OFBAROD 109.15 (110.20) 13633282
BEL 79.70 (80.35) 4549401
BHEL 63.75 (66.40) 8737901
BIOCON LTD 649.05 (664.70) 1809772
BOSCH LTD 18262.40 (18526.25) 13237
BRITANNIA 3203.45 (3206.65) 216799
CADILA HEALT 334.35 (343.70) 1483625
COLGATE PALM 1264.10 (1288.30) 580619
CONTAINER 642.95 (660.40) 553878
DABUR INDIA 427.40 (430.00) 1613234
DLF LIMITED 164.05 (158.00) 11812368
GENERAL INS 244.20 (245.30) 27950
GODREJ CONSU 759.25 (780.30) 1026380
HAVELLS INDI 698.70 (708.15) 1425427
HDFC STAND L 367.30 (359.40) 1405014
HINDUSTAN ZI 251.10 (250.40) 407107
ICICI LOMBAR 817.85 (855.45) 209562
IDEA CELLULR 31.05 (32.85) 29488750
INTERGLOBE A 1171.30 (1161.75) 941099
L&TFIN.HOLD 128.45 (134.65) 10124940
LIC HOUS.FIN 446.70 (453.05) 1544866
LUPIN 865.25 (865.05) 2416180
MARICO LIMIT 365.15 (369.90) 1317448
MCDOWELL 544.10 (554.85) 995460
MOTHERSON 145.30 (150.80) 6821443
MRF 62559.95 (63920.95) 4488
NHPC LTD 24.55 (25.00) 1752146
NMDC LTD 91.20 (90.50) 2412974
OIL INDIA 171.70 (171.85) 632113
ORACLE FIN S 3727.15 (3708.00) 19146
P&G HYG&HEAL 9908.80 (9928.85) 3557
PETRONET LNG 219.00 (227.05) 4780072
PIDILITE IND 1102.00 (1129.80) 428568
PIRAMAL ENTE 2170.50 (2299.20) 1195252
SAIL 46.15 (47.25) 8158462
SBI LIFE INS 599.25 (619.60) 285382
SHREE CEMENT 15052.40 (15723.20) 29244
SHRIRAM TRAN 1055.70 (1120.15) 2398246
SIEMENS 991.45 (1029.75) 319557
SUN TV LTD 532.35 (505.85) 4524193
THE NEW INDI 174.05 (174.80) 15995

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 5.40 (5.41) 5520
AISHWARYA TE 2.73 (2.85) 2780
ALPHAGEO 468.85 (465.20) 2938
AMAR RAJA BA 741.60 (764.65) 13559
ANDHRA BANK 26.30 (26.65) 44420
ANDHRA CEMEN 4.64 (4.87) 6788
ANDHRA PAPER 409.80 (421.40) 10711
ANDHRA PETRO 56.90 (58.70) 70483
ANDHRA SUGAR 295.05 (310.95) 1919
ANJANI PORTL 112.80 (115.55) 1122
ASTRA MICROW 79.45 (79.65) 15874
AUROBINDO PH 758.05 (783.40) 80450
AVANTEL SOFT 212.95 (222.10) 6348
AVANTI FEEDS 329.40 (349.40) 52449
BALAJI AMIN 451.85 (461.45) 6311
BARTRONICS 6.36 (6.61) 200
BHAGIRA CHEM 419.95 (431.35) 7660
BHAGYA NAG 32.30 (34.25) 50
BKV INDUSTRS 2.74 (2.74) 25
BN RATHI SEC 24.25 (24.75) 902
BRILLIANT SE 0.94 (0.96) 72110
CAMBRIDGE TE 42.65 (43.10) 1167
CONT COFFEE 270.35 (269.55) 2838
COROMAN FERT 433.65 (440.05) 3124
CUBEX TUB 13.49 (14.20) 2162
CYBERMATE 1.79 (1.88) 41520
CYIENT LIMIT 591.05 (597.35) 57562
DECCAN CEMEN 372.05 (391) 2
DIVI'S LAB 1473 (1493) 19991
DIVYA GRANIT 94 (98.70) 579
DR REDDY 2624.20 (2668.90) 18603
FOUR SOFT 36.80 (38) 950
GATI CORPN 71.25 (75.40) 79250
GAYATRI PROJ 163.20 (167.25) 2625
GMR INFRASTR 15.40 (15.65) 1865355
GOLDST INFRA 220.90 (222.80) 7922
GOLDSTONE EN 12.60 (13.25) 950
GRANULES (I) 89.05 (95.10) 91604
GSS AMERICA 108 (113.70) 89535
GVK POWER 6.68 (6.91) 397454
HBL NIFE POW 24.90 (25.95) 18649
HERITAGE FOO 485.10 (504.40) 2365
HIFCO MARWEL 65.90 (67.20) 1
HIL LTD 1809.65 (1917.75) 667
HIND FLUROCA 15.95 (16) 1
IDL INDUSTRS 241 (251.80) 1384
ILFS ENGINEE 12.25 (12.55) 7638
IVRCL INFRAS 0.90 (0.94) 26745
JEEVAN SCIEN 34.35 (34.90) 3063
KAKATIYA CEM 182.35 (186.85) 8401
KALLAM SPG 17.50 (17.35) 6565
KAVERI SEED 587.80 (591.25) 44206
KCP LTD 82.70 (86.20) 2190
KERNEX MICRO 24.50 (25.60) 87617
KNR CONSTRUC 205 (210.45) 3364
KREBS BIO 114.05 (117.45) 430
LANCO INDUS 180.90 (181) 2883
LAURUS LABS 366.15 (372.10) 345724
LOKESH MACH 42.75 (44.05) 3285
MADHUCON PRO 6.13 (6.29) 2600
MEDINOVA DIA 17.95 (18.85) 150
MEGA SOFT 7.35 (7.25) 3520
MIC ELECTRON 0.87 (0.88) 113368
MOLD-TEK.TEC 46.95 (48.60) 1756
MOLDTK PLA 237.70 (253.45) 7037
MSR INDIA LT 9.74 (10.12) 9972
NAGARJAGRICH 27.25 (27.25) 4144
NATCO PHARMA 671.45 (678.55) 6964
NAVA BH VENT 108.55 (110.80) 4338
NCC 79.30 (81.60) 1177261
NCL IND 119.55 (124.35) 1632
NEHA INTER 4.32 (4.12) 28246
NETTLINX 44.40 (45.20) 347
NEULAND LAB 498.65 (493.45) 610
NILE 340.75 (343.35) 748
NORTHGATE TE 0.62 (0.65) 9281
OIL COUNTRY 13.30 (13.60) 3175
PANYAM CEMEN 10.34 (11.59) 30063
PENNER IND 36.30 (36) 24098
PHYTOCHEM I 42.40 (43.10) 1050
PIONEER DIST 152.75 (155.55) 1279
PITTI LAMIN 52.60 (55.65) 4824
POKARNA 166.15 (164.45) 6383
PRAJAY ENGS 8.25 (8.18) 707
PREMIER EXPL 254.15 (255.15) 2339
PRISM CEMENT 74.60 (76.25) 8079
PRUDENTL PHA 3 (3.25) 146469
RAASI REFRAC 19.02 (18.12) 7546
RAIN INDUSTR 110.35 (114.65) 127436
RAJ PACKAGIN 27.80 (26.50) 1328
RAM INFORMAT 40.20 (43.15) 1702
REG.CERAMIC 4.20 (4.04) 1
SAGAR CEM 583.70 (612.10) 692
SAMKRG PIST 176.90 (186.65) 3884
SATVAH. ISPA 10.39 (9.02) 1736
SMS PHARMA 66.05 (69.75) 3029
SOUTH BIO TE 1.94 (1.91) 194
SREE RAYAL A 33.80 (35.15) 58049
SRI KPR INDU 18.55 (19.50) 500
SRINIVASA SH 38.55 (40) 1310
STEEL EXCHAN 12.10 (12.95) 1822
SUJANA METAL 0.38 (0.37) 6020
SUJANA UNIVE 0.30 (0.30) 25
SURANA STRIP 1.42 (1.36) 100
SURANA TELE 4.30 (4.19) 100
SURYALAKSH.C 39.85 (42) 525
SURYALATA SP 127.50 (130) 260
SUVEN PHARMA 186.10 (193.40) 34283
TAJ GVK HOTE 172.05 (179.55) 1092
TANLA 33.95 (31.70) 84812
TERA SOFTWAR 40 (42.40) 938
TRANS BIOTEK 5.59 (5.70) 12268
VAMSHI RUBB 29 (29.35) 185
VBC FERRO 38 (39.55) 1401
VICEROY HOTE 3.64 (3.83) 6540
VIJAY TEXTIL 37.70 (39) 10853
VIMTA LABS 253 (257.90) 3087
VISAKA IND 371 (375.15) 2103
VISTA PHARMA 25.15 (26.45) 5037
VIVIMED LABS 22.75 (23.20) 60570
VJIL CONSULT 36.45 (38.35) 629
VST INDUS 3195 (3201.30) 224
YBRANT DIGIT 2.88 (2.96) 41930
ZENOTECH LAB 29.25 (30.20) 8091
ZENTECH 80.55 (83.40) 133620



సుజుకీ వీ-స్ట్రామ్ 650 ఎక్స్‌టీ

ధర రూ.7.46 లక్షలు

దిల్లీ: సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా (ఎస్ఎమ్ఐపీఎల్) తమ ప్రీమియం మోటార్‌సైకిల్ మోడల్ వీ-స్ట్రామ్ 650 ఎక్స్‌టీ ఏబీఎస్‌లో 2019 వెర్షన్‌ను విపణిలోకి ప్రవేశపెట్టింది. దీని ధర రూ.7.46 లక్షలు (ఎక్స్-షోరూమ్ దిల్లీ)గా నిర్ణయించారు. కొత్త గ్రాఫిక్‌లు, హజార్డ్ లైట్లు, సైడ్ రిఫ్లెక్టర్లు వంటి అదనపు సదుపాయాలతో కొత్త వీ-స్ట్రామ్‌ను తీసుకొచ్చినట్లు కంపెనీ తెలిపింది. ఫోర్ స్ట్రోక్ 645 సీసీ ఇంజిన్ కలిగిన కొత్త బైకు.. మధ్య స్థాయి అడ్వెంచర్ బైకు కోరుకునే వారికి నచ్చుతుందని వివరించింది. కొత్తగా తీసుకొచ్చిన ఫీచర్లతో వీ-స్ట్రామ్ 650 ఎక్స్‌టీ మరింత ఆకర్షణీయం కానుందని ఎస్ఎమ్ఐపీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సతోషి ఉచిడా పేర్కొన్నారు. గతేడాది వీ-స్ట్రామ్ 650 ఎక్స్‌టీకి వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించిందని, భవిష్యత్‌లో ఇదే జోరు కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్యూయల్-ఇంజెక్షన్ టెక్నాలజీతో బైకు పనితీరు మరింత మెరుగు కానుందని అన్నారు. లైట్‌వెయిట్ యాంటీ లాక్ బ్రేకింగ్ వ్యవస్థతో బైకుపై మరింత పట్టు సాధించొచ్చని తెలిపారు.



ల్యాండ్ రోవర్ డిస్కవరీ స్పోర్ట్

ప్రత్యేక ఎడిషన్ రూ.53.77 లక్షలు

దిల్లీ: టాటా మోటార్స్ నేతృత్వంలోని జాగ్వార్ ల్యాండ్ రోవర్ 'డిస్కవరీ స్పోర్ట్'లో 2019 ప్రత్యేక ఎడిషన్‌ను దేశీయ విపణిలోకి తీసుకొచ్చింది. దీని ధర రూ.53.77 లక్షలుగా (ఎక్స్-షోరూమ్, దిల్లీ) నిర్ణయించింది. 2-లీటర్ ఇంజెనియమ్ డీజిల్ ఇంజిన్‌తో దీన్ని రూపొందించింది. కార్పథియన్ గ్రే కాంట్రాస్ట్ రూఫ్, స్పోర్టీ బంపర్ లాంటి ప్రత్యేక సదుపాయాలు దీని సొంతం. 'ఈ ప్రత్యేకమైన ఎడిషన్ దాని సామర్థ్యం, వైవిధ్యతతో విశేషమైన లక్షణాలను కలిగి ఉంద'ని జాగ్వార్ ల్యాండ్ రోవర్ ఇండియా అధ్యక్షుడు, మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ సూరి తెలిపారు.



బాలెనో కొత్తకొత్తగా..

ధర రూ.5.4- 8.77 లక్షలు

దిల్లీ: మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) తమ ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ మోడల్ బాలెనోలో అధునాతన వెర్షన్‌ను విపణిలోకి ప్రవేశపెట్టింది. ఇది 1.2 లీటర్ పెట్రోల్, 1.3 లీటర్ డీజిల్ వేరియంట్లలో లభించనుంది. పెట్రోల్ వేరియంట్ మాన్యువల్ ధర రూ.5.4- 7.45 లక్షలుగా, ఆటోమేటిక్ వెర్షన్ 7.48- 8.77 లక్షలుగా (ఎక్స్-షోరూమ్ దిల్లీ) ఉంది. ఇక డీజిల్ వెర్షన్ మాన్యువల్ రూ.6.6- 8.6 లక్షలుగా ఉంది. మరింత పొడవైన కొత్త స్పోర్టీ ఫ్రంట్ గ్రిల్, 16 అంగుళాల అలాయ్ చక్రాలు వంటి మార్పులు ఇందులో చేసినట్లు కంపెనీ వెల్లడించింది. కొత్త ఇన్ఫోటైన్‌మెంట్ వ్యవస్థ, రేర్ పార్కింగ్ కెమేరాలు, లైవ్ ట్రాఫిక్ నేవిగేషన్, వాహన సమాచారం, స్క్రీన్‌పై అలర్ట్‌లు మరింత మెరుగైన డ్రైవింగ్ అనుభూతి ఇస్తాయని తెలిపింది. కొత్త బాలెనోతో బ్రాండ్ మరింత బలోపేతం కానుందని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ఎస్ కల్సీ పేర్కొన్నారు.

ఈనాడు బిజినెస్



జావా బైక్‌పై క్లాసిక్ లెజెండ్స్ సహ వ్యవస్థాపకుడు అనుపమ్ థరేజా

సరికొత్త జావా.. హైదరాబాద్‌లో

ఈనాడు, హైదరాబాద్: 1980 దశకంలో యువతను ఉర్రూతలూగించిన జావా మోటార్‌సైకిల్ గుర్తుండే ఉంటుంది. అదే సరికొత్తగా రూపుదిద్దుకొని మళ్లీ అలరించటానికి ముందుకు వచ్చింది. జావా మోటార్‌సైకిల్ తయారీ హక్కులను సొంతం చేసుకొని, పాత తరం జావాకు కొత్తదనాన్ని అద్ది సరికొత్తగా రూపొందించింది క్లాసిక్ లెజెండ్స్ ప్రైవేట్ లిమిటెడ్. ఈ మోటార్‌సైకిల్‌ను సంస్థ సహ-వ్యవస్థాపకుడైన అనుపమ్ థరేజా సోమవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. అంతేగాక హైదరాబాద్‌లోని బంజారాహిల్స్, కూకట్‌పల్లి, సికింద్రాబాద్‌లలో మూడు డీలర్‌షిప్పులను క్లాసిక్ లెజెండ్స్ ప్రారంభించింది. ఈ సందర్భంగా అనుపమ్ థరేజా మాట్లాడుతూ సరికొత్త జావాకు అనూహ్యమైన స్పందన లభిస్తోందని చెప్పారు. ఆన్‌లైన్లో పెద్ద సంఖ్యలో బుకింగ్స్ జరిగినట్లు, ఇప్పుడు అదే సందడి జావా మోటార్‌సైకిల్ డీలర్ల వద్ద కనిపిస్తోందని వివరించారు. సరికొత్త 293 లిక్విడ్‌కూల్డ్ సింగిల్ సిలండర్, డీఓహెచ్‌సీ ఇంజన్, డబుల్ క్రాడిల్ ఛాసిస్... వంటి ప్రత్యేకతలతో జావా మోటార్‌సైకిల్‌ను తయారు చేసినట్లు చెప్పారు.

రెండు మోడళ్లలో...: జావా మోటార్‌సైకిల్ రెండు మోడళ్లలో లభిస్తోంది. ఒక మోడల్ జావా కాగా మరొకటి జావా ఫార్టీటూ. ఈ మోటార్ సైకిళ్ల ప్రారంభ ధరలు హైదరాబాద్‌లో (ఎక్స్-షోరూమ్) వరుసగా... రూ.1,67,000, రూ.1,58,000 ఉన్నాయి. డ్యూయల్ ఏబీఎస్ వేరియంట్ల ధర దీనికి కొంత అధికంగా ఉంది.

ప్రపంచ ఎంబీఏ ర్యాంకుల్లో ఐఎస్‌బీకి 24వ స్థానం

- టాప్ 100 జాబితాలో మరో మూడు ఐఐఎంలు
- గత ఏడాది కంటే మెరుగుపడిన స్థానం
- 'ఫైనాన్షియల్ టైమ్స్' జాబితా విడుదల

ఈనాడు - హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) నిర్వహిస్తున్న పీజీపీ (పీజీ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్) కి ప్రపంచ వ్యాప్తంగా 2019- ఫైనాన్షియల్ టైమ్స్ ఎంబీఏ ర్యాంకింగ్స్‌లో 24వ స్థానం దక్కింది. మనదేశంలోని మేనేజ్‌మెంట్ విద్యా సంస్థల్లో ఐఎస్‌బీదే అగ్రస్థానం. మొదటి 25 బీ-స్కూళ్ల జాబితాలో స్థానం సంపాదించిన విద్యా సంస్థ ఇదే కావటం గమనార్హం. గత ఏడాది ర్యాంకింగ్స్ ప్రకారం ఐఎస్‌బీ 28వ స్థానంలో ఉంది. ఈ ఏడాది నాలుగు ర్యాంకులు ఎగబాకి 24వ స్థానంలో నిలిచింది. ప్రధానంగా మేనేజ్‌మెంట్ విద్యార్థుల జీతభత్యాలు, జీతాల్లో పెరుగుదల ఆధారంగా ఈ ర్యాంకింగ్‌ను నిర్ణయించారు.

ఎలా సాధ్యమైంది?: ఐఎస్‌బీ ర్యాంకింగ్ పెరగటానికి పలు కారణాలు దోహదపడ్డాయి. ఐఎస్‌బీలో పీజీపీ పూర్తి చేసిన విద్యార్థుల జీతభత్యాల్లో 187 శాతం పెరుగుదల నమోదు కావటం ఇందులో ప్రధానమైనది. అదేవిధంగా ఐఎస్‌బీ విద్యార్థులు మహిళలు 34 శాతం ఉండటం మరొక ప్రత్యేకత. దేశంలోని మేనేజ్‌మెంట్ విద్యా సంస్థల్లో ఇంత అధిక సంఖ్యలో మహిళలు ఉన్న మరొకటి లేదు. ఐఎస్‌బీలో పీజీపీ పూర్తి చేసిన మూడు నెలల్లోనే విద్యార్థులకు మంచి ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఇంకా ఇతర ఎన్నో ప్రామాణికాల ప్రకారం చూస్తే..., ఐఎస్‌బీ మెరుగైన స్థానంలో ఉండటంతో ఫైనాన్షియల్ టైమ్స్ గ్లోబల్ ర్యాంకింగ్స్ జాబితాలో మంచి ర్యాంకు సాధించగలిగింది. ఒక ప్రపంచ స్థాయి మేనేజ్‌మెంట్ విద్యా సంస్థగా ఎదగాలనే లక్ష్యంతో ఐఎస్‌బీ ముందుకు సాగుతున్నట్లు, తాజా ర్యాంకింగ్ అందుకు ఉదాహరణగా ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ రాజేంద్ర శ్రీవాస్తవ పేర్కొన్నారు.

బెంగుళూరు, అహ్మదాబాద్, కోల్‌కతా...: ఫైనాన్షియల్ టైమ్ వెల్లడించిన ప్రపంచ ఎంబీఏ ర్యాంకింగ్స్‌లో ఐఎస్‌బీతో పాటు మరో మూడు విద్యా సంస్థలు మొదటి వంద స్థానాల్లో ఉన్నాయి. అవి, ఐఐఎం- బెంగుళూరు (33), ఐఐఎం- అహ్మదాబాద్ (47), ఐఐఎం- కోల్‌కతా (49).

అగ్రస్థానంలో స్టాన్‌ఫోర్డ్: యూఎస్‌కు చెందిన స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఫైనాన్షియల్ టైమ్స్ 2019 జాబితాలో అగ్రస్థానంలో నిలిచింది. రెండో స్థానంలో యూఎస్‌కే చెందిన హార్వార్డ్ బిజినెస్ స్కూల్ ఉంది. ఫ్రాన్స్/సింగపూర్‌లోని ఇన్‌సీడ్ మూడో స్థానంలో, యూఎస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా- వార్టన్ నాల్గవ స్థానంలో నిలిచాయి. లండన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ చికాగో- బూత్, ఐఎంటీ- సోలన్ మొదటి పది స్థానాల్లో ఉన్నాయి. అయితే ఆసక్తికరంగా టాప్ 100 జాబితాలో చైనాలోని ఆరు విద్యా సంస్థలు ఇందులో స్థానం దక్కించుకోవటం ఆసక్తికరమైన అంశం.

శామ్‌సంగ్ గెలాక్సీ ఎం స్మార్ట్‌ఫోన్లు

- ధరల శ్రేణి రూ.7,990-12,990
- 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, వేగవంత ఛార్జింగ్
- ఫిబ్రవరి 5 నుంచి ఆన్‌లైన్‌లో అమ్మకాలు



దిల్లీ: స్మార్ట్‌ఫోన్ విపణిలో అగ్రస్థానాన్ని మళ్లీ సాధించడమే లక్ష్యంగా గెలాక్సీ ఎం స్మార్ట్‌ఫోన్లను శామ్‌సంగ్ ఇండియా సోమవారం ఆవిష్కరించింది. అందుబాటు ధర, అధిక సదుపాయాల (ఫీచర్ల)తో విపణిలో దూసుకెళ్లిన చైనా సంస్థ షియామీపై ఆధిక్యం సాధించే ఉద్దేశంతో, అదే తరహాను శామ్‌సంగ్ కూడా పాటించింది. ఇంటర్నెట్ వినియోగించే వారికి స్మార్ట్‌ఫోన్‌లో బ్యాటరీ ఛార్జింగ్ ఎక్కువ సమయం ఉండటం కీలకం కనుక, 3,400- 5,000 ఎంఏహెచ్ బ్యాటరీలతో కొత్త మోడళ్లను విడుదల చేసింది. ఎం 20, ఎం 10 పేర్లతో ఆవిష్కరించిన ఈ స్మార్ట్‌ఫోన్లు ఆండ్రాయిడ్ ఆరియో 8.1 ఆపరేటింగ్ సిస్టమ్‌పై పనిచేస్తాయి. వెనుక రెండు కెమేరాలు, ముందు మరొకటి ఉన్నాయి. ఫిబ్రవరి 5 నుంచి శామ్‌సంగ్ ఆన్‌లైన్ స్టోర్, అమెజాన్ ఇండియా ఆన్‌లైన్ పోర్టళ్లలో ఈ ఫోన్లు లభిస్తాయి. ఈ ఫోన్లు కొనుగోలు చేసిన వారికి, రిలయన్స్ జియో కనెక్షన్లు రూ.198, రూ.299తో రీఛార్జి చేసుకుంటే, రెట్టింపు డేటా లభిస్తుంది.

ఎం10 సదుపాయాలు: 6.2 అంగుళాల తెర, 3400 ఎంఏహెచ్ బ్యాటరీ, 1.6 గిగాహెర్ట్జ్ ఎగ్జినోస్ 7870 చిప్‌సెట్, వెనుకవైపు 13+5 ఎంపీ కెమేరాలు, ముందు 5 ఎంపీ కెమేరా, 2జీబీ ర్యామ్+16 జీబీ మెమొరీ (రూ.7990), 3జీబీ ర్యామ్+32 జీబీ మెమొరీ (రూ.8990).

ఎం 20 సదుపాయాలు: 6.3 అంగుళాల తెర, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, 1.6 గిగాహెర్ట్జ్ ఎగ్జినోస్ 7904 చిప్‌సెట్, వెనుకవైపు 13+5 ఎంపీ కెమేరాలు, ముందు 8 ఎంపీ కెమేరా, 3జీబీ ర్యామ్+32జీబీ మెమొరీ (రూ.10,990), 4జీబీ ర్యామ్+64 జీబీ మెమొరీ (రూ.12,990).

హోటల్ సేవలకు ఐటీసీ రాదు!



సతీష్ సరాఫ్,
చార్టర్డ్ అకౌంటెంట్

? మా స్నేహితుడు ఐస్‌క్రీం, మిల్క్ షేక్స్ లాంటి వాటిని తయారుచేసి విక్రయిస్తుంటాడు. ఈ తరహా వ్యాపారం రెస్టారెంట్ సేవల కిందకు వస్తుందా లేదంటే ఐస్‌క్రీం పార్లర్ విభాగం కిందకు వస్తుందా? దీని కోసం జీఎస్‌టీ కింద రెగ్యులర్ వ్యాపారిగా లైసెన్సు తీసుకోవాల్సి ఉంటుందా? లేదంటే కాంపోజిషన్ ఎంపిక చేసుకుంటే సరిపోతుందా? తెలియజేయగలరు.

- రఘు, హైదరాబాద్

మీ మిత్రుడు నిర్వహించే ఐస్‌క్రీం వ్యాపారం రెస్టారెంట్ సేవల కిందకు వస్తుంది. దీనికి జీఎస్‌టీ రెగ్యులర్ లైసెన్సు తీసుకోవచ్చు. కాంపోజిషన్ విధానాన్ని కూడా ఎంపిక చేసుకోవచ్చు. ఈ రెండింటిలో ఎలా నమోదైనప్పటికీ, 5% జీఎస్‌టీ వర్తిస్తుంది. అయితే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్ చేసుకునే వీలు ఉండదు.

? మేం పప్పు ధాన్యాల గానుగ సేవలు అందిస్తుంటాం. జీఎస్‌టీ కోసం ఏయే పద్దు పుస్తకాలను మేం నిర్వహించాల్సి ఉంటుంది?

- రాచమడుగు నాగరాజు

జీఎస్‌టీ కింద నమోదైన ప్రతి ఒక్కరు సీజీఎస్‌టీ చట్టం-2017, సెక్షన్ 35లో నిర్దేశించిన పుస్తకాలను, దస్త్రాలను (రికార్డులు) నిర్వహించాల్సి ఉంటుంది. అవి 1) వస్తువుల ఉత్పత్తి లేదా తయారీ 2) వస్తువులు లేదా సేవలు అందించిన (అవుట్‌వార్డ్), స్వీకరించిన (ఇన్‌వార్డ్) వివరాలు 3) సరకు నిల్వలు 4) ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్ 5) పన్నుల చెల్లింపు తదితరాలకు సంబంధించిన రికార్డులతో పాటు మరికొన్ని ఇతర పద్దు పుస్తకాలను నిర్వహించాల్సి ఉంటుంది.

జీఎస్‌టీ

? మాకు చిట్‌ఫండ్ కంపెనీ ఉంది. వ్యాపార టర్నోవరు రూ.29,00,000 వరకు ఉంటుంది. నేను జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ కూడా తీసుకున్నాను. అయితే ఇప్పుడు జీఎస్‌టీ నమోదుకు టర్నోవరు పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలకు పెంచారని విన్నాను. మా టర్నోవరు ప్రతిపాదిత రూ.40 లక్షల్లోపు ఉన్నందున.. మేం జీఎస్‌టీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకోవచ్చా? అలాగే అంతరాష్ట్ర సరకు రవాణా సేవల వార్షిక టర్నోవరు రూ.20,00,000 (రూ.16,00,000) లోపు ఉన్నా కూడా రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలా? ఒకవేళ రిజిస్ట్రేషన్ లేకుంటే ఏమైనా సమస్యలు ఎదురవుతాయా? తెలియజేయగలరు.

- రాంబో రూపికా

చిట్ ఫండ్స్ విషయానికొస్తే ఫోర్‌మన్ కమీషన్‌పైనే 12 శాతం జీఎస్‌టీ వర్తిస్తుంది. చిట్ మొత్తం విలువపైన కాదు. జీఎస్‌టీ టర్నోవరు పరిమితి పెంపు గురించి మీరు సరిగ్గానే విన్నారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. అయితే జీఎస్‌టీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకుంటారా లేదా అనేది మీ ఇష్టం. నా సలహా ఏమిటంటే.. టర్నోవరు పరిమితి పెంపుపై ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసే వరకు వేచిఉండటం మంచిది. 2017 సీజీఎస్‌టీ చట్టం సెక్షన్ 24 ప్రకారం అంతరాష్ట్ర సేవలకు టర్నోవరు పరిమితితో సంబంధం లేకుండా జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ తీసుకోవడం తప్పనిసరి. అయితే మీరు ఏవిధమైన అంతరాష్ట్ర సేవలు అందిస్తున్నారో తెలియజేయనందున, రిజిస్ట్రేషన్ లేకుంటే ఎదురయ్యే సమస్యల గురించి చెప్పలేను.

? నేను పాలీ క్లినిక్‌ను ప్రారంభించే యోచనలో ఉన్నాను. ఇందుకుగాను ఓ భవనాన్ని అద్దెకు తీసుకోవాలని అనుకుంటున్నాం. సంవత్సరానికి రూ.2.5 లక్షల వరకు ఆదాయం రావొచ్చు. నేను జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ తీసుకోవాల్సి ఉంటుందా?

- నాగేశ్వర రావు అడ్డాల

ఆరోగ్య సంరక్షణ సేవలకు జీఎస్‌టీ నుంచి మినహాయింపు ఉంది. పాలీ క్లినిక్‌పై మీకు ఎంతైనా ఆదాయం వచ్చినా.. జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ అవసరం లేదు.

? మేం రెస్టారెంట్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాం. భోజనంతో పాటు మద్యాన్ని సరఫరా చేస్తుంటాం. వీటిపై 5 శాతం జీఎస్‌టీని వసూలు చేస్తున్నాం. మేం ఈ సరకు కొనుగోళ్లపై, హోటల్ భవనం అద్దెపై చెల్లించే జీఎస్‌టీని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌గా క్లెయిమ్ చేసుకోవచ్చా? రెస్టారెంట్ సామగ్రి, పరికరాలపై కూడా ఐటీసీ పొందొచ్చా

- రాంబాబు

జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన ప్రారంభంలో రెస్టారెంటు సేవలకు జీఎస్‌టీ రేటు 5 నుంచి 28 శాతం మధ్య ఉండేది. అయితే ఆ తర్వాత హోటల్ యజమాన్య సంఘాలు పన్ను రేటును ఐటీసీ లేకుండా 5 శాతం, ఐటీసీ ఉంటే 18 శాతంగా (గది అద్దె రూ.7500 కంటే ఎక్కువగా ఉంటేనే) వర్తింపజేయాలని కోరాయి. వాళ్ల వినతిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం పై తరహాలో పన్ను రేట్లను అమలుచేస్తోంది. అందువల్ల మీరు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందే వీల్లేదు.

? మా ఫ్లాట్ యజమానుల సంక్షేమ సంఘం ఒక్కొక్క ఫ్లాట్‌పై వసూలు చేసే నిర్వహణ రుసుం రూ.7500 లోపు ఉంటుంది. సంవత్సరానికి అన్ని ఫ్లాట్ల నుంచి వసూలయ్యే మొత్తం రూ.40,00,000కి పైగానే. మేం జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ తీసుకోవాల్సి ఉంటుందా

- సాయి కృష్ణ

ఒక్కో ఫ్లాట్‌కు మెయింట్‌నెన్స్ రుసుం రూ.7,500 లోపు ఉంటే జీఎస్‌టీ వర్తించదు. అలాగే రుసుం రూ.7,500 లోపు ఉండి, వార్షిక వసూళ్లు నిర్దిష్ట టర్నోవరు (రూ.20,00,000) కంటే ఎక్కువగా ఉన్నా కూడా జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు. నెలవారీగా ఒక్కో ఫ్లాటుపై చెల్లించే మెయింట్‌నెన్స్‌ను మాత్రమే ఇక్కడ పరిగణనలోకి తీసుకుంటారు. అంతేకాని పూర్తి సంవత్సరం వసూళ్లను కాదు.

? మేం మోదీ బిల్డర్స్ నుంచి 2018 అక్టోబరులో ఓ విల్లాను కొనుగోలు చేశాం. ఇప్పటికీ దీని నిర్మాణం జరుగుతూనే ఉంది. ఇటీవలే రిజిస్ట్రేషన్ పూర్తయ్యింది. ఇప్పుడు నిర్మాణ ఛార్జీలపై నిర్మాణదారు 18% జీఎస్‌టీ చెల్లించమని అడుగుతున్నాడు? నిజంగానే మేం పన్ను కట్టాల్సి ఉంటుందా? విల్లా మొత్తం వ్యయం రూ.41 లక్షలు కాగా.. ఇందులో సగం ధర స్థలానికి, మిగిలిన సగం నిర్మాణ వ్యయానికి అని అతను చెబుతున్నాడు. మేం ఏం చేయాలో తెలియజేయగలరు.

- సి.పి.కిరణ్

ఫ్లాట్‌కైనా, విల్లాకైనా 18 శాతం జీఎస్‌టీ చెల్లించాలి. అయితే స్థలం విలువ కలిపి ఉంటే ఇందులో 1/3 వంతు అంటే నికరంగా 12 శాతం జీఎస్‌టీ కడితే సరిపోతుంది. మీ విషయానికొస్తే విల్లా ధరను స్థలం విలువ కలుపుకొని రూ.41 లక్షలుగా నిర్ణయించినందున, 12 శాతం జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. స్థలాన్ని మీ పేరుపై నమోదు చేసుకొని, ఆ తర్వాత నిర్మాణ ఒప్పందం (కన్‌స్ట్రక్షన్ అగ్రిమెంట్) కుదుర్చుకొని ఉంటే.. నిర్మాణ విలువపై 18 శాతం జీఎస్‌టీ వర్తిస్తుంది. అంటే మొత్తం ధరలోని సగం విలువపై ఇది కట్టాల్సి ఉంటుంది.



? అంతరాష్ట్ర ట్రేడర్లు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను ఎలా క్లెయిమ్ చేసుకోవాలో తెలియజేయగలరు. అసలు వీళ్లు ఐటీసీ క్లెయిమ్‌కు అర్హులేనా. ఉదాహరణకు నేను ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.20 లక్షల విలువైన వస్తువులను కొనుగోలు చేశాను. దీనిపై రూ.3.6 లక్షల వరకు జీఎస్‌టీ కట్టాను. ఆ తర్వాత ఈ వస్తువులను రూ.25 లక్షలకు విక్రయించి, రూ.4.5 లక్షల వరకు జీఎస్‌టీ చెల్లించాను. ఇలాంటప్పుడు, నేను ఐటీసీకి ఎలా క్లెయిమ్ చేసుకోవాలి.

- రమేశ్

ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోళ్లు జరిపినప్పుడు మీకు ఐజీఎస్‌టీతో కూడిన ఇన్‌వాయిస్ ఇస్తారు. దీనిని ఐటీసీగా క్లెయిమ్ చేసుకోవచ్చు. మీ ఉదాహరణ ప్రకారం.. వస్తువుల కొనుగోళ్ల సమయంలో జీఎస్‌టీ కింద చెల్లించిన రూ.3.6 లక్షలను ఐటీసీగా క్లెయిమ్ చేసుకోవాలంటే, ఈ పన్ను మొత్తాన్ని జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్‌లోని ఐజీఎస్‌టీ కాలమ్‌లో ఉన్న 4(ఏ)(5) పట్టికలో పొందుపర్చాలి. ఆ తర్వాత ఆ వస్తువులను రాష్ట్రంలోపలే విక్రయిస్తే వినియోగదారుల నుంచి సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీని వసూలు చేయాల్సి ఉంటుంది. అంటే పై ఉదాహరణలో మీరు అలా వసూలు చేసిన రూ.4.5 లక్షలను జీఎస్‌టీఆర్-3బీలోని సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ వరుసలోని 3.1(బి) పట్టికలో పొందుపర్చాలి. ఐజీఎస్‌టీపై పొందిన ఐటీసీని (రూ.3.6 లక్షలను) సీజీఎస్‌టీ, ఎస్‌జీఎస్‌టీ కింద కట్టాల్సిన బకాయిలకు (రూ.4.5 లక్షలు) మినహాయించుకోగా, ఇంకా మరో రూ.90,000లను నగదు రూపేణా మీరు చెల్లించాల్సి ఉంటుంది.

మీ సందేహాలు పంపండి

జీఎస్‌టీకి సంబంధించి మీ సందేహాలు మాకు పంపించండి..
మీ సందేహాలు ఎలాంటివైనా సరే అవి క్లుప్తంగాను, సరళంగాను ఉండాలి.. మా చిరునామా
eenadubusinessdesk@gmail.com; businessdesk@eenadu.net

కదం తొక్కిన చెరకు రైతు



మహారాష్ట్రలో వేలమంది చెరకు రైతులు సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు చెరకు పరిశ్రమల వద్ద పోగుపడిన బకాయిలను చెల్లించాలని డిమాండ్‌చేశారు. స్వాభిమాన్ శెత్కరీ సంఘటన నాయకుడు, లోక్‌సభ ఎంపీ రాజు శెట్టి నేతృత్వంలో పుణెలోని అల్కాచౌక్‌లో ఈ ర్యాలీ మొదలైంది. వీరు రాష్ట్ర చెరకు కమిషనరేట్‌లో డిమాండ్ల పత్రాన్ని సమర్పించారు.

కుప్పకూలిన జాగ్వార్



భారత వైమానిక దళానికి చెందిన జాగ్వార్ యుద్ధ విమానం ఉత్తర్ ప్రదేశ్‌లోని కుశీనగర్‌లో సోమవారం కుప్పకూలింది. గస్తీలో భాగంగా చక్కర్లు కొట్టేందుకు ఇది మధ్యాహ్నం 12.30 గంటలకు గోరఖ్‌పూర్ నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే కూలిపోయింది. పైలట్ గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. గత 7 నెలల్లో ఈ శ్రేణి విమానం కూలిపోవడం ఇది మూడోసారి.

అంతా మంచు మయం



హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో హిమపాతం విపరీతంగా కురుస్తోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కుఫ్రీ ప్రాంతంలో సోమవారం వాహన రాకపోకలు ఇలా స్తంభించిపోయాయి.

మున్ముందు కఠిన నిర్ణయాలు

- దేశ భద్రతే మాకు ప్రాధాన్యం
- ఎన్‌సీసీ గణతంత్ర దినోత్సవ శిబిరంలో ప్రధాని వెల్లడి

దిల్లీ: దేశ రక్షణపరమైన ప్రయోజనాలను కాపాడడమే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యాంశమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. రాబోయే రోజుల్లో భారత్ ఇంకా బలపడేలా, స్వయంసమృద్ధి సాధించేలా చూసేందుకు మరిన్ని పెద్దవైన, కఠినమైన చర్యలు చేపడతామని వెల్లడించారు. 'ఎన్‌సీసీ గణతంత్ర దినోత్సవ శిబిరం' ముగింపును పురస్కరించుకుని సోమవారం దిల్లీలో ఆయన ప్రసంగించారు. దేశం సురక్షితంగా ఉన్నప్పుడే యువత స్వప్నాలు సాకారమవుతాయని చెప్పారు. ఈ దిశగా అనేక చర్యల్ని సర్కారు చేపట్టడం వల్ల త్రివిధ దళాల్లోనూ అణ్వాయుధాలను సమర్థంగా ప్రయోగించగల సామర్థ్యమున్న దేశాల సరసన మనం చేరామని వివరించారు. 'దశాబ్దం నుంచి తేలకుండా పడి ఉన్న యుద్ధ విమానాల కొనుగోలును, ఆధునికీకరణను మా సర్కారు కొలిక్కి తెచ్చింది. క్షిపణులు, యుద్ధ ట్యాంకులు, తుపాకులు వంటివి దేశీయంగానే తయారు చేయిస్తున్నాం. ప్రపంచంలో మనం అత్యంత శాంతి కాముకులం. అదే సమయంలో మన దేశ ప్రయోజనాల పరిరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టడానికైనా వెనుకాడబోం' అని ప్రధాని స్పష్టీకరించారు. 'నవ భారతదేశంలో అవినీతికి తావులేదు. లంచగొండుల్ని విడిచిపెట్టబోం. కుటుంబం, ఆర్థిక స్థితిగతుల ఆధారంగా కాకుండా నిపుణత, కష్టించేతత్వం, ఆత్మస్థైర్యం ఆధారంగా ఇకపై యువత భవిత నిర్దేశితమవుతుంది. వీఐపీ (అతిముఖ్య వ్యక్తి) సంస్కృతి బదులు ఈపీఐ (ప్రతి వ్యక్తి ముఖ్యమే) అనే సంస్కృతిని తీసుకువచ్చేందుకు మా సర్కారు ప్రయత్నిస్తోంది' అని వివరించారు. ప్రభుత్వ పథకాలన్నింటికీ యువత మద్దతు లభిస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని యువతను కోరారు. ఎన్‌సీసీలోని మూడు విభాగాల నుంచి గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు. ఉత్తమ కేడెట్లకు పురస్కారాలు ప్రదానం చేశారు.



దిల్లీలో సోమవారం ఎన్‌సీసీ కవాతును వీక్షిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

12వ తరగతి వరకు ఉచిత విద్య

- ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు మోదీ సర్కారు మరో వరం

ఈనాడు, దిల్లీ: ఆర్థికంగా వెనుకబడిన వర్గా (ఈడబ్ల్యూఎస్)లకు పది శాతం రిజర్వేషన్లు కల్పించిన మోదీ ప్రభుత్వం మరో ముందడుగు వేయనుంది. ఆ వర్గానికి చెందిన విద్యార్థులకు 12వ తరగతి వరకు ఉచిత విద్యను కల్పించనుంది. విద్యాహక్కు చట్టం కింద 6-14 ఏళ్లలోపు పేద విద్యార్థులకు ప్రయివేటు విద్యా సంస్థలు 25 శాతం రిజర్వేషన్లు కల్పించి ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉచితంగా విద్యను బోధించాల్సి ఉంది. దీనిని అమలు చేస్తున్న ప్రయివేటు విద్యా సంస్థలు తొమ్మిదో తరగతి నుంచి పూర్తి బోధన రుసుములను వసూలు చేస్తున్నాయి. ఇది చెల్లించలేని వారిని బయటకు పంపిస్తుండడంతో వారు తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేరాల్సి వస్తోంది. అంతవరకు ఆంగ్ల మాధ్యమంలో చదివిన ఆ విద్యార్థులు ప్రాంతీయ భాషల్లో చదవాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గమనించిన మోదీ ప్రభుత్వం విద్యా హక్కు చట్టం కింద ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు 12వ తరగతి వరకు ఉచిత విద్యను అందించాలని ఆలోచిస్తోంది.

ముస్లిం మహిళ వెనకపడడమే గుండూరావుకు తెలుసు

అనంత్‌కుమార్ వివాదాస్పద వ్యాఖ్యలు



దిల్లీ/బెంగళూరు: కేంద్రమంత్రి అనంత్ కుమార్ హెగ్డే మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు దినేశ్ గుండూరావు మతాంతర వివాహం గురించి చేసిన ప్రస్తావనతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన వ్యాఖ్యలను దినేశ్ గుండూరావు, ఆయన భార్య తీవ్రంగా ఖండించారు.

విజయాలేమిటో దయచేసి చెప్పాలి: హెగ్డే

'కేంద్రమంత్రి అయిన తర్వాత కర్ణాటకకు నేనేం చేశానంటూ ఈ వ్యక్తి (దినేశ్ గుండూరావు) వేసిన ప్రశ్నకు కచ్చితంగా సమాధానం చెబుతాను. అంతకంటే ముందు గుండూరావు తాను సాధించిన విజయాలేమిటో దయచేసి చెప్పాలి. నాకు మాత్రం ఓ ముస్లిం మహిళ వెంటపడిన వ్యక్తిగా మాత్రమే దినేశ్‌గుండూరావు తెలుసు.'

ఒరగబెట్టిందేమిటో చెప్పండి: దినేశ్

'కేంద్రమంత్రి పదవి చేపట్టిన తర్వాత అనంత్‌కుమార్ కర్ణాటక అభివృద్ధికి ఆయన ఏం చేశారు.. ఇంతలా దిగజారి వ్యాఖ్యానాలు చేయడం విచారకరం.'

ఆయనను ఎదుర్కోలేక..: టబూరావు

'రాజకీయంగా మా ఆయనను ఎదుర్కోలేక....నన్ను రాజకీయ బురదజల్లుడు కార్యక్రమంలోకి లాగుతున్నారు. భాజపా నాయకులకు ఓ సులువైన లక్ష్యంగా కనిపిస్తున్నట్లున్నాను. జన్మతః ముస్లింనైనా ముందుగా భారతీయురాలనని చెప్పుకోవడానికే ఎంతో గర్విస్తాను. చౌకబారు రాజకీయంలో నన్ను ఓ పావును చేయడం శోచనీయం.'

★ "కేంద్రమంత్రిగా కొనసాగడానికి అనంతకుమార్ అనర్హుడు. ఆయనను తొలగించాలి." – రాహుల్

ఓఆర్‌ఓపీకి కాంగ్రెస్ అర్థం వేరే

అమిత్ షా వ్యాఖ్య

సిమ్లా: ఓఆర్‌ఓపీ (వన్ ర్యాంకు- వన్ పెన్షన్...ఒకే ర్యాంకు ఒకే పెన్షన్)కు భాజపా అధ్యక్షుడు అమిత్ షా కొత్త భాష్యం చెప్పారు. కాంగ్రెస్ వారికి ఓఆర్‌ఓపీ అంటే 'ఓన్లీ రాహుల్.. ఓన్లీ ప్రియాంక' అని వ్యాఖ్యానించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పుర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. హమీర్‌పుర్ జిల్లా, పరిసర ప్రాంతాల వాసులు అధిక సంఖ్యలో సైన్యంలో పనిచేస్తుండడంతో ఆ ప్రాంతాన్ని అమరవీరుల భూమిగా పిలుస్తారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని అమిత్ షా ఓఆర్‌ఓపీపై మాట్లాడారు. తమ ప్రభుత్వం మాజీ సైనికులకు ఓఆర్‌ఓపీ అమలు చేసిందని చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇప్పుడు పేదరికం గురించి మాట్లాడుతున్నారని, మరి ఇంతవరకు వారి పాలనలో ఏం చేశారని ప్రశ్నించారు.

చిదంబరం, కార్తీలకు ఊరట

దిల్లీ: ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ కేసులో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత పి.చిదంబరం, ఆయన కుమారుడు కార్తీలను అరెస్టు చేయకుండా విధించిన గడువును దిల్లీ ప్రత్యేక సీబీఐ న్యాయస్థానం ఫిబ్రవరి 18 వరకు పొడిగించింది. ఈ కేసు తదుపరి విచారణ తేదీని ఫిబ్రవరి 1గా నిర్ణయించగా చిదంబరం అప్పటికి అందుబాటులో ఉండని విషయం న్యాయస్థానం దృష్టికి వచ్చింది. ఈనెల 11న జరిగిన విచారణలో చిదంబరం, కార్తీలతో పాటు ఐదుగురిని ప్రాసిక్యూట్ చేసేందుకు కేంద్రం అనుమతించిన విషయాన్ని సీబీఐ... న్యాయస్థానానికి నివేదించింది.

కార్తీని ప్రశ్నించే తేదీని తెలపండి: సుప్రీంకోర్టు

ఐఎన్‌ఎక్స్ మీడియా, ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ కేసుల్లో పి.చిదంబరం కుమారుడు కార్తీని ఎప్పుడు ప్రశ్నించేదీ ఈనెల 31లోగా తెలియజేయాలని సుప్రీంకోర్టు సోమవారం ఈడీని ఆదేశించింది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం ఈడీ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు స్పష్టం చేసింది.

లాలూ, కుటుంబ సభ్యులకు బెయిల్

దిల్లీ: ఇండియన్ రైల్వే కేటరింగ్, టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) కుంభకోణం కేసులో ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులకు బెయిల్ మంజూరు చేస్తూ సోమవారం ఇక్కడి ప్రత్యేక జడ్జి అరుణ్ భరద్వాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. లాలు భార్య రబ్రీదేవి, కుమారుడు తేజస్వీ యాదవ్‌కు కూడా బెయిల్ లభించింది.

లండన్‌లో ఖలిస్థాన్ మద్దతుదార్ల ఆగడం

లండన్: గణతంత్ర దినోత్సవం నాడు ఇండియా హౌస్ ఎదుట ఖలిస్థాన్ అనుకూల మద్దతుదార్లు త్రివర్ణ పతాకాన్ని దహనం చేయడంపై భారత దౌత్యకార్యాలయం తీవ్ర అభ్యంతరం తెలిపింది. దీనిపై నిరసన తెలుపుతూ బ్రిటిష్ విదేశాంగ శాఖకు లేఖ రాసింది. ఈ సంఘటనపై బ్రిటన్ విదేశాంగ శాఖ కూడా అసంతృప్తి వ్యక్తం చేసింది.

సావర్కర్‌ను నిర్లక్ష్యం చేశారు: శివసేన ధ్వజం

ముంబయి: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వి.డి.సావర్కర్‌కు కేంద్రప్రభుత్వం 'భారతరత్న' అవార్డు ప్రకటించకపోవడం దురదృష్టకరమని, ప్రధాని నరేంద్ర మోదీ హయాంలోనూ ఆయన నిర్లక్ష్యానికి గురయ్యారని శివసేన ఆవేదన వ్యక్తం చేసింది. "సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాలంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భాజపా గళమెత్తింది. అధికార పీఠమెక్కాక రామమందిరాన్నీ నిర్మించలేదు. సావర్కర్‌కు భారతరత్న ఇవ్వలేదు." అని తమ పత్రిక 'సామ్నా'లో సంపాదకీయం ప్రచురించింది. మహారాష్ట్రలో భాజపా, ఇతర పార్టీలతో కూటమిలో ఎప్పుడూ తామే 'పెద్దన్న'గా ఉంటామని శివసేన పేర్కొంది. ఆ పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ సోమవారం ముంబయిలో ఈ వ్యాఖ్యలు చేశారు.

బాంబు పేలుళ్ల కేసులో 14 మందిపై దోషనిర్ధారణ

గువాహటి: అసోంలో 88 మందిని బలిగొన్న 2008 నాటి బాంబు పేలుళ్ల కేసులో 'నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోల్యాండ్' (ఎన్‌డీఎఫ్‌బీ) అధిపతి రంజన్ దైమారి, మరో 14 మంది దోషులుగా తేలారు. ఈ మేరకు సీబీఐ ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి అపరేశ్ చక్రవర్తి తీర్పు చెప్పారు. దోషులకు బుధవారం శిక్షలను ఖరారు చేయనున్నారు.

కుంభకోణంపై దర్యాప్తును అడ్డుకుంటున్నారు: సీబీఐ

కోల్‌కతా, దిల్లీ: శారదా గొలుసుకట్టు కుంభకోణం కేసు దర్యాప్తులో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ యంత్రాంగం తమకు అడ్డంకులు సృష్టిస్తోందని సీబీఐ ఆరోపించింది. 'శారదా కుంభకోణం కేసులో ప్రభుత్వ యంత్రాంగం అన్ని సాక్ష్యాలను నాశనం చేసింది' అని సీబీఐ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. అందుకే తుది అభియోగపత్రం దాఖలు చేయడంలో జాప్యం చోటుచేసుకుంటోందని తెలిపారు.

★ గొలుసుకట్టు కుంభకోణం కేసులో తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కె.డి. సింగ్ యజమానిగా ఉన్న అల్‌కెమిస్ట్ ఇన్‌ఫ్రా రియాల్టీ లిమిటెడ్ సంస్థకు చెందిన రూ.239.29 కోట్ల ఆస్తులను ఈడీ జప్తు చేసింది.

శ్లోక పఠనాన్ని పరిశీలించాలి: సుప్రీంకోర్టు

దిల్లీ: సంస్కృత, హిందీభాషల్లో శ్లోకాలను పాఠశాలల్లో విద్యార్థులు ఉదయపు సమావేశాల్లో పఠించేలా చూడాలన్న అంశాన్ని ఓ రాజ్యాంగ ధర్మాసనం పరిశీలించాలన్న అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు సోమవారం వ్యక్తం చేసింది. కేంద్రీయ విద్యాలయాల్లో ప్రతిరోజూ ఉదయపు సమావేశంలో పిల్లలు కచ్చితంగా హిందీ, సంస్కృత శ్లోకాలను పఠించాలన్న అంశానికి సంబంధించిన పిటిషన్‌ను పరిశీలిస్తున్న జస్టిస్.ఆర్.ఎఫ్.నారిమన్ సారథ్యంలోని ధర్మాసనం సోమవారం ఈ అభిప్రాయాన్ని వెలిబుచ్చింది.

'గోవా టేపులు' నిజమైనవే

రఫేల్ రహస్యాలు పారికర్‌కు తెలుసు: రాహుల్

దిల్లీ: 'గోవా ఆడియో టేపులు' నిజమైనవేననీ, రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పంద రహస్యాలు మనోహర్ పారికర్‌కు తెలుసునని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. సంబంధిత దస్త్రం ఆయన వద్ద ఉండబట్టే ప్రధాని మోదీపై పైచేయి సాధించి గోవా ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ''రఫేల్ ఒప్పందానికి సంబంధించిన దస్త్రం తన పడకగదిలో ఉందని మంత్రివర్గ సమావేశం సందర్భంగా పారికర్ అన్నారు" అంటూ గోవా మంత్రి విశ్వజీత్ రాణె పేర్కొన్నట్టుగా చెబుతున్న ఆడియో క్లిప్ ఇటీవల బయటకొచ్చింది. ఇది కల్పితమని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ కొట్టిపారేశారు. అయితే- "రఫేల్‌పై గోవా ఆడియో టేపులు బయటకొచ్చి 30 రోజులవుతోంది. ఇంతవరకూ దీనిపై ఎఫ్ఐఆర్‌గానీ, విచారణగానీ, మంత్రిపై చర్యలుగానీ లేవు!" అంటూ రాహుల్ ట్వీట్ చేశారు.



ఉప రాష్ట్రపతితో కిర్గిజ్ విదేశాంగ మంత్రి భేటీ

భారత్‌లో పర్యటిస్తున్న కిర్గిజిస్థాన్ విదేశాంగ మంత్రి ఐదార్‌బెకోవ్ చింగిజ్ సోమవారం ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడిని కలిశారు. ద్వైపాక్షిక వాణిజ్యం వృద్ధి, పెట్టుబడులకు ప్రోత్సాహంపై వీరిద్దరూ చర్చలు జరిపారు. పర్యాటకం, విద్య, వ్యవసాయం సహా పలు రంగాల్లో బంధాలను బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు.

అది కాంగ్రెస్ అమలుచేయని హామీ

కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్

దిల్లీ: రాహుల్‌గాంధీ ప్రకటించిన 'పేదలకు కనీస ఆదాయ కల్పన' హామీ అమలుచేసే ఉద్దేశంతో ఇచ్చింది కాదనీ... గతంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వందలాది ఉత్తుత్తి హామీల్లాంటిదేనని కేంద్ర మంత్రి, భాజపా సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ సోమవారం విమర్శించారు. దీని అమలుకు అవసరమైన నిధుల సమీకరణ, నియమ నిబంధనలపై ఎలాంటి సిద్ధపాటు లేకుండానే ఆయన ఈ హామీని ప్రకటించారన్నారు. '1971లో గరీబీ హటావో (పేదరిక నిర్మూలన) నినాదంతో ఇందిరాగాంధీ ఎన్నికలకు వెళ్లి, రెండోసారి ప్రధాని అయ్యారు. మరి ఏమైంది? అప్పుడే దాన్ని అమలుచేసి ఉంటే ఇప్పుడు ప్రజల పరిస్థితి మరోలా ఉండేది కదా?' అని మంత్రి వ్యాఖ్యానించారు.

సొంత జిల్లాల్లో ఉంచొద్దు

- ఎన్నికల సమయంలో అధికారుల నియామకాలపై ఈసీ సూచనలు
- రాష్ట్రాలకు లేఖ



దిల్లీ: ఎన్నికల ప్రకటన మార్చి మొదటి వారంలో వెలువడుతుందన్న అంచనాల నేపథ్యంలో అధికారులు, ఉద్యోగుల బదిలీలు, నియామకాలకు సంబంధించి పలు సూచనలు చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) సోమవారం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాసింది. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు, ఎన్నికల కార్యదర్శులకు ఈ లేఖలు పంపింది. అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాల అధికారులకూ లేఖలు రాసింది. దీని ప్రకారం...

- ఎన్నికల నిర్వహణతో ప్రత్యక్ష సంబంధం ఉన్న అధికారులకు సొంత జిల్లాలో నియమించరాదు.
- దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తున్న అధికారులను కూడా ఆ జిల్లాలో ఉంచకూడదు.
- గత నాలుగు సంవత్సరాల కాలంలో మూడేళ్లుగా ఒకే జిల్లాలో పనిచేస్తున్నవారినీ, మే 31 నాటికి మూడేళ్లు పూర్తి చేసుకోనున్నవారినీ జిల్లా నుంచి బదిలీ చేయాలి.
- జిల్లా ఎన్నికల అధికారి/రిటర్నింగ్ అధికారి/అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి/పోలీసు ఇన్‌స్పెక్టర్/ సబ్ ఇన్‌స్పెక్టర్/ ఆపై స్థాయి అధికారులకు...గత సాధారణ ఎన్నికల్లోగానీ, 2017 మే 31కు ముందు జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లోగానీ పనిచేసిన నియోజకవర్గాల్లో తిరిగి పోస్టింగ్ ఇవ్వకూడదు.
- ఈ ఉత్తర్వులు జాయింట్ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, బీడీఓలు సంబంధిత స్థాయి అధికార్లు; ఐజీ, డీఐజీ, కమాండంట్లు, ఎస్పీలు, అదనపు ఎస్పీలు, డీఎస్పీ సంబంధిత ర్యాంకు పోలీసు అధికార్లకు వర్తిస్తాయి.
- స్పెషల్ బ్రాంచ్, కంప్యూటరైజేషన్ విభాగాల్లో పని చేసే పోలీసుల అధికారులకు ఇవి వర్తించవు.
- ఎన్నికలతో ప్రత్యక్ష సంబంధం లేని వైద్యులు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు కూడా వర్తించవు.
- ఏ అధికారి అయినా రాజకీయంగా పక్షపాతంతో వ్యవహరిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తే దర్యాప్తు చేయించాలి. నిజమని తేలితే ఆ ఉద్యోగిని బదిలీ చేయడంతో పాటు, శాఖాపరంగా చర్యలు తీసుకోవాలి.
- ఎన్నికల విధుల కోసం నియమితులయ్యే సెక్టర్ ఆఫీసర్/జోనల్ మేజిస్ట్రేట్‌కు ఈ నిబంధనలు వర్తించవు. వారి పనితీరుపై ప్రధాన ఎన్నికల అధికారి/ జిల్లా ఎన్నికల అధికారి/ రిటర్నింగ్ అధికారులు క్షుణ్ణంగా గమనించి, నిష్పక్షపాతంగా వ్యవహరించేటట్టు చూడాలి.
- క్రిమినల్ కేసులు నమోదయిన అధికారులకు కూడా ఎన్నికల విధులు అప్పగించకూడదు.
- ఇందుకు అనుగుణంగా బదిలీలు, నియామకాలను ఫిబ్రవరి 28లోగా పూర్తి చేయాలి.
- మార్చి మొదటి వారంలో ఇందుకు సంబంధించిన నివేదికను సమర్పించాలి.

'పీసా'లో చేరిన భారత్

- అంతర్జాతీయంగా విద్యా ప్రమాణాల లెక్కింపు: జావడేకర్

ఈనాడు, దిల్లీ: మన విద్యార్థుల ప్రమాణాలు అంతర్జాతీయంగా ఏ స్థాయిలో ఉన్నాయో మదింపు చేసేందుకు ఉద్దేశించిన కార్యక్రమం 'పీసా'లో భారత్ చేరినట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ సోమవారం వెల్లడించారు. 'ప్రోగ్రాం ఫర్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ అసెస్‌మెంట్'గా పిలిచే ఈ కార్యక్రమానికి సంబంధించిన అవగాహన ఒప్పందంపై కేంద్ర మంత్రి నేతృత్వంలో మానవ వనరుల శాఖ అధికారులు, ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) ప్రతినిధులు సంతకాలు చేశారు. 2021 నుంచి 10, 11, 12 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్ష జరుగుతుందని మంత్రి వివరించారు. దీనిద్వారా ప్రపంచ వ్యాప్తంగా 80 దేశాల విద్యార్థుల ప్రమాణాలను లెక్కిస్తుండగా.. తాజాగా ఇందులో భారత్ కూడా చేరింది. దేశంలోని ఓ ప్రాంతాన్ని ఎంపికచేసి అక్కడున్న పాఠశాలల విద్యార్థులను ర్యాండమ్‌గా తీసుకొని ప్రశ్నపత్రాలు ఇచ్చి వారి విద్యాప్రమాణాల స్థాయిని అంచనా వేస్తారు. విద్యార్థుల పఠనాశక్తి, లెక్కలు, సైన్స్ అర్థం చేసుకొనే సామర్థ్యం, ఉమ్మడిగా సమస్యలను పరిష్కరించే శక్తిసామర్థ్యాల ఆధారంగా విద్యార్థుల స్థాయిని అంచనా వేస్తారు. ఈ పరీక్షల ఆధారంగా భారత్‌కు అంతర్జాతీయ ర్యాంకింగ్ ఇస్తారని, తదనుగుణంగా మనం విద్యాప్రమాణాల రీత్యా ఏస్థాయిలో ఉన్నామో అంచనా వేసుకోవడానికి వీలవుతుందని మంత్రి చెప్పారు. దాని ప్రకారం ఉపాధ్యాయ విద్య, ఇన్‌సర్వీస్ శిక్షణ, పాఠ్యాంశాల్లో సంస్కరణలు తీసుకొస్తామన్నారు. ప్రస్తుతం జాతీయస్థాయిలో 3, 5, 8 తరగతుల విద్యార్థుల ప్రమాణాలను లెక్కిస్తున్నామని, ఇకమీదట అంతర్జాతీయస్థాయిలో అదే తరహా పరీక్ష ఉంటుందన్నారు.

పౌరసత్వ బిల్లుపై నిరసన గళం

గువాహటి: వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లుపై అభ్యంతరాలు తెలిపేందుకు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన భాజపా మిత్రపక్షాలైన ప్రాంతీయ పార్టీలన్నీ ఒకే వేదికపైకి రానున్నాయి. గువాహటిలో మంగళవారం సమావేశం కావడానికి ఆయా పార్టీలన్నీ నిర్ణయించాయి. ఈ సమావేశానికి బిహార్‌లోని ఎన్‌డీయే భాగస్వామి అయిన జేడీయూ, ఇటీవల భాజపాతో తెగతెంపులు చేసుకున్న అస్సాం గణ పరిషత్ (ఏజీపీ)లు కూడా హాజరవుతున్నాయి. ఆయా పార్టీలన్నీ భేటీకి సమాయత్తమయ్యేలా మేఘాలయ ముఖ్యమంత్రి, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ) అధ్యక్షుడు కాన్రాడ్ కే సంగ్మా కీలకపాత్ర పోషించారు. ఎంఎన్ఎఫ్ (మిజోరం), ఎన్‌డీపీపీ (నాగాలాండ్), ఐపీఎఫ్‌టీ (త్రిపుర), ఎస్‌డీఎఫ్ (సిక్కిం) పార్టీలు పాల్గొంటున్నాయి. అరుణాచల్, నాగాలాండ్, మణిపుర్‌లకు చెందిన ఎన్‌పీపీ నేతలు కూడా హాజరవుతున్నారు. భేటీకి గాను ఆయా పార్టీల నేతలంతా గువాహటికి చేరుకుంటున్నారు. భారత్‌లో ఆరేళ్లు నివాసం ఉన్న బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్గాన్‌లకు చెందిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించేందుకు ఈ బిల్లు ఉద్దేశించిన సంగతి తెలిసిందే.

సౌర 'శక్తి' తోడుగా..

ఈమె పేరు శెల్వమ్మ(75). బెంగళూరులోని కర్ణాటక అసెంబ్లీ ఎదుట 20 ఏళ్లుగా మొక్కజొన్న పొత్తులు విక్రయిస్తోంది. పొత్తులను బొగ్గులపై కాల్చేందుకు కష్టపడేది. ఇప్పుడు ఆమెకు సౌర శక్తి తోడైంది. సౌర విద్యుత్‌తో తిరిగే ఫ్యాన్‌తో ఆమె చేతులకు ఉపశమనం లభించింది. ఆమె లాంటి వారికోసం ఈ ఉత్పత్తులను స్వచ్ఛంద సంస్థ 'సెల్కో సోలార్ లైట్ ప్రైవేట్ లిమిటెడ్' ప్రత్యేకంగా తయారుచేసింది. లిథియం అయాన్ బ్యాటరీ సాయంతో ఇవి చక్కగా పనిచేయడం విశేషం.



ఐసీఐసీఐ కేసులో జోరు తగ్గించనున్న సీబీఐ

దిల్లీ: ఐసీఐసీఐ బ్యాంకు-వీడియోకాన్ రుణాల వ్యవహారంలో సీబీఐ కేసు నమోదు చేసిన నేపథ్యంలో బ్యాంకర్లపై 'దుస్సాహసం' వద్దన్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సలహా మేరకు సీబీఐ నడుచుకోనుంది. ఆ కేసులో స్వాధీనం చేసుకున్న పత్రాలను పరిశీలించాకే అనుమానితులను ప్రశ్నించాలని భావిస్తోంది. ఈ కేసులో బ్యాంకు మాజీ సీఈవో చందా కొచ్చర్‌పై సీబీఐ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. చందా కొచ్చర్ నివాసంలో ఎప్పుడు సోదాలు నిర్వహిస్తారని ప్రశ్నించినప్పుడు.. అది దర్యాప్తు అధికారి విచక్షణ మీద ఆధారపడి ఉంటుందని దర్యాప్తు సంస్థ వర్గాలు తెలిపాయి. ఈ కేసులో ఈ నెల 22న ఎఫ్ఐఆర్ దాఖలైంది. ఆ తర్వాత కేసు ఇన్‌ఛార్జిని సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు మార్చారు. అప్పటివరకూ బాధ్యతలు చేపట్టిన సుధాంశు ధర్ మిశ్రను రాంచీకి బదిలీ చేసి, మోహిత్ గుప్తాకు పగ్గాలు అప్పగించారు. ఈ బదిలీని సీబీఐ వర్గాలు సమర్థించుకున్నాయి. సోదాలకు సంబంధించిన సమాచారం లీక్ కావడంలో ఆయన ప్రమేయం ఉండొచ్చని పేర్కొన్నాయి. సీబీఐ 'సూటు-బూటు వాలాల'పై దర్యాప్తు చేస్తున్నప్పుడు ప్రభుత్వం దాన్ని 'దుస్సాహసం'గా పేర్కొంటోందని ఆ పార్టీ అధికార ప్రతినిధి మనీశ్ తివారి ఆరోపించారు.

10 పదేళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో భారత్ వన్డే సిరీస్ గెలిచింది. చివరిసారి 2009లో అక్కడ టీమ్‌ఇండియా సిరీస్ నెగ్గింది.

ఛాంపియన్స్

టీమ్ ఇండియాకు ఎదురేలేదు. న్యూజిలాండ్ నుంచి పోటీనే లేదు. ప్రపంచకప్ ముంగిట ప్రత్యర్థులందరికీ గట్టి హెచ్చరికలు పంపుతూ మ్యాచ్ మ్యాచ్‌కూ జోరుపెంచుతున్న కోహ్లీసేన మూడో వన్డేలో మరింత రెచ్చిపోయింది. బ్యాటుతో, బంతితో తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంటూ కివీస్‌ను చిత్తుగా ఓడించింది. మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే ఐదు వన్డేల సిరీస్‌ను చేజిక్కించుకుంది. ఈ పర్యటనలో కోహ్లీకి ఇదే ఆఖరి మ్యాచ్.

కొట్టేశారు అలవోకగా...

- భారత్‌దే వన్డే సిరీస్
- మూడో మ్యాచ్‌లో కివీస్ చిత్తు
- మెరిసిన షమి, రోహిత్, కోహ్లి

మౌంట్ మాంగనుయ్

అద్భుత ఫామ్‌లో ఉన్న టీమ్ ఇండియా ఖాతాలో మరో సిరీస్. న్యూజిలాండ్‌పై అదిరే ప్రదర్శనను కొనసాగిస్తూ కోహ్లీసేన వన్డే సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఆల్ రౌండ్ సత్తా చాటిన భారత్.. సోమవారం మూడో వన్డేలో ఏడు వికెట్ల తేడాతో కివీస్‌ను అలవోకగా మట్టికరిపించి సిరీస్‌లో 3-0తో తిరుగులేని ఆధిక్యం సంపాదించింది. షమి (3/41), భువనేశ్వర్ (2/46), పాండ్య (2/45), చాహల్ (2/51) విజృంభించడంతో మొదట న్యూజిలాండ్ 49 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది. రాస్ టేలర్ (93; 106 బంతుల్లో 9×4), లేథమ్ (51; 64 బంతుల్లో 1×4, 1×6) ఆదుకోకుంటే ఆ జట్టు చాలా తక్కువ స్కోరుకే పరిమితమయ్యేది. రోహిత్ (62; 77 బంతుల్లో 3×4, 2×6), కోహ్లి (60; 74 బంతుల్లో 6×4, 1×6) మెరవడంతో లక్ష్యాన్ని భారత్ 43 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. రాయుడు (40 నాటౌట్; 42 బంతుల్లో 5×4, 1×6), దినేశ్ కార్తీక్ (38 నాటౌట్; 38 బంతుల్లో 5×4, 1×6) రాణించారు. షమికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. తొడ కండరాలు పట్టేయడంతో దూరమైన ధోని స్థానంలో కార్తీక్, విజయ్ శంకర్ స్థానంలో పాండ్య ఈ మ్యాచ్‌కు జట్టులోకి వచ్చారు. నాలుగో వన్డే గురువారం జరుగుతుంది.



1 న్యూజిలాండ్‌లో రెండు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'లు గెలిచిన ఏకైక భారతీయుడిగా షమి నిలిచాడు.

ఛేదనలో అలవోకగా...: భారత టాప్ ఆర్డర్‌కు కళ్లెం వేయడమే వన్డే సిరీస్‌లో కీలకమని మొదటి నుంచీ న్యూజిలాండ్ చెబుతోంది. కానీ ఆ పని చేయడంలో మరోసారి విఫలమైంది. ఐతే భారత్‌కు మెరుపు ఆరంభమేమీ లభించలేదు. 9వ ఓవర్లో ధావన్ (28; 27 బంతుల్లో 6×4) ఔటయ్యేటప్పటికి స్కోరు 38 పరుగులు. ధావన్ ఔటయ్యాక రోహిత్ కాస్త వేగం పెంచాడు. శాంట్నర్ బౌలింగ్‌లో నేరుగా సిక్స్ కొట్టి తన ఉద్దేశాన్ని చాటి చెప్పాడు. మరోవైపు కోహ్లి.. ఫెర్గూసన్ బౌలింగ్‌లో పాయింట్లో ఫోర్, సోధి బౌలింగ్‌లో రెండు ఫోర్లు కొట్టాడు. సోధి బౌలింగ్‌తో మొదట బంతిని మిడ్‌వికెట్లో బౌండరీ దాటించిన కోహ్లి.. కట్ షాట్‌తో మరో బౌండరీ సాధించాడు. 63 బంతుల్లో అర్ధశతకం చేసిన రోహిత్ ఫెర్గూసన్ బౌలింగ్‌లో సిక్స్ కొట్టాడు. కోహ్లి కూడా ఫెర్గూసన్ బౌలింగ్‌లో ఓ సిక్స్ దంచాడు. అతడు 59 బంతుల్లో అర్ధసెంచరీకి చేరుకున్నాడు. ఐతే శాంట్నర్ బౌలింగ్‌లో ముందుకొచ్చి భారీ షాట్ ఆడబోయిన రోహిత్.. స్టంపౌట్ కావడంతో 113 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికే నికోల్స్ బౌలింగ్‌లో కోహ్లి వెనుదిరిగాడు. అప్పటికి స్కోరు 168. కానీ రాయుడు, దినేశ్ కార్తీక్ కివీస్‌కు ఎలాంటి అవకాశమూ ఇవ్వలేదు. అభేద్యమైన నాలుగో వికెట్‌కు 77 పరుగులు జోడించి జట్టును విజయతీరాలకు చేర్చారు.

ఆదుకున్న టేలర్: అంతకుముందు న్యూజిలాండ్ ఇన్నింగ్స్ సందర్భంగా హార్దిక్ పాండ్య చక్కగా బౌలింగ్ చేశాడు. మిడిల్ ఓవర్లలో కివీస్ పరుగుల వేగానికి కళ్లెం వేశాడు. టాస్ గెలిచిన న్యూజిలాండ్ బ్యాటింగ్ ఎంచుకోగా.. కొత్త బంతి బౌలర్లు షమి, భువనేశ్వర్ భారత్‌కు శుభారంభాన్నిచ్చారు. 26 పరుగులకే ఓపెనర్లిద్దరినీ వెనక్కి పంపారు. మన్రో (7)ను ఔట్ చేయడం ద్వారా రెండో ఓవర్లో షమి వికెట్ల పతనాన్ని ఆరంభించగా.. గప్టిల్ (13)ను భువి వెనక్కి పంపాడు. విలియమ్సన్ (28) మరోసారి ఆరంభాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. అతణ్ని చాహల్ వెనక్కి పంపాడు. ఫ్లిక్ షాట్ ఆడేందుకు యత్నించిన విలియమ్సన్.. పాండ్య అందుకున్న కళ్లు చెదిరే క్యాచ్‌కు నిష్క్రమించాడు. ఐతే 59 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన కివీస్‌ను టేలర్, లేథమ్ ఆదుకున్నారు. వాళ్లిద్దరూ నాలుగో వికెట్‌కు 119 పరుగులు జోడించడంతో న్యూజిలాండ్ 38వ ఓవర్లో 178/3తో బలమైన స్థితిలో నిలిచింది. కానీ భారత బౌలర్లు బలంగా పుంజుకున్నారు. 65 పరుగులకే చివరి ఏడు వికెట్లు పడగొట్టి కివీస్ భారీ స్కోరు ఆశలపై నీళ్లు చల్లారు. లేథమ్‌ను ఔట్ చేయడం ద్వారా నాలుగో వికెట్ భాగస్వామ్యాన్ని చాహల్ విడదీస్తే... పాండ్య తన రెండో స్పెల్‌లో వరుస ఓవర్లలో నికోల్స్ (6), శాంట్నర్ (3)లను వెనక్కి పంపాడు. అప్పటికి స్కోరు 198/6. ప్రమాదకరంగా కనిపించిన టేలర్.. 46వ ఓవర్లో షమికి దొరికిపోయాడు. ఆఫ్‌స్టంప్ ఆవల షమి వేసిన బంతిని థర్డ్‌మ్యాన్ దిశగా పంపబోయిన టేలర్.. కార్తీక్‌కు చిక్కాడు. ఆ తర్వాత కివీస్ ఇన్నింగ్స్ వేగంగా ముగిసింది.



పాండ్య 2/45

రోహిత్ 62

కోహ్లి 60

పాండ్య సూపర్

సస్పెన్షన్ తొలగిపోయాక తొలిసారి భారత జట్టు తరపున బరిలోకి దిగిన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య అదిరే ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. కివీస్‌కు కళ్లెం వేయడంలో కీలక పాత్ర పోషించాడు. పది ఓవర్లలో 45 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టిన అతడు.. చురుకైన ఫీల్డింగ్‌తోనూ ఔరా అనిపించాడు. చాహల్ బౌలింగ్‌లో అతడు విలియమ్సన్ క్యాచ్‌ను అందుకున్న తీరు అద్భుతం. విలియమ్సన్ ముందుకొచ్చి ఫ్లిక్ చేయగా.. బంతి మిడ్‌వికెట్లో లేచింది. పాండ్య.. అమాంతం ఎడమవైపునకు డైవ్ చేస్తూ గాల్లో బంతిని ఒడిసిపట్టాడు. మొత్తం మీద వివాదం కలిగించిన ఒత్తిడి నుంచి త్వరగా బయటపడి, పాండ్య మెరుగైన ప్రదర్శన చేయడం భారత క్రికెట్‌కు శుభసూచకమే.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: గప్టిల్ (సి) కార్తీక్ (బి) భువనేశ్వర్ 13; మన్రో (సి) రోహిత్ (బి) షమి 7; విలియమ్సన్ (సి) పాండ్య (బి) చాహల్ 28; రాస్ టేలర్ (సి) కార్తీక్ (బి) షమి 93; లేథమ్ (సి) రాయుడు (బి) చాహల్ 51; నికోల్స్ (సి) కార్తీక్ (బి) పాండ్య 6; శాంట్నర్ (సి) కార్తీక్ (బి) పాండ్య 3; బ్రాస్‌వెల్ రనౌట్ 15; సోధి (సి) కోహ్లి (బి) షమి 12; బౌల్ట్ (సి) షమి (బి) భువనేశ్వర్ 2; ఫెర్గూసన్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (49 ఓవర్లలో ఆలౌట్) **243; వికెట్ల పతనం:** 1-10, 2-26, 3-59, 4-178, 5-191, 6-198, 7-222, 8-239, 9-239; **బౌలింగ్:** భువనేశ్వర్ 10-1-46-2; షమి 9-0-41-3; చాహల్ 9-0-51-2; హార్దిక్ పాండ్య 10-0-45-2; కుల్‌దీప్ యాదవ్ 8-0-39-0; కేదార్ జాదవ్ 3-0-17-0

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (స్టంప్డ్) లేథమ్ (బి) శాంట్నర్ 62; ధావన్ (సి) టేలర్ (బి) బౌల్ట్ 28; కోహ్లి (సి) నికోల్స్ (బి) బౌల్ట్ 60; రాయుడు నాటౌట్ 40; దినేశ్ కార్తీక్ నాటౌట్ 38; ఎక్స్‌ట్రాలు 17 **మొత్తం:** (43 ఓవర్లలో 3 వికెట్లకు) **245; వికెట్ల పతనం:** 1-39, 2-152, 3-168; **బౌలింగ్:** బౌల్ట్ 10-1-40-2; బ్రాస్‌వెల్ 6-0-49-0; ఫెర్గూసన్ 10-1-57-0; శాంట్నర్ 10-0-45-1; ఇష్ సోధి 7-0-53-0

నొవాక్.. పై పైకి!



పారిస్: ఏడాది కిందట జకోవిచ్ పరిస్థితి చూస్తే.. రిటైర్మెంట్ దిశగా సాగుతున్నట్లు అనిపించింది. ఆటలో పతనం.. ర్యాంకుల్లో పతనం.. టైటిళ్ల గురించి ఆలోచించే పరిస్థితే లేదు. అలాంటి వాడు అనూహ్యంగా మూడు వరుస గ్రాండ్‌స్లామ్‌లు గెలిచి సంచలనం సృష్టించాడు. ర్యాంకుల్లో ఒక్కసారిగా దూసుకొచ్చి మళ్లీ అగ్రస్థానం సాధించాడు. ఇప్పుడు అతడిని అందుకునే ఆటగాడు దరిదాపుల్లో కనిపించడం లేదు. గత ఏడాదిని నంబర్‌వన్ ర్యాంకుతో ముగించిన జకోవిచ్.. ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచి తన ర్యాంకును మరింత పదిలపరుచుకున్నాడు. ర్యాంకింగ్ పాయింట్లలో అతను ప్రత్యర్థులు అందుకోలేని విధంగా ఇంకా పైకి వెళ్లిపోయాడు. ఇప్పుడు అతడి ఖాతాలో 10,955 పాయింట్లున్నాయి. రెండో స్థానంలో ఉన్న నాదల్ (8,320)కు అతడికి అంతరం 2,600కు పైనే. ఆస్ట్రేలియన్ ఓపెన్ ముందు వరకు మూడో స్థానంలో ఉన్న దిగ్గజ ఆటగాడు రోజర్ ఫెదరర్ (4,600) తాజా ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు తగ్గి ఆరో ర్యాంకుకు పడిపోవడం గమనార్హం. జ్వెరెవ్ (6,475), డెల్‌పొట్రో (5,060), అండర్సన్ (4,845) ఒక్కో ర్యాంకు మెరుగై వరుసగా 3, 4, 5 స్థానాల్లో నిలిచారు. వరుసగా రెండో గ్రాండ్‌స్లామ్ (ఆస్ట్రేలియన్ ఓపెన్) గెలిచిన జపాన్ అమ్మాయి ఒసాకా అగ్రస్థానానికి చేరగా.. రన్నరప్ క్విటోవా రెండో స్థానం సాధించింది.



రాయుడి బౌలింగ్‌కు బ్రేక్

దుబాయ్: అంబటి రాయుడు అంతర్జాతీయ క్రికెట్లో బౌలింగ్ చేయకుండా ఐసీసీ సస్పెన్షన్ విధించింది. జనవరి 13న ఆస్ట్రేలియాతో వన్డే మ్యాచ్‌లో రాయుడు బౌలింగ్ శైలి అనుమానాస్పదంగా ఉన్నట్లు రిఫరీ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు చేసిన 14 రోజులలోపు బౌలర్ ఐసీసీ పరీక్షకు హాజరు కావాలి. కానీ రాయుడు హాజరు కాకపోవడంతో అతని బౌలింగ్‌పై తక్షణం నిషేధం విధిస్తున్నట్లు ఐసీసీ వెల్లడించింది. అతను పరీక్షకు హాజరు అయ్యే వరకు ఈ సస్పెన్షన్ ఉంటుందని ఐసీసీ పేర్కొంది.

అప్పటికి గిల్‌లో 10 శాతం కూడా లేను: కోహ్లి

మౌంట్ మాంగనుయ్: టీమ్‌ఇండియాలో చోటు దక్కించుకున్న శుభ్‌మన్ గిల్‌పై కెప్టెన్ విరాట్ కోహ్లి ప్రశంసల జల్లు కురిపించాడు. 19 ఏళ్ల గిల్‌లో గొప్ప ప్రతిభ ఉందని.. తాను అదే వయసులో ఉన్నపుడు అందులో 10 శాతం ప్రతిభ కూడా లేదని విరాట్ అన్నాడు. "నాకు 19 ఏళ్లున్నపుడు శుభమన్ ప్రతిభలో పది శాతం కూడా నాలో లేదు. కుర్రాళ్ల ఆత్మవిశ్వాసం భారత జట్టుకు ఎంతో మేలు చేస్తుంది" అని చెప్పాడు. ఒక టీవీ షోలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం వల్ల సస్పెన్షన్‌కు గురై, తిరిగి టీమ్‌ఇండియాలోకి వచ్చిన హార్దిక్ పాండ్యలో ఆత్మవిశ్వాసం నింపే ప్రయత్నం చేశాడు కోహ్లి. "జీవితంలో ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైనపుడు రెండు దారులుంటాయి. దాని వల్ల పాతాళానికి పడిపోయే ప్రమాదముంటుంది. అలా కాకుండా దాన్నుంచి పాఠం నేర్చుకుని, స్ఫూర్తి నింపుకుని ముందుకు సాగొచ్చు. వివాదం తర్వాత పాండ్య మెరుగైన క్రికెటర్‌గా రూపుదిద్దుకుంటాడని అనుకుంటున్నా. అతనది చేయగలడు" అని కోహ్లి అన్నాడు.

సిరీస్‌పై అమ్మాయిల కన్ను



మంధాన

మౌంట్ మాంగనుయ్: భారత పురుషుల జట్టు న్యూజిలాండ్‌పై వన్డే సిరీస్ గెలవగా.. అమ్మాయిల జట్టు కూడా కివీస్‌పై సిరీస్ గెలిచేందుకు రంగం సిద్ధం చేసుకుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి వన్డేలో ఘన విజయం సాధించిన భారత్.. మంగళవారం జరిగే రెండో వన్డేలోనూ గెలిచి మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్ నెగ్గాలనే పట్టుదలతో ఉంది. తొలి వన్డేలో బ్యాటింగ్‌లో స్మృతి మంధాన, జెమిమా రోడ్రిగ్స్, బౌలింగ్‌లో ఏక్తాబిస్త్, పూనమ్ యాదవ్, దీప్తిశర్మ అదరగొట్టారు. రెండో వన్డేలోనూ వీళ్లు సత్తా చాటుతారని భారత్ భావిస్తోంది. వీళ్లతో పాటు వెటరన్ స్టార్, కెప్టెన్ మిథాలీరాజ్ కూడా రాణిస్తే టీమ్‌ఇండియాకు తిరుగుండదు.

సౌరాష్ట్రను రంజీ ఫైనల్ చేర్చిన పుజారా



పుజారా

బెంగళూరు: అద్భుత ఫామ్‌లో ఉన్న చెతేశ్వర్ పుజారా (131 నాటౌట్; 266 బంతుల్లో 17×4) అజేయ సెంచరీ చేయడంతో రంజీ ట్రోఫీలో సౌరాష్ట్ర ఫైనల్లో ప్రవేశించింది. సెమీస్‌లో సౌరాష్ట్ర 5 వికెట్ల తేడాతో కర్ణాటకను ఓడించింది. 279 పరుగుల ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 224/3తో సోమవారం ఆఖరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సౌరాష్ట్రను పుజారా, మరో సెంచరీ వీరుడు జాక్సన్ (100; 217 బంతుల్లో 15×4)తో కలిసి నడిపించాడు. సెంచరీ చేశాక జాక్సన్ ఔట్ కావడం.. ఆ వెంటనే మరో వికెట్ పడడంతో ఉత్కంఠ నెలకొన్నా.. మన్కడ్ (7 నాటౌట్)తో కలిసి పుజారా సౌరాష్ట్రను విజయతీరాలకు చేర్చాడు. కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 275 పరుగులు చేయగా.. సౌరాష్ట్ర 236 పరుగులు చేసింది. కర్ణాటక రెండో ఇన్నింగ్స్‌లో 239 పరుగులు సాధించింది. ఫిబ్రవరి 3న ప్రారంభమయ్యే ఫైనల్లో సౌరాష్ట్ర.. డిఫెండింగ్ ఛాంపియన్ విదర్భతో తలపడనుంది.

అతడు ఉండాలన్నది అందుకే



మౌంట్ మాంగనుయ్: సస్పెన్షన్ పూర్తి చేసుకుని వచ్చాక ఆడిన తొలి మ్యాచ్‌లో చక్కటి ప్రదర్శన చేసిన టీమ్‌ఇండియా యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యను దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ ఆకాశానికెత్తేశాడు. అతడి వల్ల భారత జట్టుకు సమతూకం వచ్చిందని ఆయన అభిప్రాయపడ్డాడు. "పాండ్య చాలా చాలా ఆకట్టుకున్నాడు. ఇందుకే అతను జట్టులో ఉండాలని యాజమాన్యం కోరుకుంది. జట్టులో ఉన్న చిన్న ఖాళీని అతను పూడ్చాడు. దీని వల్ల సమతూకం వచ్చింది. జట్టుకు మిగతా అవసరాలన్నీ పాండ్య తీర్చాడు. పాండ్య చక్కటి లైన్‌లో బౌలింగ్ చేశాడు. బౌన్సర్లను చక్కగా ఉపయోగించుకున్నాడు. మైదానంలో కదిలే కరెంటులాగా కనిపించాడు. జట్టుకు పాండ్య తెచ్చే సానుకూలత అది. హార్దిక్ తిరుగులేని ఫీల్డర్. అతను అసాధ్యమైన క్యాచ్‌లను అందుకోగలడు. రనౌట్లు చేస్తాడు. బ్యాటు, బంతితోనూ చక్కటి ప్రదర్శన చేయగలడు" అని సన్నీ అన్నాడు.

కివీస్ జట్టులో నీషమ్, అస్టల్


మౌంట్ మౌంగనుయ్: భారత్‌తో ఐదు వన్డేల సిరీస్‌ను ఇప్పటికే 0-3తో చేజార్చుకున్న న్యూజిలాండ్ చివరి రెండు వన్డేలకు జట్టులో రెండు మార్పులు చేసింది. ఆల్‌రౌండర్ జిమ్మి నీషమ్‌తో పాటు లెగ్‌స్పిన్నర్ టాడ్ అస్టల్ ఆఖరి రెండు మ్యాచ్‌లు ఆడనున్నారు. బ్రాస్‌వెల్ స్థానంలో నీషమ్.. ఇష్ సోధీ స్థానంలో అస్టల్ ఆడతారు. గత నవంబర్‌లో పాకిస్థాన్‌తో వన్డే సిరీస్‌లో గాయపడిన అస్టల్ కోలుకోవడంతో సెలక్టర్లు అతణ్ని ఎంపిక చేశారు. ఇటీవల లంకతో సిరీస్‌లో నీషమ్... కివీస్ జట్టులో ఉన్నాడు. అయితే అతనూ గాయంతో జట్టుకు దూరమయ్యాడు.

స్పెయిన్‌ను నిలువరించిన భారత్



ముర్సియా (స్పెయిన్): భారత మహిళల హాకీ జట్టు.. స్పెయిన్ పర్యటనలో పుంజుకుంది. తొలి మ్యాచ్‌లో 2-3తో ఓడిన భారత అమ్మాయిలు తర్వాతి మ్యాచ్‌లో బలమైన స్పెయిన్ జట్టును నిలువరించారు. సోమవారం జరిగిన మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది. గుర్జీత్ కౌర్ 43వ నిమిషంలో గోల్ కొట్టి భారత్‌ను ఆధిక్యంలో నిలపగా.. ఇంకో ఆరు నిమిషాలకే మరియా టోర్ట్ గోల్‌తో స్పెయిన్ స్కోరు సమం చేసింది. తర్వాత ఇరు జట్లూ గోల్ కోసం ప్రయత్నించి విఫలమయ్యాయి.

శస్త్రచికిత్స తర్వాత చెలరేగిపోతున్నాడు



మౌంట్ మాంగనుయ్: న్యూజిలాండ్ సీనియర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ లేటు వయసులో ఘాటైన ప్రదర్శనతో ఆశ్చర్యపరుస్తున్నాడు. ఒక దశలో వరుస వైఫల్యాలతో అంతర్జాతీయ కెరీర్ ముగించేసేలా కనిపించిన రాస్.. ఇప్పుడు జట్టులో అత్యంత నిలకడైన ఆటగాడిగా కొనసాగుతున్నాడు. భారత్‌తో మూడో వన్డేలో 93 పరుగులతో టేలర్ టాప్‌స్కోరర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. దీనికి ముందు శ్రీలంకతో మూడు వన్డేల సిరీస్‌లో అతను వరుసగా 54, 90, 137 పరుగులు చేయడం విశేషం. గత రెండేళ్లుగా టేలర్ ప్రదర్శన గొప్పగా ఉంది. ఐతే అంతకుముందు టేలర్ ప్రదర్శన పేలవం. ఒక దశలో అతను రిటైరవుతాడని కూడా వార్తలొచ్చాయి. కంటిలో తలెత్తిన సమస్య కారణంగా బంతిని గుర్తించడంలో తడబాటు వల్ల అతడి బ్యాటింగ్ దెబ్బ తింది. దీనికి మందులతో చికిత్స కోసం ప్రయత్నించాడు కానీ.. పెద్దగా ఫలితం లేకపోయింది. దీంతో అతను శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఆ తర్వాత చూపు మెరుగైంది. ఆటా బాగుపడింది. శస్త్రచికిత్స చేయించుకున్నప్పటి నుంచి టేలర్ వన్డే సగటు 70.81గా ఉండటం విశేషం.



యాదాద్రి ఆలయ నగరిలో నిర్మితమయ్యే 'యాడా' అతిథిగృహం నమూనా

ఆలయ నగరిలో అధునాతన అతిథి గృహం

- 'యాడా' ఆధ్వర్యంలో నిర్మాణం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి క్షేత్రంలోని ఆలయ నగరిలో అధునాతన అతిథి గృహం సిద్ధమవుతోంది. రూ.2.5 కోట్ల అంచనా వ్యయంతో 2 వేల గజాల స్థలంలో యాదగిరిగుట్ట దేవాలయాభివృద్ధి ప్రాధికార సంస్థ (యాడా) దీన్ని నిర్మిస్తోంది. యాదాద్రి కొండ కింద ఉన్న పెద్దగుట్టపై ఆలయ నగరి నిర్మాణానికి 'యాడా' ప్రణాళికలు రూపొందించిన విషయం తెలిసిందే. అక్కడ నాలుగు రకాల కాటేజీలను నిర్మించనున్నట్లు 'యాడా' వైస్‌ఛైర్మన్ కిషన్‌రావు చెప్పారు.

తలనీలాల సేకరణకు గుత్తేదారుల వెనుకంజ

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాల సేకరణకు గుత్తేదారులు వెనుకాడుతున్నారు. విదేశాల్లో తలనీలాలకు ఆదరణ తగ్గిందని సదరు వ్యాపారులు తమ వేలం పాటను గతం కన్నా తక్కువ ధర పలకడంతో ఆలయ నిర్వాహకులు ఈ సారీ వేలం రద్దు చేశారు. యాదాద్రిలో ఈ తతంగం పది నెలలుగా కొనసాగుతోంది. సోమవారం పదో దఫా వేలం పాట నిర్వహించారు. 17 మంది వ్యాపారులు పాల్గొన్నా సేకరణ ధర అనుకూలించక హక్కును కల్పించే విధానాన్ని రద్దు పరిచారు. గతేడాది రూ.3.50 కోట్లు వేలం పాట ద్వారా రాగా అంతే మొత్తంలో ధర రావాలన్నది ఆలయ అధికారుల అంచనా. సోమవారం నిర్వహించిన వేలం పాటలో హెచ్చు పాట రూ.1.80 కోట్లు మాత్రమే రావడంతో మరో మారు వేలాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.



తితిదే డిప్యూటీ ఈవో లక్ష్మణ్ నాయక్‌కు డీడీలు అందజేస్తున్న దాత వి.వెంకట కనక శేషసాయి, కుటుంబ సభ్యులు

తితిదేకు రూ.కోటి విరాళం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి ఆస్ట్రేలియాలోని విక్టోరియా ప్రాంతానికి చెందిన ప్రవాసాంధ్రుడు వి.వెంకట కనకశేషసాయి మణికంఠ రూ.కోటి విరాళాన్ని సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన దాత ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. తండ్రి అనంత శ్రీనివాస్, తల్లి కవిత, సోదరి నాగసంతోష్ వైష్ణవిలతో కలిసి సోమవారం తిరుమలలోని దాతల విభాగంలో డిప్యూటీ ఈవో లక్ష్మణ్ నాయక్‌ను కలిసి విరాళానికి సంబంధించిన డీడీలను అందజేశారు. ఈ మొత్తాన్ని శ్రీవేంకటేశ్వర వేద పరిరక్షణ ట్రస్టు కింద జమ చేయాలని దాత తితిదేకు సూచించారు.

నకిలీ ఆధార్‌తో రజత్‌కుమార్‌కు ఓటు

- ఓపీ రావత్ ఓటరు కార్డు పైనా అనుమానాలు
- ఎవరో ఉద్దేశపూర్వకంగానే జాబితాలో చేర్చారు
- పోలీసులకు జీహెచ్ఎంసీ అధికారుల ఫిర్యాదు

ఈనాడు, హైదరాబాద్: 'రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి రజత్‌కుమార్ పేరుతో నకిలీ ఆధార్‌కార్డు సృష్టించి దాని ఆధారంగా ఆయనకు ఓటరు గుర్తింపు కార్డు తీసుకున్నారు. కేంద్ర ఎన్నికల మాజీ కమిషనర్ ఓపీ రావత్ పేరుతోనూ ఓటరు కార్డును తయారు చేశారు' అని నాంపల్లి నియోజకవర్గ ఎన్నికల అధికారి మహ్మద్ ఖాజా అలీ హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 'ఓపీ రావత్, రజత్‌కుమార్‌లు నాంపల్లి ఓటర్లే' అంటూ పత్రికల్లో ప్రచురితమైన వార్తలపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించారు. రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి రజత్‌కుమార్‌కు ఓటరు గుర్తింపు కార్డు ఎలా వచ్చిందని ఆరా తీశారు. రజత్‌కుమార్, ఓపీ రావత్ పేర్లు ఎన్నికల కమిషన్ 2018 నవంబరు 19న ప్రచురించిన నాంపల్లి నియోజకవర్గ ఓటరు జాబితాలో సీరియల్ నంబరు 1146, 1147లో ఉన్నాయని గుర్తించారు. రజత్‌కుమార్ పేరుతో ఓటరు కార్డు పొందేందుకు 2018 నవంబరు 3న అంతర్జాలం ద్వారా దరఖాస్తు చేశారని తెలుసుకున్నారు. రావత్, రజత్‌కుమార్‌ల పేర్లు ఉద్దేశపూర్వకంగా చేర్చేందుకే గుర్తు తెలియని వ్యక్తులు ఇలా చేశారని జీహెచ్ఎంసీ అధికారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరిద్దరూ మాసబ్‌ట్యాంక్‌లోని మహాత్మాగాంధీ నగర్‌లో 10-4-441/333 నెంబర్ గల ఇళ్లలో ఉంటున్నారని ఫారం 6లో దరఖాస్తుదారులు పేర్కొన్నారు. ఇందుకోసం నకిలీ ఆధార్ కార్డులు, విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లో సమర్పించారు. ప్రజా ప్రాతినిధ్యం చట్టంలోని 31వ సెక్షన్ ప్రకారం ఇది నేరమైనందున తగిన చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను అభ్యర్థించారు. జీహెచ్ఎంసీ అధికారులు సమర్పించిన ప్రాథమిక ఆధారాలతో కేసు నమోదు చేశామని డీసీపీ (నేర పరిశోధన) అవినాష్ మహంతి తెలిపారు.

విదేశీ విహారయాత్రకు రైల్వే ఉద్యోగులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వేలో పని చేస్తోన్న 114 మంది ఉద్యోగులు సోమవారం విదేశీ విహారయాత్రకు వెళ్లారు. ఐదు రోజుల పాటు దుబాయ్, షార్జా, అబుదాబిలోని పర్యాటక ప్రాంతాలను వారు సందర్శిస్తారు. ఇందుకయ్యే ఖర్చులో దక్షిణమధ్య రైల్వే 70శాతం రాయితీ కల్పిస్తోంది. సికింద్రాబాద్‌లోని రైలు నిలయం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి బయల్దేరిన బస్సులను జనరల్ మేనేజర్ ఆర్‌కే కుల్‌శ్రేష్ఠ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు ఉత్సాహంగా విధులను నిర్వర్తించేందుకు ఇలాంటి విహార యాత్రలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో అదనపు జీఎం జాన్ థామస్, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ ఎన్.వి.రమణారెడ్డి, ఐఆర్‌సీటీసీ గ్రూప్ జీఎం డి.నర్సింగరావు పాల్గొన్నారు.

రైల్వే భద్రతలో సాంకేతికతను వినియోగించాలి

రైల్వే భద్రతలో నూతన సాంకేతికతను వినియోగించడం ద్వారా ప్రమాదాలను అరికట్టాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం కోరారు. ఆరు డివిజన్ల మేనేజర్లతో సోమవారం ఆయన దూరదృశ్య సమీక్ష నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ.. స్టేషన్లలో మౌలిక వసతులను మెరుగుపర్చాలని ఆదేశించారు.



తమ్ సూర్యమ్ ప్రణమామ్యహమ్!

మేహ్సాణా: లోకానికి వెలుగులు ప్రసాదించే సూర్య దేవుడికి ఒకేసారి 1008 మంది యువతీ యువకులు చేసిన వందనంతో గుజరాత్‌లో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. మేహ్సాణాలోని ప్రఖ్యాత సూర్య దేవాలయ ప్రాంగణంలో వారంతా 108 నమస్కారాలు చేయడం కనువిందు చేసింది. వివేకానంద కేంద్రం ఘనంగా నిర్వహించిన ఈ సూర్యవందన కార్యక్రమాన్ని డ్రోన్లతో చిత్రీకరించారు. యోగాసనాల్లో సూర్య నమస్కారాల విశిష్టతను తెలియజేసేందుకు రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలిరోజు దేశంలోని 32 ప్రాంతాల నుంచి వచ్చిన యువతీయువకులు సూర్యమందిర స్వరాలకు అనుగుణంగా లయబద్ధంగా నమస్కారాలు చేశారు. సూర్య నమస్కారాల్లోని శాస్త్రీయ విజ్ఞానం, వాటిని ఆచరిస్తే కలిగే ప్రయోజనాలను కళ్లకు కట్టినట్లు తెలిపారు. రెండో రోజు వాటి ప్రాముఖ్యతను, చరిత్రను వివరిస్తూ లైట్ షో నిర్వహించారు.

విద్యుత్ సౌభాగ్యం పేలవం!

- ఎన్‌హెచ్‌పీసీ మాజీ సీఎండీ యోగేంద్ర ప్రసాద్ విమర్శ

దిల్లీ: దేశంలో విద్యుత్తు రంగం కాగితాల్లో మాత్రమే అద్భుతంగా కనిపిస్తోందని.. వాస్తవానికి అవ్యవస్థీకృతంగానూ, అస్తవ్యస్తంగానూ ఉందని జాతీయ జలవిద్యుత్తు సంస్థ (ఎన్‌హెచ్‌పీసీ) మాజీ సీఎండీ యోగేంద్ర ప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన 'సౌభాగ్య' పథకం అమలు తీరు ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. సౌభాగ్య పథకం కింద ఈ నెలాఖరు నాటికి దేశంలో 100 శాతం విద్యుదీకరణను సాధించాల్సి ఉంది. అయితే దాని అమలు పేలవంగా ఉందని యోగేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. దేశంలో విద్యుత్ పరిస్థితిపై ఆయన 'ఈటీవీ భారత్'తో ప్రత్యేకంగా మాట్లాడారు. "క్షేత్ర స్థాయిలో 'సౌభాగ్య' అమలు మసకబారుతోంది. మారుమూల గ్రామాలకు వెళ్లి పరిశీలించా. 400 వోల్టుల విద్యుత్తుకు గాను వాస్తవంగా 200-250 వోల్టుల మధ్యే సరఫరా అవుతోంది. విద్యుత్ మోటార్లు సరిగా పనిచేయకపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయాలు చూసుకోవాల్సి వస్తోంది. మౌలిక వసతుల కోసం నిధులు వెచ్చిస్తున్నప్పటికీ జలవిద్యుత్తు రంగంలో అనుభవం లేని వ్యక్తులను ముఖ్యమైన హోదాల్లో నియమిస్తున్నారు. అందువల్లే విద్యుత్ రంగం అస్తవ్యస్తంగా ఉంది. ఎన్‌టీపీసీ వంటి థర్మల్ విద్యుత్ కర్మాగారాల్లో 'ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్లు' ఒకప్పుడు 90 శాతంగా ఉండేది. ఇప్పుడు అది 70 శాతానికి పడిపోయింది. దేశంలోని థర్మల్ ఇంజినీరింగ్ ప్రాజెక్టులను సమర్థంగా ఉపయోగించడం లేదు. ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరుగుతోంది" అని ప్రసాద్ పేర్కొన్నారు.

ఎన్డీయే పాలనలో వ్యవసాయ సంక్షోభం

- 2.5 శాతం దాటని వ్యవసాయ వృద్ధి రేటు
- నిత్యావసర సరకుల చట్టాన్ని రద్దు చేయాలి
- ఎన్నికల ముందు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సంప్రదాయం
- రెండు, మూడో తరగతి పట్టణాలు అభివృద్ధి చెందాలి
- 'ఈనాడు-ఈటీవీ' ముఖాముఖిలో అహ్లువాలియా

ఈనాడు - హైదరాబాద్

జనాభాలో అతిపెద్ద వర్గం రైతులు.. వీరి సంక్షేమానికి, వ్యవసాయరంగం అభివృద్ధికి దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రముఖ ఆర్థికవేత్త, భారత ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్ అహ్లువాలియా అభిప్రాయపడ్డారు. దేశంలో అన్ని రంగాలు అభివృద్ధి చెందుతున్నపుడు వ్యవసాయరంగం మాత్రమే ఎందుకు సంక్షోభంలో ఉందని.. ఈ విషయమై అందరూ ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రైతులకు సంబంధించి 10 నుంచి 12 ముఖ్యాంశాలు ఉన్నాయని.. వీటిపై ప్రభుత్వాలు దృష్టి సారించేలా ఒత్తిడి తేవాలని సూచించారు. దీనికోసం రైతు సమాఖ్యలు కృషి చేయాలన్నారు. వ్యవసాయరంగం అభివృద్ధికి దీర్ఘకాలిక, స్వల్పకాలిక కార్యక్రమాలతో పాటు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపట్టాలన్నారు. సోమవారం ఆయన 'ఈనాడు-ఈటీవీ'తో ముఖాముఖి మాట్లాడారు. ముఖ్యాంశాలివీ...



మాంటెక్ సింగ్ అహ్లువాలియా

ఎన్డీయే పాలనపై మీ అభిప్రాయం ఏమిటి

దేశంలో వ్యవసాయరంగాన్ని ఎన్డీయే పాలన తీవ్ర నిరాశకు గురి చేసింది. మిగిలిన అంశాలను విశ్లేషించాలంటే అయిదేళ్ల పాలన పూర్తి కావాలి. వ్యవసాయ రంగంలో 4 శాతం వృద్ధి రేటు లక్ష్యం కాగా ఎన్డీయే పాలనలో ఇది 2.5 శాతానికే పరిమితమైంది. యూపీయే పాలనలో వృద్ధి రేటు 3.6 శాతానికి చేరింది. ఆహారేతర పంటల ఉత్పాదనలకు మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉంది.

కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతామంటోంది

సాధారణంగా లోక్‌సభ ఎన్నికల ముందు జరిగే బడ్జెట్ సమావేశాల్లో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ మాత్రమే ప్రవేశపెడతారు. ఈసారి కూడా అలాంటి బడ్జెట్ ఉంటుందని భావిస్తున్నా. కొత్తగా ఏర్పడే పార్లమెంట్, కొత్త ప్రభుత్వం ఆలోచనల మేరకు బడ్జెట్ ఉండటం అనేది సంప్రదాయం. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో కీలక నిర్ణయాలు ఉంటాయని అనుకోవడంలేదు.

పంటలకు గిట్టుబాటు ధర కావాలంటే ఏం చేయాలి?

నిత్యావసర సరకుల చట్టాన్ని రద్దు చేయడం ద్వారానే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. దీనిపై రాజకీయ పార్టీలన్నీ దృష్టి సారించాలి. వ్యవసాయానికి సంబంధించి మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరచాలి. ఇందుకు ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి.

అమరావతి నిర్మాణంపై మీ అభిప్రాయం

దేశంలో పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో రెండు, మూడో తరగతి నగరాలు విస్తరించాల్సిన అవసరం ఉంది. దేశంలో ప్రస్తుతం 30 శాతం మంది నగరాలు, పట్టణాల్లో ఉన్నారు. 2050 నాటికి ఈ జనాభా 50 శాతానికి చేరుతుంది. ఈ తరుణంలో దేశంలో వివిధ ప్రాంతాల్లో రెండు, మూడో తరగతి పట్టణాలు అభివృద్ధి చెందాలి. మెట్రో నగరాలు ఇంకా విస్తరించాల్సిన అవసరంలేదు. కొత్త నగరాలను అభివృద్ధి చేయడం చాలా అవసరం. అమరావతి నగరాన్ని గత ఏడాది చూశాను. ఇది కొత్త నగరమే.

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'రైతుబంధు'పై...

రైతులకు అండగా నిలిచే.. రైతులకు ఆర్థిక తోడ్పాటును అందించే ఏ కార్యక్రమమైనా మంచిదే. దీనిపై నేను అధ్యయనం చేయలేదు.

రైతుల అజెండా అన్ని పార్టీలకు తెలపాలి

- సిఫా జాతీయ సదస్సులో మాంటెక్‌సింగ్ అహ్లువాలియా

ఈనాడు, హైదరాబాద్: వచ్చే ఎన్నికల తరువాత కేంద్రంలో ఏర్పడేది సంకీర్ణ ప్రభుత్వమేనని, రైతుల కోసం ఏం చేయాలో ప్రతి రాజకీయ పార్టీకి ఇప్పటి నుంచే అందరూ చెప్పి వాటిని మేనిఫెస్టోల్లో పెట్టేలా చూడాలని భారత ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్ అహ్లువాలియా సూచించారు. భారత రైతు సంఘాల సమాఖ్య(సిఫా) ఆధ్వర్యంలో 'జాతీయ రైతుల అజెండా-2019-29' అనే అంశంపై సోమవారం గోల్కొండ హోటల్‌లో జరిగిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతుల కోసం అమలు చేసే కార్యక్రమాల్లో కొన్ని దీర్ఘకాలంలో, మరికొన్ని స్వల్ప కాలంలోనే ఫలితాలను ఇచ్చేవి ఉంటాయి, ఇవేమిటి, వాటిలో అత్యంత ముఖ్యమైన 10 నుంచి 12 అంశాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన చెప్పారు. ఉదాహరణకు మద్దతు ధర పెంచాలనేది స్వల్ప కాలంలో ఫలితం ఇచ్చేదని, వాతావరణ మార్పులపై పోరాడాలనేది దీర్ఘకాలంలో ఫలితాలనిస్తుందని ఆయన తెలిపారు. రాజకీయపరంగా పంట రుణాల మాఫీ, రైతుబంధు వంటి పథకాలను అమలు చేస్తున్నారని, అలాగే పంటల ఉత్పాదకత పెంపు, రైతులకు లాభాలు వచ్చే కార్యక్రమాలపైనా దృష్టి పెట్టాలన్నారు. కేంద్రం నిత్యావసరాల చట్టాన్ని రద్దు చేయాలని, ఈ చట్టం లేకపోతే సరకుల ధరలు పెరుగుతాయని అనేది అపోహ మాత్రమేనన్నారు. ప్రముఖ ఆర్థికవేత్త జి.చంద్రశేఖర అయ్యర్ మాట్లాడుతూ వ్యవసాయం అభివృద్ధి చెందితేనే గ్రామీణాభివృద్ధి జరుగుతుందన్నారు. సిఫా ముఖ్య సలహాదారు చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల కోసం ప్రభుత్వాలు ఏం చేయాలో చెప్పడానికే ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



కేదారికంఠ పర్వతంపై జాతీయపతాకంతో మల్లికార్జున్

కేదారికంఠ పర్వతంపై నాగర్‌కర్నూలు వాసి

కల్వకుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామానికి చెందిన గుమ్మకొండ మల్లికార్జున్ ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని కేదారికంఠ మంచు పర్వతాన్ని విజయవంతగా అధిరోహించారు. హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్ విజ్ఞానభారతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న మల్లికార్జున్ స్వేరోస్ ఎంపిక చేసిన పర్వతారోహణ బృందంలో సభ్యుడిగా ఎంపికయ్యారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో బృందంతో కలిపి ఈ నెల 20 నుంచి 26 వరకు అయిదు రోజులపాటు నడుచుకుంటూ వెళ్లి కేదారికంఠ మంచు పర్వతాన్ని (12500 అడుగులు) అధిరోహించారు. అనంతరం అక్కడ 90 అడుగుల జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పర్వతారోహణ అనంతరం సోమవారం స్వగ్రామానికి చేరుకున్న మల్లికార్జున్‌ను గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, ఘనంగా సన్మానించారు.

అగ్రకులాలకు రిజర్వేషన్లపై దేశవ్యాప్త ఉద్యమం

- అఖిల భారత ఓబీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు జస్టిస్ వి.ఈశ్వరయ్య

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఆర్థికంగా వెనుకబాటుతనం పేరిట ఉన్నతవర్గాలకు పది శాతం రిజర్వేషన్ కల్పించడం అనేది ఎస్సీ, ఎస్టీ, బీసీలను రాజ్యాంగపరంగా అంటరాని వారుగా చేయడమేనని అఖిల భారత ఓబీసీ ఫెడరేషన్ అధ్యక్షులు జస్టిస్ వంగాల ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఇది రాజ్యాంగ మౌలిక సూత్రాలకు, సమానత్వమనే హక్కుకు, కేశవానంద భారతి, ఇంద్రసాని కేసులకు వ్యతిరేకంగా ఉందన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 103వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం కొనసాగుతుందని, ఫిబ్రవరి 11న దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్జేడీ, డీఎంకే, ఏఐఏడీఎంకే, ఎంఐఎం పార్టీలను ధర్నాకు ఆహ్వానిస్తున్నామన్నారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పది శాతం రిజర్వేషన్‌పై సుప్రీంకోర్టు, అన్ని హైకోర్టుల్లో పిటిషన్లు వేస్తున్నామన్నారు. ఫిబ్రవరి 11న ధర్నా, 12న కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ముట్టడి చేపడుతున్నట్లు చెప్పారు. బీసీ మహాజన సమితి కన్వీనర్ సాంబశివరావు మాట్లాడుతూ ఓట్లకోసం ప్రధాని మోదీ రిజర్వేషన్‌పై నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డా.విజయ భాస్కర్, కేంద్ర ఓబీసీ ఉద్యోగుల సంఘం కన్వీనర్ బి.సదానందం పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య. పక్కన జాజుల శ్రీనివాస్ గౌడ్

బెర్లిన్‌లో జర్మనీ తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు

ఈనాడు, హైదరాబాద్: జర్మనీ తెలంగాణ సంఘం(టాగ్) ఆధ్వర్యంలో సోమవారం బెర్లిన్‌లో గణతంత్ర, సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రఘు చలిగంటి, సాంస్కృతిక కార్యదర్శి స్వేచ్ఛారెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రవాస తెలంగాణ కుటుంబాలవారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముగ్గులు, దేశభక్తి గీతాలు, చిత్రలేఖన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. తెలంగాణ వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. తెలంగాణ అభివృద్ధి - ప్రవాసుల సాయం, ఇతర అంశాలపై చర్చించారు.

ఏప్రిల్‌లో జేఎన్‌టీయూ స్నాతకోత్సవం

ఈనాడు, హైదరాబాద్: జేఎన్‌టీయూ తన 8వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్‌లో నిర్వహించాలని నిర్ణయించింది. స్నాతకోత్సవ వేదికపై పట్టాలు పొందాలనుకునేవారు ఫిబ్రవరి 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చుంది. డిగ్రీ, డిప్లొమా, పీజీ కోర్సుల్లో ఉత్తీర్ణులు ఈ నెలాఖరులోగా దరఖాస్తులు పంపవచ్చు. వివరాలకు జేఎన్‌టీయూహెచ్ వెబ్‌సైట్ లేదా చరవాణి నంబర్లు 94912 83135, 94912 93135కు కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.యాదయ్య తెలిపారు.

గల్ఫ్ ఏజెంట్ల మోసాల్ని అరికట్టాలి

ఈనాడు, దిల్లీ: జీవనోపాధి కోసం ఎడారి దేశాలకు వెళ్లేవారు.. కొందరు ఏజెంట్ల చేతిలో మోసపోతున్నారని, అలాంటి మోసాలను ప్రభుత్వాలు అరికట్టాలని తెలంగాణ గల్ఫ్ సంక్షేమ, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు పాట్కూరి బసంత్‌రెడ్డి కోరారు. తెలంగాణ భవన్ ఆవరణలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, ఏజెంట్ల వంచనతో నాలుగు నెలలుగా ఇరాక్‌లో చిక్కుకున్న 14 మంది తెలంగాణవాసులు మంగళవారం దిల్లీకి వస్తున్నారని తెలిపారు. భారత్ నుంచి ఇరాక్‌కు వెళ్లే అనుమతి లేకున్నా, దళారులు మాయమాటలతో వారిని అక్కడికి పంపారన్నారు. ఈ తరహా కార్మికుల 'తరలింపు'పై విదేశాంగ శాఖ మరింత నిఘా పెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విదేశీ యానానికి సంబంధించి, నిబంధనలను కఠినతరం చేయాలన్నారు.



ఊబిలో కూరుకుపోయి ఏనుగు మృతి

కొమరాడ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా కొమరాడ మండలం దుగ్గి సమీపంలో నాగావళి నదీతీరాన ఊబిలో కూరుకుపోయి ఓ ఏనుగు మృతి చెందింది. ఈ సంఘటన సోమవారం వెలుగు చూసింది. ఒడిశా నుంచి శ్రీకాకుళం జిల్లా మీదుగా కొమరాడ మండలానికి సెప్టెంబర్ 13న ఎనిమిది ఏనుగులు గుణానపురానికి చేరుకున్నాయి. అందులో ఒకటి విద్యుదాఘాతం కారణంగా చనిపోయింది. మిగిలిన ఏడింటిలో ఒకటి విడివడి కళ్లికోట, దుగ్గి ప్రాంతంలో ఉండిపోయింది. అటవీ అధికారులు వీటన్నింటినీ ఒకచోటుకు చేర్చేందుకు చర్యలు చేపట్టారు. ఈ నెల 22న ఆరు ఏనుగులు జియమ్మవలస మండలం బిత్రపాడు వద్దకు చేరుకున్నాయి. విడిపోయిన ఏనుగు ఎక్కడుందో అని వెతుకుతున్న అధికారులకు సోమవారం ఏనుగు కళేబరం కనిపించింది. నది ఒడ్డు నుంచి నడుస్తున్న క్రమంలో ఊబిలో కూరుకుపోయి మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు.

పులి బారిన పడి ఇద్దరు హతం

బల్లార్ష, న్యూస్‌టుడే: పులి బారిన పడి వేర్వేరు రాష్ట్రాల్లో ఇద్దరు వ్యక్తులు హతమయ్యారు. గడ్చిరోలి (మహారాష్ట్ర) ప్రాంతం దేశాయిగంజ్ సమీపంలోని ఉసేగావ్ గ్రామానికి చెందిన సోయం పాండురంగ (57) పశువులను మేపేందుకు వెళ్లి పులి దాడిలో మరణించాడు. అతడు తన మిత్రుడితో కలిసి వెళ్లగా అక్కడే పొంచి ఉన్న పులి పాండురంగను నోట కరుచుకుని అడవిలోకి లాక్కెళ్లింది. స్నేహితుడు గ్రామస్థులకు చెప్పడంతో.. అటవీశాఖ అధికారులు, గ్రామస్థులు అంతటా గాలించారు. మృతదేహాన్ని సోమవారం ఓ పొదలో కనుగొని, శవపరీక్ష కోసం తాలూకా కేంద్రమైన దేశాయిగంజ్‌కు తరలించారు.

చలి కాగేందుకు వెళ్లి...

మైసూరు, న్యూస్‌టుడే: చలిమంట వద్ద కూర్చునేందుకు వెళ్తున్న వ్యక్తిని పులి లాక్కెళ్లి హతమార్చిన దుర్ఘటన కర్ణాటకలోని మైసూరు జిల్లా హెచ్.డి.కోట తాలూకా మచ్చూరు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. మృతుణ్ని గుండుమెట్లు గ్రామానికి చెందిన చిన్నప్ప (40)గా గుర్తించారు. చిన్నప్ప ఇంటి వెలుపల చలిమంట వద్ద కూర్చునేందుకు వెళ్తుండగా పులి అమాంతంగా దాడిచేసి నోట కరుచుకుని పరుగులు తీసింది. కొంతదూరం వెళ్లిన తరువాత చిన్నప్పను హతమార్చిన పులి అక్కణ్నుంచి పారిపోయింది.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00